

ఈనాడు




విజయవాడ 7-2-2026 శనివారం సిటీ సంపుటి 52 . సంచిక 178

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 20

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru





ఈనాడు



విజయవాడ 7-2-2026 శనివారం సిటీ సంపుటి 52 . సంచిక 178
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 20
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



తిరుమలకు కల్తీ నెయ్యి సరఫరా
మహాపచారం..

జంతు కొవ్వు కలవలేదు.. రసాయనాలే కలిశాయంటారేంటి?

- శ్రీవారి దీపారాధనకు అదే నెయ్యి వినియోగిస్తామే
- ఆ మహాపచారానికి లెంపలు వేసుకోకుండా ఇంకా బొంకుతారేంటి?
- ఏ రసాయనాలు కలిస్తే నెయ్యిలా ఉంటుందో వెతికి మరీ చేయించిన పక్కా నేరమిది
- తప్పు ఒప్పుకొని వారు ప్రాయశ్చిత్తం చేసుకోవాలి
- 'ఈనాడు'తో తితిదే పూర్వ ఈవో, విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎల్వీ సుబ్రహ్మణ్యం



ఈనాడు, అమరావతి: 'తిరుమల వేంకటేశ్వరస్వామి విషయంలో తెలియకుండా చిన్న తప్పు చేస్తేనే లెంపలు వేసుకుంటాం. క్షమాపణలు వేడుకుంటాం. పొర్లుదండాలు పెడతాం. ఉపవాసం ఉంటాం. దీక్షలు చేస్తాం. అలాంటిది సాక్షాత్తూ శ్రీవారి లడ్డూ ప్రసాదానికి వినియోగించిన నెయ్యిని చాలా ప్రణాళికాబద్ధంగా నేరపూరిత ఆలోచనతో రసాయనాలు కలిపేసి, తెలిసీ తప్పు చేసి.. పరీక్షల్లో కల్తీ అని తేలిన తర్వాతా అదే నెయ్యి వినియోగించి ఇంకా బొంకుతారేంటి? అబ్బే జంతు కొవ్వు కలవలేదు.. రసాయనాలే కలిపాం అంటారేంటి? అది అపచారం కాదనుకుంటున్నారా? (మిగతా 6లో)

సాక్ష్యాధారాలతో తప్పు తేలింది

ఏ పాల డిపో నుంచో పాలు తెచ్చి మనం పిల్లలకు పట్టిస్తాం. తర్వాత కల్తీ జరిగిందని తేలితే వెళ్లి డిపో వారిని నిలదీస్తాం. డిపో వాడు అబ్బే పాలల్లో విషం కలపలేదండీ, తెల్లగా ఉంది కదా పాలల్లో కలిసిపోతుందని కల్లు కలిపాను అంటే ఊరుకుంటామా? పిల్లాడికి ఇచ్చే పాలను కల్తీ చేస్తే సహిస్తామా? అది తప్పు కాదంటే అంగీకరిస్తామా? మరి సాక్షాత్తూ వేంకటేశ్వర స్వామివారికి ఎంతో భక్తితో సమర్పించే నైవేద్యంలో నెయ్యి కాకుండా రసాయనాలు కలిపేసిన నూనెలాంటి పదార్థంతో నైవేద్యం పెట్టి అది తప్పు కాదని వాదించడమేంటి? లడ్డూ ప్రసాదానికి వినియోగించిన నెయ్యి కల్తీ అని సాక్ష్యాధారాలతో తేలిపోయింది. చుక్క నెయ్యి లేకుండా రూ.250 కోట్ల బిల్లులు తీసుకున్నారు. ఇంకా అర్థం పర్థం లేని లాజిక్కులు తీసి తప్పు చేయలేదని మాట్లాడతారేంటి? భక్తులు చాలా ఆగ్రహావేశాలతో ఉన్నారు. తిరగబడి కొడతారు.



కొరియా టు తిరుమల
వయా భోలేబాబా

8లో

కల్తీ నెయ్యిలో కలిపిన 'మోనోగ్లిజరైడ్స్' సరఫరా ఇలా..

అలా తయారుచేసినదే తితిదేకి సరఫరా



మనదే యువ ప్రపంచం

- సూర్యవంశీ విధ్వంసక శతకం
- అండర్-19 కప్ విజేత భారత్

హరారే: ఇది భారత క్రికెట్‌కు ప్రపంచకప్‌ల కాలం. గతేడాది భారత మహిళల జట్లు వన్డే వరల్డ్‌కప్, అంధుల ప్రపంచకప్ గెలిస్తే.. కొత్త ఏడాదిలో కుర్రాళ్లు అదరగొట్టారు. స్ఫూర్తిదాయక ప్రదర్శనతో అండర్-19 ప్రపంచకప్‌ను కైవసం చేసుకున్నారు. శుక్రవారం జరిగిన ఫైనల్లో భారత్ 100 పరుగుల తేడాతో ఇంగ్లాండ్‌ను చిత్తు చేసింది. వైభవ్ సూర్యవంశీ (175; 80 బంతుల్లో 15×4, 15×6) విధ్వంసక శతకంతో మొదట భారత్ 50 ఓవర్లలో 9 వికెట్లకు 411 పరుగుల భారీ స్కోరు చేసింది. ఛేదనలో ఇంగ్లాండ్ 40.2 ఓవర్లలో 311 పరుగులకే ఆలౌటైంది. అంబ్రిష్ (3/56), దీపేశ్ (2/64), కనిష్క్ (2/63) ప్రత్యర్థిని దెబ్బతీశారు. అండర్-19 ప్రపంచకప్ గెలవడం భారత్‌కు ఇది ఆరోసారి.

- వివరాలు ఛాంపియన్‌లో..

- నేటి నుంచే టీ20 ప్రపంచకప్

వైభవ్ సూర్యవంశీ

లోపలి పేజీల్లో


తుది లక్ష్యం..
పరీక్షల్లో మార్కులు కారాదు

జీవన నైపుణ్యాలను పెంచుకోవడం కీలకం

విద్యను భారంగా పరిగణించొద్దు

నచ్చిన రంగంలో దూసుకెళ్లండి

'పరీక్షా పే చర్చ'లో విద్యార్థులకు ప్రధాని దిశానిర్దేశం





భూవివాదాలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దుతా

ఈ ఏడాదంతా ఆ పనిపైనే ఉంటా

పాసుపుస్తకాలకు సాంకేతిక భద్రత

ముఖ్యమంత్రి చంద్రబాబు

కర్నూలు జిల్లా కలుగొట్లలో రైతుకు పట్టాదారు పాసుపుస్తకం అందిస్తున్న సీఎం


డిజిటల్ మోసానికి గురైతే..
రూ.25 వేల వరకు పరిహారం

బ్యాంకు ఖాతాదార్లకు ఆర్‌బీఐ ఊరట

అబద్ధాన్ని సృష్టించి.. దుష్ప్రచారం చేస్తున్నారు

- ఇబ్రహీంపట్నంలో వైకాపా అధినేత జగన్
- జోగి కుటుంబానికి పరామర్శ

ఈనాడు, అమరావతి: 'తిరుపతి లడ్డూలో వాడిన నెయ్యిలో జంతువుల కొవ్వు కలిపారని చంద్రబాబు అబద్ధాలు ఆడుతూ ప్రజలను పెడదోవ పట్టించారని సీబీఐ (సిట్) ఛార్జిషీట్ చూస్తే తేటతెల్లమవుతోంది. వైకాపా ప్రభుత్వంలో టీటీడీ ఛైర్మన్లుగా చేసిన వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకరరెడ్డిలు ఎలాంటి తప్పులు చేయలేదని కూడా సీబీఐ తేల్చేసింది. అందుకే వారి పేర్లను ఛార్జిషీట్‌లో పెట్టకుండా క్లీన్‌చిట్ ఇచ్చింది. చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్‌లను ఒకటే ప్రశ్నిస్తున్నాను.. జంతువుల కొవ్వు కలిసిందని ఏ ల్యాబ్ రిపోర్టులు చెప్పాయో బయటపెట్టండి. సీబీఐ ఛార్జిషీట్‌లో కేంద్ర ప్రభుత్వ సంస్థలైన నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు (ఎన్‌డీడీబీ), నేషనల్ డెయిరీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్‌డీఆర్ఐ) ల్యాబ్ రిపోర్టులను జోడించారు. ఎలాంటి జంతువుల కొవ్వు కలవలేదని (మిగతా 6లో)



జోగి ఇంటి వద్ద మీడియాతో మాట్లాడుతున్న జగన్. పక్కన మొండితోక జగన్మోహన్‌రావు, దేవినేని అవినాష్, జోగి రమేష్, వెలంపల్లి శ్రీనివాస్

పోలీసులను కవ్విస్తూ.. రెచ్చగొట్టేలా తిడుతూ..

జగన్ పరామర్శ యాత్రలో వైకాపా కార్యకర్తల బరితెగింపు

జాతీయ రహదారిపై అడ్డంగా వాహనాల పార్కింగ్

సాధారణ ప్రయాణికులకు గంటల తరబడి నరకం

ఈనాడు-అమరావతి, న్యూస్‌టుడే-ఇబ్రహీంపట్నం, మైలవరం: 'మమ్మల్నే అడ్డుకుంటారా.. మేం అధికారంలోకి వస్తే మీ అంతుచూస్తాం. ఎవర్నీ వదిలిపెట్టేది లేదు' అని పోలీసులను బెదిరిస్తూ.. కవ్విస్తూ.. రెచ్చగొడుతూ వైకాపా అల్లరిమూకలు చెలరేగిపోయాయి. జగన్ పరామర్శ యాత్ర నేపథ్యంలో శుక్రవారం ఉదయం నుంచే ఇబ్రహీంపట్నం చౌరస్తా వద్ద విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే జాతీయ రహదారిపై అడ్డంగా వాహనాలను ఆపేసి ఒకవైపు రాకపోకలను స్తంభింపజేశారు. వైకాపా శ్రేణులను రహదారికి పక్కగా నిలబడాలని చెప్పి పంపేందుకు పోలీసులు ప్రయత్నించగా వారిపై తీవ్ర ఆగ్రహావేశాలతో ఊగిపోతూ, నోటికొచ్చినట్టు తిడుతూ రెచ్చిపోయారు. తాడేపల్లిలోని జగన్ నివాసం నుంచి బయటకు రాకముందే (మిగతా 6లో)



పశువుల కొట్టం నుంచి పెద్దపులి పరుగులు

ఎట్టకేలకు చిక్కిన పెద్దపులి

మత్తు ఇంజక్షన్ ప్రయోగించి బంధించిన రెస్క్యూ బృందం


ఈనాడు-రాజమహేంద్రవరం; న్యూస్‌టుడే-రాయవరం, మండపేట గ్రామీణం: తూర్పుగోదావరి జిల్లాలో ఏడు రోజులుగా అధికారులను పరుగులు పెట్టిస్తూ.. ప్రజలకు కంటిమీద కునుకులేకుండా చేసిన పెద్దపులి ఎట్టకేలకు శుక్రవారం రాత్రి పట్టుబడింది. అటవీశాఖ అధికారులు, పుణె నుంచి వచ్చిన రెస్క్యూ నిపుణుల బృందం సంయుక్త వ్యూహంతో మండపేట (మిగతా 6లో)

సమగ్ర కుటుంబ సర్వే ఆధారంగా
బీసీ కోటా!

స్థానిక సంస్థల్లో 34% రిజర్వేషన్ల ఖరారుకు ఇదే ప్రాతిపదిక

- ఈ మేరకు ప్రభుత్వానికి నివేదించాలని బీసీ సంక్షేమశాఖ నిర్ణయం
- ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమోదం తర్వాత ముందుకు..

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో వెనుకబడిన తరగతుల జనాభా లెక్క తేల్చేందుకు సమగ్ర కుటుంబ సర్వేను (యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే) ప్రాతిపదికగా తీసుకోవాలని బీసీ సంక్షేమ శాఖ అధికారులు ప్రాథమికంగా నిర్ణయించారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా గత నెల రోజులుగా స్వర్ణగ్రామ, స్వర్ణవార్డు కార్యాలయాల సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఈ సర్వే చేపడుతున్నారు. ఇందులో ప్రజల ఆధార్ నంబర్ మొదలు విద్య, ఉపాధి, వ్యవసాయం, ఆర్థిక వనరులు, ఇళ్లలోని సామగ్రి, సామాజికవర్గాల వివరాలు సహా మొత్తం 38 అంశాలు సేకరిస్తున్నారు. ఇది కలెక్టర్ల నేతృత్వంలో జరుగుతున్నందున బీసీ జనాభా ఖరారుకు అధీకృతంగా ఉంటుందని భావిస్తున్నారు. దీంతోపాటు రెవెన్యూ శాఖ వద్ద ఉన్న కుల ధ్రువీకరణపత్రాల ఆధారంగా బీసీల జనాభా ఎంత ఉందనే వివరాల్ని సేకరించారు. ఆర్టీజీఎస్ డేటాను అనుసంధానించి సమగ్ర కుటుంబ సర్వేలో వచ్చే వివరాల్ని సరిపోల్చనున్నారు. ఈ నెల 15 వరకు సర్వే కొనసాగనుంది. తదుపరి దీన్ని సీఎం చంద్రబాబుకు నివేదించి, ఆయన ఆమోదం తర్వాత ముందుకు వెళ్లనున్నారు.



పంచాయతీ ఎన్నికల్లోపే ఖరారు

మార్చి నెలాఖరు నాటికి సర్పంచుల పదవీ కాలం ముగియనుంది. తదుపరి పంచాయతీ ఎన్నికల నాటికి కూటమి పార్టీలు (మిగతా 6లో)

Kamma Global Federation

KAMMA GLOBAL FEDERATION
AN UMBRELLA ORGANIZATION FOR GLOBAL KAMMA ORGANIZATIONS
K.G.F

రండి... ఏకమవుదాం... మన సత్తా చాటుదాం...

KGF కేజీయఫ్



కమ్మ మహానాడు 2026

8 ఫిబ్రవరి- ఆదివారం, మ॥ 3.30 గం॥లకు
సేందమంగళం, శ్రీ పెరంబదూర్, తమిళనాడు
(చెన్నై-బెంగళూరు జాతీయ రహదారి)

ప్రియ బంధువులారా !

కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో తమిళ కమ్మ సంఘాలు కలిసి సంయుక్తంగా లక్షలాది మందితో నిర్వహిస్తున్న చారిత్రాత్మక ఘట్టం 'కమ్మ మహానాడు - 2026'

తమిళనాడులోని 65 లక్షల మంది శక్తివంతమైన కమ్మ జనాభాని ఏకతాటిపైకి తీసుకురావడమే ముఖ్యోద్దేశం.

రండి.. ఒక్కటై గళమెత్తి జగమంతా ఎలుగెత్తి మన శక్తిని చాటుదాం, మనమంతా ఏకమైతే, మన లక్ష్యం ఒక్కటైతే.. అవకాశం మనదే..! అధికారం మనదే..!!

కమ్మ మహానాడుకు తరలి రండి..
కమ్మ శక్తిని, ప్రపంచానికి చాటి చెప్పండి.
మీరూ పాల్గొనండి., పదిమందిని కదిలించండి..
మన సత్తా చాటండి...!



TMS: +91 99895 50055

శ్రీ జెట్టి కుసుమ కుమార్
ఫౌండర్ & ప్రెసిడెంట్, కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ (KGF)

ప్రపంచ కమ్మ మహా జనులారా... ఏకం కండు..!! కమ్మ మహానాడు పిలుస్తోంది... కదలి రండు..!!

Website: www.kammaglobal.com. Email: kammaglobalfederation@gmail.com. Mobile No: 90555 17555

తితిదే ఈవోగా ముద్దాడ రవిచంద్ర బాధ్యతల స్వీకరణ




తితిదే ఈవో ముద్దాడ రవిచంద్ర దంపతులకు శ్రీవారి తీర్థప్రసాదాలు అందిస్తున్న అదనపు ఈవో వెంకయ్యచౌదరి

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల తిరుపతి దేవస్థానం(తితిదే) కార్యనిర్వహణాధికారి (ఈవో)గా ముద్దాడ రవిచంద్ర శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా ఆలయ క్షేత్ర సంప్రదాయాన్ని పాటిస్తూ ఈవో దంపతులు భూవరాహస్వామి వారిని దర్శించుకున్నారు. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌-1 మీదుగా శ్రీవారి ఆలయం వద్దకు చేరుకున్న వారికి తితిదే అదనపు ఈవో వెంకయ్యచౌదరి, అధికారులు స్వాగతం పలికారు. రంగనాయకుల మండపంలో తితిదే నూతన ఈవోగా రవిచంద్ర పదవీ బాధ్యతలు చేపట్టారు. అనంతరం తితిదే బోర్డు ఎక్స్‌అఫిషియో సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేసి.. శ్రీవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. ఈవో దంపతులకు వేదపండితులు వేదాశీర్వచనం అందించగా తితిదే అదనపు ఈవో శ్రీవారి తీర్థప్రసాదాలు, చిత్రపటాన్ని అందజేశారు. ఆలయం వెలుపల ఈవో విలేకరులతో మాట్లాడారు. శ్రీవారి భక్తుడిగా ఉన్న తనకు సహచర భక్తులకు సేవ చేసే భాగ్యం కలిగిందన్నారు. హిందువుల నమ్మకాలను నిలబెట్టేలా పని చేస్తానని చెప్పారు. తనకు ఈ అవకాశం కల్పించిన సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆ తర్వాత స్థానిక అన్నమయ్య భవనంలో, తిరుపతిలోని పరిపాలన భవనంలో పలు విభాగాధిపతులతో ఈవో సమీక్షించారు.

అబూజ్‌మడ్‌ అడవుల్లో భారీ ఎన్‌కౌంటర్‌

ఏడుగురు మావోయిస్టులు, ఓ కమాండో కానిస్టేబుల్‌ మృతి



పద్కల్‌ స్వామి

ఈనాడు, హైదరాబాద్‌ - చర్ల, న్యూస్‌టుడే: ఛత్తీస్‌గఢ్‌ రాష్ట్రం బీజాపుర్‌-మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాల సరిహద్దు వద్ద భామ్రాగఢ్‌లోని అబూజ్‌మడ్‌ అడవుల్లో గురువారం నుంచి జరిగిన భారీ ఎన్‌కౌంటర్లో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందారు. మృతుల్లో మావోయిస్టు పార్టీ వెస్ట్‌ సబ్‌ జోనల్‌ బ్యూరో కార్యదర్శిగా ఉన్న లోకేటి చందర్‌రావు ఎలియాస్‌ ప్రభాకర్‌ ఎలియాస్‌ పద్కల్‌ స్వామి(57) ఉన్నాడు. ఈ ఘటనలో సీ-60 కమాండో కానిస్టేబుల్‌ దీపక్‌ చిన్న మదవి మంద్రా (38) ప్రాణాలు కోల్పోయారు. 'అబూజ్‌మడ్‌ అడవుల్లో భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య భీకర ఎన్‌కౌంటర్‌ జరిగింది. ఘటన స్థలంలో నలుగురు పురుషులు, ముగ్గురు మహిళా మావోయిస్టుల మృతదేహాలతో పాటు ఏకే-47 రైఫిల్స్‌-03, ఒక 303, ఒక ఎస్‌ఎల్‌ఆర్‌ను బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. మృతుల్లో రూ.25 లక్షల రివార్డు ఉన్న ప్రభాకర్‌(కామారెడ్డి జిల్లా)తో పాటు అనిల్‌ కొవాచి, కామేశ్‌ పదం (ఏసీఎం), భజ్నాథ్‌ ఎలియాస్‌ బీమా హోలీగా గుర్తించారు. మరో ముగ్గురిని గుర్తించే ప్రక్రియ జరుగుతోంది. ఎన్‌కౌంటర్‌లో గాయపడిన మరో జవాన్‌ జోగా మదవి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు' అని పోలీసులు తెలిపారు.

మార్కులపై వ్యామోహం వద్దు

- 'పరీక్షా పే చర్చ'లో ప్రధాని మోదీ

దిల్లీ: పరీక్షలు పండగల్లాంటివని, వాటిని ఓ వేడుకగా జరుపుకోవాలని విద్యార్థులకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూచించారు. మార్కులపై వ్యామోహం వీడి జీవన నైపుణ్యాలను మెరుగుపరచుకోవడంపై శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. "విద్యను భారంగా చూడకండి. గతేడాది ప్రథమస్థానం వచ్చిన విద్యార్థి పేరు ఇప్పుడు ఎవరికీ గుర్తుండదు. మార్కులకు అంతగా ప్రాధాన్యం లేదని దీన్ని బట్టే అవగతమవుతోంది. జీవితాన్ని మెరుగుపరచుకోవడానికి విద్య ఓ మార్గం మాత్రమే. పరీక్షల కోసమే మన జీవితం లేదు. తుది లక్ష్యం.. మార్కులు కారాదు. సంపూర్ణ జీవన వికాసమే కీలకం. విద్యతో పాటు జీవితాన్ని తీర్చిదిద్దుకోవడంపైనా దృష్టి పెట్టండి. సాధించగల లక్ష్యాన్నే ఎంపిక చేసుకోండి. అలా అని సులభమైన లక్ష్యాన్ని ఎంచుకోవద్దు. నచ్చిన రంగంలో దూసుకెళ్లండి" అని దిశా నిర్దేశం చేశారు. సీబీఎస్‌ఈ, ఐసీఎస్‌ఈ, వివిధ రాష్ట్రాల బోర్డు పరీక్షల తేదీలు సమీపించిన వేళ శుక్రవారం తన అధికారిక నివాసంలో వార్షిక 'పరీక్షా పే చర్చ' కార్యక్రమాన్ని ప్రధాని మోదీ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రాష్ట్రాల విద్యార్థులతో సంభాషించారు.

నాకూ సలహాలిస్తుంటారు

"నేను అంచెలంచెలుగా ప్రధాని స్థాయికి ఎదిగాను. ఇప్పుడు కూడా చాలామంది నాకు సూచనలిస్తూ ఉంటారు. నా పని విధానంలో కొన్ని మార్పులు చేసుకోవాలని సలహాలు ఇస్తుంటారు. నా అభిప్రాయం ఏమిటంటే, ఒక్కొక్కరు ఒక్కో విధంగా పనిచేస్తుంటారు. విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధమయ్యే విధానాలు కూడా భిన్నంగా ఉంటాయి. కొందరు ఉదయం వేళ బాగా చదువుతారు. మరి కొందరు రాత్రి సమయంలో. అందరి సలహాలూ తీసుకోండి. చిట్టచివరగా మీకు అత్యంత అనువుగా, ప్రయోజనకరంగా ఉన్న విధానాన్నే అనుసరించండి" అని విద్యార్థులకు ప్రధాని సూచించారు.

ఇంటర్నెట్‌లో గడపకండి

"డేటా చౌకగా వస్తోంది కదా అని ఇంటర్నెట్‌లో సమయం వృథా చేసుకోకండి. సరదాగా గేమ్స్‌ ఆడుతూ కాలాన్ని గడిపేయకండి. డబ్బుపై ఆశతో గేమ్స్‌ ఆడితే జీవితాలు నాశనం అవుతాయి. అందుకే మా ప్రభుత్వం జూదం లాంటి ఆటలను ప్రోత్సహించడం లేదు. ఆన్‌లైన్‌ జూదానికి వ్యతిరేకంగా ఒక చట్టాన్ని కూడా చేశాం" అని మోదీ పేర్కొన్నారు.



పరీక్షా పే చర్చ సందర్భంగా విద్యార్థులతో ప్రధాని



పరీక్షా పే చర్చలో విద్యార్థులకు సూచనలు చేస్తున్న ప్రధాని మోదీ

ఇంకా 25 ఏళ్లు మిగిలి ఉన్నాయి

"నా వయసు 75 ఏళ్లకు చేరిందని జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ ఓ నాయకుడు అన్నారు. మరో 25 ఏళ్లు మిగిలి ఉన్నాయని ఆయనకు సమాధానం చెప్పాను. గతాన్ని గణించను. మిగిలిన సమయాన్నే లెక్కిస్తాను. మీకు చెప్పేదేమిటంటే, గడిచిపోయిన కాలం గురించి ఆలోచిస్తూ సమయం వృథా చేసుకోకండి. జీవన వికాసంపై శ్రద్ధ పెట్టండి. అది తరగతి గదులు, పరీక్షల పరిధిలో లేని విలువైన అంశం" అని మోదీ తెలిపారు.

గ్రహం అనుగ్రహం

7-2-2026 శనివారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; ఉత్తరాయణం; శిశిర రుతువు, మాఘ మాసం, బహుళ పక్షం
షష్ఠి: తె. 3-58 తదుపరి సప్తమి
చిత్త: తె. 3-48 తదుపరి స్వాతి
వర్జ్యం: ఉ. 10-40 నుంచి 12-23 వరకు
అమృత ఘడియలు: రా. 8-57 నుంచి 10-39 వరకు
దుర్ముహూర్తం: ఉ. 6-35 నుంచి 8-06 వరకు
రాహుకాలం: ఉ. 9-00 నుంచి 10-30 వరకు
సూర్యోదయం: ఉ.6.36; సూర్యాస్తమయం: సా.5.54

చలి పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
విజయనగరం	16.0	30.0
రాజమహేంద్రవరం	16.0	33.5
అనంతపురం	16.0	34.5
విశాఖపట్నం	16.8	31.4
కడప	17.0	31.0
శ్రీకాకుళం	18.0	32.0
తాడేపల్లిగూడెం	18.0	33.0
తిరుపతి	18.5	31.2
గుంటూరు	19.0	32.0
కర్నూలు	19.2	33.9
విజయవాడ	20.4	31.0
ఒంగోలు	20.7	31.9

టిడ్కో లబ్ధిదారులకు రూ.1,423 కోట్ల రుణం

- 3 ప్రైవేటు ఆర్థిక సంస్థలను ఒప్పించిన ప్రభుత్వం
- 39 వేల మంది పేదల వాటా నిధుల సమస్యకు పరిష్కారం
- జూన్‌ నాటికి లబ్ధిదారుల చేతికి 2.61 లక్షల ఇళ్లు

ఈనాడు, అమరావతి: టిడ్కో లబ్ధిదారుల వాటా నిధుల కోసం వివిధ ప్రైవేటు ఆర్థిక సంస్థల నుంచి ప్రభుత్వం రుణాలు ఇప్పిస్తోంది. ఒక్కో లబ్ధిదారుకు రూ.3.65 లక్షల చొప్పున మొత్తం 39వేల మందికి రూ.1,423 కోట్లు సమకూర్చనుంది. వీటితో అసంపూర్తిగా నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయించనుంది. ఈ ఏడాది జూన్‌ నాటికి 2.61 లక్షల ఇళ్లను లబ్ధిదారులకు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పేదరికం, ఇతర కారణాలతో తమ వాటా నిధులు చెల్లించని 39వేల కుటుంబాలను గుర్తించింది. ప్రభుత్వం సంప్రదించడంతో ఈజీ ఫైనాన్స్‌, ఐఎఫ్‌ఎఫ్‌ఎల్‌, వాస్తు సంస్థలు లబ్ధిదారులకు ఇళ్ల హామీపై రుణాలిచ్చేందుకు ముందుకొచ్చాయి. 10.2%-11.5% వడ్డీపై రుణాలు అందించనున్నాయి. గృహప్రవేశం చేసినప్పటి నుంచి 15-20 ఏళ్లలోగా లబ్ధిదారులు రుణం మొత్తాన్ని వాయిదాల్లో చెల్లించాలి. వీరిలో అత్యధికులు పట్టణ స్వయం సహాయక సంఘాల సభ్యులు కావడంతో ఆర్థిక సంస్థల నుంచి రుణాలు ఇప్పించే బాధ్యతను పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)కి ప్రభుత్వం అప్పగించింది. ప్రైవేటు ఆర్థిక సంస్థలు అందించే రుణాలను నేరుగా టిడ్కోకు బదిలీ చేయనున్నారు.

పేదలను రుణగ్రస్తుల్ని చేసిన వైకాపా ప్రభుత్వం

వైకాపా హయాంలో 65వేల మంది లబ్ధిదారులకు సగటున రూ.3.50 లక్షల చొప్పున బ్యాంకుల నుంచి రుణాలిప్పించి పేదలను రుణగ్రస్తులను చేశారు. లబ్ధిదారుల వాటా కింద రూ.కోట్లు తీసుకుని టిడ్కోకి జమ చేసినట్లు చూపించినా ఇళ్ల నిర్మాణాలు పూర్తికాలేదు. రుణాలు తిరిగి చెల్లించాలని బ్యాంకులు తాఖీదులివ్వడంతో గందరగోళ పరిస్థితి ఏర్పడింది.

★ లబ్ధిదారుల తరఫున వడ్డీ మొత్తాలను కూటమి ప్రభుత్వం బ్యాంకులకు చెల్లించడంతో పాటు ఇప్పటి వరకు వాటా నిధులు చెల్లించని కుటుంబాలకు ప్రైవేటు ఆర్థిక సంస్థల నుంచి రుణాలిప్పిస్తోంది. ఇలా పట్టణ పేదల సొంతింటి కలను సాకారం చేయాలని నిర్ణయించింది. వచ్చే రెండునెలల్లో పెండింగ్‌ పనులన్నీ పూర్తి చేయించాలని ప్రభుత్వం టిడ్కోని ఆదేశించింది.

20న అగ్రిగోల్డ్‌ బాధితుల చైతన్య జయభేరి సభలు

విజయవాడ (గాంధీనగర్‌), న్యూస్‌టుడే: అగ్రిగోల్డ్‌ బాధితుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 20 నుంచి రాష్ట్రవ్యాప్తంగా చైతన్య జయభేరి సభలు నిర్వహించనున్నట్లు అగ్రిగోల్డ్‌ కస్టమర్స్‌ అండ్‌ ఏజెంట్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు తెలిపారు. సభలు ఇచ్ఛాపురంలో ప్రారంభించి 13 రోజుల పాటు నిర్వహిస్తామన్నారు. శుక్రవారం నాగేశ్వరరావు విజయవాడలో విలేకర్లతో మాట్లాడుతూ.. కూటమి అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా బాధితులకు న్యాయం జరగకపోవడం విచారకరమన్నారు. ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేసి ఆస్తుల విక్రయానికి చర్యలు చేపట్టకపోవడంతో బాధితులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. అగ్రిగోల్డ్‌ కంపెనీ నుంచి 21 లక్షల మందికి రావాల్సిన రూ.6,500 కోట్లు తక్షణమే చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు.


ఈనాడు

మణిపుర్‌కు జీవంపోయాలి!

దేశ జనాభాలో కేవలం 0.2శాతం వాటా కలిగిన మణిపుర్ చిన్న రాష్ట్రమే అయినా జాతీయ సమగ్రత, సరిహద్దు భద్రత, ఆగ్నేయాసియాతో అనుసంధానతల పరంగా యావద్భారతానికీ కీలకమైన ప్రాంతమది. స్థానిక ఆధిపత్య వర్గమైన మెయ్‌తెయ్‌లను ఎస్టీల్లో చేర్చే ప్రతిపాదనలను నిరసిస్తూ కుకీ, జో, నాగా తదితర ఆదివాసీ సమూహాలు 2023 మేలో నిర్వహించిన 'గిరిజన సంఘీభావ ప్రదర్శన' దరిమిలా మణిపుర్‌లో జాతుల మధ్య ఘర్షణలు చెలరేగాయి. అనతికాలంలోనే అవి రావణకాష్ఠంగా మారాయి. 250కి పైగా ప్రాణాలను హరించి, దాదాపు 70వేల మందిని నిరాశ్రయులుగా మిగిల్చిన హింసాత్మక దాడులను కట్టడిచేయడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. సీఎం బీరేన్ సింగ్ రాజీనామా అనంతర పరిణామాల్లో నిరుడు ఫిబ్రవరి 13నుంచి అక్కడ రాష్ట్రపతి పాలన అమలులోకి వచ్చింది. వచ్చే ఏడాది మొదట్లో మణిపుర్‌లో ఎన్నికలు జరగాల్సి ఉన్న నేపథ్యంలో అక్కడ ప్రజాప్రభుత్వాన్ని తిరిగి ప్రతిష్ఠించేందుకు భాజపా అధిష్ఠానం నిశ్చయించింది. దాంతో రాష్ట్రపతి పాలన ముగిసిపోయి, వివాదరహితుడిగా పేరుపొందిన ఆ పార్టీ నేత యుమ్నమ్ ఖేమ్‌చంద్ సింగ్ సారథ్యంలో మణిపుర్‌లో తాజాగా కొత్త సర్కారు కొలువుతీరింది. మెయ్‌తెయ్ ముఖ్యమంత్రికి తోడుగా కుకీ, నాగా వర్గాల నుంచి ఒక్కొక్కరిని ఉపముఖ్యమంత్రులుగా ఎంపిక చేయడంలో- పరస్పరం కత్తులు దూసుకుంటున్న తెగల నడుమ సుహృద్భావ సంబంధాలను పెంపొందించాలన్న కమలదళం ఆలోచన ప్రస్ఫుటమవుతోంది!

ఎన్‌సీఆర్‌బీ గణాంకాల ప్రకారం, మణిపుర్‌లో 2021లో 545, 2022లో 631 హింసాత్మక నేరాలు చోటుచేసుకున్నాయి. అలాంటిది 2023లో వాటి సంఖ్య ఒక్కసారిగా 14,427కు పెరిగిందంటే- సాధారణ జనజీవితాన్ని కన్నీటి పాల్జేసిన హింసోన్మాదం అక్కడ ఏ స్థాయిలో ప్రకోపించిందో అర్థం చేసుకోవచ్చు. ఆ ఏడాది మిగిలిన రాష్ట్రాల్లో అత్యధికంగా ఒడిశాలో 68.5శాతం క్రైంరేటు నమోదైతే- మణిపుర్‌లో అది 446కు పైబడింది. అత్యాచారాలు, హత్యలు, గృహదహనాలు సర్వసాధారణమైన కల్లోల పరిస్థితుల్లో స్థానికుల జీవనోపాధి మార్గాలు దాదాపుగా మూసుకుపోయాయి. చదువులు ఆగిపోయాయి. సామాజికంగా చీలిపోయి ఆర్థికంగా నలిగిపోయిన మణిపుర్‌ను తిరిగి గాడినపెట్టడం ఖేమ్‌చంద్ ప్రభుత్వానికి పెద్ద సవాలే! అందులో భాగంగా ముందు స్వరాష్ట్రంలోనే శరణార్థులైన వారిని స్వస్థలాలకు చేర్చాల్సి ఉంది. వచ్చే మాసాంతానికి 40వేల మందికి పైగా బాధితులకు పునరావాసం కల్పించే లక్ష్యంతో శ్రమిస్తున్నట్లు మణిపుర్ యంత్రాంగం చెబుతోంది. అలాగని ఇంటి నిర్మాణాలకు సాయం చేసి సరిపెట్టేయకుండా ఆ నిర్భాగ్యులు సుస్థిరాదాయంతో సురక్షితంగా, గౌరవప్రదంగా జీవించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలి!

జాతీయ ఎమర్జెన్సీ అమలులో ఉన్నప్పుడో, అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించలేని పరిస్థితి ఉందని ఎలక్షన్ కమిషన్ ధ్రువీకరించినప్పుడో తప్ప ఎక్కడా రాష్ట్రపతి పాలనను ఏడాదికి మించి పొడిగించేందుకు కుదరదు. అందుకే మణిపుర్‌లో ఎన్నికైన ప్రభుత్వాన్ని పునఃస్థాపించేందుకు భాజపా అధిష్ఠానం కొద్ది నెలలుగా కసరత్తు చేస్తూ వచ్చింది. ఆదివాసీ ప్రాంతాల్లో ప్రత్యేక అసెంబ్లీతో కూడిన యూటీ తరహా పాలనా వ్యవస్థను ఏర్పాటు చేయాలని భీష్మిస్తున్న కుకీ-జో వర్గాలు... నూతన ప్రభుత్వ ఏర్పాటును నిరసిస్తున్నాయి. సర్కారులో చేరిన ఆదివాసీ ఎమ్మెల్యేలను వెలేస్తున్నట్లు ప్రకటించాయి. రాజ్యాంగబద్ధమైన పాలనకు హామీనిస్తూ, భూమి హక్కులూ గిరిజనులకు రక్షణ తదితర అంశాల్లో సమస్యలను పరిష్కరిస్తూ, ఆయా వర్గాలకు విశ్వాసం కల్పించి శాంతి సాధనలో అందరినీ భాగస్వాములను చేయడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత!



మనిషి ఒంటరిగా ఉన్నంత కాలం మృగాలతో సమానంగా ఉన్నాడు. కలిసి జీవించడం మొదలయ్యాకే నాగరికత ఏర్పడింది. వేల ఏళ్లుగా నాగరికుడిగా బతుకుతున్నా అజ్ఞానం, అహంకారం మాత్రం వెన్నంటే ఉంటున్నాయి.


– అశోక్ బ్యాంకర్, రచయిత

అజ్ఞానాన్ని రూపుమాపాలి!

ఆదిశంకరుడు చెప్పిన అజ్ఞానం వేరు. ఈ అజ్ఞానం అది కాదు. అంతటా వ్యాపించి రాజ్యమేలుతున్న ఈ అజ్ఞానమే అధర్మానికి, అన్యాయానికి కూడా కారణం.

తప్పునకు మరో తప్పు తమ్ముడన్నట్లు ఈ అజ్ఞానం బంధువులు ఎక్కడ చూసినా ఉంటారు. ఇది యోగ్యత లేనివాళ్లని సింహాసనాలు ఎక్కించి రాజ్యాన్ని చిన్నాభిన్నం చేస్తుంది. జనాలను పావులను చేసి ఆడుకుంటుంది. అందరూ జ్ఞానవంతులు అయితే చెడ్డ పాలకులను ఎందుకు నెత్తిమీద పెట్టుకుని ఊరేగుతారు? వాళ్లని దించడానికి అష్టకష్టాలు ఎందుకు పడతారు? అజ్ఞానం దుర్యోధనుడికి గురువు. కంసుడికి మామ. రాక్షసులను, రాక్షసుల్లాంటి మనుషులను నడిపించేది అజ్ఞానమే. దాన్ని లేకుండా చేయడం ఎలా? అది సాధ్యపడదు. అందరూ విద్యావేత్తలు, పండితులు, జ్ఞానులు, యోగులు కాలేరు. జ్ఞానం ఎంత సనాతనమో అజ్ఞానం కూడా ఆనాటిదే అని వేదాలు చెబుతున్నాయి. ఈ రెండింటి మధ్య పోరాటమే జీవితం. అయితే చూస్తూ చూస్తూ అజ్ఞానాన్ని పెంచి పోషించకూడదు. ఎక్కడ ఉన్నా, దాన్ని రూపుమాపాలి.

ఒక్కోసారి తెలిసిన వాడికంటే తెలియనివాడే ఎక్కువగా సుఖపడతాడు. అలాగని అందరూ అజ్ఞానంతో ప్రవర్తిస్తే లోకం ఏమవుతుంది? మసక చీకట్లో తాడు పాములా కనిపిస్తుంది. దానిమీద దీపపు వెలుగు ప్రసరిస్తే అది తాడని తెలుస్తుంది. అజ్ఞానం తొలగాలంటే విజ్ఞాన వెలుగులు విస్తరించాలి. అవిద్య పోవాలంటే ఆత్మవిద్య కావాలి. అందరికీ అది అందిరాదు స్వానుభవంతో సంపాదించుకునే బ్రహ్మజ్ఞాన సిద్ధి కలగదు. కాబట్టి తనకున్న అజ్ఞానం తనకు తెలిస్తే చాలు. అందుకే సోక్రటీస్ 'నాకేమీ తెలియదన్న విషయం తెలిసింద'ని చెబుతాడు.



అంతర్యామి


అజ్ఞానం పోగొట్టడానికి సరైన జ్ఞానం సరైన సమయంలో రావాలి. లేదా అజ్ఞానం పెరగకుండా చూడాలి. కౌరవులు నూరుగురు అజ్ఞానం వెంట నడిచారు. దుర్యోధనుడి వల్ల నాశనమై పోయారు. పాండవులు అయిదుగురు జ్ఞానం వెంట నడిచారు. శ్రీకృష్ణుడి రక్షణ పొందారు. విజయం సాధించారు. సర్వ అనర్థాలకు కారణం అజ్ఞానం. సర్వ శుభాలకు, సుఖ సంతోషాలకు కారణం విజ్ఞానం. అన్నివైపుల నుంచి గొప్ప ఆలోచనలు, అద్భుతమైన జ్ఞానం వచ్చుగాక! అని రుగ్వేదం అందుకే చెబుతోంది.

సత్సాంగత్యంలో జ్ఞానం ఉంటుంది. దుస్సాంగత్యంలో అజ్ఞానం ఉంటుంది. అందులో తాత్కాలికమైన హాయి లభిస్తుంది. జ్ఞానంలో శాశ్వతమైన ఆనందం ఉంటుంది. దాన్ని లోకానికి అందించాలంటే- చీడపురుగుల మీద క్రిమిసంహారక మందులు చల్లినట్లు, అజ్ఞానం మీద జ్ఞానాన్ని వర్షంలా కురిపించాలి.

చెడు దావానలంలా వ్యాపిస్తుంది. మంచి చెవిని చేరకముందే చెడు ఇల్లు కట్టేస్తుంది. అజ్ఞానం ఊళ్లకి ఊళ్లనే తగలబెడుతుంది. గురు రూపంలో దైవం సరైన మార్గంలో నడిపించి, అజ్ఞానం ఆట కట్టిస్తాడు. ఎవరికి వాళ్లు బాధ్యత తీసుకుని ఎక్కడ అజ్ఞానం, అధర్మం, అసత్యం వేరుకున్నా వాటిని నిరసించాలి, ఎదిరించాలి, రూపుమాపాలి. బ్రహ్మసత్యం జగన్మిథ్య అనే వాక్యాన్ని అనుభవంలోకి తెచ్చుకోవాలంటే ముందు ఈ సాధారణ స్థాయిలో ప్రాథమికమైన అజ్ఞానాన్ని తొలగించుకోవాలి.

– ఆనందసాయి స్వామి

పన్ను చెల్లింపుదారులకు భయం అనవసరం



పన్ను విధానాలను మరింత సరళం, సులభతరం చేయాలని కేంద్రం సంకల్పించింది. అందులో భాగంగా ఆదాయ పన్ను చట్టం-2025ను తెచ్చింది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి అది అమలులోకి రానుంది. కొత్త పన్ను విధానం ప్రత్యేకతలు, రీఫండ్‌లు, ట్యాక్సుల చెల్లింపు తీరుతెన్నులు, వాటిలో ఎదురవుతున్న ఇబ్బందుల పరిష్కారం తదితరాలపై కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) అధ్యక్షుడు రవి అగ్రవాల్ 'ఈటీవీ భారత్' ప్రతినిధి సౌరభ్ శుక్లాతో మాట్లాడారు. ఆ వివరాలు...

ఆదాయ పన్ను చెల్లింపుదారుల సంఖ్య పెరుగుతున్న దృష్ట్యా వేగంగా బాధ్యతలు నిర్వహించడానికి మీ విభాగం ఎలాంటి చర్యలు తీసుకుంటోంది?

పన్ను చెల్లింపుదారుల సంఖ్య పెరుగుతున్నమాట నిజమే. ప్రస్తుతం తొమ్మిది కోట్లమంది ఆదాయపన్ను రిటర్నులు దాఖలు చేస్తున్నారు. పన్ను చెల్లించాల్సిన మరో నాలుగు కోట్లమంది రిటర్నులు దాఖలు చేయడం లేదు. వారిలో చాలామంది తమ ఆదాయం నుంచి టీడీఎస్‌ను మినహాయించారు కాబట్టి ఇక రిటర్నులు అవసరంలేదని భావిస్తున్నారు. అది సరికాదని, రిటర్నులు దాఖలు చేయాలని వారికి ఈ-మెయిల్స్, సందేశాల ద్వారా తెలియజేస్తున్నాం. అందరూ సక్రమంగా పన్నులు చెల్లించేలా తగిన చర్యలు తీసుకుంటున్నాం. ఈ విషయంలో కేసులు దాఖలు చేయాల్సిన అగత్యాన్ని నివారించదలిచాం. వివాదాలకు తావు లేకుండా చూస్తున్నాం. అన్ని రకాల పన్ను వసూళ్లు పెరుగుతున్నందు వల్ల ఆదాయ పన్ను వసూళ్లలోనూ వృద్ధి ఉంటుందని ఆశిస్తున్నాం.



చెల్లింపుదారులు ఇప్పటికీ పాత విధానాన్నే కోరుకుంటున్నారా లేక కొత్త పన్నుల వ్యవస్థకు మారుతున్నారా?

88శాతం మంది కొత్త విధానాన్ని ఎంచుకుంటున్నారు. దీన్ని మరింత ఆకర్షణీయం చేయడానికి ఈ ఏటి బడ్జెట్ పలు ఏర్పాట్లు చేసింది. పాత పన్ను విధానంలో కనీస ప్రత్యామ్నాయ పన్ను(ఎంఏటీ)ను ఒక లబ్ధిగా పరిగణించేవారు. వచ్చే ఏడాది నుంచి ఎంఏటీకి బదులు కనీస పన్ను అమలులోకి వస్తుంది. ఇది బుక్ ప్రాఫిట్‌పై ప్రస్తుత 15శాతంగా కాకుండా 14శాతంగా ఉంటుంది.

కొత్త ఆదాయ పన్ను చట్టం వల్ల కలిగే ప్రయోజనాలేంటి?

కొత్త చట్టం పన్ను చెల్లింపు నిబంధనలను, విధానాలను సడలించింది. అందరికీ అర్థమయ్యే సులభమైన భాషను ఉపయోగిస్తోంది. ఏదైనా రిటర్నుపై ఆదాయ పన్ను శాఖ పునఃపరిశీలన జరిపినా చెల్లింపుదారుడు తన రిటర్నులో మార్పుచేర్పులు చేసి అదనపు పన్ను చెల్లించి సమస్యను పరిష్కరించుకోవచ్చు. కొత్త ఆదాయ పన్ను విధానం అందరూ సులువుగా పాటించడానికి అనువుగా ఉంటుంది.

ఆదాయ పన్ను శాఖ నుంచి నోటీసులు వస్తే చాలామంది ఆందోళన పడతారు. కొత్త చట్టం దీనికి పరిష్కారం చూపుతుందా?

పన్ను చెల్లింపుదారులు భయపడనక్కర్లేదు. అసెస్‌మెంట్ తరవాత కూడా అదనపు పన్ను చెల్లించి సమస్యను పరిష్కరించుకోవచ్చు. జరిమానా, నేరాభియోగం దాఖలు ఉండనే ఉండవు. వేతన జీవులకు, చిన్న మొత్తాల్లో పన్ను చెల్లించేవారికి టీడీఎస్, టీసీఎస్‌లను తగ్గించాం. విద్యావైద్యాల కోసం విదేశాలకు పంపే సొమ్ము మీద పరిమితులను సడలించాం. ఫలితంగా పన్ను చెల్లింపుదారుల చేతిలో ఎక్కువ డబ్బు మిగులుతుంది. నోటీసుల బెడద ఉండదు. చాలామంది పనుల ఒత్తిడి వల్ల తాము చెల్లించాల్సిన పన్ను గురించి సరిగ్గా లెక్కలు వేసుకోరు. అడ్వాన్స్ పన్ను చెల్లించకపోతే వడ్డీ లేదా జరిమానా రూపంలో పెద్ద మొత్తం చెల్లించాల్సి వస్తుంది. టీడీఎస్, టీసీఎస్ పద్ధతుల్లో స్వల్ప మొత్తాల్లో పన్నులను ముందునుంచే జమచేయడం జరుగుతుంది. దానివల్ల ఒక్కసారే పెద్ద మొత్తం నెత్తిన పడకుండా ఉంటుంది. ఒకవేళ ఎక్కువ పన్ను వసూలు చేస్తే, ఆదాయపన్ను శాఖ దాన్ని వాపసు (రీఫండ్) ఇస్తుంది. దీనివల్ల పన్ను చెల్లింపుదారులు సక్రమంగా పన్ను రిటర్నులు దాఖలు చేసి నోటీసుల బారి నుంచి తప్పించుకోగలుగుతారు.

ఆన్‌లైన్‌లో పన్ను రిటర్ను దాఖలు చేసేటప్పుడు సిస్టమ్ బాగా నెమ్మదిస్తోంది. దీన్ని ఎలా పరిష్కరించబోతున్నారు?

గడువు సమీపిస్తుండగా మూకుమ్మడిగా రిటర్నులు దాఖలు చేయడమే సమస్యకు కారణం. ఇక నుంచి ఎక్కువ గడువు ఇస్తున్నాం. దీనివల్ల సర్వర్‌పై తక్కువ ఒత్తిడి పడుతుంది. రిటర్నులో తప్పులు సరిదిద్దుకోవడానికి గడువును డిసెంబరు 31 నుంచి మార్చి 31 వరకు పొడిగించాం.

కొంతమందికి రీఫండ్‌లు త్వరగా వస్తాయి, మరికొందరికి చాలా ఆలస్యమవుతాయి. దీనికి కారణమేంటి?

చిన్న మొత్తాలను త్వరగా వాపసు ఇస్తున్నాం. కొత్త పన్ను విధానానికి మారినవారికి బోలెడు పత్రాలు దాఖలు చేయాల్సిన అవసరం లేదు. అధిక మొత్తాల్లో పన్ను చెల్లించేవారు చాలా సందర్భాల్లో తప్పుగా మినహాయింపులు, డిడక్షన్లు కోరుతుంటారని కృత్రిమ మేధ (ఏఐ), డేటా ఎనలిటిక్స్ ద్వారా కనుగొన్నాం. ఇలాంటి కేసుల్లో రీఫండ్‌లు ఆలస్యమవుతాయి. ఇలాంటి వాటిలో తప్పులు సరిదిద్దుకోవాల్సిందిగా కోరతాం. ఫలితంగా 50 లక్షల మంది తమ రిటర్నులను సవరించుకున్నారు. 25.5 లక్షల మంది పొరపాట్లను సరిదిద్దుకుని రిటర్నులు సమర్పించారు. గడిచిన రెండేళ్లలో సవరించిన రిటర్నుల సంఖ్య 1.1 కోట్లకు చేరింది. దీనివల్ల పన్నులో రూ.8,500 కోట్ల వ్యత్యాసం కనుగొన్నాం. ఈ ఏడాది జనవరి 31 వరకు రూ.1,750 కోట్ల విలువైన రీఫండ్ క్లెయిములను పరిష్కరించాం.

వచ్చే ఏడాది నుంచి రీఫండ్‌లు వేగంగా వస్తాయా?

అవును. పొరపాట్లు చేస్తే రీఫండ్‌లు ఆలస్యమవుతాయని పన్ను చెల్లింపుదారులు గ్రహించారు కాబట్టి ఇకపై వారు జాగ్రత్తగా ఉంటారు. అధునాతన సాంకేతికతలను ఉపయోగించి క్లెయిములను వేగంగా పరిష్కరిస్తున్నాం. కొత్త ఆదాయపన్ను చట్టంలో మారిన నిబంధనలకు అనుగుణంగా కొత్త ఫారాలు రూపొందిస్తున్నాం. సాఫ్ట్‌వేర్‌లో కూడా మార్పులు చేస్తున్నాం. ★

మనుషులు రకరకాల కారణాల వల్ల వైకల్యం బారిన పడుతుంటారు. దాని తాలూకు కష్టాలను అధిగమించేందుకు వారికి శక్తినిచ్చేది జీవితేచ్ఛ మాత్రమే. అదే కొందరిని ఎందరికో స్ఫూర్తినివ్వగల అద్భుత వ్యక్తులుగా నిలుపుతుంది. అలాంటి వారే పాల్ రిచర్డ్ అలెగ్జాండర్. డెబ్బై ఎనిమిదేళ్ల జీవితంలో 72 ఏళ్ల పాటు పాల్ భౌతికంగా మంచానికి పరిమితమయ్యారు. తల తప్ప ఇంకే అవయవాన్నీ కదల్చలేని అశక్తత. ఊపిరి తీసుకోవడానికి సైతం యంత్రాల మీద ఆధారపడటమే. అలాంటి యంత్రం ఐరన్‌లంగ్‌లో సుదీర్ఘ కాలం జీవించిన వ్యక్తిగా గిన్నిస్

ఈ అలెగ్జాండర్ నిజంగా గ్రేట్!



రికార్డు ఆయన పేరు మీదే ఉంది. ఆ స్థితిలోనూ అలెగ్జాండర్ న్యాయశాస్త్రంలో డాక్టరేట్ పొంది బార్ అసోసియేషన్‌లో సభ్యులయ్యారు. తన జీవిత చరిత్ర స్వయంగా రాశారు. సామాజిక మాధ్యమాల్లో లక్షలాది ఫాలోవర్లను సంపాదించుకున్నారు.


పాల్ అలెగ్జాండర్ 1946లో టెక్సాస్‌లో పుట్టారు. ఆయనకు ఆరేళ్ల వయసున్నప్పుడు అమెరికాలో పోలియో విజృంభించింది. అది పాల్‌కు ఎంత తీవ్రంగా సోకిందంటే మెడ కింది నుంచి శరీరమంతా అచేతనమైపోయింది. ఆఖరికి శ్వాస తీసుకోవడం కూడా సాధ్యం కాలేదు. వెంటనే ఆస్పత్రిలో చేర్పించి ఐరన్ లంగ్ అనే యంత్రాన్ని అమర్చి శ్వాస తీసుకునే ఏర్పాటు చేశారు. మెడ కింది నుంచి మొత్తం శరీరమంతా ఒక పెద్ద సిలిండర్ లాంటి యంత్రంలో ఉంటుంది. తల ఒక్కటే బయట ఉండేది. ఆరోజుల్లో అందుబాటులో ఉన్న వెంటిలేటర్స్ అవే. పాల్ ఏడాదిన్నరపాటు ఆస్పత్రిలోనే ఉన్నారు. ఆరోగ్యం కాస్త మెరుగైంది కానీ శరీరం శాశ్వతంగా అచేతనమైంది. శ్వాస కూడా సొంతంగా తీసుకోలేరు. దాంతో ఐరన్ లంగ్‌తో సహా తనను ఇంటికి తీసుకెళ్లడానికి తల్లిదండ్రులు పోర్టబుల్ జనరేటర్‌నీ, ట్రక్‌నీ అద్దెకు తీసుకోవాల్సి వచ్చింది. ఓ స్వచ్ఛంద సంస్థ సహకారంతో థెరపీ తీసుకున్న పాల్ కాసేపు ఐరన్ లంగ్ లేకుండా శ్వాస తీసుకోవడం సాధన చేసేవారు. పట్టుదలగా ఆ సమయాన్ని క్రమంగా పెంచుకున్నారు. పాఠాలు విని గుర్తుపెట్టుకుని బడిలో అడుగు పెట్టకుండానే హైస్కూల్ నుంచి ఉత్తీర్ణుడైన తొలి వ్యక్తిగా రికార్డు సృష్టించారు. స్కాలర్‌షిప్‌తో యూనివర్సిటీలో ప్రవేశం పొందారు. గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి, లా పట్టా పొందారు. ఉద్యోగాలూ చేశారు. బార్ సభ్యత్వం పొందాక కక్షిదారుల తరఫున వాదించడానికి కోర్టుకు కూడా వెళ్లారు. శరీరాన్ని నిటారుగా ఉంచడానికి ప్రత్యేకంగా వీల్‌చెయిర్ తయారు చేయించుకున్నారు. 2024 జనవరిలో సోషల్ మీడియా ఖాతా తెరిచి తన జీవిత పాఠాలను పంచుకోవడం మొదలెట్టిన అలెగ్జాండర్ ఆ తరవాత రెండు నెలలకు చనిపోయే నాటికి లక్షలాది ఫాలోవర్లను సంపాదించుకున్నారు.

నోటితో ప్లాస్టిక్ పుల్ల పట్టుకుని కీబోర్డు మీద ఒక్కో అక్షరాన్ని నొక్కుతూ ఎనిమిదేళ్ల పాటు కష్టపడి పాల్ రాసిన బయోగ్రఫీ పేరు 'త్రీ మినిట్స్ ఫర్ ఎ డాగ్: మై లైఫ్ ఇన్ యాన్ ఐరన్ లంగ్'. మానసికంగా, శారీరకంగా తానెన్ని కష్టాలు పడిందీ అందులో వివరించారు. 'నా శరీరమే ఐరన్ లంగ్‌లో ఉంది. నా మనసూ హృదయం జీవితం... అన్నీ బయటే ఉన్నాయి' అని రాసుకున్నారు పాల్ తన జీవిత చరిత్రలో.

– ఊటుకూరి నందిని

హ్యూమానిటీస్‌దే హవా

యూపీఎస్సీ పరీక్షల ద్వారా సివిల్ సర్వీసులకు ఎంపికవుతున్న వారిలో ఎక్కువ మంది ఎంచుకునే అంశాలేంటి అన్నది ఆశావహ యువతకు ఆసక్తికర అంశం. విజేతల్లో అధికులు మెయిన్స్ ఆప్షనల్ సబ్జెక్టులుగా ఆంత్రోపాలజీ, జాగ్రఫీ, హిస్టరీ, ఫిలాసఫీ, సైకాలజీ, సోషియాలజీలను (హ్యూమానిటీస్-ఎ) ఎంచుకుంటున్నారు. తరవాతి స్థానంలో కామర్స్ అండ్ అకౌంటెన్సీ, ఎకనామిక్స్, లా, మేనేజ్‌మెంట్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, పొలిటికల్ సైన్స్ వంటివి (హ్యూమానిటీస్-బి) కనపడతాయి. తెలుగు, తమిళం, హిందీ, ఇంగ్లిష్ తదితర భాషా సాహిత్యాలు, సైన్స్ (అగ్రికల్చర్, బోటనీ, మ్యాథమెటిక్స్, స్టాటిస్టిక్స్ వంటివి), మెడికల్ సైన్స్, ఇంజినీరింగ్ సబ్జెక్టులను కొద్ది మందే ఎంపిక చేసుకుంటున్నారు. 2021 సివిల్స్ విజేతల్లో ఎందరు ఆయా ఆప్షనల్ సబ్జెక్టులను ఎంచుకున్నారంటే... (శాతాల్లో)



హ్యూమానిటీస్-ఎ	41.2
హ్యూమానిటీస్-బి	32.5
భాషా సాహిత్యాలు	7.1
సైన్స్	12.2
మెడికల్ సైన్స్	3.3
ఇంజినీరింగ్	3.7

(ఆధారం: యూపీఎస్సీ వార్షిక నివేదిక)

అంతర్గత శత్రుస్వామ్యం

ప్రజాస్వామ్యం అనగానే అన్ని పార్టీలకూ ఎన్నికలు గుర్తొచ్చి, ఆ గండం ఎలా గట్టెక్కుతామా అన్న గుబులు రేగుతుంది. గెలిస్తే మాత్రం గుండె మీద చెయ్యి వేసుకుని ఆ పార్టీల నాయకులు పగలు కూడా గుర్రుపెట్టి నిద్రపోగలరు. కాంగ్రెస్ పార్టీకి మాత్రం గెలిచినా ఆ అదృష్టం ఉండదు. అదృష్టవశాత్తు పార్టీ ఓడిపోతే ఫర్వాలేదు గానీ, గెలిస్తే మాత్రం అంతర్గత శత్రుస్వామ్యం కొంప ముంచుతుంది!

'కొంతమంది నేతలు/ పీతలకే తాతలు/ పైకి పచ్చు వాణ్ని పట్టి/ పాతాళానికి తొక్కగలరు' అని ఒక కవి సొంత పార్టీలోని ఎసరు రాయుళ్లను కళ్లారా చూసి పళ్లారా అన్నాడు. శల్య పరీక్ష చేసినా దొరకని శల్యులు వాళ్లు. గద్దెనెక్కిన వారిని కనీసం కుదురుగా కూడా కూర్చోనివ్వకుండా అయిన పార్టీలోని పరాయివాళ్లు మిద్దెల మీది నుంచి గురి చూసి రాళ్లు విసురుతుంటారు. శ్రీశ్రీ రాసిన 'గాలిలో కనిపించు గడుసు దయ్యాలు' అన్నట్టు విమానాల్లో దిల్లీకి ఎగురుతూ ఉంటారు. పార్టీలోని పెద్దల దగ్గర మంచి మార్కులు కొట్టేసి కీలక పదవులు పట్టేసిన వర్గానికి, అవి రాని వారికి మధ్య హోరాహోరీగా పోరు జరుగుతుంటుంది. మా వల్లనే అధికారం వచ్చిందని ఒక వర్గం అంటే, కాదు మా వల్లనే అని ఇంకో వర్గం ఇచ్చే స్టేట్‌మెంట్లు స్టేట్ దాటి సెంటర్ దాకా యమ స్పీడులో వెళ్తుంటాయి. అధికారం పోతే మాత్రం మా వల్లనే పోయిందని ఎవరూ అనరు. అదే 'హస్తం' మార్క్ రాజకీయం! 'మాకు అన్ని పార్టీల్లోనూ అదృశ్య మిత్రులున్నార'ని వెనకటికి ప్రధానమంత్రిగా బల పరీక్షను ఎదుర్కొంటున్న రోజుల్లో పీవీ నరసింహారావు అన్నారు. అది నిజమైంది. సాధారణంగా ప్రపంచంలో ఎవరికైనా మిత్రులు కంటికి కనిపిస్తారు. వెతికి చూస్తే తప్ప శత్రువులు కనిపించరు. కాంగ్రెస్ ప్రపంచం వేరు. మిత్రుల కన్నా శత్రువులు దెబ్బ కొట్టొచ్చినట్టు కనిపిస్తారు.

ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలో ఉన్న కర్ణాటకలో రాజకీయం మరీ అధిష్ఠానం 'కరుణా'టకం అయిపోయింది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ వర్గాలు అమీతుమీ తేల్చుకోవడానికి సిద్ధమయినట్టు కనిపిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ



పథకం పేరు మార్చడాన్ని ఖండిస్తూ ఆ మధ్య కర్ణాటక కాంగ్రెస్ ఒక కార్యక్రమం ఏర్పాటు చేసింది. అందులో డీకే శివకుమార్ అనుకూల నినాదాలు మిన్నంటాయి. వాటిని విన్న సిద్ధరామయ్య 'యుద్ధరామయ్య' అయ్యారు. పూర్తి కాలం తానే ముఖ్యమంత్రిగా ఉంటానని మనసులో ఉందో లేదో గానీ, పైకి మాత్రం ధీమాగా చెప్పారు. అయితే అధిష్ఠానం ఎలా చెబితే అలా నడుచుకుంటామని ఇద్దరు నాయకులూ సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. గొడవలు పడమని అధిష్ఠానం ఏమీ చెప్పలేదు కదా!

సయోధ్య కోసం అప్పట్లో సిద్ధరామయ్య, శివకుమార్‌లతో అల్పాహార విందు సమావేశం ఏర్పాటైంది. ఇరువురిలో ఎవరు ఏమి అన్నారో, ఏమి విన్నారో, ఎవరు ఎక్కువ తిన్నారో, ఎవరు తక్కువ తిన్నారో తెలియదుగానీ.. ఇద్దరూ చేతిలో చెయ్యేసి చెప్పుకొన్నట్లు, మనసు విప్పుకొన్నట్టు వ్యవహారం గప్పుచుప్పు అయిపోయింది. కొత్తగా ఏమీ ఉప్పు అందకపోవడంతో మీడియాకు పని తగ్గింది. మళ్లీ తెర వెనకో, బయటో ఏమి జరిగిందో తెలియదు గానీ, వ్యవహారం మరోసారి 'రాజు'కుంది. ఆహారం ఆహారమే, వ్యవహారం వ్యవహారమే అని కొందరు చమత్కరించారు. ఎవరు రాజు? ఎవరు మంత్రి? అన్న రగడ వల్ల మాటలు గడగడ వినిపిస్తున్నాయి. ఒకవేళ అప్పటి అల్పాహారం సరిపోక సంపూర్ణ పరిష్కారం కుదరలేదనుకుంటే ఈసారి వాళ్లిద్దరూ ఆకలికి నకనకలాడుతున్నప్పుడు మిట్ట మధ్యాహ్నమో, నట్ట నడిరాత్రో 'అధికాహార విందు' ఏర్పాటు చేస్తే సరి!

అప్పటికీ సమస్య సద్దుమణగకపోతే నాయకత్వ మార్పిడి చేయాలని కొందరి సూచన. ఇది చెప్పడానికి బాగానే ఉంది గానీ 'ముందు గతి కానవే చిలకా' అని కాంగ్రెస్ అంతర్గత ఆత్మ వెనకవైపు చూపిస్తోంది. నాయకత్వ మార్పిడి చేయవచ్చుగానీ, కొత్తగా గద్దెనెక్కిన వర్గంతో గద్దె దిగిన పెద్దమనిషి బ్యాచ్ పేచీకి దిగి ఎసరు పెడితే ఎలా? ఇది పెరిగిన డాలర్ విలువను బట్టి ఎంత విలువైన ప్రశ్న అన్నది రాజకీయ ఆర్థిక శాస్త్రవేత్తలు సైతం చెప్పలేరు! ఫలితంగా తరవాత జరిగే ఎన్నికల్లో పార్టీ మట్టికరిస్తే ఎట్లా? రేసులో వెనకబడితే కాంగ్రెస్ పార్టీ తన తలకు తానే కొరివి పెట్టుకున్నట్టు కాదా! అన్నట్టూ, గతంలో చాలా కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఇదే అనుభవం పదే పదే ఎదురై కార్యకర్తలను ఇప్పటికీ బెదరగొడుతోంది. ముందు గొయ్యి... వెనక నుయ్యి! ఇలాంటి పరిస్థితుల్లో ఏం చేస్తావో చెయ్, చెయ్యి!!

– శంకర నారాయణ

ఎవరు అర్హులు?

కళింగ రాజ్యానికి రాజు కీర్తిసేనుడు. ఒకసారి మంత్రి సుబుద్ధిని పిలిచి.. 'రాజ్యంలో పేదవారికి ఏదైనా సాయం చేయాలి అనుకుంటున్నాను. అర్హులు ఎవరో నువ్వే గుర్తించాలి' అన్నాడు. ఆ విషయాన్ని అందరికీ తెలిసేలా రాజ్యంలో దండోరా వేయించాడు మంత్రి. దాంతో తెల్లారే చాలామంది కోటకు వచ్చారు. వారిలో నిజమైన పేదవాళ్లతో పాటు కొంతమంది అత్యాశపరులైన ధనవంతులు, భూస్వాములూ ఉన్నారు. వచ్చిన వాళ్లందరినీ మంత్రి ఒక వరసలో నిలబెట్టాడు. తరవాత.. 'రాజుగారు తన సాయంగా ఇక్కడికి వచ్చిన వాళ్లందరికీ ఒక్కో వరహా ఇవ్వమన్నారు. కాసేపట్లో మీ అందరికీ అవి అందజేస్తాం' అని చెప్పాడు. అది విని చాలామంది.. 'ఒక్క వరహాతో ఏం చేస్తాం. మాకేం వద్దు' అంటూ



వెళ్లిపోయారు. ఇంకొంత మంది.. 'ఇది మొదటిసారి కావచ్చు.. తరవాత మళ్లీ ఇంకొన్ని వరహాలు ఇస్తారేమో చూద్దాం' అనుకుని అక్కడే ఉన్నారు. కాసేపటికి మంత్రి అక్కడ ఉన్నవాళ్లందరికీ ఒక్కో వరహా ఇచ్చి.. 'ఇక మీరు వెళ్లొచ్చు' అని చెప్పాడు.

అప్పుడు కూడా 'ఒక్కటైతే మాకొద్దు' అంటూ చాలామంది అక్కడే పెట్టి వెళ్లిపోసాగారు. కానీ కొద్ది మంది మాత్రమే వాటిని తీసుకున్నారు. వాళ్లను గుర్తించి.. రాజు దగ్గరికి తీసుకెళ్లాడు మంత్రి.

హాయ్! బుజ్జీ!!

'మహారాజా! వీళ్లే మీ సాయాన్ని పొందడానికి అసలైన అర్హులు' అని చెప్పాడు. దాంతో రాజు.. 'సరే! వీళ్ల కుటుంబ పరిస్థితులకు సంబంధించి అన్ని వివరాలు ఆరా తీయండి. తరవాత వాళ్లకు కొంత ధనం ఇచ్చి, మంచి రాబడిని వచ్చే వ్యాపారం ఏదైనా పెట్టించండి' అని చెప్పాడు. కొన్ని రోజుల్లోనే ఆ పనంతా పూర్తి చేశాడు మంత్రి. దాంతో రెండుమూడేళ్లలో కళింగ రాజ్యంలో పేదల సంఖ్య తగ్గిపోయింది. అలాగే రాజ్యమూ అభివృద్ధిలోకి వచ్చింది.

– సంగనభట్ల చిన్న రామకిష్టయ్య

ఆ ఒక్కటి ఏది?

కింద ఇచ్చిన పదాల్లో ఒక్కటి మాత్రం మిగతా వాటికి భిన్నంగా ఉంటుంది. ఆ ఒక్కటి ఏదో కనిపెట్టండి.

1. మజ్జిగ, బ్రెడ్, జున్ను, నెయ్యి
2. నైలు, హిందూ, అట్లాంటిక్, పసిఫిక్
3. వెండి, బంగారం, బొగ్గు, రాగి
4. గ్రామం, జిల్లా, రాష్ట్రం, చైనా


Pure Since 1925
100 ఇయర్స్ ఆఫ్ భీమ
100 సంవత్సరాలు.
100 రోజులు.
100% తగ్గింపు
మేకింగ్ ఛార్జీలపై*
భీమ
లెగసీ ఫెస్ట్
100 డేస్ ఆఫర్
100%*
వరకు తగ్గింపు
బంగారం, వెండి మరియు
వజ్రాల మేకింగ్ ఛార్జీలపై వర్తిస్తుంది.
ఉచితం
999
24kt బంగారం బార్
ప్రతి ఒక లక్ష రూపాయలు
వజ్రాల విలువపై*.
FORMERLY
BHIMA
GOLD • DIAMONDS • SILVER • PLATINUM
BHIMA
BHIMA Helpline
1800-121-9076
(10:00 a.m. to 7:00 p.m.)
విజయవాడ: బందర్ రోడ్, ఎమ్. జి. రోడ్, గేట్‌వే హోటల్ పక్కన. ఫోన్: 086-62481531.
రాజమండ్రి: గోకవరం బస్టాండ్ ఎదురుగా, లక్ష్మీవారపు పేట–533101. ఫోన్: 088-32460100.
బెంగళూరు • ఉడుపి • హాసన్ • మంగళూరు • శివమొగ్గ • చెన్నై • హోసూర్ • బెళగావి • హుబ్బళ్ళి | bhimagold.com


BODYCARE
WOMEN'S INNERWEAR
LOVE
YOUR
body
THE NEW WAY...
UNVEILING
SOON!
CONNECT WITH US:

సమగ్ర కుటుంబ సర్వే ఆధారంగా బీసీ కోటా!

(మొదటి పేజీ తరువాయి)

ఇచ్చిన హామీ మేరకు బీసీలకు 34% రిజర్వేషన్ల ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. రిజర్వేషన్ కోటా ఖరారుకు డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు చేయాలని ఇప్పటికే చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారు. ఈ కమిషన్ ఏర్పాటుకు తెలంగాణ, ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో అనుసరించిన విధానాన్ని అధికారులు పరిశీలించారు. అక్కడ కులగణన చేపట్టిన తీరుతో పాటు డెడికేటెడ్ కమిషన్ నియామకాన్ని కూడా ప్రభుత్వం ముందు ఉంచి తదుపరి నిర్ణయం తీసుకోవాలని యోచిస్తున్నారు. మరో వారంలో దీనికి సంబంధించి ప్రభుత్వం నుంచి గ్రీన్‌సిగ్నల్ రానున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. డెడికేటెడ్ కమిషన్ నియామకం తర్వాత గరిష్ఠంగా 45 రోజుల గడువుతో ప్రక్రియను పూర్తి చేయనున్నారు.

మార్చి 12 తర్వాత.. తొమ్మిదో తరగతి విద్యార్థులకు పది పాఠాల బోధన

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో మార్చి 12 తర్వాత నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు పదో తరగతి పాఠాలు బోధించేందుకు చర్యలు తీసుకోవాలని పాఠశాల విద్యాశాఖ అధికారులు సూచించారు. ఉపాధ్యాయ సంఘాల నేతలతో శుక్రవారం పాఠశాల విద్యాశాఖ అదనపు డైరెక్టర్లు సుబ్బారెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, జేడీలు శైలజ, అబ్రహం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించి మారిన సిలబస్‌పై జూన్ నెలలో ఉపాధ్యాయులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. 'నో బ్యాగ్ డే' రోజున పుస్తకాలు లేకుండా బోధన చేసే అంశాలు ఉంటే బోధించవచ్చని, గత బదిలీల కంటే మెరుగ్గా ఈ సంవత్సరం నిర్వహిస్తామని అధికారులు హామీ ఇచ్చారు.



మీకున్న ఏకైక ఆస్తి అదే..


మీ దగ్గర ఉన్న డబ్బు కన్నా విలువైనది, మీ స్నేహితుల కన్నా ఎక్కువగా మీకు ఉపయోగపడేది, మీరు వాడుకున్నా, వాడుకోకపోయినా ఖర్చయ్యేది ఒకటుంది. అదేంటంటే సమయం. అదే మీకున్న ఏకైక ఆస్తి. దాని విలువను గుర్తించి సద్వినియోగం చేసుకోండి.

– నావల్ రవికాంత్, ఆంత్రప్రెన్యూర్

తిరుమలకు కల్తీ నెయ్యి సరఫరా మహాపచారం

(మొదటి పేజీ తరువాయి)

రసాయనాలు కలిపేసి నెయ్యి కాని నెయ్యి తయారు చేసి తిరుమల స్వామి వారి ముందు దీపారాధన చేశారే, స్వామివారి లడ్డూ ప్రసాదానికి, ఇతర నైవేద్యాలకు వినియోగించారే ఇది తప్పు కాదనుకుంటున్నారా' అని తిరుమల తిరుపతి దేవస్థానం పూర్వ ఈవో, విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎల్వీ సుబ్రహ్మణ్యం నిలదీశారు. 'మహాపచారం జరిగిపోయింది. ఇది మానవాళికే శాపం. ఇప్పటికైనా మీ వాదనలు, సమర్థనలు ఆపేసి. . ప్రాయశ్చిత్తం చేసుకోండి' అని డిమాండ్ చేశారు. జగన్ ప్రభుత్వంలో తిరుమలలో నెయ్యి కల్తీ జరిగిన వ్యవహారం, మాజీ ముఖ్యమంత్రి జగన్, అప్పటి తితిదే ఛైర్మన్ సుబ్బారెడ్డి, కొనుగోళ్ల కమిటీ ప్రత్యేక ఆహ్వానితుడు కరుణాకరరెడ్డి వంటి వారు తాజాగా చేస్తున్న వాదనల్లోని అంశాలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. 'వీళ్ల తప్పు లేదు.. వీళ్ల తప్పు ఉంది అని తేల్చి చెప్పండి. అంతే కానీ అసలు తప్పు జరగలేదు అని బొంకుతారేంటి? ఎవరు తప్పు చేశారో వాళ్లు తిరుమలకు వచ్చి పొర్లుదండాలు పెడతారో, తలనీలాలే అర్పిస్తారో వచ్చి తప్పు అంగీకరించండి' అని డిమాండ్ చేశారు. శుక్రవారం రాత్రి 'ఈనాడు'తో ఆయన ముఖాముఖి మాట్లాడారు.



పక్కా ప్రణాళిక.. నేరస్వభావం

వీళ్లు ప్లాన్ చేసి ఏ రసాయనం కలిపితే నెయ్యి వాసన వస్తుంది, నెయ్యిలా రంగు కనిపిస్తుంది? నెయ్యిలా ముద్దలా వస్తుంది? అని వెతికి, దాని కోసం ఎక్కడెక్కడికో వెళ్లి ఎవరెవర్నో తీసుకువచ్చి, భాగస్వాములను చేసి ఈ మొత్తం వ్యవహారం నడిపారంటే అది ఎంత పెద్ద కుట్రో స్పష్టంగా తెలుస్తోంది. ఇందులో నేరస్వభావం అర్థమవుతోంది. 2022లో నమూనాలు పరీక్షించినప్పుడు నెయ్యి కల్తీ జరిగిందని నివేదికలు వచ్చాయి. అప్పుడైనా చర్యలు తీసుకోకుండా అదే నెయ్యిని కొనసాగించడం చూస్తే.. ఇది కావాలని చేసినట్లు అర్థమవుతోంది కదా!

హిందూ సమాజమంతా ఏకం కావాలి

ఈ కుట్రపై, మహాపచారంపై ఏం చర్యలు తీసుకుంటారో చెప్పాలని హిందూ సమాజం అంతా ఏకమై ప్రభుత్వాన్ని కోరాలి. జరిగినదానికి శిక్ష పడేలా చూడాలని న్యాయస్థానాన్ని మనం వేడుకోవాలి. ఈ విషయంలో బాధ్యులైనవారందరూ తప్పు అంగీకరించి ప్రాయశ్చిత్తం చేసుకునే వరకూ వారెవరినీ శ్రీవారి దర్శనానికి అనుమతించకూడదు.

ఈవో, ఛైర్మన్ ఇద్దరూ బాధ్యులే

తిరుమల తిరుపతి దేవస్థానంలో ఈవోది చాలా కీలక బాధ్యత. ఆయన సాధారణ అధికారి కాదు.. సాక్షాత్తూ శ్రీవారికి అనుంగు సేవకుడు. ఏదైనా తప్పు గుర్తించినా, తప్పు జరుగుతోందని భావించినా ఈవో బోర్డు ఛైర్మన్ దృష్టికి తీసుకువెళ్లాలి. వారు వినకపోతే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలి. దేవదేవుడి సేవలో ఎలాంటి తప్పు జరగకుండా నిరోధించనందుకే ప్రభుత్వం సింఘాల్‌పై చర్యలు తీసుకుంది. తప్పులు జరగకుండా తితిదే ఛైర్మన్ కూడా బాధ్యత వహించాలి. తితిదే ఈవో, ఛైర్మన్ ఇద్దరూ జోడు గుర్రాల్లాంటివారు.

ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోవాలి

ఈ అంశాన్ని రెండు రకాలుగా చూడాలి. సిట్ తన నివేదికను సుప్రీంకోర్టుకు సమర్పిస్తుంది. ఎవరిపై ఎలా చర్యలు తీసుకోవాలో కోర్టు నిర్ణయిస్తుంది. అది సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం జరుగుతుంది. ప్రభుత్వం లేదా తితిదే బోర్డు ఇలాంటి వ్యవహారం పునరావృతం కాకుండా గట్టి చర్యలు తీసుకోవాలి.

నెయ్యి సరఫరా కోసం సొంత వ్యవస్థ

రాష్ట్రంలో ఆలయాలకు నెయ్యి సరఫరా విధానం పకడ్బందీగా ఉండేలా చూసుకోవాలి. గుజరాత్‌లో ఉన్న అమూల్ నమూనాను ఇక్కడా అమలు చేయొచ్చు. ఉమ్మడి చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లో రైతులను దేశీ ఆవులు పెంచేలా ప్రోత్సహించాలి. వారు ఉత్పత్తి చేసే ఆవుపాలు స్వామివారికి నెయ్యికి వినియోగిస్తామని ఒప్పందం చేసుకోవాలి. అప్పుడు రైతులు స్వామికి సమర్పించుకుంటున్నామనే భక్తితో పాలు పోస్తారు. పాల కేంద్రాలు పెట్టి ఆ ఆవుపాలు సేకరించాలి. అందులో నుంచి వెన్న తీసి, నెయ్యి తయారు చేయించాలి. తద్వారా ఎవరి నుంచి నెయ్యి వస్తోందో తితిదేకు తెలుస్తుంది. ఇలా చేస్తే 20 నుంచి 30 వేల రైతు కుటుంబాలకు ఆదాయమూ వస్తుంది. పాల సేకరణ, ఇతర పనులతో ఎంతో మందికి ఉపాధీ లభిస్తుంది.

పోలీసులను కవ్విస్తూ.. రెచ్చగొట్టేలా తిడుతూ..



ఇబ్రహీంపట్నం కూడలిలో బైక్‌తో వైకాపా శ్రేణుల అత్యుత్సాహం



జగన్ రాకతో విజయవాడ రూరల్ మండలం నల్లకుంట వద్ద జాతీయ రహదారిపై నిలిచిపోయిన ట్రాఫిక్

(మొదటి పేజీ తరువాయి)

ఇబ్రహీంపట్నం చౌరస్తాకు విజయవాడ, మైలవరం, తిరువూరు, నందిగామ, జగ్గయ్యపేట సహా చుట్టుపక్కల నియోజకవర్గాల నుంచి వేలమందిని వాహనాల్లో తీసుకొచ్చారు. దీంతో గొల్లపూడి నుంచి ఇబ్రహీంపట్నం వరకూ జాతీయరహదారిపై సాధారణ ప్రయాణికుల వాహనాలు స్తంభించిపోయాయి.

సైలెన్సర్లు తీసేసి.. రహదారిపై ఫీట్లు

కొందరు ద్విచక్రవాహనాలకు సైలెన్సర్లు తీసేసి జాతీయరహదారిపై వేగంగా దూసుకెళుతూ, చుట్టూ గుండ్రంగా తిప్పి స్టంట్లు చేస్తూ తోటి వాహనదారులను భయభ్రాంతులకు గురిచేశారు. జాతీయరహదారి వెంట ద్విచక్ర వాహనాలను ఆపి మద్యం తాగి ఊగుతూ.. వాహనాలను పెద్ద శబ్దంతో నడుపుతూ హల్‌చల్ చేశారు.

- చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేశ్‌లను దుర్భాషలాడుతూ, సవాళ్లు విసురుతూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు రాసిన జగన్ ఫ్లెక్సీలను చూపుతూ పైశాచికత్వం ప్రదర్శించారు.
- ఇబ్రహీంపట్నం చౌరస్తాలో ఓ వైకాపా కార్యకర్త తన చేతిపై గాటు పెట్టుకుని రక్తంతో జగన్ చిత్రపటానికి తిలకాలు పెట్టాడు. చుట్టూ ఉన్న వైకాపా కార్యకర్తలు నినాదాలు చేస్తూ కేరింతలు కొట్టారు. రక్తం ఎక్కువ కారడంతో కొంతమంది ఆ యువకుడి చేతికి కట్టుకట్టారు.

ఆరు గంటలకు పైగా యాత్ర

జగన్ ర్యాలీగా ఉదయం 11.06 గంటలకు తాడేపల్లిలో నివాసం నుంచి బయలుదేరి ఇబ్రహీంపట్నంలో జోగి రమేష్ ఇంటికి సాయంత్రం 5.05 గంటలకు చేరుకున్నారు. ఆరు గంటలకు పైగా పరామర్శ యాత్ర సాగింది. తాడేపల్లి నుంచి మంగళగిరి మీదుగా కాజ వరకూ వెళ్లి విజయవాడ బైపాస్‌రోడ్డు మీదకు చేరుకున్నారు. అక్కడి నుంచి గొల్లపూడి అడ్డరోడ్డు వద్ద జాతీయ రహదారిపైకి జగన్ ర్యాలీ ప్రవేశించింది. జగన్ ఇంటి దగ్గరకే విజయవాడ, మంగళగిరి నియోజకవర్గాల నుంచి భారీగా కార్యకర్తలను తీసుకొచ్చి ఉంచారు. అక్కడి నుంచి కార్లు, ద్విచక్రవాహనాలపై జగన్ వెంట వారంతా బయలుదేరారు. దారి పొడవునా వీరి దెబ్బకు సాధారణ ప్రయాణికులు ట్రాఫిక్‌లో చిక్కుకుని విలవిల్లాడారు.



గొల్లపూడి నుంచి ఇబ్రహీంపట్నం వరకు హైదరాబాద్ మార్గంలో నిలిచిపోయిన వాహనాలు

- గొల్లపూడి వద్ద జగన్ ర్యాలీ జాతీయ రహదారిపైకి మధ్యాహ్నం 1.40కి చేరుకోగా, ఇబ్రహీంపట్నంలోని జోగి ఇంటికి చేరుకునే సరికి సాయంత్రం 5 గంటలైంది. ఈ మూడున్నర గంటలకు పైగా.. జాతీయ రహదారిపై ఒకవైపు ట్రాఫిక్ పూర్తిగా స్తంభించి వాహనాలన్నీ కిలోమీటర్ల మేర నిలిచిపోయాయి. అదుపు చేయడానికి పోలీసులు ఎంతగా ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్‌లో మూడంచెల పోలీసు భద్రతను ఏర్పాటుచేసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు ప్రయత్నించారు.
- జగన్ పరామర్శ యాత్ర గొల్లపూడి నుంచి ఇబ్రహీంపట్నం వరకు తొమ్మిది కిలోమీటర్లు నత్త కంటే దారుణంగా సాగింది. గొల్లపూడి, నల్లకుంట సహా ప్రతి చౌరస్తాలోనూ జగన్‌కి స్వాగతం పలికేందుకు వందల మంది కార్యకర్తలను మోహరించారు.
- యాత్ర ముగిశాక కూడా సాయంత్రం 6.30 వరకూ జోగి నివాసం వద్దే జగన్ ఉండడంతో వైకాపా కార్యకర్తలు భారీగా మోహరించి జాతీయరహదారిపై వాహనాల రాకపోకలకు తీవ్ర అసౌకర్యం కలిగించారు.

జగన్ పర్యటనలో గుండెపోటుతో వైకాపా కార్యకర్త మృతి



రాంబాబు

వైకాపా అధ్యక్షుడు జగన్.. మాజీ మంత్రి జోగి రమేష్ పరామర్శకు శుక్రవారం ఇబ్రహీంపట్నానికి రాగా, ర్యాలీలో పాల్గొనేందుకు వచ్చిన ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం చిల్లకల్లుకు చెందిన వైకాపా గ్రామ పార్టీ అధ్యక్షుడు రాంబాబు గుండెపోటుతో మృతి చెందారు. అప్పటి వరకూ ఉత్సాహంగా ఉన్న రాంబాబు.. మధ్యాహ్నం భోజనానికి వెళ్తూ ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. అక్కడ ఉన్నవారు ఆయనకు సపర్యలు చేసి, సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచనతో విజయవాడ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న బంధువులు ఇబ్రహీంపట్నం చేరుకున్నారు. సాయంత్రానికి జగన్ అక్కడికి రావడంతో.. రాంబాబు మృతి విషయాన్ని ఎవరూ పట్టించుకోలేదు. రాంబాబుకు భార్య, ఇద్దరు కుమారులు కాగా, చిన్న కుమారుడు అనారోగ్యంతో రెండేళ్ల కిందట చనిపోయారు.

అబద్ధాన్ని సృష్టించి.. దుష్ప్రచారం చేస్తున్నారు

(మొదటి పేజీ తరువాయి)

ఈ రిపోర్టులు స్పష్టం చేస్తున్నాయి. చంద్రబాబు ప్రభుత్వంలో ఆయన మనిషి టీటీడీ ఈవోగా ఉండగా సేకరించిన నమూనాల నివేదికలు ఇవి. కేవలం ఒక అబద్ధాన్ని సృష్టించి, దాంతో దుష్ప్రచారం చేసి, దేవుణ్ని కూడా రాజకీయాల కోసం వాడుకుంటున్నారు. జంతువుల కొవ్వు, గొడ్డుమాంసం కలిసిన నెయ్యితో లడ్డూలు తయారు చేశారంటూ అన్యాయంగా ప్రచారం చేస్తున్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కానంతవరకూ భక్తులు వేంకటేశ్వరస్వామి ప్రసాదాన్ని కళ్లకద్దుకుని తినేవాళ్లు. ఇప్పుడు ఆ ప్రసాదం ప్రతిష్ఠను బాబు దిగజార్చారు' అని వైకాపా అధినేత జగన్ ధ్వజమెత్తారు. శుక్రవారం తాడేపల్లిలోని తన ఇంటి నుంచి బయలుదేరిన జగన్ ఇబ్రహీంపట్నంలోని జోగి రమేష్ ఇంటికి 39 కిలోమీటర్ల దూరానికి.. ఆరు గంటలకు పైగా సుదీర్ఘ పరామర్శ యాత్ర చేశారు. జోగి కుటుంబాన్ని పరామర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.



ఇబ్రహీంపట్నం వద్ద జగన్ అభివాదం.. వెనుక భారీగా నిలిచిపోయిన వాహనాలు

చంద్రబాబే క్షమాపణ చెప్పాలి: '2024 జులై 25లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే టీటీడీ నాలుగు నెయ్యి ట్యాంకులను కల్తీవని తిరస్కరించింది. మళ్లీ అవే ట్యాంకర్లు వేరే పేర్లతో వస్తే వాటిని లడ్డూల తయారీకి వాడారని సీబీఐ ఛార్జిషీట్‌లో ఉంది. దీనినిబట్టే ఎవరు పాపం చేశారనేది అర్థమవుతోంది. సీబీఐ ఛార్జిషీట్ నేపథ్యంలో ఇప్పటికైనా చంద్రబాబు లెంపలేసుకుని, ప్రజలకు క్షమాపణ చెప్పాలి' అని జగన్ వ్యాఖ్యానించారు. నెయ్యి కల్తీపై చంద్రబాబు వేసుకున్న ఏకసభ్య కమిటీ అబద్ధాన్ని నిజమని చూపించడానికే తప్ప దానికి ఎలాంటి విలువ ఉండదని జగన్ ఎద్దేవా చేశారు.

సింఘాల్‌ను తీసుకొచ్చింది చంద్రబాబే

అనిల్ కుమార్ సింఘాల్‌ను చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే తితిదే ఈవోగా తీసుకొచ్చారని, తర్వాత తాము ఆయన్ను కొనసాగించామని జగన్ పేర్కొన్నారు. 'సింఘాల్ తప్పు చేసి ఉంటే ఇప్పుడు మళ్లీ చంద్రబాబు ముఖ్యమంత్రిగా వచ్చాక ఈవోగా ఆయన్నే ఎందుకు తీసుకొచ్చారు? శ్యామలరావు అనే ఈవోను టీటీడీ ప్రక్షాళన కోసం తీసుకొచ్చామన్నారు.. మరి ఆయనను ఎందుకు తీసేశారో చెప్పాలి. శ్యామలరావు ఈవోగా ఉన్నప్పుడే నెయ్యి ట్యాంకర్లు తిరస్కరణకు గురవడం, తిరిగి మళ్లీ తీసుకొచ్చి వాడడం జరిగిందని సీబీఐ చెప్పింది. దీనికి చంద్రబాబు ఏం సమాధానం చెబుతారు' అని జగన్ ప్రశ్నించారు. 'చంద్రబాబు, ఆయన కుమారుడు, పవన్ కల్యాణ్‌లకు బుద్ధి ప్రసాదించాలని మావాళ్లు ప్రార్థనలు చేసినందుకే దాడులు చేస్తారా? చంద్రబాబు జంగిల్‌రాజ్ పరిపాలన నాగరిక సమాజం తల దించుకునేలా ఉంది. అంబటి రాంబాబు, జోగి ఇళ్లపై పోలీసుల సమక్షంలోనే వారి సహకారంతో దాడులు జరిగాయి. జోగి ఇంటిపై యాసిడ్ బాటిళ్లు, పెట్రోలు బాంబులతో దాడి చేస్తే తలుపులు కాలిపోయాయి. బీసీ నాయకుడిగా జోగి ఎదుగుతున్నాడని, అతణ్ని అణగదొక్కాలనే ఇలాంటి దాడులు చేయించారు. ఈ దాడికి ముందు పోలీసులు, తెదేపా నేతలు కలిసి ఇబ్రహీంపట్నం చౌరస్తాలో మంతనాలు జరిపారు' అని జగన్ ఆరోపించారు. దీనికి సంబంధించిన వీడియో ఫుటేజీ కూడా తమ వద్ద ఉందన్నారు. జోగి రమేష్‌పై ఇప్పటి వరకూ 12 కేసులు పెట్టారన్నారు. వచ్చేది తమ ప్రభుత్వమేనని, ఈ దాడుల్లో పాత్రధారులైన పోలీసులు, నాయకులు ఎవరినీ వదిలేది లేదని జగన్ హెచ్చరించారు.



జోగి రమేష్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న జగన్

ప్రజల దృష్టి మళ్లించడానికే జగన్ పరామర్శలు

మంత్రి కందుల ధ్వజం

ఈనాడు, అమరావతి: వైకాపా అధినేత జగన్ చేస్తున్న పర్యటనలు పరామర్శలకు కాదని, తాను చేసిన తప్పుల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికేనని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేశ్ మండిపడ్డారు. గత ఐదేళ్లలో ఆయన చేసిన అరాచకాలకు ప్రాయశ్చిత్త దీక్షలు చేయాల్సిన సమయం ఆసన్నమైందని శుక్రవారం ఒక ప్రకటనలో మంత్రి పేర్కొన్నారు. 'రోడ్లు క్లియర్‌గా ఉన్నప్పటికీ.. కేవలం 20 కిలో మీటర్ల దూరాన్ని ఏడు గంటలపాటు నెమ్మదిగా ప్రయాణించడం వెనుక ఆంతర్యం ఏమిటి? ఇది ప్రజలను ఇబ్బంది పెట్టడం కాదా? తప్పుడుగా మాట్లాడిన వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేయాల్సింది పోయి...వారినే జగన్ పరామర్శిస్తూ తప్పుడు సంకేతాలు ఇస్తున్నారు. వైకాపా నేతలు ఎన్ని డ్రామాలు ఆడినా ప్రజలు నమ్మరు' అని మంత్రి దుర్గేశ్ అన్నారు.

స్మగ్లర్లు, కల్తీ మద్యం అమ్మేవారి కోసమే జగన్ యాత్రలు

తెదేపా ఎమ్మెల్యే కూన రవికుమార్

ఈనాడు, అమరావతి: స్మగ్లర్లు, కల్తీ మద్యం అమ్మేవారి కోసమే వైకాపా అధినేత జగన్ యాత్రలు చేస్తున్నారని తెదేపా ఎమ్మెల్యే కూన రవికుమార్ ధ్వజమెత్తారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జగన్ పరామర్శ డ్రామాకు ఒకరు బలయ్యారని పేర్కొన్నారు. రాజకీయ లబ్ధి కోసం యువతను రెచ్చగొట్టడం ఆయనకు అలవాటుగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎట్టకేలకు చిక్కిన పెద్దపులి

(మొదటి పేజీ తరువాయి)

నియోజకవర్గం రాయవరం మండలం కూర్మాపురం గ్రామంలో చాకచక్యంగా దాన్ని బంధించారు.

వారం రోజులుగా సంచరిస్తూ..

మహారాష్ట్రలోని తాడోబా ప్రాంతం నుంచి తెలంగాణ మీదుగా ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు జిల్లాలోకి వచ్చిన పులి వారంరోజులుగా తూర్పుగోదావరి జిల్లాలోని అభయారణ్యాలు, గోదావరి పరీవాహక ప్రాంతాలు, పొలాల్లో సంచరించింది. రాజానగరం, రాజమహేంద్రవరం గ్రామీణ మండలాల్లో 8 మూగజీవాలను వధించింది. శుక్రవారం ఉదయం మండపేట మండలం కేశవరం పరిసరాల నుంచి కూర్మాపురంలోని పాలచర్ల రాజుకు చెందిన ఓ శిథిలగృహంలోకి చొరబడింది. పులి గాండ్రింపులతో స్థానికులు బెంబేలెత్తారు. అటవీ, పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు, రెస్క్యూ బృందాలు చేరుకుని దాన్ని బంధించేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రజలు పెద్ద సంఖ్యలో రావడంతో ఆపరేషన్‌కు అడ్డంకులు ఎదురయ్యాయి. పులిపై మత్తు ఇంజక్షన్ ప్రయోగానికి నిపుణులు ఏర్పాట్లు చేసుకుంటుండగా శుక్రవారం మధ్యాహ్నం 1.30 సమయంలో శిథిల గృహం నుంచి ఒక్కసారిగా బయటకొచ్చి వరి పొలాల్లోకి పరుగులు తీసింది. అక్కడినుంచి శివారులోని ఇళ్ల సమీపంలోకి రావడంతో ఓ కానిస్టేబుల్ అందరినీ అప్రమత్తం చేశారు. అనంతరం దుర్గమ్మ గుడి సమీపంలోని కొలగాని సత్తిబాబుకు చెందిన పశువుల పాకలోకి చేరి సాయంత్రం వరకు దాదాపు ఐదుగంటల పాటు అక్కడే నిద్రపోయింది.

రెండు మూడు ప్రాంతాల్లో వలలు వేసి

పులి ఎలా బయటకు వస్తుంది.. దాని కదలికలు ఎలా ఉంటాయో ముందుగానే అంచనా వేసిన నిపుణులు రెండు, మూడు ప్రాంతాల్లో వలలు వేసి, మత్తు ఇంజక్షన్ల గన్‌లతో సిద్ధమయ్యారు. ఆ పాక చుట్టూ, భవనాల మధ్య వలలు వేశారు. పాకలోని రెండు గేదెలపై పులి దాడికి ప్రయత్నించగా అవి తీవ్రంగా ప్రతిఘటించాయి. అనంతరం పులి బయటకు రాగా ఒకసారి గన్‌తో మత్తు ఇంజక్షన్ ప్రయోగించినా విఫలమైంది. వంద మీటర్ల దూరం వెళ్లిన పులిపై రెండోసారి ప్రయోగించగా మత్తెక్కి.. అక్కడి చెరువుగట్టు వద్ద పడిపోయింది. తర్వాత బోనులో బంధించి రాజమహేంద్రవరం తరలించారు. వైద్యపరీక్షలు నిర్వహించి విశాఖపట్నంలోని జంతు సంరక్షణ కేంద్రానికి (జూపార్కు) చేర్చే యోచనలో అటవీశాఖ అధికారులు ఉన్నారు.



స్పృహ కోల్పోయిన పులిని స్ట్రెచర్‌పైకి చేరుస్తున్న సిబ్బంది

వసుంధర

vasundhara@eenadu.in

నిన్నటి వరకూ వంటగది, పొలం పనులే ప్రపంచంగా బతికిన మహిళలు... ఇప్పుడు మైదానంలో బ్యాట్-బాల్ పట్టుకుని కనిపిస్తున్నారు. ఎంతో అనుభవం ఉన్నవాళ్లలా క్రికెట్ ఆడేస్తున్నారు. వీళ్ల ఆట చూసి అక్కడి ప్రజలంతా ప్రోత్సహిస్తున్నారు. అంతేనా, వికెట్ పడితే ఈలలు వేస్తున్నారు. క్యాచ్ పట్టుకుంటే... కేరింతలు కొడుతున్నారు. 'సైబేజ్ ఆశా ప్యాడీ కప్' పేరుతో జరిగిన క్రికెట్ టోర్నమెంట్ విశేషాలివి.

మహిళా రైతుల క్రికెట్ టోర్నీ!





ఆడవాళ్లకు అవకాశం ఇవ్వాలే కానీ, అద్భుతాలు చేస్తారనడానికి ఈ మహిళలే ఉదాహరణ. పుణె జిల్లాలోని భోర్, రాజ్‌గఢ్ తాలూకాలో నిర్వహించిన సైబేజ్ ఆశా ప్యాడీ కప్ క్రికెట్ టోర్నీలో జరిగిందీ అద్భుతం. ఏటా వ్యవసాయ సీజన్ ముగింపు సందర్భంగా సైబేజ్ ఫౌండేషన్ దీన్ని ఏర్పాటుచేస్తుంది. ఈ చిన్న క్రికెట్ టోర్నమెంట్... ఇప్పుడు మహిళా రైతులకు పెద్ద వేదికగా మారింది. ఇందులో 35 పురుష జట్లు పాల్గొంటే.. 40 మహిళా జట్లు బరిలోకి దిగాయి. వీరంతా నిన్న మొన్నటి వరకూ ఇంటి బాధ్యతలు, పొలం పనులు చేసుకుంటూ కాలం గడిపిన సాధారణ మహిళలు. ఆటలు ఆడటం, పోటీల్లో పాల్గొనడం వంటివన్నీ కొత్తే అయినా సరే... ధైర్యంగా ముందడుగు వేశారు. ఆసక్తిగా ఆడే ఆడవాళ్లందరూ ఏకమై సాధన చేశారు. మైదానంలో సమస్యల్ని పరిష్కరించుకున్నారు. తమ తమ గ్రామాలకు ప్రాతినిధ్యం వహించారు. ఇదేమీ చిన్న విషయం కాదు... సాధికారత దిశగా పడిన కీలక అడుగు.

'నిజానికి ఇలాంటివన్నీ మగవాళ్లే చేస్తారని అనుకునేవాళ్లం... ఈ అనుభవం మాకు కేవలం మైదానంలోనే కాదు, జీవితంలోనూ ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చింది. మా జట్టు మొదటి బహుమతి గెలిచినా, దీనికంటే ఆడిన ఆనందమే పెద్దది. తొలిరోజుల్లో కొందరు పెద్దలు, కుటుంబ సభ్యులు మా ఆటపై అభ్యంతరం చెప్పారు. కానీ క్రమంగా వాళ్లే అభిమానులుగా మారారు. మైదానంలో కూర్చుని ఉత్సాహంగా అరుస్తూ మమ్మల్ని ప్రోత్సహిస్తున్నారు. ఈ టోర్నమెంట్ గ్రామాల్లోని పాత నియమాలన్నింటినీ పక్కకి పెట్టేసింది. మహిళలు నాయకత్వం తీసుకోవడం, నిర్ణయాల్లో పాల్గొనడం గురించి చర్చలు మొదలయ్యాయి' అని చెబుతారు గెలిచిన మహిళల జట్టు కెప్టెన్ స్వాతి జెండే.

'సుస్థిర వ్యవసాయ పద్ధతులు, గ్రామీణ ఐక్యత, సహకారం, నాయకత్వ లక్షణాల్ని పెంపొందించడానికి... మా సైబేజ్ ఫౌండేషన్ పనిచేస్తుంది. మేం నిర్వహించే క్రికెట్ టోర్నీలో ఏటా పురుషుల జట్లే పోటీపడతాయి. ఈసారి ఆడవాళ్లూ ముందుకొచ్చారు. ఇది వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపుతుంది' అంటారు సంస్థ నిర్వాహకురాలు రీతూ నథానీ.

ఉపవిష్ట కోణాసనం

ఇది కాళ్లను విస్తరించి ముందుకు వంగే భంగిమ. హార్మోన్ల సమతుల్యతకు సాయపడే ఆసనం.



చేసే విధానం: ముందుగా యోగా మ్యాట్‌పైన ప్రశాంతంగా కూర్చోండి. ఇప్పుడు మెల్లగా రెండు కాళ్లను సాధ్యమైనంత వెడల్పుగా విస్తరించండి. ఈ స్థితిలో మడమల్ని నేలపై ఆనించి పాదాల వేళ్లు పైకి ఉంచాలి. వెన్నెముకను నిటారుగా ఉంచి, శ్వాస తీసుకోవాలి... ఆపై గాలిని మెల్లగా వదిలిపెడుతూ సాధ్యమైనంత ముందుకు వంగాలి. రెండు చేతులతో పాదాలను పట్టుకోవాలి. వీలైనంత మేర పొట్ట, ఛాతీ, భుజాలు, గడ్డం నేలకు దగ్గరగా తీసుకురావాలి. ఇక్కడ సాధారణ శ్వాసలు తీసుకుంటూ 10-12 సెకన్లు ఉండే ప్రయత్నం చేయండి. తర్వాత గాలి తీసుకుంటూ సున్నితంగా ఆసనాన్ని విడుదల చేయండి. కాళ్లను ముందుకు చాచి విశ్రాంతి తీసుకోండి.

జాగ్రత్తలు: వెన్ను నొప్పి ఉన్న వాళ్లు, వెన్ను సర్జరీ అయిన వాళ్లు చేయరాదు.


ఉపయోగాలు: గైనిక్ సమస్యల్ని దూరం చేస్తుంది. హార్మోన్ల అసమతుల్యతను తగ్గిస్తుంది. జీర్ణశక్తిని పెంచుతుంది. నడుము, దాని చుట్టూ ఉండే కండరాలు దృఢంగా తయారవుతాయి.

ఆహారం: చక్కెర వినియోగాన్ని తగ్గించాలి. ఆరోగ్యకరమైన కొవ్వులు, పీచు పదార్థం ఎక్కువగా లభించే పాలకూర, తృణధాన్యాలు, బీన్స్, చిక్కుళ్లు, అవిసె, గుమ్మడి, చియా గింజల్ని ఆహారంలో తీసుకోవాలి.

- శిరీష, యోగ గురు



ఆమె ఒక కళాకారిణి... అయితే, ఆ కళ తనకు మాత్రమే ఉపయోగపడితే సరిపోదనుకున్నారు. దానికి సామాజిక ప్రయోజనం జోడించాలనుకున్నారు. అంతే, మురికివాడల రూపు రేఖల్ని మార్చేందుకు శ్రీకారం చుట్టారు. అందమైన బాల్యాన్ని కోల్పోతున్న నిరుపేద చిన్నారులకోసం దేశవ్యాప్తంగా లర్నింగ్ సెంటర్లనూ ఏర్పాటుచేశారు. ఈ కృషికే రుబల్ నాగీని ప్రతిష్ఠాత్మక గ్లోబల్ టీచర్ ప్రైజ్ వరించింది.




ఈ టీచరమ్మ 'స్లమ్ క్వీన్' మిలియనీర్!

జమ్మూ కశ్మీర్‌లోని ఓ చిన్న గ్రామంలో పుట్టారు రుబల్ నాగీ. చిన్నప్పటి నుంచి ఆమెకు కళలంటే ఎంతో ఇష్టం. అందుకే, పొలిటికల్ సైన్స్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశాక... లండన్‌లోని ప్రఖ్యాత స్లేడ్ స్కూల్ ఆఫ్ ఫైన్‌ఆర్ట్స్‌లో పట్టా తీసుకున్నారు. ఆపై ముంబయికి తిరిగొచ్చి 'రుబల్ నాగీ డిజైన్ స్టూడియో'ని స్థాపించారు. కళలతో సమాజాన్ని మార్చాలన్నది ఆమె కల. ఈ క్రమంలోనే తన ప్రత్యేకతైన ఆర్ట్ ఇన్‌స్టాలేషన్‌తో ముంబయి సుందరీకరణలో కీలక పాత్ర పోషించారు. ఇందులో భాగంగానే 2018 నుంచి 'మిసాల్ ముంబయి' పేరుతో మురికివాడల్లోని ఇళ్ల గోడలపై చిత్రాలు వేస్తూ లక్షలాది ఇళ్ల రూపు రేఖల్ని మార్చారు. పరిశుభ్రత, ఆరోగ్యం, వ్యర్థాల నిర్వహణ వంటి సున్నితమైన అంశాలపై కమ్యూనిటీ వర్క్‌షాప్‌లు నిర్వహిస్తూ ప్రజల్లో పరివర్తన తీసుకొస్తున్నారు. ఈ సంస్థ ప్రధానంగా నైపుణ్యాభివృద్ధి, వృత్తిశిక్షణ, మహిళాసాధికారత, విద్య, పిల్లల సంక్షేమం అనే ఐదు అంశాలపై దృష్టి సారించింది. వాటిల్లో రూరల్ ఆంత్రప్రెన్యూర్లను తయారుచేయడం, వెనకబడిన వర్గాలకు ఉపాధి అవకాశాలు కల్పించడం వంటివి ముఖ్యంగా ఉన్నాయి. 'రుబల్ ఇండియా డిజైన్ కౌన్సిల్' సభ్యురాలు కూడా.

లెక్కలు చెప్పే మ్యూరల్స్...

చదువుకి దూరమైన చిన్నారులకు విద్యపై ఆసక్తి కలిగించడమే లక్ష్యంగా 'రుబల్ నాగీ ఆర్ట్ ఫౌండేషన్'(ఆర్ఎన్ఏఎఫ్)నీ ఏర్పాటుచేశారు. బడికెళ్లడానికి భయపడే పిల్లలను చూసి... విద్య కేవలం తరగతి గదులకే పరిమితం కాదని భావించారు.. దీంతో ఆరుబయట గోడలనే నల్లబల్లలుగా మార్చి వారికి పాఠాలు చెప్పాలనుకున్నారు. ఆ ప్రయత్నంలోనే ప్రభుత్వ భవనాలు, పాఠశాలలు, ప్రజల ఇళ్ల గోడల్నే కాన్వాసుగా మార్చి అక్షరాలు, అంకెలు, గుణింతాలను చిత్రాలుగా వేశారు. సైన్స్, చరిత్రను చెప్పే మ్యూరల్స్ చిత్రీకరించారు. వీటితోనే చిన్నారులకు చదువు చెబుతున్నారు.



లర్నింగ్ సెంటర్ల ఏర్పాటుతో...

పిల్లల్లో వ్యక్తిగత ప్రతిభను ప్రోత్సహిస్తూ, వారికి బంగారు భవిష్యత్తుని చూపించడమే తమ ఉద్దేశం అంటారు నాగీ. ఇందుకోసమే 73 బాల్వాడీలు, వందల సంఖ్యలో లర్నింగ్ సెంటర్లను ఏర్పాటుచేశారు. ఇక్కడ ఆర్ట్ ద్వారా పిల్లలకు అక్షరాలు నేర్పిస్తారు. స్వేచ్ఛగా ఆడుకునే అవకాశమూ ఉంటుందిక్కడ. ఈ కేంద్రాల ద్వారా ఇప్పటి వరకూ 6,75,000 మందికి పైగా పిల్లలకు సాయమందించారు. ఇలా దిల్లీ, ముంబయితో పాటు రాజస్థాన్, తెలంగాణ, జమ్మూ కశ్మీర్, ఉత్తరాఖండ్, ఉత్తర్‌ప్రదేశ్, మహారాష్ట్ర... వంటి పలు రాష్ట్రాల్లోని గ్రామాల్లో నిరుపేద బాలబాలికలకోసం ఆర్ట్ క్యాంప్‌లు ఏర్పాటుచేస్తున్నారు. అంతేకాదు, 'రీడ్ అండ్ రైట్ ఇండియా' కార్యక్రమం ద్వారా ఈ-బుక్స్, గేమ్స్, స్థానిక కంటెంట్‌తో పిల్లల్లో చదివే, రాసే అలవాటును పెంచుతున్నారు. ఆపై రుబల్ మహిళాసాధికారత, యువతకు నైపుణ్యాల శిక్షణ వంటి విషయాలపైనా శ్రద్ధపెట్టారు. వీరు గౌరవప్రదమైన ఉద్యోగాలు, వృత్తి వ్యాపారాల్లో స్థిరపడేందుకు 'స్కిల్ ఇనిషియేటివ్స్ ఇన్ ఇండియా' కార్యక్రమాన్నీ తీసుకొచ్చారు.

ఈ రెండు దశాబ్దాలలో రుబల్ నాగీ 800 శిల్పాల్ని చెక్కారు. లెక్కలేనన్ని చిత్రాలు వేశారు. వాటితో ప్రపంచవ్యాప్తంగా 150కి పైగా ఎగ్జిబిషన్స్ నిర్వహించారు. అలా వచ్చిన డబ్బుతో సేవా కార్యక్రమాలెన్నో నిర్వహిస్తున్నారు. 2022లో ఈ అనుభవాలతో 'ది స్లమ్ క్వీన్' అనే పుస్తకాన్నీ రాశారు. ఈ సేవలకుగానూ తాజాగా ప్రతిష్ఠాత్మక గ్లోబల్ టీచర్ ప్రైజ్ 2026ను సొంతం చేసుకున్నారు. దీనికిగానూ మిలియన్ డాలర్ల (దాదాపు రూ.9 కోట్లు) నగదు బహుమతి లభించింది ఆమెకు. ఈ ప్రైజ్‌ను వార్కీ ఫౌండేషన్ అందజేస్తోంది.



భయమేస్తే... 'బాక్స్' వేద్దాం!

ముఖ్యమైన పరీక్ష, ఇంటర్వ్యూ, సీనియర్ల ముందు ప్రెజెంటేషన్... ఇలాంటి పరిస్థితిలో ఎలా ఉంటాం? ఎంత సిద్ధమైనా కానీ... గుండె కొట్టుకోవడంలో వేగం, అరచేతుల్లో చెమటలు, కాళ్లలో వణుకు వంటివి తప్పనిసరి కదూ! ఆ ఒత్తిడి దాటితేకానీ బుర్ర సరిగా పనిచేయదు. ఆలోచనల్లో స్పష్టత రాదు. కచ్చితంగానూ మాట్లాడలేం. అలాగని అన్నిసార్లూ మనల్ని మనం నెమ్మదింపజేసుకునే సమయం దొరకదు. అలాంటప్పుడు 'బాక్స్ బ్రీతింగ్' ప్రయత్నించండి.

అంటే... 4 వరకూ లెక్కబెడుతూ శ్వాస తీసుకోవాలి. ఆపై నాలుగు సెకన్లు దాన్ని పట్టి ఉంచాలి. తరవాత నాలుగు లెక్కపెడుతూ నెమ్మదిగా వదలాలి. మళ్లీ నాలుగు సెకన్లు ఉచ్ఛ్వాసనిశ్వాసలు లేకుండా ఉండాలి. ఈ మొత్తం ప్రక్రియకు పట్టేది 15-20 సెకన్లే. దీన్ని పదిలోపు వీలైనన్నిసార్లు ప్రయత్నిస్తే సరి. ఒత్తిడంతా మాయం అవకపోవచ్చు. కానీ అదుపులోకి వస్తుంది. మనసు, శరీరం స్థిమితపడతాయి. గుండె వేగం కూడా నెమ్మదించి, ఆలోచనల్లో స్పష్టత వస్తుంది. దీంతో పరీక్షకానీ, ప్రెజెంటేషన్ కానీ భయం లేకుండా పూర్తిచేయగలుగుతాం. సాధారణంగా ఒత్తిడి, ఆందోళనగా ఉన్నప్పుడు తొలి ప్రభావం పడేది శ్వాస మీదే. దీంతో ఆక్సిజన్ సరఫరా తగ్గి మెదడు పనితీరూ నెమ్మదిస్తుంది. ఈ చిన్న ప్రక్రియ దాన్ని సరిచేసి, మెదడుకీ తద్వారా శరీరానికీ విశ్రాంతినిస్తుంది. చురుకైన ఆలోచనలకు మార్గం సుగమం అవుతుంది. ఇంకేం అవసరమైతే ప్రయత్నించండి మరి.

చిన్న మార్పుతో లాభాలెన్నో!

శోధిత

'అబ్బా... కూరలో అసలు ఉప్పే లేదు... ఎలా తినాలి?' కుటుంబ సభ్యుల నుంచి ప్రతి ఇల్లాలికీ ఏదో ఒక సందర్భంలో ఎదురయ్యే సమస్యే. కానీ ఆ విషయాన్ని తేలికగా తీసుకుని, ప్రతిరోజూ అదే పద్ధతిని పాటించండి. కొంతకాలానికి ఇంటిల్లిపాదికీ ఉప్పు తక్కువగా తినడం అలవాటవుతుంది. బీపీ, హృద్రోగ సమస్యలూ తగ్గుతాయి అంటున్నారు నిపుణులు. అవునండీ, ఈ విషయాన్ని ఫ్రాన్స్, లండన్ పరిశోధకులు ప్రయోగపూర్వకంగా పరిశీలించి మరీ చెబుతున్నారు. అక్కడ రోజువారీ తినే బ్రెడ్, ప్యాకేజ్డ్ ఆహారాల్లో సోడియం శాతాన్ని తగ్గించడం వల్ల హృద్రోగాలు, పక్షవాత సమస్యలు గణనీయంగా తగ్గించవచ్చు అంటున్నారు. ఫ్రాన్స్‌లో ఇప్పటికే బ్రెడ్‌లో కొంతమేర ఉప్పు తగ్గించారట. దీనివల్ల అక్కడి ప్రజలు రోజువారీ తీసుకునే సోడియంలో 0.35 గ్రా. తగ్గుతుందనీ, ఈ చిన్న మార్పు వాళ్ల ఆరోగ్యంలో అనేక మార్పుల్ని తీసుకొస్తుందనీ విశ్లేషిస్తున్నారు. అధిక సోడియం వల్ల ఒక్క బీపీ పెరగడమే కాదు... గుండెజబ్బులు, పక్షవాతం, మూత్రపిండాల వ్యాధులు, మతిమరుపు... ఇలా ఎన్నో సమస్యలు పెరుగుతాయి. అందుకే పెద్దవాళ్ల రోజువారీ ఆహారంలో 2 వేల మి.గ్రా. కన్నా తక్కువ సోడియం ఉండాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతోంది. అదే బీపీ ఎక్కువగా ఉన్నవాళ్లయితే 1500 మి.గ్రా. కన్నా ఎక్కువ సోడియం వద్దని హెచ్చరిస్తోంది. కాబట్టి కూరలో ఉప్పు తక్కువైందని ఇంట్లోవాళ్లు సణిగినా పెద్దగా పట్టించుకోకండి. కాస్త తగ్గించి వేయడం వల్ల క్రమంగా తక్కువ తినడం అలవాటవుతుంది. ఆరోగ్య సమస్యలూ తగ్గుతాయన్నది మర్చిపోకండి. ఏమంటారు?





దిండు మీదా కురులేనా?

కురులు రాలడం సహజ ప్రక్రియే! ఒకటో రెండో దిండు మీద కనిపించినా బాధపడాల్సిన పనిలేదు. కానీ... తరచూ దర్శనమిస్తోంటేనే నైట్ రొటీన్ సరిగా లేదని అర్థం. కాబట్టి...

- గలేబులు ఏవి వాడుతున్నారు? దీనికీ కురులు రాలడానికీ సంబంధమేంటి అనుకోవద్దు. నిద్రలో మనం కదులుతూ ఉంటాం కదా... ఆ రాపిడి ప్రభావం కురుల మీద పడి తెగుతాయి. అందుకే సిల్క్ లేదా శాటిన్ గలేబులకు చోటివ్వండి.
- తీరిగ్గా చేయొచ్చని రాత్రుళ్లు తలస్నానాలు చేస్తుంటారు చాలామంది. బాగానే ఉంది కానీ... ఆ తడి తలతో మాత్రం పడుకోవద్దు. ఇది మాడుమీద ప్రభావం చూపుతుంది. దురద, యాక్నే వంటివాటికి దారితీసి కురులు రాలేలా చేస్తుంది. కాబట్టి, పూర్తిగా ఆరాకే పడుకోండి.
- రాత్రుళ్లు మాడును మృదువుగా తప్పక మర్దనా చేసుకోవాలి. ఇది రక్తప్రసరణకు సాయపడి, కుదుళ్లు దృఢంగా మారేలా చేస్తుంది. ఏదైనా లైట్‌వెయిట్ సీరమ్‌ని వాడినా నూనెనే రాసుకున్నా మంచిదే. తరవాత చిక్కుల్లేకుండా వెడల్పు పళ్లున్న దువ్వెనతో దువ్వాలి. అలాగే విరబోసుకుని పడుకోవద్దు. అలాగని బిగుతుగా జడలల్లొద్దు. లో పోనీ అయినా పెట్టుకోండి లేదంటే వదులుగా అల్లుకోండి.
- చివరగా... 7-8 గంటల నిద్ర తప్పనిసరి చేసుకోండి. దీంతో కార్టిసాల్ స్థాయులు తగ్గుతాయి. ఫలితంగా ఒత్తిడి తగ్గి, కురులూ ఆరోగ్యంగా పెరుగుతాయి.

వాచ్ కూడా... నచ్చినట్టుగా!

మన డ్రెస్, స్టైల్... అంతెందుకు, పెట్టే స్టేటస్, పోస్టు మీద కూడా మన మూడ్ ఆధారపడి ఉంటుందంటే కాదనలేం కదా! అలాంటప్పుడు వాచ్‌లని మాత్రం ఒకేలా ఎందుకు పెట్టుకోవాలి? వాటి స్టైల్‌నీ నచ్చినట్టుగా మార్చేద్దాం.





కఫ్ తగిలించేద్దాం

సంప్రదాయ వాచ్ లుక్‌కి చెక్ పెడుతూ వచ్చినవే కఫ్ వాచ్‌లు. ఆఫీసుకైనా, పార్టీలైనా కాస్త ఆధునిక స్టైల్ అద్దాలంటే వీటికి మించిన యాక్సెసరీలు ఉంటాయా? అందుకే మినిమల్‌గా కనిపిస్తూనే ట్రెండీగా కనిపించాలనుకునే అమ్మాయిల ఎంపిక ఇదే అవుతోంది. కాబట్టే, దీన్ని వాచ్‌కీ జోడించుకునేలా ఇలా 'కఫ్'లు వచ్చేస్తున్నాయి. డయల్‌ని తీసి, దీనికి జోడించుకోవడమే. దీనిలోనూ రెమ్, నాట్, బ్యాంగిల్ అంటూ బోలెడు రకాలు. నచ్చింది ఎంచుకోవడమే!

వేడుక మణికట్టు మీదా!



వేడుక ఏదైనా ఉంటే హడావుడంతా అమ్మాయిల చుట్టూనే! తల నుంచి కాళ్ల గోళ్ల వరకూ ముస్తాబు చేసేస్తాం. వాచీ విషయంలో మాత్రం సాదాసీదాగా ఉండటమెందుకు? దానికీ కాస్త అలంకరణలు జోడిద్దాం అనిపిస్తే బ్రేస్‌లెట్ వాచ్ బ్యాండ్లను తెచ్చేసుకోవాల్సిందే!

ఆపై నచ్చిన లేయర్డ్ బ్రేస్‌లెట్ స్ట్రాప్‌ని ఎంచుకుని డయల్‌ని పెట్టేయడమే! ఈ తరం అమ్మాయిలు ఫిట్‌నెస్‌కి ఎంత ప్రాధాన్యం ఇస్తున్నారో తెలిసిందేగా! వాటికీ అనువుగా వచ్చేస్తున్నాయివి. పైగా చేతికి సరిగ్గా అమరేలా సెట్ చేసుకోవచ్చు. రిమూవబుల్ క్లాస్ప్‌లనూ ఇస్తున్నారు. దీంతో ప్రత్యేకంగా బయట షాపుల చుట్టూ తిరగకుండానే సులువుగా మీరే మీకు అనుగుణంగా సైజ్ సెట్ చేసుకోవచ్చు.



స్ట్రాప్‌కి మెసేజ్

'బ్లెస్డ్', 'ఈరోజు ఇంకొంచెం ఆనందంగా'... మన మూడ్‌ని బట్టి, స్టేటస్‌లో, సోషల్ మీడియాలో ఎన్నెన్ని పోస్టులు పెడుతుంటాం? డ్రెస్సుకి తగ్గ రంగులు, డిజైన్లలోనే కాదు, ఇలా స్ఫూర్తిని నింపే మెసేజ్‌లూ కళ్ల ముందు కనిపిస్తే బాగుండు అనిపిస్తే ఇది కావాల్సిందే. రిమూవబుల్ రాప్ బ్రాస్‌లెట్ బ్యాండ్... పొడవైన స్ట్రాప్‌తో వస్తుంది. చేతికి చుడితే చక్కగా వాచ్‌కి మరో లేయర్ బ్రేస్‌లెట్ జోడించినట్టు ఉంటుంది. అలాగే క్రిస్టల్స్, పూసలు, మెసేజ్, కోట్‌లతో కూడిన చిన్న మెటల్ పిన్స్ కూడా వస్తుంటాయి. వాటిని అవసరాన్ని బట్టి జోడించుకోవచ్చు. లేదంటే తొలగించొచ్చు. బాగున్నాయి కదూ! మీకు నచ్చినవేవో ఎంచుకోండి మరి.





తక్షణ ఉపశమనం కావాలంటే..!

రోజులో ఎనిమిది గంటలు కంప్యూటర్లను చూస్తూ ఉద్యోగాలు చేస్తోన్న మహిళల సంఖ్యే ఎక్కువ. దీనివల్ల శారీరక, మానసిక సవాళ్లనెన్నో ఎదుర్కొంటున్నారు. మెడ, వెన్ను, తల నొప్పులూ, కళ్ల సమస్యలతో బాధపడుతున్నవారు లేరంటే అతిశయోక్తి కాదేమో! అయితే, ఎంత బాధ ఉన్నా ఇంటికి వెళ్లేంతవరకో... బస్‌లో కూర్చునేంత వరకో వేచి చూసే వారే ఎక్కువ. దీనివల్ల సమస్య మరింత జఠిలమై, నిద్రలేమికి దారితీస్తుంది. అలాకాకూడదంటే...



- ఉద్యోగినుల్ని వేధించే సమస్యల్లో మెడ నొప్పి ఒకటి. ఒత్తిడి ఎక్కువైనా, కూర్చునే భంగిమలో తేడా ఉన్నా వస్తుంది ఇది. దీన్నుంచి బయటపడటానికి బామ్‌లు, మందుల మీద ఆధారపడుతుంటారు కొందరు. ఆ వాసన పక్కవాళ్లకి ఇబ్బంది అన్న కారణంతో నొప్పిని భరిస్తారు ఇంకొందరు. రెండూ ఆరోగ్యానికి చేటు చేసేవే. నొప్పి ఎక్కువగా ఉన్నప్పుడు వేడి నీళ్లతో రెండు నుంచి మూడు నిమిషాలు కాపడం పెట్టుకోండి. వేడినీళ్లు, కర్చీఫ్ ఉంటే చాలు. తక్షణ ఉపశమనం లభిస్తుంది.
- వెన్ను నొప్పి ఎక్కువగా ఉంటే... కూర్చున్న చోటే భంగిమ మార్చాలి. 30-45 నిమిషాలకోసారి నడవాలి. కింద కూర్చునే సౌలభ్యం ఉంటే హామ్‌స్ట్రింగ్ స్ట్రెచెస్, 10-15 సార్లు షోల్డర్ రోల్స్ చేస్తే కండరాల్లో కదలిక ఏర్పడి రక్తప్రసరణ మెరుగవుతుంది. నొప్పీ తగ్గుతుంది.
- తలనొప్పి బాధిస్తుంటే... చీకటిలో కూర్చుని పదినిమిషాల పాటు కళ్లు మూసి ఉంచాలి. గోరువెచ్చని నీళ్లను తాగాలి. కనుబొమలు, నుదురు మీద వృత్తాకారంలో మసాజ్ చేస్తే... నొప్పి నుంచి ఉపశమనం దొరుకుతుంది. కంప్యూటర్‌కి దూరంగా పదినిమిషాలు ప్రశాంతమైన వాతావరణంలో వాకింగ్ చేసినా ఫలితముంటుంది. అంతేకాదు అల్లం, పుదీనా టీలను తాగినా మంచిదే.
- కళ్లు మండటం, అలసట, మసక బారడం... వంటి సమస్యలు ఉంటే చల్లని నీళ్లతో రెండుమూడుసార్లు కడగాలి. దీనివల్ల మంట, అలసట, ఎరుపు తగ్గుతాయి. 20-20-20 పద్ధతిని తప్పక పాటించాలి. ఇరవై నిమిషాలకు ఇరవై మీటర్ల దూరంలో ఉన్న వస్తువును 20 సెకన్లపాటు చూడటం. పది, పదిహేను నిమిషాలకోసారి అలారం పెట్టుకునైనా కొన్ని సెకన్ల పాటు రెప్పలు మూసి, తెరవడం చేయాలి. ఇవన్నీ తక్షణ ఉపశమనాన్ని అందిస్తాయి. ప్రయత్నిస్తారుగా మరి!

కల్తీ నెయ్యి వ్యవహారంలో కర్త, కర్మ, క్రియ జగన్‌రెడ్డే

మంత్రి కొల్లు రవీంద్ర ఆరోపణ

ఈనాడు, అమరావతి: కల్తీ నెయ్యి వ్యవహారంలో కర్త, కర్మ, క్రియ వైకాపా అధినేత జగన్‌రెడ్డేనని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఆరోపించారు. కాసుల కక్కుర్తితోనే ఆయన ఈ పాపానికి ఒడిగట్టారని మండిపడ్డారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. "రాష్ట్రంలోని ఇతర దేవాలయాల్లోనూ వైకాపా వాళ్లు ఇలాంటి అపచారాలే చేశారనే అనుమానం కలుగుతోంది. వైకాపా ప్రభుత్వంలో 60 లక్షల కిలోల నెయ్యిని కల్తీ చేసి 20 కోట్ల లడ్డూలు తయారు చేశారు. కమీషన్ల కక్కుర్తితో ఇంతటి నీచానికి ఒడిగట్టడం దారుణం" అని కొల్లు రవీంద్ర వ్యాఖ్యానించారు.

మందలించాల్సింది పోయి ఓదార్పులా?

జగన్ వైఖరిపై ఎంపీ కలిశెట్టి మండిపాటు

ఈనాడు, దిల్లీ: రాజకీయ ప్రత్యర్థుల్ని నోటికొచ్చినట్లు మాట్లాడుతున్న సొంతపార్టీ నాయకులను మందలించాల్సిందిపోయి ఓదార్పులు చేయడం ఏమిటనివైకాపా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డిని తెదేపా ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. జగన్ తీరు నేరప్రవృత్తి రాజకీయాలను ప్రోత్సహించేలా ఉందని ఆరోపించారు. ఆయన శుక్రవారం ఇక్కడ తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రత్యర్థి పార్టీల నాయకులపై సభ్యసమాజం తలదించుకొనేలా మాట్లాడిన జోగి రమేష్ లాంటి వారిని ఇంటికి వెళ్లి పరామర్శించడం ద్వారా జగన్ ఏం సందేశం ఇవ్వదలుచుకున్నారని ప్రశ్నించారు.

లడ్డూ కల్తీని రాజకీయ కోణంలో చూడొద్దు

శివశక్తి అధ్యక్షుడు కరుణాకర్

హైదరాబాద్, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి ఆలయంలో జరిగిన కల్తీ నెయ్యితో లడ్డూ తయారీ ఘటనను రాజకీయ కోణంలో చూడొద్దని శివశక్తి అధ్యక్షుడు కరుణాకర్ సుగ్గున సూచించారు. కల్తీ వ్యవహారంపై విచారణ పూర్తయి..నివేదిక వెలువడిన నేపథ్యంలో హిందువులు పార్టీల వారీగా విడిపోయి మౌనం దాల్చడాన్ని ఆందోళనకర పరిణామంగా అభివర్ణించారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లో గత వైకాపా ప్రభుత్వం నెయ్యి సరఫరా టెండర్లలో నిబంధనలు సవరించి..వేంకటేశ్వరస్వామి సొమ్మును దోచుకోవడంతోపాటు ఆ సొమ్మును హవాలా మార్గంలో తరలించినట్లు నివేదికలు చెబుతున్నాయన్నారు. శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన ఆ అపవిత్రతపై సమాజం మొత్తం ఒక్కటై స్పందించాల్సిన అవసరం ఉందన్నారు.

తితిదే లడ్డూ వివాదానికి స్వస్తి పలకాలి: సీపీఐ

ఈనాడు, అమరావతి: తితిదే లడ్డూ వివాదానికి ఇకనైనా స్వస్తి పలికి, లడ్డూ కల్తీ దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ సీఎం చంద్రబాబుకు సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ లేఖ రాశారు. "రాష్ట్రంలో తితిదే లడ్డూ సమస్య తప్ప మరో ఏ సమస్య లేదన్నట్లు అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య వాదోపవాదాలు సాగుతున్నాయి. ఈ వైఖరి తితిదే లడ్డూ పవిత్రతకు భంగం కలిగించేలా ఉంది. లడ్డూ కల్తీ అంశంపై ఇప్పటికే సిట్ ఏర్పాటు చేసి, దర్యాప్తు చేశారు. ఛార్జిషీట్ తయారు చేస్తున్నారు. చట్టపరంగా తప్పుచేసిన వారిపై చర్యలు తీసుకునే అధికారం మీ చేతుల్లోనే ఉంది. దోషులు ఎంత పెద్దవారైనా జైలుకు పంపాలి" అని కోరారు.

కొరియా టూ తిరుమల

వయా భోలే బాబా

- వెజిటబుల్ ఆయిల్ లేదా జంతుకొవ్వులతో మోనోగ్లిజరైడ్స్ తయారీ
- ఎన్‌డీడీబీ- సీఏఎల్‌ఎఫ్ నివేదికతో సరిపోల్చినా అదే స్పష్టం



ఈనాడు - అమరావతి : వైకాపా హయాంలో తిరుమలకు లక్షల కిలోల కల్తీ నెయ్యి సరఫరా చేసిన భోలే బాబా డెయిరీ దాని తయారీలో మోనోగ్లిజరైడ్స్ అనే రసాయనాన్ని పెద్ద ఎత్తున వినియోగించినట్లు సిట్ దర్యాప్తులో తేలింది. దిల్లీలోని రఘుబీర్ శరణ్ ఓవర్‌సీస్ సంస్థ కొరియా నుంచి వీటిని దిగుమతి చేసుకుంది. వారి నుంచి సుగంధ్ ఆయిల్ సంస్థ కొని భోలే బాబా డెయిరీకి సరఫరా చేసినట్లు నిగ్గుతేలింది. సిట్ అధికారులు గతేడాది ఏప్రిల్ 23న సుగంధ ఆయిల్స్ కంపెనీలో సోదాలు చేపట్టగా 200 కిలోల సామర్థ్యం కలిగిన డ్రమ్ముల్లో వీనస్ బ్రాండ్ లేబుల్‌తో ఉన్న మోనోగ్లిజరైడ్స్ పెద్ద ఎత్తున కనిపించాయి. కొరియాలోని 'ఐఎల్ షిన్ వెల్స్ కో లిమిటెడ్' కంపెనీ వీటిని ఉత్పత్తి చేసినట్లు ఆ లేబుళ్లపై ఉంది. కొద్ది రోజుల తర్వాత సిట్ అధికారులు ఉత్తరాఖండ్ భగవాన్‌పుర్‌లోని భోలేబాబా డెయిరీలో తనిఖీలు చేసినప్పుడు అక్కడ కూడా సుగంధ ఆయిల్స్‌లో కనిపించిన మోనోగ్లిజరైడ్స్ లభించాయి. వాటిని వినియోగించి కల్తీ నెయ్యి తయారు చేసి, తిరుమలకు సరఫరా చేసినట్లు సిట్ అభియోగపత్రంలో వెల్లడించింది.

ఏమిటీ మోనోగ్లిజరైడ్స్?

సాధారణంగా వెజిటబుల్ ఆయిల్స్ లేదా జంతుకొవ్వులతో మోనోగ్లిజరైడ్స్ తయారు చేస్తారు. వెజిటబుల్స్‌తో తయారుచేసినవి ధర ఎక్కువ, జంతుకొవ్వులతో తయారైనవి ధర తక్కువగా ఉంటాయి. ధర తక్కువ కాబట్టి జంతుకొవ్వులతో తయారైన మోనోగ్లిజరైడ్స్‌నే కల్తీ నెయ్యి తయారీ కోసం వాడి ఉండొచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తితిదే 2024 జులైలో పంపించిన నెయ్యి నమూనాల్లో పంది కొవ్వు, గొడ్డు కొవ్వు ఉండొచ్చని ఎన్‌డీడీబీ-సీఏఎల్‌ఎఫ్ ప్రయోగశాల నివేదికల్లో పేర్కొనటాన్ని చూస్తే జంతుకొవ్వులతో తయారైన మోనోగ్లిజరైడ్స్‌నే కల్తీ నెయ్యి తయారీలో వాడి ఉండే అవకాశాలు దండిగా ఉన్నాయి. కానీ సిట్ దీనిపై లోతుగా దర్యాప్తు చేయలేదు.

■ ఏఆర్ డెయిరీ ముసుగులో భోలేబాబా సంస్థ తిరుమలకు పంపించిన నెయ్యి ట్యాంకర్లలో నుంచి సేకరించిన నమూనాల్లో నాలుగింటిని 2024 జులైలో తితిదే గుజరాత్‌లోని ఎన్‌డీడీబీ-సీఏఎల్‌ఎఫ్ ప్రయోగశాలకు పంపింది. అక్కడ నాణ్యత పరీక్షలు చేయించగా ఆ నమూనాల్లో గొడ్డు కొవ్వు, పందికొవ్వు ఉండొచ్చని వెల్లడైంది. ఈ పరీక్షల్లో ఓ సమీకరణం ప్రకారం 95.90-104.10 మధ్య ఉండాల్సిన 'ఎస్ విలువ' 23.22గా వచ్చింది. దీన్ని బట్టి అందులో గొడ్డు కొవ్వు ఉండొచ్చని ఎన్‌డీడీబీ నివేదికలో స్పష్టం చేసింది. మరో సమీకరణం ప్రకారం 97.96- 102.04 మధ్య ఉండాల్సిన 'ఎస్-విలువ' 116.09గా వచ్చింది. దీన్ని బట్టి పంది కొవ్వు ఉండొచ్చని పేర్కొంది.

■ జంతుకొవ్వులతో మోనోగ్లిజరైడ్స్ తయారీ కోసం ఎక్కువగా చౌకధరకు దొరికే పంది కొవ్వు, గొడ్డు కొవ్వే వాడుతారు. ఎన్‌డీడీబీ నివేదికలో అంశాల్ని, సిట్ దర్యాప్తులో వెల్లడైన విషయాల్ని సరిపోల్చి చూస్తే జంతుకొవ్వుతో తయారు చేసిన మోనోగ్లిజరైడ్స్‌నే వాడి ఉంటారనే వాదన బలంగా వినిపిస్తోంది.

■ కల్తీ నెయ్యి తయారీలో మోనోగ్లిజరైడ్స్ వాడారని అభియోగపత్రంలో పేర్కొన్న సిట్.. అది వెజిటబుల్ ఆయిల్స్‌తో తయారైందా? జంతుకొవ్వులతో తయారైందా అనేదానిపై లోతుగా దర్యాప్తు చేయకుండా వదిలేసింది.

వంట నూనెల పేరిట నకిలీ ఇన్‌వాయిస్‌లతో కొనుగోలు

▼ భోలేబాబా డెయిరీ వంట నూనెల (ఎడిబుల్ ఆయిల్స్) పేరిట నకిలీ ఇన్‌వాయిస్‌లతో సుగంధ ఆయిల్స్ నుంచి మోనోగ్లిజరైడ్స్ కొన్నట్లు సిట్ తేల్చింది. జంతుకొవ్వులతో తయారైనది కాకపోతే మోనోగ్లిజరైడ్స్‌ను ఎడిబుల్ ఆయిల్స్ ముసుగులో కొనాల్సిన అవసరం ఆ సంస్థకు ఏమొచ్చింది?

▼ పామాయిల్, పామ్‌కెర్నెల్ ఆయిల్‌లో మోనోగ్లిజరైడ్స్‌తో పాటు బీటాకెరటిన్, ఎసిటిక్ యాసిడ్ ఎస్టర్, లాక్టిక్ యాసిడ్ ఫుడ్ గ్రేడ్ వంటివి కలిపి భోలేబాబా డెయిరీలో కల్తీ నెయ్యి తయారు చేసినట్లు సిట్ తేల్చింది. ల్యాబ్‌లో పరీక్షిస్తే నెయ్యే అని ఫలితాలు వచ్చేలా చేసేందుకు ఈ రసాయనాలు కలిపినట్లు వెల్లడించింది. ఆ రసాయన మిశ్రమాన్ని నిజమైన నెయ్యిలా మభ్యపెట్టేందుకు, నిల్వ కాలం పెంచటానికి మోనోగ్లిజరైడ్స్ వాడతారు.

నెయ్యిలో పామాయిల్ కలిసినట్టు వైవీ సుబ్బారెడ్డే అంగీకరించారు

- క్షమాపణలు చెప్పాల్సింది పోయి ఎదురుదాడి సిగ్గుచేటు
- వైకాపా నేతలపై హోంమంత్రి అనిత ధ్వజం



ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వంలో శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీకి వినియోగించిన నెయ్యి కల్తీ జరిగినట్టు నాలుగు నివేదికలు స్పష్టం చేశాయని హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ల్యాబ్ ఎన్‌డీడీబీ నివేదిక ప్రకారం నెయ్యిలో జంతువుల కొవ్వు ఉన్నట్టు తేలిందని స్పష్టం చేశారు. నిన్నమొన్నటి వరకూ అసలు నెయ్యి కల్తీనే జరగలేదని బుకాయించిన తితిదే బోర్డు మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి...తాజాగా పామాయిల్ కలిసిందని అంగీకరించారని గుర్తుచేశారు. ఇంత ఘోరం జరిగినా వైకాపా నేతలు ఎక్కడా క్షమాపణలు చెప్పకపోగా...ఎదురుదాడి చేయడం సిగ్గుచేటని దుయ్యబట్టారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ''అధికారులు, థర్డ్ పార్టీ వ్యక్తులే ఇదంతా చేశారని వైవీ సుబ్బారెడ్డి పేర్కొంటున్నారు. పర్చేజ్ కమిటీ ఛైర్మన్‌గా ఉన్న ఆయన సంతకం లేకుండా ఇవన్నీ ఎలా జరిగాయి? 2022లోనే రిపోర్టు వస్తే అప్పుడే ఎందుకు చర్యలు తీసుకోలేదు'' అని అనిత నిలదీశారు.

పవిత్ర ప్రసాదంలో బాత్రూమ్ క్లీనర్లలో వాడే లబ్సా కలుపుతారా?

హిందువులు అత్యంత పవిత్రంగా భావించే తిరుమల లడ్డూ ప్రసాదంలో బాత్రూం క్లీనర్ల తయారీకి వాడే లబ్సా లాంటి రసాయనాలు, పామాయిల్, జంతువుల కొవ్వు కలిపి భక్తుల మనోభావాల్ని దెబ్బతీస్తారా? అని అనిత నిలదీశారు. ''జంతువుల కొవ్వు కలవలేదని సీబీఐ చెప్పిందంటూ వైకాపా వాళ్లు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. 2022లో వైవీ సుబ్బారెడ్డి తితిదే బోర్డు ఛైర్మన్‌గా ఉన్నప్పుడు నెయ్యిలో పామాయిల్ కలిసిందని సీఎఫ్‌టీఆర్ఐ(మైసూర్) రిపోర్టు స్పష్టం చేసింది. ప్రసాదాల తయారీకి వాడింది నెయ్యి కాదు...రసాయనాల ముద్దని ఎన్‌డీఆర్ఐ నివేదిక నిర్ధారించింది. సుప్రీంకోర్టు నియమించిన సిట్ కూడా కల్తీని ధ్రువీకరించింది. నెయ్యి కల్తీ జరిగిందని నిర్ధారించడానికి మా దగ్గర నాలుగు నివేదికలున్నాయి. కానీ వైకాపా వాళ్లకు మాత్రం సాక్షి పత్రికలో వచ్చే రాతలే నివేదికల్లా ఉన్నాయి'' అని అనిత మండిపడ్డారు. కేవలం జేబులు నింపుకోవడానికే టెండర్ నిబంధనలు మార్చారని...చివరకు ఎఫ్ఎస్ఎస్ఏఐ సర్టిఫికేషన్ ఉండాలనే నింబధనను పక్కపెట్టారని దుయ్యబట్టారు.

దేవుణ్ని అడ్డం పెట్టుకొని రూ.250 కోట్లు దోచేశారు

- కల్తీ నెయ్యికి బ్రాండ్ అంబాసిడర్లు వైకాపా వాళ్లే
- టీం-11 తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టండి
- తెదేపా కార్యకర్తలకు లోకేశ్ పిలుపు



తెదేపా కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన బూత్ మేనేజ్‌మెంట్ వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న మంత్రి లోకేశ్

ఈనాడు, అమరావతి: "రాష్ట్రంలో టీం-11 ఉంది. కల్తీ మద్యానికి, కల్తీ నెయ్యికి, బాబాయ్ హత్యకు వాళ్లు బ్రాండ్ అంబాసిడర్లు. దేవుడ్ని అడ్డంపెట్టుకుని రూ.250 కోట్లు దోచేశారు. ఇప్పుడు క్లీన్‌చిట్ వచ్చిందంటూ ఆ టీం కెప్టెన్ తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఈ మహానుభావుడు ఏం చదివారో నాకు అర్థం కాలేదు. ఛార్జిషీట్ ఇంగ్లిష్‌లో ఉంది. అసలు ఆయనకు ఇంగ్లిష్ వచ్చా?'' అని విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్ ఎద్దేవా చేశారు. క్షేత్రస్థాయిలో వైకాపా వాళ్లు చేస్తున్న తప్పుడు ప్రచారాల్ని తిప్పికొట్టాలని పేర్కొన్నారు. అప్పట్లో వైఎస్ వివేకానందరెడ్డిని కడప ఎంపీ అవినాష్‌రెడ్డి చంపించారని తెలిసినా.. చంద్రబాబుపై నెపం వేసి దుష్ప్రచారం చేశారన్నారు. దీన్ని సమర్థంగా తిప్పికొట్టలేకపోవడంతోనే 2019 ఎన్నికల్లో పార్టీ నష్టపోయిందన్నారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో శుక్రవారం జరిగిన బూత్ మేనేజ్‌మెంట్ వర్క్‌షాప్‌లో ఆయన పాల్గొని ప్రసంగించారు. ''అధికారంలోకి వచ్చాక పార్టీకి దూరమవ్వడం జరగకూడదు. పార్టీ సొంతిల్లు, ప్రభుత్వం కిరాయి ఇల్లు. ముందు తెదేపాను బలోపేతం చేసుకోవాలి. 2019 ఎన్నికల నుంచి బూత్‌స్థాయిలో మన పనితీరు ఎలా ఉందో బేరీజు వేసుకోవాలి'' అని లోకేశ్ పేర్కొన్నారు.

బూత్‌స్థాయిలో పార్టీని బలోపేతం చేయడంతోనే మంగళగిరిలో గెలుపు

"బూత్‌స్థాయి నుంచి పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడం వల్లే గత ఎన్నికల్లో మంగళగిరిలో తెదేపా గెలుపు సాధ్యమైంది. 1985 తర్వాత మంగళగిరిలో తెదేపా జెండా ఎగరలేదు. ఛాలెంజ్‌గా తీసుకున్నా. 2019లో 5,300 ఓట్ల తేడాతో ఓడిపోయాను. దీంతో నాలో బాధ, ఆవేదన కలిగింది. బూత్‌ల వారీ కార్యకర్తలతో సమీక్ష చేశాను. అక్కడ తీసుకున్న నిర్ణయాల్ని తప్పకుండా అమలు చేశాం. అదే మంగళగిరిలో విజయానికి కారణం'' అని తెలిపారు.

4,772 బూత్‌ల బలోపేతానికి 903 మంది సీనియర్ల నియామకం

''ఐదు జోన్లలో 4,772 బూత్‌లను బలోపేతం చేయాల్సి ఉంది. ఇందుకు 903 మంది సీనియర్ నాయకుల్ని నియమిస్తూ కార్యాచరణ రూపొందించాం. వీరంతా క్షేత్రస్థాయికి వెళ్లి పరిస్థితులు తెలుసుకోవాలి. అక్కడి పరిస్థితులపై పార్టీకి నివేదిక ఇవ్వాలి. మీ రాజకీయ భవిష్యత్తు బూత్‌తో ముడిపడి ఉంది'' అని లోకేశ్ స్పష్టం చేశారు. నమ్ముకున్న పసుపు జెండా కోసం ప్రాణాలనే త్యాగం చేసిన కార్యకర్తలు ఒక్క తెదేపా సొంతమని చెప్పారు. "అంజిరెడ్డి తాత, మంజుల, చెన్నుపాటి గాంధీ, తోట చంద్రయ్యలే నాకు స్ఫూర్తి. అందరం కష్టపడి పనిచేద్దాం. ఎంత పని ఒత్తిడి ఉన్నా వారంలో ఒక రోజు పార్టీ కేంద్ర కార్యాలయానికి కేటాయిస్తున్నా'' అని చెప్పారు. "పార్టీ నేతలు అలక వీడాలి. అలిగితే నష్టపోయేది మనం, మన పార్టీ, మన రాష్ట్రం.కూటమిలో సమస్యలు ఉంటే మూడు పార్టీలు కూర్చొని చర్చించుకుంటాయి. ఇదే గ్రామస్థాయి వరకు పాటించాలి" అని లోకేశ్ సూచించారు. కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, పలువురు మంత్రులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

అంబటి కుటుంబ సభ్యులకు రోజా, భూమన పరామర్శ

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: 'తిరుమల లడ్డూ ప్రసాదం నెయ్యి విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇష్టానుసారం మాట్లాడుతున్నారని మాజీ మంత్రి ఆర్కే రోజా పేర్కొన్నారు. అంబటి ఇంటిపై దాడి చేసిన వారిపై ఇంతవరకు ఎందుకు కేసు పెట్టలేదని ఆమె ప్రశ్నించారు. 'మీకు రౌడీయిజం చేయాలంటే అధికారం కావాలేమో.. మాకు అధికారం అవసరం లేదు.. జగనన్న సైగ చేస్తే చాలు' అని హెచ్చరించారు. మాజీ మంత్రి అంబటి రాంబాబు కుటుంబ సభ్యులను ఆర్కే రోజా, తితిదే మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి శుక్రవారం పరామర్శించారు. అనంతరం రోజా మీడియాతో మాట్లాడారు.



లంబసింగిలో అలుముకున్న పొగమంచు

మన్యంలో మళ్లీ చలి!

చింతపల్లి, న్యూస్‌టుడే: అల్లూరి సీతారామరాజు జిల్లాలో చలి తీవ్రత మళ్లీ ఒక్కసారిగా పెరిగింది. రెండు రోజులుగా జిల్లాలో తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. హుకుంపేటలో శుక్రవారం 7.3 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం తెలిపింది. అరకులోయలో 7.4, చింతపల్లిలో 7.8, పెదబయలులో 8.9, ముంచంగిపుట్టులో 9, జి.మాడుగులలో 10.7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని పేర్కొంది.

కల్తీ బయటపడుతుందనే కఠినతరం చేశారా?

- 2024 ఎన్నికల నోటిఫికేషన్‌కు 5 నెలల ముందు నెయ్యి కొనుగోలు నిబంధనల మార్పు
- గతంలో పాలసేకరణ అవసరం లేదని, తర్వాత 4 లక్షల లీటర్లు ఉండాలని తీర్మానం
- 15-20 శాతం నమూనాలు బయటకు పంపాలన్న ప్రయోగశాల అధికారులు

ఈనాడు- తిరుపతి, న్యూస్‌టుడే, తిరుపతి (నేరవిభాగం): మన ఇంట్లో దొంగతనం జరిగితే తర్వాత మరింత అప్రమత్తంగా ఉంటాం. ఎక్కడెక్కడ నుంచి దొంగలు చొరబడే అవకాశముందో గుర్తించి జాగ్రత్తలు తీసుకుంటాం. తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి విషయంలో వైకాపా హయాంలో ఈ ప్రాథమిక సూత్రాన్ని విస్మరించారు. లడ్డూ తయారీకి భోలేబాబా, శ్రీ వైష్ణవి, ప్రీమియర్ డెయిరీలు కల్తీ నెయ్యి సరఫరా చేస్తున్నాయని 2022 ఆగస్టులోనే మైసూరులోని సీఎఫ్‌టీఆర్ఐ నివేదిక ఇచ్చినా వాటిపై చర్యలు తీసుకోలేదు. అదే ఏడాది అక్టోబరులో ఆ డెయిరీల కాంట్రాక్టు ముగిసేవరకూ నెయ్యి సరఫరాకు అనుమతించి తితిదేకు కోట్ల రూపాయల నష్టం వాటిల్లేలా చూశారు. భక్తుల మనోభావాలతో ఆటాడుకున్నారు. కల్తీగా నిర్ధారణ అయిన 14 నెలల తర్వాత.. 2024 సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్‌కు ఐదు నెలల ముందు అకస్మాత్తుగా మేల్కొన్నారు. నెయ్యి కొనుగోలు నిబంధనలను కఠినతరం చేశారు. 2020 ఫిబ్రవరిలో నిబంధనలు సరళతరం చేసినప్పుడు చిన్న డెయిరీలకూ అవకాశం కల్పించాలని పేర్కొన్నారు. 2023 నవంబరులో షరతులను కఠినతరం చేసినప్పుడు పేరుప్రఖ్యాతులు, అనుభవం ఉన్న సంస్థలు ఉండాలన్నారు. జాతీయ కేటగిరీ టెండర్లలో పాల్గొనే డెయిరీలకు వార్షిక టర్నోవర్ రూ.500 కోట్లు ఉండాలని తితిదే బోర్డు సమావేశంలో ఆమోదించారు. కల్తీ వ్యవహారం వెలుగుచూసినప్పుడే కఠిన నిబంధనలు విధించకుండా ఎన్నికల ముందు ఇలా చేయడం వెనుక లోగుట్టు ఏంటనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

జాతీయ డెయిరీల నుంచి నెయ్యి కొనుగోలు నిబంధనలు ఇలా మార్చారు

నిబంధనలు	2019 ఆగస్టు నుంచి	2020 ఫిబ్రవరి నెలాఖరు నుంచి	2023 నవంబరు నుంచి
వార్షిక టర్నోవర్ (రూ.కోట్లలో)	250	150	500
డెయిరీ రంగంలో అనుభవం	మూడేళ్లు	ఏడాది	ఐదేళ్లు
పాల సేకరణ సామర్థ్యం (రోజుకు)	4 లక్షల లీటర్లు	అవసరం లేదు	4 లక్షల లీటర్లు
నెయ్యి ఉత్పత్తి సామర్థ్యం (రోజుకు)	12 టన్నులు	8 టన్నులు	12 టన్నులు

బాహ్య ప్రపంచానికి తెలుస్తుందేమోనని!

నెయ్యి నాణ్యతను సరిగ్గా గుర్తించే సామర్థ్యం తితిదే ప్రయోగశాలకు లేదని ఆ విభాగంలోని అధికారులు తెలిపారు. 2022 ఆగస్టులో సీఎఫ్‌టీఆర్ఐ నివేదిక వచ్చిన తర్వాత 15-20 శాతం నమూనాలను బయటి ప్రయోగశాలలకు పంపాలని తితిదే యంత్రాంగాన్ని కోరారు. పలుమార్లు లేఖలు రాయడంతో ఇది బాహ్య ప్రపంచానికి తెలుస్తుందేమోనని భయపడి టెండరు నిబంధనలు కఠినతరం చేశారా? అన్న అనుమానం వ్యక్తమవుతోంది.

ప్లాంట్లను తనిఖీ చేయకుండా

మరోవైపు తితిదేకు నెయ్యి సరఫరా చేసే డెయిరీల ప్లాంట్లను అధికారులు, డెయిరీ నిపుణులు పరిశీలించి.. వాటికి అంత సామర్థ్యం ఉందా? లేదా? అని నివేదిక ఇస్తారు. ఏడాదికోసారి తనిఖీ చేస్తారు. 2023 నవంబరు 7న టెండరు నిబంధనలు కఠినతరం చేయాలని నిపుణుల కమిటీ సిఫార్సు చేసింది. అదే నెల 14న భూమన కరుణాకరరెడ్డి అధ్యక్షతన జరిగిన బోర్డు సమావేశంలో వీటికి ఆమోదం తెలిపారు. 2024 మార్చి 12న తిరుమలకు 1,500 కి.మీ.ల పరిధిలో ఉన్న సంస్థల నుంచి 10 లక్షల కిలోల నెయ్యి సరఫరాకు తితిదే టెండర్లు పిలిచింది. తమిళనాడు దిండిగల్‌లోని ఏఆర్ డెయిరీ కిలోకు రూ.319.80 కోట్ చేసింది. ఆ సంస్థకు టెండర్ కట్టబెట్టే ముందు అంతకుముందు 2023 నవంబరులో కఠినతరం చేసిన నిబంధనలకు అనుగుణంగా ఏఆర్ డెయిరీకి సామర్థ్యం ఉందా.. లేదా? అని పరిశీలించాలి. ప్లాంట్లను తనిఖీ చేసి పాల సేకరణ, నెయ్యి ఉత్పత్తి సామర్థ్యాన్ని తనిఖీ చేయాలి. అప్పట్లో ఇవేవీ చేయలేదు. అంతకు కొన్ని నెలల క్రితమే తనిఖీ చేశామని, ఏడాది కూడా కానందున మరోసారి ప్లాంటుకు వెళ్లక్కర్లేదని సమర్థించుకున్నారు. అసలు ఏఆర్ డెయిరీకి ఐఎస్ఓ ధ్రువపత్రం కూడా లేదని సిట్ విచారణలో తేలింది. నెయ్యి ఉత్పత్తి సామర్థ్యంపైనా తప్పుడు ధ్రువపత్రాలు సమర్పించింది. ఏడాదికి 53 టన్నుల సామర్థ్యమే ఉండగా 196 టన్నులుగా పేర్కొన్నారు. టెండరు నిబంధనలు మార్చాక తనిఖీ చేసి ఉంటే ఈ లోపాలన్నీ బయటపడేవి. వైష్ణవి డెయిరీ సైతం తప్పుడు పత్రాలు సమర్పించి కాంట్రాక్టును దక్కించుకుంది.

■ 2020 డిసెంబరు ముందువరకు భోలేబాబా డెయిరీకి ఉత్తరాఖండ్‌లోని భగవాన్‌పుర్‌లో డెయిరీ ఉంది. 2020 డిసెంబరులో ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం ఫతేపుర్‌లోని ఓ డెయిరీని లీజుకు తీసుకుంది. 2021లో నెయ్యి కొనుగోలుకు టెండర్లు పిలిచినప్పుడు ఫతేపుర్‌లో తమకు డెయిరీ ఉన్నట్టు పేర్కొని నెయ్యి సరఫరా కాంట్రాక్టును దక్కించుకుంది. తొమ్మిది నెలలే అనుభవమున్నా ఏడాదికిపైగా ఉన్నట్టు చూపి టెండర్‌ను దక్కించుకుంది.

పాల సేకరణ నిబంధన ఇందుకే

2019 ఏప్రిల్‌లో తితిదే అధికారులు, డెయిరీ రంగ నిపుణులతో కలిసి నెయ్యి కొనుగోలుకు నిబంధనలు రూపొందించడానికి కమిటీ వేశారు. అదే ఏడాది ఆగస్టు నుంచి ఇవి అమలులోకి వచ్చాయి. ఇందులో రోజుకు డెయిరీలకు 4 లక్షల లీటర్ల పాల సేకరణ, 12 టన్నుల నెయ్యి ఉత్పత్తి సామర్థ్యం ఉండాలన్నారు. సమగ్ర అధ్యయనం తర్వాతే ఈ నిబంధన విధించారు. కిలో నెయ్యి తయారుకావాలంటే సుమారు 32-35 లీటర్ల పాలు కావాలి. ఈ లెక్కన 12 టన్నుల నెయ్యి తయారీకి సుమారు 4 లక్షల లీటర్ల పాలు అవసరమని అంచనా వేశారు.

బోధనాసుపత్రుల్లో ఔషధ మొక్కల తోటలు

నడకదారులు, ఇతర ఆహ్లాదకర వసతులు సైతం

ఈనాడు, అమరావతి: ఆసుపత్రుల్లో ఎక్కడికక్కడ రోగులు, వారి సహాయకుల హడావుడి ఉంటుంది. కాసేపు సేదతీరాలంటే అనువైన వాతావరణం చాలా చోట్ల కరవు. ఈ పరిస్థితి చక్కదిద్దాలని ప్రభుత్వం భావిస్తోంది. ఔషధ గుణాలున్న, పూల మొక్కల పెంపకంతో పాటు నడకదారులు, సేద తీరేందుకు బెంచీలు, తాగునీటి వసతి ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. తొలిదశలో వైద్య విద్య సంచాలకుల (డీఎంఈ) పరిధిలోని విశాఖ విమ్స్, ఈఎన్టీ, తిరుపతిలోని ప్రసూతి వైద్యశాల, పలాసలోని కిడ్నీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌తో పాటు ఇతర అన్ని బోధనాసుపత్రులు, స్పెషాలిటీ ఆసుపత్రుల్లో కలిపి 35 చోట్ల ఈ సౌకర్యాలు కల్పించనున్నారు. ఇందుకు అవసరమైన స్థలాల గుర్తింపు ప్రక్రియ ప్రస్తుతం కొనసాగుతోంది. సీఎం చంద్రబాబు తాజా ఆదేశాల మేరకు ఔషధ, సుగంధ మొక్కల బోర్డు, ఏపీ అర్బన్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ సంయుక్తంగా ఈ చర్యలు చేపట్టనున్నాయి. ఆసుపత్రుల్లో స్థలాల లభ్యత మేరకు తులసి, బిల్వపత్ర, అశ్వగంధ, రణపాల, బ్రహ్మి, అశోక తదితర 40 రకాల ఔషధ మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ వెల్లడించారు. ప్రభుత్వం ఆయుష్ విభాగానికి ప్రాధాన్యం ఇస్తున్న క్రమంలో వైద్య విద్యార్థులకూ ఈ హెర్బల్ గార్డెన్స్ ఉపకరిస్తాయని పేర్కొన్నారు.

రైలు పట్టాలపై బాంబులు పెట్టాం

జిహాదీ పేరుతో రైల్వే అధికారులకు బెదిరింపు లేఖ



వందేభారత్ రైల్లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

సికింద్రాబాద్, న్యూస్‌టుడే: రైలు పట్టాలపై బాంబులు పెట్టి వందేభారత్ రైలును పేల్చేందుకు సిద్ధంగా ఉన్నామని జిహాదీ బృందం పేరుతో రైల్వే అధికారులకు ఆగంతకుల నుంచి లేఖ రావడంతో జీఆర్పీ పోలీసులు అప్రమత్తమయ్యారు. రోజూ సికింద్రాబాద్ నుంచి బయలుదేరి వెళ్తున్న వందేభారత్ రైళ్లలో డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేపడుతున్నారు. ఈ నెల 3న సికింద్రాబాద్ రైల్ నిలయంలోని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌కు హైదరాబాద్‌లో ఉంటున్న అజ్ఞాత వ్యక్తుల నుంచి ఓ లేఖ వచ్చింది. వందేభారత్ రైలును పేల్చడానికి రైలు పట్టాలపై బాంబులు అమర్చామని, ఎక్కువగా ప్రాణనష్టం జరుగుతుందని అందులో రాశారు. జిహాదీ బృందం పేరుతో నలుగురి పేర్లు కూడా ఉన్నట్లుగా తెలిసింది. ఈ మేరకు అధికారులు రైల్వే ఆర్పీఎఫ్ అధికారుల ద్వారా సికింద్రాబాద్ జీఆర్పీకి ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేపట్టారు. వందేభారత్ రైళ్లకు భద్రతను కట్టుదిట్టం చేశారు.



పిల్లలు గమనిస్తున్నారు సుమా..

వంట సరిగా కుదరకపోతే భార్య మీద కోప్పడతారు. పిల్లలు అల్లరి చేస్తే వారి మీద అరిచేస్తారు. మీరు అనుకున్నది జరగనప్పుడు అసహనానికి గురవుతారు. మీరే ఇలా ఉంటూ మీ పిల్లలకు ఓర్పు, సహనం గురించి బోధిస్తే ఉపయోగం ఉంటుందా? మీ పిల్లలు మీ ప్రతి చర్యను గమనిస్తుంటారు. అందుకే మీ మాటల ద్వారా కాకుండా, మీ ప్రవర్తన ద్వారా వారికి ఆదర్శంగా నిలవండి.

– లింకన్, ఫాదర్‌హుడ్ మెంటార్



వీడియో గేమ్ కాదు.. వీరోచిత విన్యాసం!

విశాఖపట్నంలోని ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో శనివారం జాతీయ బైక్ రేసింగ్ పోటీలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి సన్నాహక పోటీలు సంభ్రమాశ్చర్యాలకు గురి చేశాయి. జంపింగ్ ట్రాక్‌లపైనుంచి గాల్లోకి దూసుకెళ్లిన బైక్‌లను వీక్షకులు కన్నార్పకుండా చూశారు. ఈ పోటీలకు కొన్ని రోజులుగా మైదానంలో ఏర్పాట్లు సాగుతున్నాయి.

– న్యూస్‌టుడే, విశాఖ క్రీడలు

'క్వాంటమ్' వేడుకకు సిద్ధం



వేదిక వద్ద ఏర్పాటు చేసిన కుర్చీలు

తుళ్లూరు, న్యూస్‌టుడే: తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెంలో శనివారం నిర్వహించే క్వాంటమ్ వ్యాలీ శంకుస్థాపన కార్యక్రమానికి సర్వం సిద్ధమైంది. సీఎం చంద్రబాబు, ఇతర ప్రముఖులు, పలు టెక్ సంస్థల ప్రతినిధులు హాజరు కానున్న నేపథ్యంలో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. సీడ్ యాక్సెస్ రహదారి (ఈ-3) ఎన్-10 జంక్షన్‌లో జర్మన్ టెంట్లు, పార్కింగ్, బారికేడ్లు, కుర్చీలు, ప్రధాన వేదిక పనులు పూర్తయ్యాయి. ఆహ్వానితులందరికీ భోజనం, అల్పాహారం, తాగునీరు అందించేందుకు ఏర్పాట్లు చేశారు. శుక్రవారం ఈ పనులను జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, పోలీసు అధికారులు పరిశీలించి పలు సూచనలు చేశారు.

ఈనాడు-ఈటీవీ ఆధ్వర్యంలో...

జిల్లా స్థాయి ప్రతిభాపాటవ పోటీలు రేపు

ఈనాడు-ఈటీవీ ఆధ్వర్యంలో ఉమ్మడి కృష్ణాజిల్లా స్థాయి పాఠశాలల ప్రతిభా పోటీలు ఆదివారం జరగనున్నాయి. విజయవాడ కొత్తపేటలోని కేబీఎన్ కళాశాలలో ఉదయం 9.30కి పోటీలు ప్రారంభం కానున్నాయి. నాలుగు నెలలుగా ఉమ్మడి కృష్ణాజిల్లా పరిధిలోని వివిధ కేంద్రాల్లో 133 పాఠశాలల్లో వ్యాసరచన, చిత్రలేఖనం, ఉపన్యాసం, క్విజ్ విభాగాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పోటీలు జరిగాయి. రీజినల్ స్థాయిలో 1420 మంది హాజరు కాగా, 144 మంది బహుమతులు అందుకుని జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. మచిలీపట్నం, అవనిగడ్డ, గుడివాడ, గన్నవరం, ఉయ్యూరు, విస్సన్నపేట, మైలవరం, నందిగామ, జగ్గయ్యపేట, పెనమలూరు, విజయవాడలోని పలు కేంద్రాల నుంచి 144 మంది విద్యార్థులు జిల్లా పోటీలకు అర్హత సాధించారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు ఆదివారం ఉదయం 9 గంటలకు వేదిక వద్దకు చేరుకోవాలని నిర్వాహకులు సూచించారు. - చిట్టినగర్, న్యూస్‌టుడే

జగన్ ఊరేగింపు.. జనం ఈసడింపు



బలప్రదర్శనకు పరాకాష్ఠ: విజయవాడ బైపాస్ రోడ్డు నుంచి గొల్లపూడి వద్ద జాతీయ రహదారిలోకి ప్రవేశిస్తున్న భారీ వాహనశ్రేణి..

దారి మార్చినా తీరు మార్చుకోలేదు... | **అరగంట పరామర్శ.. ఆరు గంటల నరకం**

అరగంట పరామర్శకు వచ్చిన జగన్.. జనానికి ఆరు గంటలు ప్రత్యక్ష నరకం చూపించారు. పెద్దగా జనం లేకున్నా భారీ సంఖ్యలో వాహనాలు రప్పించి ట్రాఫిక్ స్తంభించేలా చేశారు. విజయవాడ బైపాస్‌తోపాటు విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిలో వాహనదారులు గంటల తరబడి ముందుకు కదల్లేక చిక్కుకుపోయారు. శుక్రవారం జోగి రమేశ్ కుటుంబాన్ని పరామర్శించేందుకు జగన్ తాడేపల్లిలో తన నివాసం నుంచి ఇబ్రహీంపట్నం వరకు 39 కిలోమీటర్ల దూరం రావడానికి 6గంటలకు పైగా సమయం తీసుకున్నారు. హైవే, కాన్వాయ్‌లో అక్కడికి వెళ్లేందుకు అరగంట కూడా పట్టదు. జగన్ యాత్ర మాత్రం నెమ్మదిగా సాగడంతో అవస్థలు తప్పలేదు.

నిబంధనలతో నాకేమని?...

షెడ్యూల్ ప్రకారం 10 గంటలకు పర్యటన మొదలై 12 గంటలకు ముగియాలి. ఎక్కడా పోలీసుల నిబంధనలను జగన్ పట్టించుకోలేదు. ప్రధాన కూడళ్లలో ఇష్టారాజ్యంగా జన సమీకరణ చేయడంతో తాడేపల్లి, పెదకాకాని, వెంకటపాలెం, గొల్లపూడి, గుంటుపల్లి, తిరుమలపాలెం... ఇలా ప్రతి చోట రాకపోకలు రెండు కిలోమీటర్ల మేర నిలిచాయి. విజయవాడ, గుంటూరు, ఏలూరు వైపుల నుంచి హైదరాబాద్ వెళ్లే ప్రయాణికులు గొల్లపూడి వద్దకు చేరుకొని.. పద్మవ్యూహంలో చిక్కుకొని గగ్గోలు పెట్టారు. వైకాపా శ్రేణులు మద్యం మత్తులో అడ్డగోలుగా ప్రయాణికులను ఇబ్బంది పెడుతూ నడిరోడ్డుపై బైకులతో విన్యాసాలు చేశారు.

ఉదయం 11.06 తాడేపల్లి

తాడేపల్లి నివాసం నుంచి కాజ టోల్ ప్లాజాకు 13 కి.మీ. ఇక్కడకు రావడానికి కాన్వాయ్‌కు 10 నిమిషాలు చాలా ఎక్కువ. జగన్‌కు మాత్రం 1.24 గంటలు పట్టింది. దీంతో ట్రాఫిక్ నిలిచి.. జనం పడరాని పాట్లు పడ్డారు. ఎటూ కదల్లేక ఎండలోనే ఉండిపోయారు. ఇంత సమయం పట్టడానికి భారీ జనసందోహం ఉందా అంటే అదీ లేదు. కాన్వాయ్‌లో వాహనాలు తప్ప మరేమీలేవు.



భవానీపురం నుంచి గొల్లపూడి వరకు గంటల తరబడి కదలని వాహనాలు...

మధ్యాహ్నం 12.30 కాజ

కాజ నుంచి గొల్లపూడి శివారుకు 16 కి.మీ. 15 నిమిషాల్లో రావాల్సి ఉండగా 1.15 గంటలు పట్టింది. సమయం తీసుకుని 1.45కి వచ్చారు. ఆ మధ్యలో వెంకటపాలెం టోల్ ప్లాజా దగ్గర మినహా ఎక్కడా జనం లేరు. అయినా నెమ్మదిగా వెళ్లడంతో బైపాస్‌పై హైదరాబాద్ వెళ్లే ప్రయాణికుల అవస్థలు అన్నీ ఇన్నీ కావు. పోలీసులు వేగంగా వెళ్లమని చెబుతున్నా ఖాతరు చేయలేదు.



విజయవాడ బైపాస్ మీద చుక్కలు...

మధ్యాహ్నం 3.00 గొల్లపూడి

గొల్లపూడి నుంచి గుంటుపల్లి 5 కి.మీ. దీనికి 1.15 గంటలు పట్టింది. ముందుగా చెప్పిన ప్రకారం విజయవాడ నగరం మీదుగా పర్యటన రద్దవడంతో నగర శ్రేణులు గొల్లపూడి చేరుకున్నాయి. ఆకతాయిలు రప్పా రప్పా నినాదాలతో.. బైకులపై విన్యాసాలతో చెలరేగారు. దారంతా ఆక్రమించి వెళ్లేందుకు వీలు లేకుండా చేశారు. అటు విజయవాడ నుంచి వచ్చేవారు, ఇటు బైపాస్ నుంచి హైదరాబాద్ వెళ్లే ప్రయాణికులు కదల్లేక ఉక్కిరిబిక్కిరయ్యారు. దాదాపు 4 కి.మీ. ట్రాఫిక్ నిలిచింది. వృద్ధులు, చిన్నారులు, మహిళలు విలవిల్లాడారు. గొల్లపూడి దాటాక గుంటుపల్లి వరకు పెద్దగా జనం లేకున్నా కాన్వాయ్‌ను నెమ్మదిగా నడిపి ప్రజలకు నరకం చూపించారు.



వైకాపా శ్రేణుల అత్యుత్సాహం

సాయంత్రం 5.00 గుంటుపల్లి

గుంటుపల్లి నుంచి ఇబ్రహీంపట్నం 4.8 కి.మీ. జగన్ కాన్వాయ్‌కు పట్టిన సమయం రెండు గంటలు. ఇబ్రహీంపట్నం కూడలిలో తప్ప గుంటుపల్లి నుంచి ఇబ్రహీంపట్నం మధ్య జనమే లేకున్నా...సాగదీస్తూ సాగారు. రింగ్‌లో భారీగా జనాన్ని కూడేసి. రప్పారప్పా ప్రత్యేక పాటలతో వికృత నృత్యాలు చేశారు. దీంతో హైదరాబాద్ వెళ్లే వారే కాదు.. మైలవరం, తిరువూరు వెళ్లే వాహనాలు సైతం స్తంభించి వాహనదారులు నరకం చూశారు.



జోగి రమేష్ నివాసంపై దాడి జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జగన్



ఇబ్రహీంపట్నం కూడలి: హైదరాబాద్ నుంచి వస్తున్న వాహనాలు నిలిచాయిలా..

తిరుగు ప్రయాణంతోనూ తంటాలే..

జగన్ పర్యటన సాయంత్రం 6.30 గంటలకు ముగిసింది. కాన్వాయ్‌ను పంపేందుకు పోలీసులు ట్రాఫిక్‌ను ఆపగా సాధారణ స్థితికి తేవడానికి 2.30 గంటలు పట్టిందంటే ప్రజల ప్రయాస తెలుస్తోంది. ★ ఇబ్రహీంపట్నం రింగు నుంచి గుంటుపల్లి వరకు 4 కి.మీ. ట్రాఫిక్ స్తంభించింది. చాలా మంది అపసవ్య దిశలో ప్రమాదకరంగా సాగగా.. ట్రాఫిక్ నియంత్రణ పోలీసులకు తలకు మించిన భారమైంది.

– ఈనాడు, డిజిటల్ – అమరావతి, న్యూస్‌టుడే – ఇబ్రహీంపట్నం, రూరల్, మైలవరం, గొల్లపూడి, తాడేపల్లి

ప్రేమించానని.. వివాహితకు వేధింపులు

పురుగుల మందు నోట్లో పోసి పరారీ

మధురానగర్, న్యూస్‌టుడే: ప్రేమించానంటూ వివాహిత వెంట పడ్డాడు. భర్తకు తప్పుడు మాటలు చెప్పి ఇద్దరినీ విడదీశాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి తీసుకొచ్చాడు. తన గదిలో ఉంచుకుని ఆ తరవాత వేరే యువకుడితో మాట్లాడుతున్నాడని గొడవ పడి పురుగుల మందు బలవంతంగా గొంతులో పోశాడు. ఆ తరువాత ఆసుపత్రిలో చేర్పించి అక్కడి నుంచి పారిపోయాడు. అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. కృష్ణా జిల్లా పమిడిముక్కల మండలంలోని ఒక గ్రామానికి చెందిన యువతికి గతేడాది ఏప్రిల్‌లో వివాహమైంది. పరిచయస్తుడైన భవానీశంకర్ ప్రేమించానంటూ ఆమె వెంట పడ్డాడు. ఆమె భర్తకు ఫోన్ చేసి తప్పుడు ఆరోపణలు చేయడంతో వారిద్దరి మధ్య గొడవలు జరిగాయి. ఈ క్రమంలో యువతి తన తల్లిదండ్రుల వద్దకు వచ్చేసింది. విజయవాడలో నర్సింగ్ కోర్సులో చేరేందుకు శిక్షణ తీసుకుంటూ ఉండడంతో భవానీశంకర్ ఆమె వెంట పడి పెళ్లి చేసుకుంటానని వేధించడం ప్రారంభించాడు. యువతి తల్లిదండ్రులకు చెప్పడంతో వారు ఆమెను హైదరాబాద్‌లో ఒక హాస్టల్‌లో ఉంచి చదివిస్తున్నారు. యువతి ఇన్‌స్టాగ్రామ్ ఐడీ ద్వారా ఆమె వివరాలు తెలుసుకుని తరచూ ఫోన్ చేసి వేధిస్తున్నాడు. ఈ క్రమంలో పెళ్లి చేసుకుంటానని తరచూ ఒత్తిడి చేయడంతో అతని మాటలు నమ్మి ఈ నెల 2న హైదరాబాద్ నుంచి బయలుదేరి విజయవాడకు వచ్చింది. భవానీశంకర్ ఆమెను దేవీనగర్‌లోని తన గదికి తీసుకొచ్చాడు. 3న సాయంత్రం యువతి చరవాణిని చెక్ చేయగా దానిలో మహేష్ అనే యువకుడి ఫోన్ నంబరు ఉండడంతో ఆమెను అనుమానించాడు. గొడవపడి కొట్టాడు. ఆమె హైదరాబాద్ వెళ్లేందుకు రైల్వేస్టేషన్‌కు వెళ్లగా మళ్లీ ఆమెను తన గదికి తీసుకొచ్చాడు. మళ్లీ గొడవ పెట్టుకుని ఆమె నోట్లో బలవంతంగా పురుగుల మందు పోశాడు. అపస్మారక స్థితికి చేరుకున్న ఆమెను చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేర్పించి తల్లికి సమాచారం ఇచ్చి పారిపోయాడు. దీనిపై యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు గురువారం సాయంత్రం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అవి చూశారో.. అంతేనండోయ్!



- చైల్డ్ పోర్న్ వీక్షిస్తూ.. షేర్ చేస్తూ దొరికిపోతూ..
- ఎక్కువగా 10 నుంచి 16 ఏళ్లలోపు వారే అధికం

యువతలో పలువురు చైల్డ్‌పోర్న్ వీక్షణకు అలవడుతున్నారు. చూడటమే కాదు.. ఇతరులకు షేర్ చేస్తూ కేసుల్లో చిక్కుకుంటున్నారు. ప్రయోజకులు కావాల్సిన వయసులో చట్టం ముందు దోషులుగా నిలుస్తున్నారు. వీరిలో ఎక్కువ మంది పదేళ్ల నుంచి 16 ఏళ్లలోపు వారు ఉంటున్నారు. ఇటీవల విజయవాడ నగరంలో ఈ కేసులు అధికంగా నమోదవుతున్నాయి.

తెలిసీ తెలియక..

వెబ్‌సైట్లను బ్రౌజ్ చేస్తుండగా పోర్న్‌సైట్లకు చెందిన పాప్‌అప్‌లు వస్తుంటాయి. వీటిపై క్లిక్ చేస్తే అశ్లీల ప్రపంచంలోకి అడుగు పెట్టినట్లే. ఇలా అలవాటు పడి బానిసలుగా మారుతున్నారు. చైల్డ్ పోర్న్ వీక్షించే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. ఇటీవల నమోదవుతున్న కేసులే నిదర్శనం. నిరుడు 678 మందిపై విజయవాడలో కేసులు నమోదయ్యాయి.

అప్‌లోడ్ చేసినా.. షేర్ చేసినా నేరమే: పోక్సో చట్టం ప్రకారం యుక్త వయసులోపు వారితో అభ్యంతరకర చిత్రాలు తీయడం పూర్తిగా నిషేధం. తీసినా, సేకరించినా, చూసినా, ఇతరులకు పంపినా నేరమే. ఐటీ చట్టంలో 67 (బి) సెక్షన్ ప్రకారం చిన్నారులకు సంబంధించి.. దుస్తులు లేకుండా చిత్రీకరించిన వీడియోలు, ఫొటోలను తీసి సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేసినా నేరమే. నిందితులు తొలిసారి నేరానికి పాల్పడితే ఐదేళ్ల వరకు శిక్ష, రూ.10 లక్షల జరిమానా విధిస్తారు. రెండోసారి.. ఏడేళ్ల వరకు జైలు శిక్ష, రూ.10 లక్షల వరకు జరిమానా విధిస్తారు.

చట్టం ముందు దోషులుగా.. పదో తరగతి వరకు చదివిన ఓ యువకుడు.. డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. తరచూ చిన్నారుల అశ్లీల వీడియోలను చూస్తుంటాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో చైల్డ్ పోర్న్ వీడియోను తన ఫోన్ నుంచి స్నేహితుడికి పంపాడు. ఈ సమాచారాన్ని ఎన్‌సీఎంఈసీ సంస్థ.. విజయవాడ పోలీసులకు అందజేసి అతనిపై కేసు నమోదు చేయాలంది. ఆ యువకుడిపై ఐటీ చట్టం కింద కేసు నమోదైంది.

నిఘా కళ్లు.. ✪ అంతర్జాలం, సామాజిక మాధ్యమాల్లో ఈ కంటెంట్‌ను శోధించే వారిపై నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో నిఘా పెట్టింది. వారి ఐపీ చిరునామాల ఆధారంగా కేసులు పెడుతున్నారు. దిల్లీలోని ఎన్‌సీఎంఈసీ (నేషనల్ సెంటర్ ఫర్ మిస్సింగ్ అండ్ ఎక్స్‌ప్లాయిటెడ్ చిల్డ్రన్) కూడా చైల్డ్ పోర్న్‌పై నిఘా పెడుతోంది. ఎవరు ఈ తరహా వీడియోలు షేర్ చేసినా సమాచారం వారికి వెళ్తుంది. ✪ బీఎన్ఎస్ 67 కింద కూడా కేసులు నమోదు చేస్తున్నారు. ఈమేరకు.. 3-7 ఏళ్ల వరకు జైలు శిక్ష పడుతుంది. కోర్టులు జరిమానా కూడా విధించే వీలుంది.

– ఈనాడు, అమరావతి

విశ్వ విద్యాలయం... సమస్యల వలయం



నత్తనడకన విద్యార్థినుల వసతి గృహ భవన నిర్మాణం

కొలిక్కిరాని వసతిగృహ నిర్మాణాలు

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం

కృష్ణా వర్సిటీని ఏళ్లుగా సమస్యలు వేధిస్తున్నాయి. కొత్త ప్రాంగణంలోకి మారాక విద్యార్థుల చేరికలు, అధ్యాపకుల సంఖ్య మరింత తగ్గింది. విశాల మైదానం ఉన్నా నాలుగైదు అడుగుల లోతున ఉండటంతో ఏడాది పొడవునా చెరువులానే దర్శనమిస్తోంది.

బందరు శివారులో వర్సిటీ ఉండటంతో స్థానికేతర విద్యార్థులు 10 కి.మీ. దూరంలో అద్దెకు ఉండాల్సిందే. వైకాపా ప్రభుత్వంలో స్వామి భక్తికే వీసీలు, రిజిస్ట్రార్లు పాకులాడగా... భవనాల నిర్మాణ దశలోనే నిధులు పక్కదారి పట్టాయి.

--- వెరసి వసతి భవనాలు, ఇంజినీరింగ్ బ్లాక్ తదితర నిర్మాణాలు పునాదుల్లోనే నిలిచాయి. నిరుడు జూన్‌లోనే పూర్తి కావాల్సిన విద్యార్థినుల గృహ వసతి భవనం నేటికీ నిర్మాణంలోనే ఉంది.

దిగజారుతున్న ప్రతిష్ఠ... 2008లో వర్సిటీ స్థాపించినపుడు 167 కళాశాలలు ఉంటే ప్రస్తుతం 144కు తగ్గాయి. 108 మంది శాశ్వత ప్రొఫెసర్లకు 17 మందే ఉన్నారు. 53 మంది ఒప్పంద ఉద్యోగులతో నెట్టుకొస్తున్నారు. ● ఏళ్లుగా ఒప్పంద ఉద్యోగులు, కిందిస్థాయి సిబ్బందికి వేతనాలు.. పని భద్రతలో సమస్యలు వీడట్లేదు. వైకాపా జమానాలో వర్సిటీని అంతర్గత రాజకీయాలతో దిగజార్చారు.

బోధన అంతంతే... ప్రొఫెసర్లకు ఒకరంటే ఒకరికి పడట్లేదు. తరగతుల నిర్వహణ సరిగాలేదు. ఇటీవల ఇంజినీరింగ్ విద్యార్థులు భారీగా పరీక్షలు తప్పారు.



పునాదుల్లోనే నిలిచిన అబ్బాయిల వసతి గృహం.. తుప్పుపట్టిన చువ్వలు

● **చెరువులోనే మైదానం...** 102 ఎకరాల్లో భవనాలు పోగా మిగిలిన మైదానం చెరువులా మారింది. మెరక చేసేందుకు రూ.12 కోట్లు అవసరమని అంచనా వేసి ప్రజాప్రతినిధుల సహకారం కోరినా పట్టించుకోలేదు. వర్సిటీ కార్యక్రమాలకు బయట సంస్థలపై ఆధారపడే దుస్థితి నెలకొంది.

● పీహెచ్‌డీ విద్యార్థులకు ధ్రువపత్రాలు ఇవ్వకుండా పలువురు సిబ్బంది తిప్పుతున్నారు. బోధన రుసుములు రాలేదనీ.. బకాయి ఫీజులు కడితేనే ధ్రువపత్రాలని కోర్సు పూర్తయిన వారిని ఇబ్బంది పెడుతున్నారు.

రూ.45 కోట్లు కావాలండి...

రాజధాని డిమాండ్‌కు తగిన కోర్సులు.. విజయవాడలో పీజీ సెంటర్ ఏర్పాటుకు 10 ఎకరాల కేటాయింపు ప్రతిపాదన ముందుకు కదల్లేదు. ● కొత్త కోర్సుల తాత్కాలిక భవనమూ కొలిక్కిరాలేదు. ● ఆరేళ్ల కిందట ఇంజినీరింగ్ బ్లాక్, యువకుల హాస్టళ్లకు పునాదుల్లోనే రూ.10 కోట్లు ఖర్చుచేసి వదిలేశారు. పూర్తవడానికి రూ.45 కోట్లు కావాలని ప్రభుత్వ సాయం కోరినా స్పందన లేదు. చువ్వలు తుప్పుపట్టిపోతున్నాయి. ● 'సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నాం. ఈ మార్చి నాటికి విద్యార్థినుల హాస్టల్ అందుబాటులోకి తెస్తామని' ఉపకులపతి రాంజీ తెలిపారు.

సిడిబండి వేడుక నేడు

ఉయ్యూరు, న్యూస్‌టుడే : ఉయ్యూరు వీరమ్మతల్లి తిరునాళ్లలో భాగంగా సిడిబండి వేడుకను శనివారం సాయంత్రం నిర్వహించనున్నారు. ఈ వేడుక చూసేందుకు ఉమ్మడి కృష్ణాతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా వస్తారు. ఏళ్ల నుంచి వస్తున్న సంప్రదాయం ప్రకారం ఉయ్యూరులోని ఎస్సీ కాలనీకి చెందిన ఓ కుటుంబంలో వివాహానికి సిద్ధంగా ఉన్న యువకుడిని సిడి బండికి కట్టిన ఉట్టిలో కూర్చోబెట్టి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేయిస్తారు. ఉట్టిలో ఉన్న పెళ్లి కుమారుడు మీదకు భక్తులు అరటి పళ్లు విసురుతారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలో చోటుచేసుకోకుండా డీఎస్పీ శ్రీనివాస్ నేతృత్వంలో పోలీసులతో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు.

ప్రత్యేక రైళ్లు

విజయవాడ(రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే: ప్రయాణికుల సౌకర్యార్థం విజయవాడ మీదుగా వివిధ ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు విజయవాడ రైల్వే అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ✪ 07033/07034 కాకినాడ టౌన్-మైసూర్ ప్రత్యేక రైలు మార్చి 2వ తేదీ నుంచి మార్చి 31 వరకు రాకపోకలు సాగిస్తుంది. సామర్లకోట, రాజమహేంద్రవరం, నిడదవోలు, తణుకు, భీమవరం టౌన్, ఆకివీడు, కైకలూరు, గుడివాడ, విజయవాడ, గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి, మిర్యాలగూడ, నల్గొండ, సికింద్రాబాద్, బేగంపేట, లింగంపల్లి, వికారాబాద్, తాండూర్, మంత్రాలయం, ఆదోని, గుంతకల్, అనంతపురం, ధర్మవరం, హిందూపురం, యలహంక, బెంగళూరు, మాండ్య స్టేషన్లలో ఆగుతుంది. ✪ 07153/07154 బెంగళూరు- నర్సాపూర్ ప్రత్యేక రైలు మార్చి 6వ తేదీ నుంచి మార్చి 28 వరకు రాకపోకలు సాగిస్తుంది. పాలకొల్లు, వీరవాసరం, భీమవరం టౌన్, ఆకివీడు, కైకలూరు, గుడివాడ, విజయవాడ, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, కాట్పాడి, జోలార్‌పేట, కృష్ణరాజపురం స్టేషన్లలో ఆగుతుంది.

పలు రైళ్ల రద్దు: నిర్వహణ పనుల దృష్ట్యా ఈ నెల 7, 8 తేదీల్లో డివిజన్‌లో నడిచే రైళ్లను రద్దు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. 67767/67768 విజయవాడ-డోర్నకల్, 67769/67770 విజయవాడ-గుంటూరు

కచ్చితత్వంతో ఏకీకృత కుటుంబ సర్వే



దుర్గాపురం సంగీత కళాశాల ప్రాంతంలో సర్వే ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

ఎన్టీఆర్ కలెక్టరేట్: జిల్లాలో ఏకీకృత కుటుంబ (యూనిఫైడ్ ఫ్యామిలీ) సర్వేను కచ్చితత్వంతో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. నగరంలోని దుర్గాపురం సంగీత కళాశాల ప్రాంతంలో శుక్రవారం సర్వే తీరును పరిశీలించి మాట్లాడారు. సంక్షేమ పథకాల లక్ష్యసాధన, సమర్థ అమలు, పర్యవేక్షణ, సేవల పంపిణీని మరింత మెరుగుపరిచే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఎఫ్‌బీఎంఎస్)ను అమలు చేస్తున్నట్లు చెప్పారు. గ్రామ/వార్డు సచివాలయాల పరిధిలో కుటుంబ డేటాబేస్‌లో నమోదైన కుటుంబాల సర్వే నిర్వహిస్తున్నట్లు వివరించారు. అర్హులైన కుటుంబాలకు సంక్షేమ ప్రయోజనాలు అందించడం, రియల్ టైమ్ గవర్నెన్స్ డేటా సంతృప్తికర స్థాయిలో నాణ్యంగా రూపొందించడం, వివిధ శాఖల ద్వారా ఆధార సహిత విధానాల రూపకల్పనకు సర్వే నిర్వహిస్తున్నట్లు వివరించారు. జోనల్ కమిషనర్ ప్రభుదాసు పాల్గొన్నారు.

గ్యాస్ డెలివరీ బాయ్స్ కోసం వేట

నిందితుల కోసం రాజస్థాన్‌కు మూడు ప్రత్యేక బృందాలు

భవానీపురం, న్యూస్‌టుడే: నగరంలో కలకలం సృష్టించిన విద్యాధరపురంలోని రమ్య కృష్ణ గ్యాస్ ఏజెన్సీ ఘటనపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. తుపాకీతో బెదిరించి నగదు తీసుకెళ్లిన ఘటనలో పాల్గొన్న ముగ్గురి కోసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. రాజస్థాన్‌కు చెందిన భజరంగి, దినేష్‌లు స్నేహితుడు ధీరజ్‌తో కలిసి బుధవారం రాత్రి గ్యాస్ ఏజెన్సీకి వచ్చి తుపాకీతో ఉద్యోగినులను బెదిరించి రూ.1.50లక్షల నగదు, రెండు ఫోన్లను ఎత్తుకెళ్లారు. వీరిని వారం కిందట ఏజెన్సీ యాజమాన్యం విధుల నుంచి తొలగించింది. రాజస్థాన్ రాష్ట్రం జోధ్‌పూర్‌కు చెందిన భజరంగి, బికనీర్‌కు చెందిన దినేష్, మరో యువకుడు ధీరజ్ ఆచూకీ ఇంకా దొరకలేదు. నిందితులను పట్టుకునేందుకు సీపీ రాజశేఖరబాబు ఏడు బృందాలు ఏర్పాటు చేశారు. మూడు బృందాలు రాజస్థాన్‌లోని నిందితుల స్వస్థలాలకు వెళ్లాయి. మిగిలినవి స్థానికంగా గాలిస్తున్నాయి. స్థానికంగా నివాసం ఉండే రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన వారి సాయాన్ని పోలీసులు తీసుకున్నారు. ఘటన జరిగిన తర్వాత ద్విచక్రవాహనంపై ముగ్గురు వెళ్లినట్లుగా సీసీ కెమెరాల్లోని దృశ్యాల ఆధారంగా గుర్తించారు. ద్విచక్ర వాహనం విద్యాధరపురంలో వారు ఉంటున్న గదికి దిగువన నివాసం ఉండే వారికి చెందినదిగా తేలింది. గ్యాస్ సిలిండర్ డెలివరీ ఇచ్చి వస్తామంటూ వాహనాన్ని తీసుకున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. బైక్‌ను ఎక్కడ ఉంచారో ఇంకా తేలలేదు. వీరి ఫోన్లు స్విచాఫ్ చేయడంతో లొకేషన్ గుర్తించలేని పరిస్థితి. దీంతో పోలీసులు ఇతర మార్గాల్లో అన్వేషిస్తున్నారు. వీరిపై గతంలో ఎటువంటి కేసులు లేనట్లు తేలింది. మొత్తం పది మంది రాజస్థానీయులను ఏజెన్సీ పనిలో పెట్టుకుంది. మిగిలిన వారు రాజస్థాన్ వెళ్లినట్లు తేలింది. వీరి గురించి కూడా పోలీసులు ఆరా తీస్తున్నారు.

ముగ్గురిపై కేసు : ఈ ఘటనపై ఏజెన్సీలో పనిచేసే మేనేజర్ గద్దం సత్యశ్రీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు భవానీపురం పోలీసులు బీఎన్ఎస్ 308 (5) రెడ్‌విత్ 3 (5) సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. నిందితులుగా దినేష్, భజరంగి, ధీరజ్‌ను పేర్కొన్నారు.

రైల్వే ప్యాంట్రీ కార్లలో నిలువు దోపిడీ

ప్రయాణికుల నుంచి ఫిర్యాదుల వెల్లువ



5 కాఫీలకు రూ.150 వసూలు చేసి..

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: రైళ్లలో ప్యాంట్రీ కార్ల నిర్వాహకులు ప్రయాణికులను నిలువునా దోచుకుంటున్నారు. తాజా ఆహార పదార్థాలను సరఫరా చేయకుండా నాసిరకమైన వాటిని విక్రయిస్తున్నారు. దీనికి తోడు అధిక ధరలు వసూలు చేస్తున్నారు. ధరల దోపిడీపై ప్రయాణికుల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు వస్తున్నాయి. గతంలో ప్యాంట్రీ కార్ల ప్రమాణాలు జరగడంతో ప్రయాణికుల భద్రత దృష్ట్యా దశలవారీగా అన్ని రైళ్లలో ప్యాంట్రీ కార్లు ఏర్పాటైన ఆయా మార్గాల్లోని మన రైల్వేస్టేషన్ల నుంచి తాజా ఆహార పదార్థాలను ఎప్పటికప్పుడు సరఫరా చేయాలని రైల్వే శాఖ గతంలో నిర్ణయించింది. అయితే కొన్ని రైళ్లకు కాంట్రాక్ట్ ఐఆర్‌సీటీసీ ద్వారా పొందడంతో ప్రస్తుతం యథావిధిగా నడుస్తున్నాయి. ● విజయవాడ డివిజన్‌లో కంటే ఇతర రాష్ట్రాల రైళ్లలోనే ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది. ప్రయాణికుల ఫిర్యాదులపై రైల్వే అధికారులు చర్యలు తీసుకుంటున్నా నిర్వాహకుల్లో మార్పు రావడం లేదు. ● ఇటీవల విజయవాడ సత్యనారాయణపురానికి చెందిన 15 మంది ప్రయాణికుల బృందం రైలు నంబరు 18190 కోయంబత్తూర్ వెళ్లగా రెండు వైపులా రైల్లో ఇదే పరిస్థితి. మంచినీటి సీసా రూ. 14 బదులు రూ.20కి విక్రయించారు. రూ.20 ఉన్న కాఫీని రూ.30కి విక్రయించగా అడుగుడు కలిసి రూ.150 చెల్లించారు. రూ.28 ఉన్న కూల్ డ్రింక్ రూ.50 వసూలు చేశారు. దీనిపై ప్రయాణికులు 139లో అధికారులకు ఫిర్యాదు చేశారు. ● ప్యాంట్రీ కార్లలో ఆహార పదార్థాల నాణ్యత కూడా అంతంత మాత్రంగానే ఉంటుంది. కొన్ని పదార్థాలు ముక్కు వాసన వస్తున్నట్లు ప్రయాణికుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. మంచినీటికి వేసవి సీజన్లో మంచి డిమాండ్ ఉంటుంది. దీన్ని ఆసరాగా తీసుకొని కొందరు ప్యాంట్రీకార్ల నిర్వాహకులు రెట్టింపు ధరలకు విక్రయిస్తూ ప్రయాణికులను దోచుకుంటున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అన్నదానం.. ప్రసాదాలపోటు పరిశీలన

విద్యాధరపురం: దుర్గగుడిలో నిర్వహించే అన్నదానం, ప్రసాదాల పోటును తితిదే టెక్నికల్ బృంద సభ్యులు శుక్రవారం పరిశీలించారు. వంటగది, బాయిలర్ పనుల గురించి ఎక్కడ ఏర్పాటు చేయాల్సి ఉందో స్థలాన్ని పరిశీలించారు. వారం రోజుల కిందట దుర్గగుడి ఈవో శీనానాయక్ నేతృత్వంలో అధికారుల బృందం తిరుమలలోని అన్నప్రసాదం తయారీ చేసే విధానాన్ని పరిశీలించారు. దుర్గగుడి ఈవో అభ్యర్థన మేరకు తితిదే సభ్యులు పాల్గొని, దేవాదాయ శాఖ సీఈ శేఖర్ దేవస్థానం ఇంజినీరింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో దుర్గగుడి ఈఈ కోటేశ్వరరావు, డీఈ రమేష్, ఏఈ మస్తాన్ పాల్గొన్నారు.


ప్రసాదాల పోటు పరిశీలిస్తున్న తితిదే టెక్నికల్ బృంద సభ్యులు

ధర వరలు

వంకాయలు-20, టమాటా-14, బెండ-30, పచ్చిమిర్చి-34, కాకర-32, బీర-30/28, క్యాలీ ఫ్లవర్-15/20, క్యాబేజీ-14, క్యారెట్-26, దొండ-42, బంగాళదుంప-21, ఉల్లిపాయలు-22, గోరుచిక్కుడు-30, దోస-20/30, సొర-12/10, పొట్ల-30, అరటికాయ-7/6, చామ దుంప-24, అల్లం-72, ముల్లంగి-10/12. (నిమ్మలు). - న్యూస్‌టుడే, విజయవాడ రైతుబజారు

పెళ్లి సంబంధాల కోసం చూస్తున్నారా
మాదిగ కుల వధూవరులకు సువర్ణావకాశం

నేడు, రేపు మాదిగ కుల వధూవరులకు ఈనాడు పెళ్లిపందిరి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్



తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన ఈనాడు పెళ్లిపందిరి, మాదిగ కుల అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తుంది. విజయవాడ ఆటోనగర్‌లోని స్టాలిన్ కార్పొరేట్ బిల్డింగ్, బి బ్లాక్, 3వ అంతస్తులోని ఈనాడు కార్యాలయం వేదికగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వివాహం కోసం ఎదురుచూస్తున్న వారు, సంబంధిత కుటుంబీకులు నేడు, రేపు (7 & 8 ఫిబ్రవరి 2026) ఉదయం 9 గం. నుంచి సాయంత్రం 5.30 గం. వరకు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు. ★ ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ ఫోన్ యాప్ ద్వారా కూడా చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న వధూవరుల బయోడేటా, ఫొటోలు క్రింద తెలిపిన ఫోన్ నెంబర్లకు సంప్రదించి వాట్సాప్ ద్వారా పంపవచ్చు.

మరిన్ని వివరాలకు
95501 28306 & 92475 20500
ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చు.

8న శ్రీసత్యసాయి రన్.. రైడ్-2026

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ జిల్లా శ్రీసత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ఈనెల 8న బీఆర్‌టీఎస్ రోడ్డు శారద కళాశాల కూడలి వద్ద శ్రీసత్యసాయి రన్ అండ్ రైడ్-2026 కార్యక్రమం నిర్వహిస్తామని ఆ సంస్థల రాష్ట్ర మీడియా ఇన్‌ఛార్జి ద్వారం స్వామి తెలిపారు. భగవాన్ శ్రీసత్యసాయి బాబా శతజయంతి వేడుకల్లో భాగంగా ఐక్యతాభావాన్ని పెంపొందించడం, ఫిట్ ఇండియా ఉద్యమానికి మద్దతివ్వాలనే ప్రధాన లక్ష్యంతో దేశవ్యాప్తంగా ఆదివారం 60 ప్రధాన నగరాల్లో ఏకకాలంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. 15 సంవత్సరాలు, అంతకన్నా పైబడిన అన్ని వర్గాలకు చెందిన వారు ఈ 5కే రన్, 5కే సైకిల్ రైడ్‌లో పాల్గొనాలని వివరించారు. ఇప్పటికే సుమారు 9 వేల మందికిపైగా పేర్లు నమోదు చేసుకున్నారని, వారందరూ ఈనెల 7వ తేదీ ఉదయం 7 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు సీతారాంపురంలోని శ్రీసత్యసాయి నిలయం(మందిరం)లో ఉచిత టీ-షర్ట్, బిబ్ పొందవచ్చన్నారు. పాల్గొనే వారందరూ శాఖ గుర్తింపు పత్రంతో హాజరవ్వాలన్నారు. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర, డీసీపీ(ట్రాఫిక్) షేక్ షిరీన్ బేగం అతిథులుగా హాజరై రన్, రైడ్‌ను జెండా ఊపి ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమంలో సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు, ఇతర సీనియర్ పదాధికారులు పాల్గొంటారని వెల్లడించారు. మరిన్ని వివరాలకు 92487 77749, 94266 12394, 99485 03231 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

దేశాన్ని ప్రేమిస్తే డ్రగ్స్ జోలికి వెళ్లరు: కలెక్టర్ లక్ష్మీశ


ప్రమాణం చేస్తున్న ఈగల్ ఐజీ రవికృష్ణ, సీపీ రాజశేఖరబాబు, కేబీఎన్ కళాశాల కార్యదర్శి శ్రీనివాస్, ఏవో నారాయణరావు, ప్రిన్సిపల్ కృష్ణవేణి


చిట్టినగర్, న్యూస్‌టుడే: దేశాన్ని ప్రేమించే వ్యక్తులు డ్రగ్స్ జోలికి వెళ్లరని కలెక్టర్ లక్ష్మీశ యువతను ఉద్దేశించి పిలుపునిచ్చారు. కేబీఎన్ కళాశాలలో కొత్తపేట పోలీస్‌స్టేషన్ సీవ చిన కొందలరావు ఆధ్వర్యంలో డ్రగ్స్‌పై చండ యాత్ర సైకిల్ ర్యాలీ, అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మత్తుకు అలవాటు పడితే జీవితం నాశనం అవుతుందని తెలిపారు. మన కుటుంబం, సమాజం బాగుండాలంటే డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లాను డ్రగ్స్ ఫ్రీగా నిలిపేందుకు కృషి చేయాలన్నారు. ఈగల్ ఐజీ రవికృష్ణ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన ఈగల్ వ్యవస్థ ద్వారా 'డ్రగ్స్ వద్దు బ్రో' ప్రచారం సుమారు 40 వేల ఈగల్ క్లబ్‌లలో చేస్తున్నామని అన్నారు. 70 లక్షల విద్యార్థులకు అందుబాటులోకి తీసుకు వెళ్లడం కోసం ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు. గంజాయి, డ్రగ్స్ నిర్మూలన గురించి తెలిసిన 1972కు సమాచారం అందించాలని సూచించారు. సీపీ ఎస్.వి.రాజశేఖరబాబు మాట్లాడుతూ.. డ్రగ్స్‌పై దండయాత్ర ఒక మహోత్తర కార్యక్రమం ప్రారంభించి 11 రోజుకు చేరుకున్నామన్నారు. సుమారు 115 కిలోమీటర్లు సైకిల్ యాత్ర నిర్వహిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకువస్తున్నట్లు తెలిపారు. ఆంధ్ర, ఒడిశా సరిహద్దుల్లో ఒకప్పుడు దాదాపు 9 వేల ఎకరాల్లో గంజాయి సాగు చేసేవారని.. కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే గంజాయి పంటను అన్ని రకాలుగా సాంకేతికతను వినియోగించి గంజాయి సాగు లేకుండా చేస్తున్నామన్నారు. డ్రగ్స్‌ను మందకొండి నిర్మూలించాలని పిలుపునిచ్చారు. అనంతరం సైకిల్ ర్యాలీ కేబీఎన్ కళాశాల వరకు సాగింది. బెలూన్లు ఎగురవేశారు. కార్యక్రమంలో ఏడీసీపీ రామకృష్ణ, ఏసీపీ దుర్గారావు, సీఐ చిన కొండలరావు, కేబీఎన్ కళాశాల కార్యదర్శి టి.శ్రీనివాస్, ఏవో వి.నారాయణరావు, ప్రిన్సిపల్ కృష్ణవేణి, కార్యక్రమ కో-ఆర్డినేటర్ పతాపుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

దుర్గగుడి నిత్యాన్నదాన పథకానికి భూరి విరాళం


దాత రమేశ్‌కు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ట్రస్టుబోర్డు సభ్యులు ధర్మారావు

ఇంద్రకీలాద్రి: శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్ జూబ్లీహిల్స్ ప్రాంతానికి చెందిన పెద్ది రమేశ్ రూ.6,66,666 విరాళాన్ని శుక్రవారం అందజేశారు. దాత కుటుంబ సభ్యులు దేవస్థానం సిబ్బంది ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. ఆశీర్వచన మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేశారు.

బారికేడును ఢీకొని యువకుడి మృతి


భార్గవ్

కొండపల్లి: ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా రహదారిపై ఏర్పాటు చేసిన బారికేడ్లను ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన కొండపల్లి డీపీ పొరకల వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. కొండపల్లి గ్రామకంఠానికి చెందిన భార్గవ్(22) ద్విచక్ర వాహనంతో జాతీయ రహదారి మీదుగా కొత్తగేటుకు వెళుతున్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల వద్ద విద్యార్థుల రాకపోకల కోసం రహదారిపై బారికేడ్లను పోలీసులు ఏర్పాటు చేశారు. ద్విచక్ర వాహనంపై వేగంగా వచ్చిన యువకుడు ముందు ఉన్న కారును దాటుకొని వెళ్లే క్రమంలో వాహనం అదుపు తప్పి బారికేడ్‌ను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్వర్ణాంధ్ర లక్ష్య సాధనలో ఉద్యోగుల భాగస్వామ్యం కీలకం


మాట్లాడుతున్న మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి, చిత్రంలో కాటమనేని భాస్కర్, శివప్రసాద్ తదితరులు

విజయవాడ(విద్యాధరపురం), న్యూస్‌టుడే: స్వర్ణాంధ్ర లక్ష్య సాధనలో ఉద్యోగుల భాగస్వామ్యం అత్యంత కీలకమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి పేర్కొన్నారు. విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో జిల్లా, అర్బన్‌లోని స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు అధికారులకు రెండు రోజుల పాటు నిర్వహించే అవగాహన కార్యక్రమాన్ని మంత్రి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్-2047 లక్ష్యంగా స్వర్ణాంధ్ర ప్రదేశ్ సాధించేందుకు కార్యాచరణ మొదలు పెట్టారని తెలిపారు. ప్రతి పౌరుడికి నాణ్యమైన ప్రభుత్వ సేవలు అందించేందుకు ఉద్యోగుల కృషి చేయాలని సూచించారు. గతంలో మున్సిపల్, పంచాయతీ రాజ్ శాఖల పర్యవేక్షణ వేర్వేరుగా ఉండేది.. ప్రస్తుతం వాటిని సమన్వయం చేస్తూ శాఖ ఏర్పడిందన్నారు. 20 వేల పోస్టులు భర్తీ చేస్తామని.. వారు కాకుండా 1,40,000 మంది గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు ఉన్నారన్నారు. జనాభా ప్రాతిపదికన ఎ, బి, సి కేటగిరీలుగా సిబ్బందిని విభజించి సేవలు ప్రమాదికరిస్తున్నట్లు తెలిపారు. విశాఖపట్నం వంటి మహానగరాల్లో 18 మందిని, పంచాయతీల్లో జనాభాను అనుసరించి 4 నుంచి 10 మందిని నియమిస్తామన్నారు. స్వర్ణ వార్డు-స్వర్ణ గ్రామ సచివాలయాల కార్యదర్శి కాటమనేని భాస్కర్ మాట్లాడుతూ.. జిల్లా, మండల, పట్టణ స్థాయిల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని ప్రజలకు మెరుగైన సేవలు అందించాల్సిన బాధ్యత ఉద్యోగులపై ఉందన్నారు. రోడ్లు, పాఠశాలలు, డ్రైనేజీ వంటి మౌలిక వసతుల కల్పించడం ద్వారా లక్ష్య సాధనకు చేరువ కావాలని చెప్పారు. డైరెక్టర్ శివప్రసాద్ మాట్లాడుతూ.. ప్రతి బూత్ ఉద్యోగిని ప్రజల దగ్గరకు చేరువయ్యేలా జనాభా ఆధారంగా కార్యాలయాలను మూడు కేటగిరీలుగా విభజించామన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ సెక్రటరీలు వస్తున్న ఉద్యోగాలను సందర్భానుసారంగా తొలగించేందుకు గ్రూప్ ఆఫ్ మినిస్టర్లతో కమిటీని ప్రభుత్వం నియమించిందన్నారు. ఈసందర్భంగా మంత్రిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

'పరామర్శ పేరుతో జగన్ అరాచకం'


మాట్లాడుతున్న బుద్దా వెంకన్న, పక్కన నాయకులు

పటమట, న్యూస్‌టుడే: పులివెందుల ఎమ్మెల్యే జగన్ పరామర్శల పేరుతో ఆరాచక రాజకీయాలకు తెరలేపారని.. వైకాపా అధికారంలో ఉన్నప్పుడు తెదేపా అధినేత చంద్రబాబు ఇంటిపై దాడి చేసినప్పుడే అదిర్రేటీ నుంచి జోగి రమేష్‌ను సస్పెండ్ చేసి ఉంటే ఇప్పుడు ఈ పరిస్థితి వచ్చేది కాదని మాజీ ఎమ్మెల్సీ, తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న పేర్కొన్నారు. శుక్రవారం గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఉద్రిక్త పూరిత వాతావరణంలో జగన్ యాత్ర సాగించారన్నారు. జనాలను డబ్బులు ఇచ్చి తరలించారని, గంజాయి బ్యాచ్‌ని కూడా దింపారని ఆరోపించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి, జగన్ బ్రాండ్ అంబాసిడర్ అంటూ విమర్శించారు. దాడులను ప్రోత్సహించే సంస్కృతి చంద్రబాబుకు లేదన్నారు. జోగి రమేష్ ఇంటిపై పెట్రోల్ బాంబులు విసిరింది వైకాపా వాళ్లేనని ఆరోపించారు. అక్కడ నిరసన తెలిపిన 41 మంది తెదేపా వారిపై కేసు నమోదు చేశారని, చంద్రబాబు పాలనకు ఇది నిదర్శనమన్నారు. తప్పు చేసే సొంత పార్టీ నేతల మీద కూడా చర్యలు తీసుకునేందుకు తమ పార్టీ అధినేత వెనుకాడరని తెలిపారు. రాష్ట్ర ప్రజలు మళ్లీ జగన్‌ను నమ్మే పరిస్థితి లేదన్నారు. సమావేశంలో తెదేపా నేతలు కాట్రు మల్లికార్జునరావ్, గురునాథం, కోగంటి రామారావు, వల్లభనేని నరసింహాచారి పాల్గొన్నారు.

సృజన వెలికితీస్తాం

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: ప్రత్యేక అవసరాల పిల్లల్లో దాగి ఉన్న సృజన, నైపుణ్యాలను వెలికితీసేందుకు పోటీలు నిర్వహిస్తున్నామని సమగ్ర శిక్షా జిల్లా అదనపు కోఆర్డినేటర్ ఎం.రజని కుమారి తెలిపారు. జిల్లాలోని భవిత కేంద్రాల్లో విద్యాబుద్ధులు నేర్చుకుంటున్న విద్యార్థులకు మేరీ స్టెల్లా కళాశాలలో శుక్రవారం చిత్రలేఖనం, క్రీడా పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రజనికుమారి హాజరై పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో సహిత విద్య సమన్వయకర్త నారాయణ, ఏఎంవో ఎస్.శేఖర్, ఏపీవో శేషకుమారి, జీసీడీవో విశ్వభారతి, ఏఎస్‌వో చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు. అనంతరం పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు.


విజేతలతో రజనికుమారి, నారాయణ తదితరులు

ఎంబీ వర్సిటీపై చర్యలు తీసుకోవాలి

విద్యార్థి, యువజన సంఘాల ఐక్యవేదిక డిమాండ్

మాచవరం, న్యూస్‌టుడే: తిరుపతిలోని మోహన్‌బాబు యూనివర్సిటీపై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థి, యువజన సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం చుట్టుగుంట బీసీఎస్‌బీ కూడలి నుంచి మాచవరంలోని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ కళాశాల వరకు ఏలూరు రోడ్డులో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్ మాట్లాడుతూ.. ఎంబీ వర్సిటీలో అక్రమాలు జరిగినట్లు, ఫీజుల దోపిడీ జరుగుతున్నట్లు గత కొంతకాలంగా విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళనలు చేస్తున్నారన్నారు. విద్యార్థుల నుంచి రూ.25కోట్లను వెనక్కి ఇవ్వాలని ఆదేశించినా.. ఏమాత్రం వెనక్కు తగ్గకుండా విద్యార్థులను వేధిస్తున్నారన్నారు. దీన్ని ప్రశ్నించిన ఎస్ఎఫ్ఐ తిరుపతి జిల్లా కార్యదర్శి ఇతర విద్యార్థి సంఘాల నాయకులపై తప్పుడు కేసులు బనాయించారన్నారు. దీనిపై మంత్రి నారా లోకేష్ చొరవ తీసుకోవాలన్నారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమన్వయకర్త శ్రీనివాస్, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కిరణ్ మాట్లాడుతూ.. ఆ కళాశాల పాల్పడుతున్న యూనివర్సిటీని బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని డిమాండ్ చేశారు. కేసులు ఎత్తివేయకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తామన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు కృష్ణ, ఉమామహేశ్వరరావు, వెంకటేశ్వరరావు, సాయికుమార్, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్

బ్రాయిలర్ ధరలు

విజయవాడ: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -133 లేయర్ ధర 100 డజన్ ఎగ్స్ స్కిన్‌లెస్ - 232 విత్ స్కిన్ - 264. ఉమ్మడి కృష్ణా జిల్లాలో ... ఫ్యాక్టరీ ధర - 150, 159, 170 డజన్ స్కిన్ లెస్ - 280 విత్ స్కిన్ - 300.

ప్రకటన

[illegible]

Ch.రవికుమార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్

ప్రకటన

[illegible]

K.VENKATARAMULU, S.VIJAYA LAKSHMI, Advocates, Door No.11-267/10, Beesuvala Street, Polakampadu Village, Tadepalli Mandal, Guntur District - 522 501. Cell No.: 6302504564.

విజయవాడ తేది: 06-02-2026

వారధిపై ఢీకొన్న కార్లు.. నిలిచిన ట్రాఫిక్

కృష్ణలంక, న్యూస్‌టుడే: కనకదుర్గమ్మ వారధిపై మూడు కార్లు ఢీకొనడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం ఉదయం వారధిపై గుంటూరు వైపునుంచి వస్తున్న ముందు వెళుతున్న కారును వెనుక ఉన్న కారు ఢీకొట్టగా.. దానిని మరోకారు ఢీకొంది. దీంతో మూడు కార్లు వారధిపై నిలిచిపోవడంతో ట్రాఫిక్ స్తంభించింది. ఘటనా స్థలానికి చేరుకున్న ట్రాఫిక్ పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. క్రేన్ సాయంతో రెండు కార్లను మధ్యలో ఉన్న కారు ధ్వంసమై అక్కడే నిలిచిపోయింది. అనంతరం పోలీసులు కారును వారధి నుంచి తరలించారు. ఈ క్రమంలో గుంటూరు, విజయవాడ వైపు వెళ్లే మార్గంలో సుమారు 45 నిమిషాల ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు సమన్వయంతో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.


వారధి మధ్యలో నిలిచిన కారును తరలిస్తూ..

సమ్మె జయప్రదం కోరుతూ ప్రచారజాత

పాయకాపురం, న్యూస్‌టుడే: ఈ నెల 12న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, నగర ప్రధాన కార్యదర్శి కె.దుర్గారావులు కోరారు. శుక్రవారం పాయకాపురం కండ్రిక ప్రాంతం నుంచి మోటారు వాహనాలతో ప్రచార జాత నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. ఆ రోజు నగరంలో భారీ ప్రదర్శన ఉంటుందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక లేబర్ కోడ్‌లను అమలులోకి తీసుకొచ్చిందని విమర్శించారు. కేరళ రాష్ట్రం ఒకటే లేబర్ కోడ్‌లను అమలు చేయడం లేదని, కేంద్రం విజ్ఞప్తిని తిరస్కరించిందని తెలిపారు. మిగిలిన రాష్ట్ర ప్రభుత్వాలు లేబర్ కోడ్‌లను అమలులోకి తీసుకొస్తున్నాయన్నారు. సీఐటీయూ నాయకులు మునిశంకర్, కిషోర్, బాషా, మరియ ప్రసాద్, కమల, ప్రవీణ్, సుబ్బారావు, సోమేశ్వరరావు పాల్గొన్నారు.


బైక్ ర్యాలీలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

91.9 FM Vijayawada ఈటీవీఎం కార్యక్రమాలు శనివారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉపోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వు నేను	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
కలర్ స్టైల్	సా. 5 - రా. 9
ఈఎఫ్ఎం సరాగాలు	రా. 9 - రా. 11
బ్లాక్ బస్టర్ సాంగ్స్	రా. 11 - ఉ. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 8008003297

తిరువూరు

• తిరువూరు • మైలవరం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

? స్థానిక సొసైటీ బ్యాంకు సమీపంలోని నాగేంద్రస్వామి పుట్ట బజార్‌లో కాలువల్లో మురుగు పారక దోమలతో అవస్థలు పడుతున్నాం. **-రవి, గ్రామస్థుడు**

✔ సమస్య మా దృష్టికి వచ్చింది. తక్షణమే పారిశుద్ధ్య సిబ్బందితో పూడిక తీయించి దోమల నివారణకు చర్యలు చేపడతాం. **- బసవలింగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి – న్యూస్‌టుడే, జి.కొండూరు**

స్పందనకు వందనం: ✤ పట్టణ 8వ వార్డులోని కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయి ఇబ్బందిగా ఉందని స్థానికుల సమస్యను మున్సిపల్ అధికారులు పరిష్కరించారు. ✤ పట్టణంలోని 5వ వార్డులోని కాలువల్లో పిచ్చిమొక్కలు పెరిగి దోమలతో ఇబ్బందులు పడుతున్నామన్న స్థానికుల సమస్యపై మున్సిపల్ శానిటరీ అధికారి సంతోష్ స్పందించారు. సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు.



స్పందనకు వందనం: మూలపాడు గ్రామంలో మురుగు కాలువల నుంచి తీసి రోడ్డుపై వదిలేసిన పూడిక కుప్పల వల్ల దుర్వాసన వస్తోందని స్థానికులు మేమున్నాం మీకు తోడుగా ద్వారా తెలిపిన సమస్యపై గ్రామ కార్యదర్శి అనిల్ కుమార్ స్పందించి పారిశుద్ధ్య కార్మికులతో శుభ్రం చేయించారు. – తిరువూరు ఇబ్రహీంపట్నం గ్రామీణం

అల్లుకున్నాయ్.. అల్లాడిస్తున్నాయ్ శీర్షికతో గురువారం ఈనాడులో ప్రచురితమైన సమస్య వార్తకు సంబంధిత విద్యుత్తు శాఖాధికారులు, సిబ్బంది స్పందించారు. ఏఈ విజయ్ భాస్కర్ సిబ్బందిని పంపి స్తంభాలకు అల్లుకుపోయిన పిచ్చి మొక్కల తీగలను తొలగింపజేశారు. ప్రజలు హర్షించారు.– న్యూస్‌టుడే, విస్సన్నపేట

పంటల మార్పిడి మేలు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: పంటల మార్పిడి విధానం ద్వారా తెగుళ్లు, పురుగులను అదుపు చేయవచ్చని రెడ్డిగూడెం మండల వ్యవసాయ అధికారి డి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం కూనపరాజుపర్వ గ్రామంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించి రైతులకు పలు సూచనలు చేశారు. ఉద్యాన అధికారి నరేంద్రకుమార్, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

భూముల వివరాలు పరిశీలించుకోండి

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: భూమి రీసర్వే నిర్వహించిన రుద్రవరం, కుదప, పాతనాగులూరు గ్రామాల్లో రెవెన్యూ సిబ్బంది భూమి రికార్డుల ఆధారంగా నూతన పాస్‌పుస్తకాలు మంజూరుకు చేస్తున్న కార్యక్రమాలను శుక్రవారం తహసీల్దార్ జె.సుశీలాదేవి తనిఖీ చేశారు. భూమి వివరాలు సక్రమంగా ఉన్న రైతులు ఆధార్ కార్డులతో ఈ కేవైసీ చేయించుకోవాలన్నారు. ఆర్ఐ జి.పుల్లయ్య, వీఆర్వోలు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అభినందన

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: ఇటీవల విడుదలైన గ్రూప్స్ ఫలితాల్లో డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికైన బి.నిఖిలశ్రీని ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ శుక్రవారం అభినందించారు. ఇబ్రహీంపట్నంలోని ఆమె ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. శ్రమించి విజయాన్ని సొంతం చేసుకుని యువతకు ఆదర్శంగా నిలిచారని తెలిపారు.

వైభవంగా శత దీపాలంకరణ



నెమలి(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని నెమలి వేణుగోపాల స్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి అర్చకులు గోపాలాచార్యులు ఆధ్వర్యంలో అష్టోత్తర శత దీపాలంకరణ సేవ ఘనంగా నిర్వహించారు. భక్తులు పాల్గొని రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామిని దర్శించుకున్నారు.

ప్రభుత్వ సాయం.. లేదిక భయం

పూల తోటల సాగుతో లాభాల బాట

గంపలగూడెం, న్యూస్‌టుడే: జిల్లాలో పూల తోటల సాగు విస్తీర్ణం ఏటేటా పెరుగుతోంది. ఆహార, వాణిజ్య పంటలతో పాటు ఉద్యాన పంటలు కూడా లాభసాటిగానే ఉంటున్నాయి. దీంతో పూల తోటల పెంపకంపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు వస్తుండడంతో సాగు చేస్తున్నారు. పూల తోటల సాగుదారులకు ప్రభుత్వం ప్రోత్సాహక ఆర్థిక చేయూతనందిస్తోంది. జిల్లాలో మల్లె సాగు అగ్రస్థానంలో ఉండగా బంతి సాగు ద్వితీయ స్థానంలో ఉంది. ఇక గులాబీ, కనకాంబరం, లిల్లీ తదితర రకాల పూల తోటలు సాగవుతున్నాయి. జిల్లాలో మెట్ట ప్రాంతమైన తిరువూరు, మైలవరం నియోజకవర్గాల్లో పూల తోటల సాగు విస్తరిస్తోంది. మైలవరం నియోజకవర్గంలో మల్లె సాగు, తిరువూరు నియోజకవర్గంలో పసుపు, నారింజ రంగు ముద్ద బంతి సాగుపై ఆసక్తి చూపిస్తున్నారు.

900 ఎకరాల్లో..: జిల్లాలో 900 ఎకరాల్లో పూల తోటలు సాగు చేస్తున్నారు. ఈ ఏడాది నుంచి పలువురు రైతులు గులాబీ సాగును ఆరంభించి ఇప్పుడిప్పుడే విపణిలో విక్రయాలు ఆరంభించారు. గంపలగూడెం మండలం సొబ్బాల గ్రామానికి చెందిన చింతల రమేష్ ఏటా బంతి పూల సాగు చేస్తున్నారు. ఏడాది కిందట బెంగళూరు నుంచి గులాబీ మొక్క ఒక్కోటి రూ.70 చొప్పున కొనుగోలు చేసి 80 సెంట్లలో సాగు చేశారు. ప్రస్తుతం గులాబీ పూలు దిగుబడి సిద్ధంగా ఉన్నాయి. ఎకరా లోపు విస్తీర్ణంలో గులాబీ సాగుకు రూ.2.50 లక్షల వరకు పెట్టుబడి అవగా..పూల దిగుబడి ప్రారంభమైతే ఐదేళ్ల వరకు ఉత్పత్తి లభిస్తుందని తెలిపారు. ప్రస్తుతం ప్రధాన విపణిలో కిలో గులాబీలు రూ.125, ప్రయివేటుగా రూ.200 వరకు ధర ఉంటున్నాయి.



మెండుగా పసుపు రంగు ముద్దబంతి

హెక్టారుకు రూ. 20వేలు : సోహైల్ అహ్మద్, గంపలగూడెం మండల ఉద్యానాధికారి

ప్రభుత్వం పూల తోటల సాగు చేసే రైతులకు హెక్టారుకు రూ.20వేలు వరకు రాయితీ అందిస్తోంది. గంపలగూడెం మండలంలోని పలు గ్రామాల రైతులకు ఈ ఏడాది కూడా ప్రభుత్వ సాయం లభించింది. పూల తోటలు సాగు చేసిన రైతులు వివరాలను రైతు సేవా కేంద్రంలో అందజేయాలి. దరఖాస్తు అందగానే ఉద్యానాధికారులు క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి చేసి సాగుదారుల బ్యాంక్ ఖాతాలకు ప్రభుత్వ ప్రోత్సాహక సొమ్ము జమ చేస్తుంది.

ఉచిత వైద్యశిబిరం రేపు

మైలవరం, న్యూస్‌టుడే: వెరికోస్ వీన్స్‌పై ద్వారకా తిరుమల దేవస్థాన ఛైర్మన్ ఎస్వీ సుధాకరరావు, లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం ఆధ్వర్యంలో శుశ్రుత ఫౌండేషన్ సహకారంతో స్థానిక ఎస్వీఎస్ కల్యాణ మండపంలో ఈ నెల 8న ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'అసత్యాలు చెప్పడంలో జగన్ దిట్ట'



సుబ్బారావు

గొల్లపూడి, న్యూస్‌టుడే: అసత్యాలు చెప్పడంలో జగన్ దిట్ట అని తెదేపా రాష్ట్ర ప్రచార కార్యదర్శి బొమ్మసాని సుబ్బారావు పేర్కొన్నారు. శుక్రవారం గొల్లపూడిలోని ఇంటిపై దాడికి తాను కుట్ర పన్నినట్లుగా మీడియా సమావేశంలో జగన్ చెప్పడం, తన చిత్రాన్ని చూపించడం తగదన్నారు. కుట్రలు పన్నే అలవాటు తనకు లేదని, అది జగన్ సొంతమని అన్నారు. ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్ వద్ద వ్యక్తిగత పనుల నిమిత్తం పోలీసులతో మాట్లాడుతుంటే వైకాపా నాయకులు వీడియోలు తీసి అసత్య ప్రచారానికి దిగారని వెల్లడించారు. తెదేపా నాయకులపై బురద చల్లడం జగన్, వైకాపా నాయకులకు అలవాటని తెలిపారు. వైకాపా నాయకులు ఇచ్చిన స్క్రిప్టును జగన్ చదివారని చెప్పారు.

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

జి.కొండూరు, న్యూస్‌టుడే: కుంటముక్కల డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల అభివృద్ధికి తొలి అడుగు పడిందని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. ఇటీవల గురుకులం సందర్శించి విద్యార్థినులతో మాట్లాడినప్పుడు పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీంతో వాటిని దశల వారీగా తీసుకుని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ క్రమంలో గతేడాది వరదల కారణంగా గురుకులం వద్ద కోతకు గురైన రోడ్డును అభివృద్ధి చేసేందుకు శుక్రవారం శ్రీకారం చుట్టారు. ఉపాధి హామీ నిధుల కింద రూ.40 లక్షలతో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. అధికారులు రామ్మోహన్‌రావు, మండల అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వరావు, నాగేశ్వరావు, గురుకులం ప్రిన్సిపల్ బ్యూలా, సిబ్బంది పాల్గొన్నారు. ✤ అనంతరం గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపన ప్రారంభోత్సవాల్లో పాల్గొన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో రూ.36 లక్షలు చొప్పున చెవుటూరు, వెంకటాపురం, కోడూరు గ్రామాల్లో ఆరోగ్య కేంద్రాలను రూ.1.08 కోట్లతో నిర్మించేందుకు శంకుస్థాపన, భూమిపూజ చేశారు. ✤ ఇండియా లిటరసీ ప్రాజెక్టు ఆధ్వర్యంలో నడిచే ప్రజా ప్రగతి ట్రస్ట్(విజయవాడ) మండలంలోని పలు పాఠశాలలకు విద్యా సామగ్రిని శుక్రవారం వితరణగా అందించారు. వీటిని ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆయా పాఠశాలలకు ప్రాజెక్టు డైరెక్టర్ సుస్మిత అందజేశారు. ఎంపీడీవో టీవీ.రామకృష్ణ నాయక్, సీడీపీవో పుష్పలత, ప్రధానోపాధ్యాయులు షేక్.షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్, నాయకులు

పోటీల్లో విద్యార్థులకు పతకాలు



ధ్రువపత్రాలు అందజేస్తున్న ప్రిన్సిపల్ అప్పారావు

మైలవరం, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూకే సెంట్రల్ జోన్ అంతర కళాశాలల పవర్ లిఫ్టింగ్, బెస్ట్ ఫిజిక్ పోటీల్లో స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు సత్తా చాటి పతకాలు సాధించారని ప్రిన్సిపల్ కె.అప్పారావు తెలిపారు. భీమవరంలోని సెయింట్ ఆన్స్ కళాశాలలో నిర్వహించిన బెస్ట్ ఫిజిక్ విభాగంలో ఈఈఈ విద్యార్థి ఎం.సాగర్‌కు బంగారు పతకం, డి.రామ్‌కుమార్ కాంస్య పతకం సాధించినట్లు పేర్కొన్నారు. పవర్ లిఫ్టింగ్ పోటీల్లో వివిధ విభాగాల్లో కేకే సిద్ధార్థ, టి.గోపిచంద్, రేవంత్‌కుమార్, డి.రామ్‌కుమార్ రజత పతకాలు సాధించారని వివరించారు. విజేతలను, శిక్షకుడు బి.నటరాజ్, వ్యాయామ విద్య విభాగాధిపతి రాజ్‌కుమార్‌లను కళాశాల అధ్యక్షుడు జి.శ్రీనివాస రెడ్డి, ప్రిన్సిపల్, ఉప ప్రిన్సిపల్ తదితరులు అభినందించారు.

పేదలకు అండగా సీఎం సహాయనిధి

ఎ.కొండూరు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు అండ అని శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కొత్త రేవూరు, మాధవరం, రామచంద్రాపురం, అల్లపురం గ్రామాల్లో పలువురు అనారోగ్యానికి గురవగా వారికి వైద్య సహాయం కోసం మంజూరైన రూ.2.02 లక్షల సీఎం రిలీఫ్ చెక్కులను శుక్రవారం ఆయన అందజేశారు. నాయకులు జి.కృష్ణారెడ్డి, వి.దేవేందర్, గోపాలు తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారుడికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

ఆరోగ్య సంరక్షణ సేవలు అందించాలి

విస్సన్నపేట, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రజలకు అవసరమైన ఆరోగ్య సంరక్షణ సేవలను సీహెచ్‌సీల ద్వారా అందించాలని తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం విస్సన్నపేట సామాజిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. సీహెచ్‌సీ మెడికల్ సూపరింటెండెంట్ పావనితో కలిసి ఆసుపత్రి వార్డులు సందర్శించి చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించారు. స్థానిక బీజేఆర్ నగర్, కమ్ముటూరు బాధితుల ఇళ్లకు వెళ్లి సీఎం సహాయ నిధి చెక్కులు అందజేశారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ మురుగుల ప్రసాద్, కూటమి నాయకులు యాసిన్, సాంబారు నాగలక్ష్మి, సీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

పత్ర సమర్పణకు సత్కారం

మైలవరం, న్యూస్‌టుడే: విజయవాడలోని మేరీస్ స్టెల్లా కళాశాలలో శుక్రవారం నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో పత్ర సమర్పణ గాను గౌతమ్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు విభాగాధిపతి మొండా దేవానందకుమార్‌ను సత్కరించారు. తెలుగుశాఖ ఆధ్వర్యంలో జ్ఞాన పరంపర తెలుగు సాహిత్యం అంశంపై నిర్వహించిన అంతర్జాతీయ సదస్సుకు అధ్యక్షత వహించిన ఆయన సదస్సులో ప్రాచీనాంధ్ర లేఖనాల్లో సంప్రదాయాలు, పరిశీలన అంశంపై పత్ర సమర్పణ చేశారు. నాగరికత, తాళపత్ర గ్రంథాలకు సంబంధించి చేసిన సమర్పణపై సత్కారం అందుకున్న ఆయనను ప్రిన్సిపల్ పి.రంగారావు అభినందించారు.

గురుకులంలో చేరదాం.. చదువులో రాణిద్దాం

గంపలగూడెం, ఎ.కొండూరు, న్యూస్‌టుడే: గురుకులాల్లో విద్యాభ్యాసనకు ప్రభుత్వం ఆహ్వానిస్తోంది. 5వ తరగతి, ప్రథమ ఇంటర్‌లో చేరేందుకు దరఖాస్తు చేసేందుకు పిలుపునిచ్చింది. కార్పొరేట్ విద్యా సంస్థలను తలదన్నేలా సకల సౌకర్యాలు, సాంకేతిక వనరులతో విద్యాబోధన చేసేందుకు గురుకులాలు సిద్ధంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో 2026-27 విద్యా ఏడాదిలో నియోజకవర్గంలోని ఎ.కొండూరు మండలం కృష్ణారావుపాలెం (బాలురు), తిరువూరు (బాలురు), విస్సన్నపేట మండలం నరసాపురం(బాలికలు)లో డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ గురుకులాల్లో విద్యార్థులను చేర్చుకునేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానించారు. ఏపీ సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే విద్యాలయాల్లో అర్హులైన విద్యార్థుల ప్రవేశాలకు ఈ నెల 19వ తేదీలోపు తమ ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తులు ఆన్‌లైన్‌లో పంపించవచ్చని అధికారులు తెలిపారు.



ఎ.కొండూరు మండలం కృష్ణారావుపాలెం డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ గురుకులం

ఉచిత సౌకర్యాలతో: గురుకులం గ్రామీణ పేద విద్యార్థులకు ఆశాకిరణంగా ఉంది. ఉచిత విద్య, వసతి, భోజనం, దుస్తులు, పుస్తకాలు, కాస్మొటిక్స్ ఛార్జీలు అందిస్తారు. సబ్జెక్టు నిపుణులతో నాణ్యమైన విద్యాబోధన గురుకులాల్లోనే సాధ్యం. శారీరక దారుఢ్యం, ప్రతిభను చాటేందుకు క్రీడల్లో శిక్షణిస్తారు. 5వ తరగతిలో 80 మంది, ప్రథమ ఇంటర్‌లో ఎంపీసీ 40, బైపీసీ 40 మంది విద్యార్థుల ప్రవేశాలకు అవకాశం ఉంది. అదేవిధంగా 6, 7, 8, 9 తరగతుల్లో ఖాళీలు ఉన్నా ప్రవేశ పరీక్ష ద్వారా భర్తీ చేస్తారు. ప్రతి తరగతిలో రిజర్వేషన్ ప్రాతిపదికన సీట్లు భర్తీ చేస్తారు. గురుకులాల్లో ఎస్సీ 60, బీసీ 4, బీసీ-సీ 10, ఎస్టీ 5, ఇతరులు 1 చొప్పున సీట్లు కేటాయించారు. ఈ ఏడాది మార్చి 1న ప్రవేశాలకు అర్హత పరీక్ష ఆయా గురుకులాల్లో నిర్వహిస్తారు. విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించినట్లు కృష్ణారావుపాలెం గురుకుల విద్యాలయం ప్రిన్సిపల్ కె.సిద్దయ్య తెలిపారు.

నిందితులను అరెస్టు చేయాలి

తిరువూరు, న్యూస్‌టుడే: స్థానిక బోసుబొమ్మ కూడలిలో ఎస్ఎఫ్ఐ నాయకుల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం శుక్రవారం చేపట్టారు. తిరుపతి ఎంబీ యూనివర్సిటీలో విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడానికి వెళుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులను అపహరించారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు ఇప్పటి వరకు వారిని అరెస్టు చేయకపోవడాన్ని నిరసించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ బాధ్యులైన వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థుల నినాదాలు



ప్రాథమిక పాఠశాలలో క్రీడాపరికరాలను హెచ్‌ఎంకు అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

పాఠశాలలకు ఆట వస్తువుల పంపిణీ

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రజా ప్రగతి ట్రస్టు ఇండియా లిటరసీ ప్రాజెక్టు (ఐఎల్‌పి) ఆధ్వర్యంలో శుక్రవారం జూపూడి ప్రాథమిక పాఠశాలకు క్రీడా పరికరాలు, కేతనకొండ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రానికి బోధన కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు కో ఆర్డినేటరు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం మండల పరిధిలో పది పాఠశాలలకు రూ.3 వేల చొప్పున క్రీడా పరికరాలను, మూడు అంగన్‌వాడీ కేంద్రాలకు ఒక్కొక్క కేంద్రానికి రూ.1,500 విలువైన బోధన పరికారాలు, బొమ్మల చార్టులు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రెడ్‌స్టార్, విద్యాకమిటీ సభ్యులు, అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు భవాని, కార్యకర్తలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇష్టంలేని పెళ్లి చేస్తున్నారని యువతి పరారీ

తిరువూరు, న్యూస్‌టుడే: ఇష్టం లేని పెళ్లి కుదర్చడంతో మండలానికి చెందిన ఓ యువతి ఇంట్లో నుంచి పారిపోయిన ఘటన గురువారం చోటుచేసుకుంది. దీనిపై తల్లిదండ్రులు తమ కుమార్తె కనిపించడంలేదని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా. సెక్టార్-1 ఎస్సై శాతకర్ణి ఆధ్వర్యంలో పోలీసులు రెండు బృందాలుగా గాలించి..సాంకేతిక పరిజ్ఞానంతో హైదరాబాద్‌లో ఉన్నట్లు గుర్తించి శుక్రవారం తిరువూరు పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. యువతి కుటుంబ సభ్యులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

కొనసాగుతున్న సాగర్ జలాల సరఫరా

గంపలగూడెం, న్యూస్‌టుడే: ఎన్నెస్పీ రెండో జోన్ పరిధిలోని మధిర బ్రాంచి కెనాల్‌కు ఖమ్మం జిల్లా కల్లూరు మండలం కప్పలబందం నియంత్రిక నుంచి 1150 క్యూసెక్కుల సాగర్‌జలాలు శుక్రవారం విడుదలైనట్లు ఏఈ మహేష్‌బాబు తెలిపారు. మండల సరిహద్దులోని 23వ కి.మీ వద్దకు 587 క్యూసెక్కులు చేరగా, దిగువున మేజర్ల వారీగా గంపలగూడెం 30, ఊటుకూరు- 1కి 80, పెదకొమిర 30, మధిర 60, నిదానపురం 70 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నట్లు వివరించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

మైలవరం, న్యూస్‌టుడే: మండలంలోని గణపవరానికి చెందిన తెదేపా కార్యకర్త ఓర్సు దుర్గారావు అనారోగ్యంతో మరణించగా, గ్రామ తెదేపా నాయకులు శుక్రవారం రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. నాయకులు బుజ్జిరెడ్డి, శ్యాంప్రసాద్, అంబేడ్కర్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ పర్యటనలో దొంగ చేతివాటం

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జోగి రమేష్‌ను పరామర్శించడం కోసం వచ్చినప్పుడు ఓ జేబు దొంగ హడావుడి చేశాడు. వైకాపా కార్యకర్తలు, అభిమానులు శుక్రవారం సాయంత్రం ఐదు గంటలకు జోగి ఇంటి ముందు జగన్ కోసం గుంపులుగా ఏర్పడ్డారు. ఆ సమయంలో యువకుడు కొందరి జేబుల్లో చేతులు పెట్టి దోచేశాడు. దీనిని గమనించిన మరో యువకుడు అతడిని పట్టుకున్నాడు. పోలీసులు అప్రమత్తమై స్థానిక స్టేషన్‌కు తరలించారు.



దొంగను తీసుకెళుతున్న సిబ్బంది



శిక్షణ పొందుతున్న మహిళలతో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

వ్యాపార అవకాశాలు పెంపొందించుకోండి

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం గ్రామీణం), న్యూస్‌టుడే: గుంటుపల్లి రైజ్ కేంద్రంలోని సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని కలెక్టర్ జి.లక్ష్మీశ సూచించారు. ఆయన శుక్రవారం కేంద్రాన్ని పరిశీలించి శిక్షణ పొందుతున్న మహిళలతో మాట్లాడారు. కేంద్రంలో అందిస్తున్న నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, బోధన విధానాలను అడిగి తెలుసుకున్నారు. మహిళలు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని వ్యాపార అవకాశాలను విస్తృతం చేసుకోవాలని చెప్పారు. స్వయం ఉపాధి ద్వారా ఆర్థిక స్వావలంబన సాధ్యమవుతుందని తెలిపారు. డీఆర్‌డీఏ పీడీ నాంచారరావు, అధికారులు పాల్గొన్నారు.

సమ్మె జయప్రదానికి పిలుపు

ఎ.కొండూరు, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్స్ రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 12న నిర్వహించనున్న దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు కోరారు. మండలంలోని కంభంపాడులో శుక్రవారం కార్మిక సంఘాల నాయకులు సమ్మె గోడపత్రికలు ఆవిష్కరించారు. స్కీం వర్కర్లకు నెలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పని చేయాలని నినాదాలు చేశారు.

సమ్మె గోడపత్రికలు ఆవిష్కరించిన కార్మిక సంఘాల నాయకులు



'పరామర్శల పేరుతో దండయాత్ర'

గొల్లపూడి, న్యూస్‌టుడే: పోలీసుల ఆంక్షలు, నిబంధనలను తుంగలో తొక్కుతూ పరామర్శల పేరుతో జగన్ దండయాత్ర చేస్తున్నారని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. గొల్లపూడిలోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ..జగన్ పరామర్శ కారణంగా విజయవాడ- హైదరాబాద్ జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభించిందని, సామాన్య ప్రజలు ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు. వైకాపా కార్యకర్త రాంబాబు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ప్రజల ప్రాణాలు బలిగొనేందుకు వస్తున్నారని మండిపడ్డారు. పరామర్శల పేరుతో జరుగుతున్న ప్రాణనష్టంపై సుమోటోగా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న దేవినేని ఉమా




ముత్యాలమ్మ తల్లికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

సామూహిక శుభదుర్గా వ్రతం

గంపలగూడెం, న్యూస్‌టుడే: మండలంలోని గ్రామదేవత ముత్యాలమ్మ తల్లి గుడిలో భక్తులు సామూహిక శుభదుర్గా, కామాక్షి వ్రతాలు నిర్వహించారు. అమ్మవారి మూల విరాట్‌కు పంచామృతాభిషేకాలు, ఆభరణాలు, పుష్పాలతో అలంకరణ చేశారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు.

అంకమ్మతల్లి.. దీవించమ్మా

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: మండలంలోని రెడ్డిగూడెంలో అంకమ్మతల్లి దేవాలయం వార్షికోత్సవం పురస్కరించుకుని శుక్రవారం హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు సిహెచ్.పవన్‌కుమార్ ఆధ్వర్యంలో వేద పండితులు మేధా దక్షిణామూర్తి, వాగ్దేవి హోమాలు, అమ్మవారికి అభిషేకాలు జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు.



అలంకరణలో అమ్మవారు

ఘనంగా ముగిసిన బ్రహ్మోత్సవాలు

విస్సన్నపేట, న్యూస్‌టుడే: విస్సన్నపేట మండలం నరసాపురం గ్రామంలోని శ్రీ సూర్య లక్ష్మీ నారాయణ దేవాలయ ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలు మూడో రోజు శుక్రవారం ఘనంగా ముగిశాయి. స్వామి వారి శాంతి కల్యాణం కనులపండువగా జరిగింది. ఈ కల్యాణంలో దాత గొట్టేటి సుబ్రహ్మణ్యేశ్వరరావు దంపతులు, గ్రామ ప్రముఖులు పీటల మీద కూర్చొని వైభవంగా నిర్వహించారు. అనంతరం జరిగిన అన్నసంతర్పణలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



స్వామివార్ల శాంతి కల్యాణంలో భక్తులు

దరఖాస్తు చేశారా?

☛ సౌత్ ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్స్‌లో 66 సెక్యూరిటీ గార్డ్ ఉద్యోగాలు
చివరి తేదీ: 11-02-2026

☛ స్పేస్ అప్లికేషన్ సెంటర్ అహ్మదాబాద్‌లో 49 సైంటిస్ట్/ఇంజినీర్ ఖాళీలు
చివరి తేదీ: 2026 ఫిబ్రవరి 12

కరెంట్ అఫైర్స్ — మాదిరి ప్రశ్నలు



★ యునిసెఫ్ ఇండియా సెలబ్రిటీ అడ్వకేట్‌గా ఇటీవల ఏ ప్రముఖ నటి నియమితులయ్యారు? (పిల్లల మానసిక ఆరోగ్యం, భావోద్వేగ శ్రేయస్సు, వారి హక్కుల అవగాహన లాంటి అంశాలపై ఈమె కృషి చేస్తారు.)
జ: కీర్తి సురేష్

★ భారత ప్రభుత్వం ఎస్‌బీఐ మేనేజింగ్ డైరెక్టర్ అశ్విని కుమార్ తివారీ పదవీ కాలాన్ని ఎప్పటి వరకు పొడిగించింది? (2021, జనవరిలో మూడేళ్ల కాలానికి నియమితులైన ఈయనకు ఇది రెండో పదవీ కాలం పొడిగింపు.) జ: 2027, డిసెంబరు 31

★ ఆఫ్రికాలో తన మొదటి నావికా స్థావరాన్ని ఏర్పాటు చేసుకోవడానికి రష్యాకు ఇటీవల ఏ ఆఫ్రికా దేశం అనుమతించింది? (ఈ కొత్త రష్యన్ స్థావరం పోర్ట్ సూడాన్ సమీపంలో ఎర్రసముద్రం నుంచి సూయజ్ కాలువకు అనుసంధానించే కీలక మార్గంలో ఉంటుంది.) ఈ జల మార్గం ప్రపంచవాణిజ్యంలో దాదాపు 12 శాతం వాటాను నిర్వహిస్తుంది. 25 ఏళ్ల పాటు ఈ ఒప్పందం కొనసాగుతుంది.)
జ: సూడాన్

★ ప్రఖ్యాత కేంబ్రిడ్జ్ డిక్షనరీ 2025 సంవత్సరానికి 'వర్డ్ ఆఫ్ ది ఇయర్' గా ఏ పదాన్ని ప్రకటించింది?
జ: పారా సోషల్ ('పారాసోషల్' అనేది ఎవరైనా తమ ఉనికిని గురించి తెలియని వ్యక్తితో ఏర్పరుచుకునే ఏక-మార్గ భావోద్వేగ సంబంధాన్ని సూచిస్తుంది. ఈ పదాన్ని మొదటిసారిగా 1956లో అమెరికన్ సామాజిక శాస్త్రవేత్తలు డొనాల్డ్ హోర్టన్, రిచర్డ్ వోల్ ప్రవేశపెట్టారు.)

మరింత సమాచారం

ఈనాడు ప్రతిభ

◆ https://pratibha.eenadu.net ◆ https://eenadupratibha.net

విద్య, ఉద్యోగ పరీక్షల ప్రత్యేకం!

గడియారాలు

జనరల్ స్టడీస్ — రీజనింగ్

3 ముళ్లు.. 12 గంటలు
నిరంతర ప్రయాణం!



కాలం ఎవరి కోసం ఆగదు. కానీ ఆ కాలాన్ని కొలిచే గడియారాలు మాత్రం తార్కిక ఆలోచనలకు వేదికలుగా నిలుస్తాయి. గడియారం అంటే కేవలం సెకన్లు, నిమిషాలు, గంటల కలయిక మాత్రమే కాదు. అది వృత్తాకార బాటలో మూడు ముళ్ల మధ్య సాగే నిరంతర గణిత ప్రయాణం. అందులో కోణాలు, వేగం, దిశల విశ్లేషణ ఉంటుంది. రీజనింగ్‌లో భాగంగా పలు రకాల పోటీ పరీక్షల్లో వీటిపై ప్రశ్నలు అడుగుతున్నారు. ముళ్ల కదలికల వెనుక ఉన్న లాజిక్‌ను అర్థం చేసుకుంటే వాటికి సమాధానాలను తేలికగా గుర్తించవచ్చు. ముళ్లు ఏకీభవించడం, వ్యతిరేక దిశలో, లంబంగా ఉండటం మొదలైన అంశాలపై అభ్యర్థులు అవగాహన పెంచుకోవాలి. ముళ్ల మధ్య కోణాన్ని, ఇచ్చిన కోణంలో ఏర్పడే సమయాన్ని కనుక్కునే ప్రశ్నలను ఎక్కువగా ప్రాక్టీస్ చేయాలి.

గడియారంలోని ముళ్లు వృత్తాకారంలో తిరుగుతూ ఉంటాయి. దీన్ని 12 పెద్ద సమాన భాగాలుగా విభజిస్తారు. ప్రతి భాగాన్ని 'ఒక గంట అవధి' అంటారు. ప్రతి గంట అవధి తిరిగి ఐదు చిన్న సమాన భాగాలుగా విభజితమై ఉంటుంది. అలా గడియారంలో 60 చిన్న సమాన భాగాలు ఉంటాయి. ప్రతి భాగాన్ని 'నిమిష అవధి' అంటారు. గడియారంలో గంటల ముల్లు నిమిషాల ముల్లు ఈ భాగాలపై తిరుగుతూ ఉన్నప్పుడు కింది సందర్భాలు ఏర్పడుతుంటాయి.

ముళ్లు ఏకీభవించడం (0°): ప్రతి ఒక గంట సమయంలో రెండు ముళ్లు ఒకసారి ఏకీభవిస్తాయి. కానీ 12 గంటల సమయంలో 11 సార్లు, 24 గంటల సమయంలో కేవలం 22 సార్లు మాత్రమే ఏకీభవిస్తాయి. (11-12, 12-1 గంటల మధ్య కేవలం ఒకసారి మాత్రమే 12 వద్ద ఏకీభవిస్తాయి.)

ముళ్లు వ్యతిరేక దిశలో ఉండటం (180°): ప్రతి ఒక గంట సమయంలో రెండు ముళ్లు ఒకసారి వ్యతిరేక దిశలో ఉంటాయి. కానీ 12 గంటల సమయంలో 11 సార్లు, 24 గంటల సమయంలో కేవలం 22 సార్లు మాత్రమే వ్యతిరేక దిశలో ఉంటాయి. (5-6, 6-7 గంటల మధ్య కేవలం ఒకసారి మాత్రమే వ్యతిరేక దిశలో ఉంటాయి.)

ముళ్లు లంబంగా ఉండటం (90°): ప్రతి ఒక గంట సమయంలో రెండు ముళ్లు రెండుసార్లు లంబంగా ఉంటాయి. కానీ 12 గంటల సమయంలో 22 సార్లు, 24 గంటల సమయంలో 44 సార్లు మాత్రమే రెండు ముళ్లు లంబంగా ఉంటాయి. (8-9, 9-10, 2-3, 3-4 గంటల మధ్య కేవలం 6 సార్లు మాత్రమే లంబంగా ఉంటాయి.)

గంటల ముల్లు: ప్రతి 12 గంటల సమయంలో గంటల ముల్లు ఒక పూర్తి భ్రమణం చేస్తుంది.

12 గంటలు = 360° ★ గంటల ముల్లు ఒక గంటలో చేసే కోణం 30°

12 — 360°, 1 — ? ⇒ $\frac{360^\circ}{12} = 30^\circ$

1 గంట = 30°

★ గంటలముల్లు ఒక నిమిషంలో చేసే కోణం

1 గంట — 30°

60 నిమిషాలు — 30°

1 నిమిషం — ?

$\frac{1}{30} \times 60^\circ = \left(\frac{1}{2}\right)^\circ$

1 నిమిషం = $\left(\frac{1}{2}\right)^\circ$

నిమిషాల ముల్లు

★ నిమిషాల ముల్లు ఒక గంట సమయంలో ఒక పూర్తి భ్రమణం చేస్తుంది.

1 గంట = 360°

60 నిమిషాలు = 360°

★ నిమిషాల ముల్లు ఒక నిమిషంలో చేసే కోణం

60 నిమిషాలు = 360°

1 నిమిషం = ?

$\frac{1 \times 360}{60} = 6^\circ$

1 నిమిషం = 6°

గమనిక: 1) నిమిషాల ముల్లు ఒక నిమిష కాలంల్లో గంటల ముల్లు కంటే $5\frac{1}{2}$ కోణం అధికంగా చేస్తుంది.

$6^\circ - \frac{1}{2}^\circ = 5\frac{1}{2}^\circ$

2) కింది సూత్రం ఆధారంగా వివిధ రకాల సమస్యలను సాధించవచ్చు.

$M = \frac{2}{11}[H \times 30^\circ \pm \theta]$

M = నిమిషాలు

H = ప్రారంభ గంట

θ = రెండు ముళ్ల మధ్య కోణం

★ ప్రారంభ గంట 12 గా ఉన్నప్పుడు H = 0 గా తీసుకోవాలి. ★ ఆగిపోయిన గడియారం ఒక రోజులో రెండుసార్లు సరైన సమయాన్ని సూచిస్తుంది.

మాదిరి ప్రశ్నలు

టైప్ - 1

1. గడియారంలో గంటల ముల్లు ఉదయం 6 గంటల నుంచి 6 : 20 వరకు ఏర్పరిచే కోణం ఎంత?
1) 15° 2) 10° 3) 12° 4) 20°

వివరణ: $6:00 \to 6:20 = 20$ నిమిషాలు

గంటల ముల్లు ఒక నిమిషంలో ఏర్పరిచే కోణం = $\left(\frac{1}{2}\right)^\circ$

1 నిమిషం — $\left(\frac{1}{2}\right)^\circ$

20 నిమిషాలు — ?

$= \frac{20}{1} \times \frac{1}{2} = 10^\circ$

జ: 2

2. గడియారంలో నిమిషాల ముల్లు సమయం 5:32 నిమిషాల నుంచి 5:48 నిమిషాల వరకు ఏర్పరిచే కోణం ఎంత?
1) 89° 2) 69° 3) 94° 4) 96°

వివరణ: $5:32 \to 5:48 = 16$ నిమిషాలు

నిమిషాల ముల్లు ఒక నిమిషంలో ఏర్పరిచే కోణం = 6°

1 నిమిషం — 6°

16 నిమిషాలు — ?

$= \frac{16}{1} \times 6 = 96^\circ$

జ: 4

టైప్ - 2

3. గడియారంలో సమయం 9, 10 గంటల మధ్య ఏ సమయంలో రెండు ముళ్లు ఏకీభవిస్తాయి?
1) 9 గం. $44\frac{1}{9}$ ని.
2) 9 గం. $40\frac{1}{9}$ ని.
3) 9 గం. $49\frac{1}{11}$ ని.
4) 10 గం. $49\frac{1}{11}$ ని.

వివరణ: రెండు ముళ్లు ఏకీభవించినప్పుడు వాటి మధ్య కోణం '0'

$M = \frac{2}{11}[H \times 30 \pm \theta]$

$M = \frac{2}{11}[9 \times 30 + 0^\circ]$

$= \frac{2}{11} \times 270 = \frac{540}{11}$

$= 49\frac{1}{11}$ నిమిషాలు

∴ 9 గంటల $49\frac{1}{11}$ నిమిషాల వద్ద రెండు ముళ్లు ఏకీభవిస్తాయి.

జ: 3

టైప్ - 3

4. గడియారంలో సమయం 4:20 వద్ద రెండు ముళ్ల మధ్య ఏర్పడే కోణం ఎంత?
1) 20° 2) 10° 3) 30° 4) 15°

వివరణ: M = 20; H = 4

$M = \frac{2}{11}[H \times 30 \pm \theta]$

$20 = \frac{2}{11}[4 \times 30 \pm \theta]$

$20 \times \frac{11}{2} = 120 \pm \theta$

$110 = 120 \pm \theta$ (పెద్ద విలువలో నుంచి చిన్న విలువను తీసివేయాలి.)

$\theta = 10^\circ$

జ: 2

5. గడియారంలో సమయం 7:26 వద్ద రెండు ముళ్ల మధ్య ఏర్పడే పరావర్తన కోణం ఎంత?
1) 67° 2) 180° 3) 113° 4) 97°

వివరణ: M = 26; H = 7

$M = \frac{2}{11}[H \times 30 \pm \theta]$

$26 = \frac{2}{11}[7 \times 30 \pm \theta]$

$26 \times \frac{11}{2} = 210 \pm \theta$

$143 = 210 \pm \theta$

$\theta = 210 - 143 = 67^\circ$

పరావర్తన కోణం = $180^\circ - 67^\circ = 113^\circ$

జ: 3



రచయిత: గోలి ప్రశాంత్ రెడ్డి

పదో తరగతి — ఫిజికల్ సైన్స్

లోహాలు, అలోహాలు

ఫైనల్ పరీక్షలు - 2026 — ముఖ్యమైన ప్రశ్నలు - జవాబులు

ఒక మార్కు

1. అధిక చర్యాశీలత ఉన్న లోహాన్ని దాని ధాతువు నుంచి సంగ్రహించడానికి ఒక పద్ధతిని ప్రతిపాదించండి.
జ: విద్యుత్తు విశ్లేషణ

2. అధిక చర్యాశీలత ఉన్న లోహాల ఆక్సైడ్‌లను ఎందుకు కార్బన్ ద్వారా క్షయకరణం చేయరు?
జ: ఈ లోహాలు కార్బన్‌తో కంటే ఆక్సిజన్‌తో చురుకుగా బంధంలో పాల్గొంటాయి.

3. నీలం రంగు ఉన్న కాపర్ సల్ఫేట్ ద్రావణంలో ఇనుప మేకును ఉంచితే ఏం జరుగుతుంది?
జ: మేకులపై ఎర్రని కాపర్ పూత ఏర్పడుతుంది. ద్రావణం లేత ఆకుపచ్చని రంగులోకి మారుతుంది.

4. సోడియం లేదా పొటాషియంలను ఎందుకు కిరోసిన్‌లోఉంచాలి?
జ: ఇవి అత్యధిక చర్యాశీలతతో ఉంటాయి. బహిరంగ ప్రదేశాల్లో ఉంచినట్లయితే మంటలు అంటుకుంటాయి. కాబట్టి కిరోసిన్‌లో ఉంచుతారు.

5. అయానిక సమ్మేళనాలు ఎందుకు అధిక ద్రవీభవన స్థానాలను కలిగి ఉంటాయి?
జ: అయానిక సమ్మేళనాల మధ్య ఉన్న బలమైన అంతర అయానిక ఆకర్షణను విచ్ఛిన్నం చేయడానికి అధిక శక్తి కావాలి.

6. Fe, Na, Ag, Zn లోహాలను రసాయనిక చర్యాశీలత పెరుగుతున్న క్రమంలో రాయండి.
జ: Ag < Fe < Zn < Na


7. ఆక్సైడ్ నుంచి లోహాన్ని పొందడానికి ఏ రసాయన ప్రక్రియను ఉపయోగిస్తారు?
జ: క్షయకరణం

8. ఇనుము తుప్పు పట్టకుండా నిరోధించడానికి ఏదైనా ఒక పద్ధతిని తెలపండి.
జ: పెయింట్ వేయడం, నూనె పూయడం, గాల్వనీకరణం మొదలైనవి.

9. ఒక మూలకం ఆక్సిజన్‌తో చర్య జరిపి అధిక ద్రవీభవన స్థానం ఉన్న సమ్మేళనాన్ని ఇస్తుంది. ఈ సమ్మేళనం నీటిలో కూడా కరుగుతుంది. ఈ మూలకం
ఎ) క్యాల్షియం బి) కార్బన్ సి) సిలికాన్ డి) ఇనుము
జ: ఎ) క్యాల్షియం

10. ఆహార డబ్బాలకు జింక్‌తో కాకుండా టిన్‌తో పూత వేస్తారు ఎందుకంటే...
ఎ) జింక్.. టిన్ కంటే ఖరీదైంది.
బి) జింక్.. టిన్ కంటే ఎక్కువ ద్రవీభవన స్థానం కలిగి ఉంటుంది.
సి) జింక్.. టిన్ కంటే ఎక్కువ చర్యాశీలతగా ఉంటుంది.
డి) జింక్.. టిన్ కంటే తక్కువ చర్యాశీలతగా ఉంటుంది.
జ: బి) జింక్.. టిన్ కంటే ఎక్కువ ద్రవీభవన స్థానం కలిగి ఉంటుంది

ముఖ్యమైన ప్రశ్నలు-జవాబులు



రచయిత: డి.వి. సుబ్బనాయుడు

బెయిళ్ల రద్దు పిటిషన్లపై..

జోగి సోదరులకు వ్యక్తిగత నోటీసులు

ఈనాడు - అమరావతి: వైకాపా నేత జోగి రమేష్, అతని సోదరుడు రాము బెయిళ్ల రద్దు పిటిషన్లపై ప్రతివాదులకు నోటీసుల నిమిత్తం కోర్టు విచారణ వాయిదా పడింది. నకిలీ మద్యం కేసులో సిట్ దాఖలు చేసిన ఈ పిటిషన్లు శుక్రవారం విజయవాడలోని 8వ ఏడీజే కోర్టులో విచారణకు వచ్చాయి. నోటీసులను నిందితులకు వ్యక్తిగతంగా అందించేందుకు వీలుగా ఈనెల 12కు న్యాయాధికారి వాయిదా వేశారు. ● ఇదే కేసులో నిందితుడు సెంథిల్ (ఏ22) 8వ ఏడీజే కోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ వేశారు. అన్నమయ్య జిల్లా ములకలచెరువు నకిలీ మద్యం కేసులో అరెస్టయి మదనపల్లి కారాగారంలో రిమాండ్‌లో ఉన్నాడు. ఇబ్రహీంపట్నంలో వెలుగుచూసిన నకిలీ మద్యం వ్యవహారంలోనూ భవానీపురం ఎక్సైజ్ స్టేషన్‌లో నమోదైన కేసులో నిందితుడిగా చేర్చారు. దీంతో ఇక్కడి కేసులో ముందస్తు బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేశాడు. నిందితుడిపై ఎక్సైజ్ కోర్టు జారీ చేసిన పీటీ వారెంట్ అమలులో ఉన్నందున.. ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కోర్టు అనుమతించలేదు.

దరఖాస్తు చేసిన వెంటనే విద్యుత్తు కనెక్షన్

సూర్యారావుపేట, న్యూస్‌టుడే: విద్యుత్తు వినియోగదారులకు దరఖాస్తు చేసుకున్న వెంటనే కనెక్షన్ ఇవ్వాలని ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి.పుల్లారెడ్డి పేర్కొన్నారు. గురువారం సాయంత్రం విద్యుత్తు సర్కిల్ కార్యాలయంలో అన్ని జిల్లాల ఎస్‌ఈలు, ఈఈలతో ఆయన నెలవారీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. విద్యుత్తు బిల్లుల వసూళ్లు నూరు శాతం ఉండాలన్నారు. వచ్చే వేసవి డిమాండ్‌ను తట్టుకునేందుకు సిద్ధం కావాలని, లోఓల్టేజీ సమస్య రాకుండా చూసుకోవాలని కోరారు. ఫీడర్ స్థాయిలో ఎక్కడా అవాంతరాలు రాకుండా నిరంతరం పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. సౌర విద్యుత్తు కనెక్షన్లు మరింతగా పెంచాలని, వాటి వల్ల ఉపయోగాలు ఎప్పటికప్పుడు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీసీపీడీసీఎల్ డైరెక్టర్లు మురళీకృష్ణయాదవ్, టీవీఎస్ఎన్ మూర్తి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

యువ క్రికెటర్ల ఘన విజయం దేశానికే గర్వకారణం

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: అండర్-19 ప్రపంచ కప్ సాధించిన యువ భారత క్రికెట్ జట్టు దేశానికే గర్వకారణమని ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్, కార్యదర్శి సానా సతీష్ తెలిపారు. భారత్ అండర్-19 క్రికెట్ జట్టుకు ఏసీఏ తరఫున అభినందనలు తెలుపుతూ శుక్రవారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. శుక్రవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో భారత్ జట్టు భారీ ఆధిక్యంతో ఇంగ్లండ్ జట్టుపై విజయం సాధించి ఆరోసారి ప్రపంచ కప్ సాధించి దేశ గౌరవాన్ని మరోసారి నిలబెట్టిందని పేర్కొన్నారు.

'శరీర అవశేషాలను తిరిగి అప్పగించడంలో సీబీఐ నిర్లక్ష్యం'

ఈనాడు - అమరావతి: ఆయేషామీరా శరీర భాగాలకు రీపోస్ట్‌మార్టం తర్వాత తిరిగి.. వాటిని అప్పగించే విషయంలో సీబీఐ అధికారులు ప్రొసీడర్‌ను పాటించలేదని ఆయేషా మీరా తల్లిదండ్రుల తరఫు న్యాయవాది పిచ్చుక శ్రీనివాస్ అన్నారు. ఆయేషా మీరా కేసు శుక్రవారం విజయవాడలోని సీబీఐ కోర్టులో విచారణకు వచ్చింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ తన వాదనలు వినిపించారు. తిరిగి పోస్ట్‌మార్టం కోసం శరీర భాగాలను తీసుకెళ్లే సమయంలో పది రోజుల్లోనే తిరిగి అప్పగిస్తామని మతపెద్దలు, తల్లిదండ్రులకు సీబీఐ అధికారులు హామీ ఇచ్చి ఉల్లంఘించారని అన్నారు. శరీర అవశేషాలను తిరిగి అప్పగించకుండా.. కేవలం కోర్టులో అప్పగించి చేతులు దులుపుకొన్నారన్నారు. సరైన పద్ధతిని అనుసరించాలని, వాటిని అంబులెన్సులో తరలించి మృతురాలి తల్లిదండ్రులకు అప్పగించాలని న్యాయవాది శ్రీనివాస్ వాదించారు. ఈవిషయంలో కోర్టు తగిన ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. ఆయేషా మీరా తల్లిదండ్రుల నుంచి సమ్మతి తీసుకుని ఆదేశాలు ఇస్తామని న్యాయాధికారి అన్నపూర్ణ చెప్పారు. మృతురాలి తల్లిదండ్రులు ఈనెల 18న కోర్టుకు హాజరుకావాలని ఆదేశిస్తూ వాయిదా వేశారు.

విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి ప్రసాద్ మృతి



ప్రసాద్

విజయవాడ (ఎన్టీఆర్ కలెక్టరేట్), న్యూస్‌టుడే: విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి గుదే లక్ష్మీ వరప్రసాద్ (65) విజయవాడ పాతబస్తీ ఇస్లాంపేటలోని స్వగృహంలో గురువారం సాయంత్రం గుండెపోటుతో మరణించారు. కృష్ణా జిల్లా గుడివాడకు చెందిన ప్రసాద్ 1995-99 మధ్య విజయవాడ ఆదాయపు పన్ను శాఖలో డిప్యూటీ కమిషనర్‌గా పని చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్‌లోనూ పని చేశారు. తమిళనాడులోని చెన్నైలో ఆదాయపు పన్ను శాఖ కమిషనర్‌గా పని చేస్తూ 2021లో పదవీ విరమణ చేశారు. విజయవాడలో స్థిరపడ్డారు. ఆయన సతీమణి మమతాప్రసాద్ తెలంగాణలో రవాణా శాఖ కమిషనర్‌గా పని చేసి పదవీ విరమణ పొందారు. ప్రసాద్‌కు భార్య, ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. ఆయన ఆకస్మిక మృతితో అధికారులు, సహోద్యోగులు దిగ్భ్రాంతికి గురయ్యారు. కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.

కృష్ణా రివర్ క్రాస్ ఈత పోటీలు 8న

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: ఆక్వా డెవిల్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 8న 26వ కృష్ణా రివర్ క్రాస్ 1.5 కి.మీ. ఈత పోటీలు నిర్వహిస్తున్నామని సంఘం అధ్యక్షుడు ఎల్.రామకృష్ణ, కార్యదర్శి వైవీ రమేష్ కుమార్ తెలిపారు. విజయవాడ దుర్గాఘాట్ నుంచి ప్రకాశం బ్యారేజీ లోటస్ ఫుడ్ సిటీ వరకు జరిగే రివర్ క్రాస్ పోటీలో అత్యల్పంగా 10 సంవత్సరాల నుంచి అత్యధికంగా 88 సంవత్సరాల వయసుగల వారు తలపడతారని పేర్కొన్నారు. ఎనిమిది కేటగిరీల్లో స్త్రీ, పురుషుల విభాగాల్లో వేర్వేరుగా పోటీలు జరుగుతాయన్నారు. కేటగిరీ వారీగా తొలి మూడు స్థానాల్లో నిలిచిన వారికి వరుసగా రూ.10 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు నగదు బహుమతులు అందజేస్తామన్నారు. మొత్తం రూ.3.20 లక్షల నగదు బహుమతులు, వ్యక్తిగత పతకాలు, ప్రశంసాపత్రాలు బహూకరిస్తామన్నారు. పోటీలో తలపడేందుకు సుమారు 600 మందికిపైగా నమోదు చేసుకున్నారని పేర్కొన్నారు. వీరిలో ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి తలపడుతున్నారని వివరించారు. పోటీలను జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ, ఆక్వా డెవిల్స్ సంక్షేమ సంఘం వ్యవస్థాపక ఛైర్మన్, మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభిస్తారని, బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర విపత్తుల, అగ్నిమాపకశాఖ డీజీ పి.వెంకటరమణ ముఖ్యఅతిథిగా హాజరవుతారని వారు తెలిపారు.

9న కృష్ణా వర్సిటీ దేహదారుఢ్య పోటీలు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆధ్వర్యంలో ఈ నెల 9న కృష్ణా వర్సిటీ అంతర్ కళాశాలల పురుషుల ఉత్తమ దేహదారుఢ్యం పోటీలు, వర్సిటీ జట్టు ఎంపికలు నిర్వహిస్తామని కళాశాల ప్రిన్సిపల్ మేకా రమేష్ తెలిపారు. ఆసక్తిగల వర్సిటీ అనుబంధ కళాశాలల విద్యార్థులు మూడు సెట్ల అర్హతా పత్రాలతోపాటు గుర్తింపు కార్డులతో అదే రోజు ఉదయం 9 గంటలకు పోటీల కార్యనిర్వాహక కార్యదర్శి టీవీబీ కృష్ణారెడ్డికి కళాశాలలో రిపోర్టు చేయాలన్నారు. మరిన్ని వివరాలకు 99639 92102 ఫోన్ నంబరులో సంప్రదించాలన్నారు.

మద్యం కేసులో.. బెయిల్ పిటిషన్లపై కౌంటర్ల దాఖలుకు గడువు

ఈనాడు - అమరావతి: మద్యం కేసులో ముగ్గురు నిందితుల బెయిల్ పిటిషన్లపై విచారణ వాయిదా పడింది. ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, బాలాజీ గోవిందప్ప దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్లు శుక్రవారం విజయవాడలోని ఏసీబీ కోర్టులో విచారణకు వచ్చాయి. వీటిపై ప్రాసిక్యూషన్ కౌంటర్లు దాఖలు చేయాల్సి ఉంది. దీనికి గడువు కోరడంతో అంగీకరించిన న్యాయాధికారి.. ఈనెల 12కు వాయిదా వేశారు.

వైద్యురాలు దీపిక మృతిపై పారదర్శకంగా దర్యాప్తు

రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ



ఆసుపత్రి అధికారులు, పోలీసుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న రాయపాటి శైలజ

విజయవాడ వైద్యం, న్యూస్‌టుడే

సిద్ధార్థ వైద్య కళాశాల విద్యార్థిని డాక్టర్ దీపిక ప్రతిభావంతురాలని, ఆమె మరణం వైద్య రంగానికి తీరని లోటని రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ అన్నారు. శుక్రవారం ఆమె విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి ఘటనకు సంబంధించిన వివరాలను అధికారులు, తోటి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆమె ప్రవర్తనలో ఏమైనా మార్పులు గమనించారా..? ఏదైనా ఒత్తిడి ఉందా..? అనే కోణంలో తోటి విద్యార్థులు, సహచర వైద్యులతో వ్యక్తిగతంగా మాట్లాడారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. ఆమెలో ఎటువంటి అసాధారణ మార్పులు లేవని సహచరులు తెలిపారన్నారు. ఆమె శరీరంపై ఉన్న సూది గుర్తులు దేనివలన వచ్చాయనేది తెలాల్సి ఉందని తెలిపారు. నమూనాలను పరీక్షల నిమిత్తం పంపామని, ఈనివేదికలు రావడానికి రెండు నుంచి మూడు వారాల సమయం పడుతుందన్నారు. దర్యాప్తు పారదర్శకంగా జరిగేలా అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. బాధితురాలి కటుంబానికి పూర్తిస్థాయిలో న్యాయం జరిగేలా మహిళా కమిషన్ చర్యలు తీసుకుంటుందన్నారు. విషప్రయోగం జరిగి ఉండవచ్చనే అనుమానాలను ఆమె తోసిపుచ్చారు. దీపికతో కలిసి భోజనం చేసిన మరో జూనియర్ వైద్యురాలు ఆరోగ్యంగానే ఉన్నట్టు తెలిపారు. ప్రాథమిక సమాచారం ప్రకారం వాంతులు నివారణకు వాడే ఇంజక్షన్ తీసుకున్నట్లు సమాచారం ఉందని, కేసు దర్యాప్తులో భాగంగా కాల్‌డేటా రికార్డ్స్, పోస్టుమార్టం నివేదికల కోసం వేచి చూస్తున్నట్టు తెలిపారు. ఫోరెన్సిక్ నివేదికలు వచ్చాక ఇది ఆత్మహత్యా లేక ఇతర కారణాలు ఉన్నాయా అన్నది స్పష్టమవుతుందని వెల్లడించారు. మాచవరం పోలీసుస్టేషన్ సిబ్బంది నుంచి కూడా ఆమె వివరాలు తెలుసుకున్నారు. ఆమె వెంట ప్రభుత్వ ఆసుపత్రి ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ ఏడుకొండలరావు ఉన్నారు.

బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎన్టీఆర్ వర్సిటీ జట్టు ఎంపిక



జట్టు సభ్యులతో ఉపకులపతి చంద్రశేఖరరావు, రిజిస్ట్రార్ సాయిసుధీర్, ఇ.త్రిమూర్తి

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: చెన్నైలోని అన్నా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఈనెల 11 నుంచి 15వ తేదీ వరకు జరిగే అఖిలభారత అంతర్ వర్సిటీల మహిళా బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొనే డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం జట్టును వర్సిటీ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ఇ.త్రిమూర్తి శుక్రవారం వెల్లడించారు. విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ పి.చంద్రశేఖర్, రిజిస్ట్రార్ డాక్టర్ టి.సాయిసుధీర్‌లు శుక్రవారం వర్సిటీ ప్రాంగణంలో ఎంపికైన జట్టు సభ్యులకు స్పోర్ట్స్ కిట్ అందజేశారు. జట్టులో ఎన్.నాగశ్రీస్వపంతి, టి.గ్రీష్మ, జి.గీత(ఆశ్రం వైద్య కళాశాల, ఏలూరు), బీఎన్‌జీ గౌరి అన్నపూర్ణాదేవి, కె.పూజశ్రీ, కె.ఉదయలక్ష్మి(సిద్ధార్థ వైద్య కళాశాల, విజయవాడ), ఎన్.చరితారెడ్డి (డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ వైద్య కళాశాల, చిన్నఅవుటపల్లి), ఎ.జ్యోతిమణిమాల, బి.శిరీష(అనిల్ నీరుకొండ దంత కళాశాల, విశాఖపట్నం), కె.జయ సాయిశ్రీ(మహారాజ హోమియోపతి కళాశాల, విజయనగరం)లు స్థానం సాధించారు. ఈ జట్టుకు వీవీఎస్ఎం శ్రీనివాసరాజు(పీడీ, ఆశ్రం వైద్య కళాశాల, ఏలూరు) మేనేజరుగా, డీవీవీఎస్ శ్రీనివాసరావు (పీడీ, జీఎస్ఎల్ వైద్య కళాశాల, రాజమహేంద్రవరం)కోచ్‌గా నియమితులయ్యారు.

బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన యువకుడికి జైలు

కృష్ణలంక, న్యూస్‌టుడే: బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన కేసులో నిందితుడికి పోక్సో కోర్టు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పింది. కృష్ణలంక పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాలిక(12) పాఠశాలకు వెళ్లి తిరిగొచ్చే క్రమంలో అదే ప్రాంతానికి చెందిన యువకుడు వంగల సాయి అలియాస్ యాము ప్రేమిస్తున్నానంటూ వెంటపడి వేధిస్తుండడంతో బాలిక విషయాన్ని ఇంట్లో చెప్పింది. దీంతో బాలిక తండ్రి సదరు యువకుడిని మందలించారు. అయినప్పటికీ అతని ప్రవర్తనలో మార్పు లేకపోవడంతో కృష్ణలంక పోలీసుస్టేషన్‌లో బాలిక తండ్రి ఫిర్యాదు చేశారు. ఆమేరకు పోలీసులు యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. 2020 జనవరి 9న నిందితుడిని అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరు పరిచారు. విచారణ అనంతరం నేరం రుజువైనందున నిందితుడికి మూడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు జడ్జి వేల్పుల భవానీ శుక్రవారం తీర్పు చెప్పారు.

ఉద్యోగుల నమ్మకాన్ని వమ్ము చేయం

ఏపీ ఐకాస నేతలు బొప్పరాజు, పలిశెట్టి

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఏపీ ఐకాస అమరావతిపై ఉద్యోగులు పెట్టుకున్న ఆశలను వమ్ము చేయకుండా పని చేస్తామని ఐకాస ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు శుక్రవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విజయవాడలో గురువారం నిర్వహించిన ఐకాస నాలుగో సభను జయప్రదం చేసినందుకు ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. వేల మందితో కూడిన ఉద్యోగుల భారీ ర్యాలీ, మహాసభ ద్వారా ఏపీ ఐకాసలో ఉన్న ఐక్యతను చూపగలిగామని పేర్కొన్నారు. 96 ప్రభుత్వ శాఖలకు చెందిన ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులకు ధన్యవాదాలు తెలిపారు. ఐకాస రాష్ట్ర కమిటీకి గురవారం 21 మంది కార్యవర్గంతో కూడిన కమిటీని ఎన్నుకున్నట్టు వెల్లడించారు. రెవెన్యూ శాఖకు చెందిన బొప్పరాజు నాలుగోసారి ఐకాస ఛైర్మన్‌గా, ఆర్టీసీకి చెందిన పలిశెట్టి సెక్రటరీ జనరల్‌గా రెండో పర్యాయం, సహకార శాఖకు చెందిన ఫణి పేర్రాజు సహాధ్యక్షుడిగా మూడోసారి, మున్సిపల్ శాఖకు చెందిన తిమ్మసర్తి నాగేశ్వరరావు కోశాధికారిగా తొలిసారి ఎన్నికైనట్లు తెలిపారు. కార్యవర్గంలో మిగతా 17 మందిలో పోలీసు, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, నాల్గవ తరగతి ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, ప్రభుత్వ డ్రైవర్లు, ఏపీ ప్రభుత్వ డాక్టర్ల సంఘం, పశుసంవర్ధక శాఖ డాక్టర్ల సంఘం, హెడ్ మాస్టర్ల సంఘం, గ్రామ/వార్డు ఉద్యోగులు తదితర సంఘాల నాయకులు ఉన్నట్లు పేర్కొన్నారు.

నేడు: పాకిస్థాన్ × నెదర్లాండ్స్, ఉదయం 11 నుంచి; స్కాట్లాండ్ × వెస్టిండీస్ మధ్యాహ్నం 3 నుంచి - స్టార్ స్పోర్ట్స్‌లో

ఛాంపియన్

175 వైభవ్ సూర్యవంశీ స్కోరు. ఐసీసీ టోర్నీ ఫైనల్లో ఓ ప్లేయర్ చేసిన అత్యధిక స్కోరు ఇదే. అలిసా హీలీ (2022 మహిళల వన్డే ప్రపంచకప్‌లో 170) రికార్డు బద్దలైంది.

"భారత క్రికెట్ నైపుణ్యం వెలిగిపోతోంది. దేశానికి ప్రపంచకప్‌ను అందించిన అండర్-19 జట్టుకు శుభాభినందనలు"
- ప్రధాన మంత్రి నరేంద్రమోదీ

6 అండర్-19 క్రికెట్లో భారత్ ఇది 6వ వన్డే ప్రపంచకప్ కాగా.. భారత్ రికార్డు స్థాయిలో ఆరోసారి విజేతగా నిలిచింది. ఇంతకుముందు 2000, 2008, 2012, 2018, 2022లో ఇండియా కప్పు నెగ్గింది. నాలుగు ప్రపంచకప్‌లతో ఆస్ట్రేలియా (1988, 2002, 2010, 2024) రెండో స్థానంలో ఉంది.




టీ20 ప్రపంచకప్ జట్ల కెప్టెన్లు

యువదరహో

- వైభవ్ సూర్యవంశీ విశ్వరూపం ● 80 బంతుల్లోనే 175 పరుగులు
- భారత్‌దే అండర్-19 ప్రపంచకప్ ● ఫైనల్లో ఇంగ్లాండ్‌పై ఘనవిజయం

ఒక్క ఓటమి లేకుండా ఫైనల్ చేరినా ఎక్కడో ఒక అసంతృప్తి! కుర్రాళ్లు తమ ప్రతిభకు పూర్తి న్యాయం చేయట్లేదని.. సమష్టిగా ఆడట్లేదని.. పెద్ద జట్లపై సాధికారిక విజయాలు సాధించలేదని! పైగా ఫైనల్ ప్రత్యర్థి కూడా అజేయ జట్టే కావడంతో ఫలితం సానుకూలంగా వస్తుందా అన్న సందేహం! కానీ కుర్రాళ్ల జట్టు అంతిమ సమరంలో అసలు ఆటను బయటికి తీసింది. ముఖ్యంగా యువ సంచలనం, ఇంకా 15 ఏళ్లు కూడా నిండని వైభవ్ సూర్యవంశీ తన ప్రతిభనంతా ఫైనల్ కోసమే దాచుకున్నాడా అన్నట్లు ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. ప్రపంచకప్ ఫైనల్‌ను గల్లీ మ్యాచ్‌గా మార్చేసిన అతను.. సిక్సర్ల మోత మోగించడంతో మ్యాచ్ ఆరంభమైన రెండు గంటలకే ఫలితంపై అంచనా వచ్చేసింది. వైభవ్ విధ్వంసంతో ఇంగ్లిష్ జట్టుకు 412 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించిన యువ భారత్.. 100 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించి సగర్వంగా ప్రపంచకప్‌ను ముద్దాడింది.

హరారే

అండర్-19 ప్రపంచకప్ ఫైనల్లో భారత జట్టు జూలు విదిల్చింది. 100 పరుగుల తేడాతో ఇంగ్లాండ్‌ను చిత్తు చేసి ప్రపంచకప్‌ను చేజిక్కించుకుంది. మొదట వైభవ్ సూర్యవంశీ (175; 80 బంతుల్లో 15×4, 15×6) చెలరేగిపోవడంతో భారత్ 9 వికెట్లకు 411 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఆయుష్ మాత్రే (53; 51 బంతుల్లో 7×4, 2×6), అభిజ్ఞాన్ కుందు (40; 31 బంతుల్లో 6×4, 1×6), కనిష్క్ చౌహాన్ (37 నాటౌట్; 20 బంతుల్లో 3×4, 1×6) కూడా రాణించారు. ఇంగ్లిష్ బౌలర్లలో మింటో (3/63), అలెక్స్ గ్రీన్ (2/49) ఆకట్టుకున్నారు. అనంతరం అంబ్రిష్ (3/56), కనిష్క్ చౌహాన్ (2/63), దీపేశ్ దేవేంద్రన్ (2/64)ల ధాటికి ఇంగ్లాండ్ 40.2 ఓవర్లలో 311 పరుగులకే ఆలౌటైంది. కాలెబ్ ఫాల్కనర్ (115; 67 బంతుల్లో 9×4, 7×6) మెరుపు శతకం సాధించాడు. బెన్ డాకిన్స్ (66), బెన్ మేస్ (45) కూడా రాణించారు.

ముందే తేల్చేశాడు..: మానీ లమ్స్‌డెన్.. ఈ ప్రపంచకప్‌లో అత్యుత్తమ బౌలర్. పొదుపుగా బౌలింగ్ చేయడమే కాక, 6 మ్యాచ్‌ల్లోనే 15 వికెట్లు పడగొట్టాడు. వారం కిందట న్యూజిలాండ్‌పై 5/17 గణాంకాలు సాధించిన ఈ బౌలర్.. శుక్రవారం 8 ఓవర్లలోనే 81 పరుగులు సమర్పించుకున్నాడు. జట్టులో ఉత్తమ బౌలర్‌ను లక్ష్యంగా చేసుకుని సిక్సర్ల మోత మోగించడం ద్వారా ప్రత్యర్థిని ఆత్మరక్షణలోకి నెట్టి, మ్యాచ్ ఫలితాన్ని శాసించాడు వైభవ్. అయితే టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన భారత్‌కు ఆశించిన ఆరంభం దక్కలేదు. సెమీస్‌లో సెంచరీ కొట్టిన హైదరాబాద్ కుర్రాడు ఆరోన్ జార్జ్ 9 పరుగులకే ఔటైపోయాడు. 5 ఓవర్లకు స్కోరు 25/1. కానీ తర్వాతి ఓవర్ నుంచే మొదలైంది సూర్యవంశీ ప్రతాపం. 8వ ఓవర్లో బంతి అందుకున్న లమ్స్‌డెన్‌కు 4, 4, 6తో స్వాగతం పలికిన వైభవ్.. మింటో వేసిన తర్వాతి ఓవర్లో ఒక సిక్సర్, మూడు ఫోర్లు అందుకున్నాడు. ఇలా ఒక్కో బౌలర్ గణాంకాలను సవరిస్తూ ముందుకు సాగిన వైభవ్.. 32 బంతుల్లో అర్ధశతకం, 55 బంతుల్లో శతకం సాధించాడు. సెంచరీ తర్వాత అతడి విధ్వంసం మరో స్థాయికి చేరుకుంది. రాల్ఫీ ఆల్బర్ట్ వేసిన 22వ ఓవర్లో వరుసగా 4, 6, 6, 4, 4తో మొత్తంగా 27 పరుగులు రాబట్టాడు. 100 నుంచి 150కి చేరుకోవడానికి 16 బంతులే అవసరమయ్యాయి. 25వ ఓవర్‌కే వైభవ్ 175 మీదికి వచ్చేశాడు. అప్పటికే స్కోరు 250కి చేరుకుంది. వైభవ్ ద్విశతకం లాంఛనమే అనిపించగా.. తన చేతిలో ఊచకోతకు గురైన లమ్స్‌డెనే అతణ్ని ఔట్ చేసి జట్టుకు ఉపశమనాన్నిచ్చాడు. ఆయుష్ (53)తో రెండో వికెట్‌కు 142 పరుగులు జోడించిన సూర్యవంశీ.. వేదాంత్ (32)తో మూడో వికెట్‌కు 89 పరుగులు జత చేశాడు. 34వ ఓవర్లోనే భారత్ 300 మార్కును దాటేసింది. వైభవ్ ఔటయ్యాక స్కోరు వేగం కొంచెం తగ్గినప్పటికీ.. విహాన్ (30), కుందు, కనిష్క్ సమయోచితంగా రాణించి స్కోరును 400 దాటించారు. అనంతరం ఛేదనలో ఇంగ్లాండ్ ధాటిగానే ఆడినప్పటికీ.. వికెట్లు కాపాడుకోలేకపోవడంతో ఓటమి తప్పలేదు. 20 ఓవర్లకు 171/3తో పోటీలో నిలిచిన ఇంగ్లాండ్.. అనూహ్యంగా 2 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 177/7కు చేరుకుంది. ఈ దశలో ఫాల్కనర్ మెరుపు శతకం బాదినా.. అతడి పోరాటం ఓటమి అంతరాన్ని తగ్గించడానికే ఉపయోగపడింది.

● ఫైనల్లో ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచిన వైభవ్ ప్లేయర్ ఆఫ్ టోర్నీ అవార్డునూ గెలుచుకున్నాడు. ఒక ఐసీసీ టోర్నీలో ఈ అవార్డులు దక్కించుకున్న పిన్న వయస్కుడిగా ఘనత సాధించాడు.

భారత్ ఇన్నింగ్స్: ఆరోన్ జార్జ్ (సి) మేస్ (బి) గ్రీన్ 9; వైభవ్ సూర్యవంశీ (సి) థామస్ (బి) లమ్స్‌డెన్ 175; ఆయుష్ మాత్రే (సి) మేస్ (బి) గ్రీన్ 53; వేదాంత్ త్రివేది (సి) మేస్ (బి) మింటో 32; విహాన్ మల్హోత్రా (సి) డాకిన్స్ (బి) మింటో 30; అభిజ్ఞాన్ (సి) ఆల్బర్ట్ (బి) మోర్గాన్ 40; అంబ్రిష్ (బి) మింటో 18; కనిష్క్ నాటౌట్ 37; ఖిలాన్ (సి) మూర్స్ (బి) మోర్గాన్ 3; హెనిల్ రనౌట్ 5; దీపేశ్ నాటౌట్ 0, ఎక్స్‌ట్రాలు 9, **మొత్తం:** (50 ఓవర్లలో 9 వికెట్లకు) **411; వికెట్ల పతనం:** 1-20, 2-162, 3-251, 4-302, 5-308, 6-359, 7-367, 8-375, 9-393; **బౌలింగ్:** మోర్గాన్ 9-0-74-2, గ్రీన్ 5-0-49-2, లమ్స్‌డెన్ 8-0-81-1, మింటో 8-0-63-3, పర్హాన్ 10-0-77-0, ఆల్బర్ట్ 10-0-66-0

ఇంగ్లాండ్ ఇన్నింగ్స్: డాకిన్స్ (సి) ఖిలాన్ (బి) ఆయుష్ 66; మూర్స్ (బి) అంబ్రిష్ 17; మేస్ (సి) హెనిల్ (బి) ఖిలాన్ 45; థామస్ (సి) ఆయుష్ (బి) కనిష్క్ 31; ఫాల్కనర్ (సి) ఖిలాన్ (బి) కనిష్క్ 115; ఆల్బర్ట్ రనౌట్ 0; పర్హాన్ (సి) కుందు (బి) దీపేశ్ 1; మోర్గాన్ (సి) అండ్ (బి) దీపేశ్ 0; మింటో (సి) ఎనాన్ (బి) అంబ్రిష్ 28; లమ్స్‌డెన్ (సి) వేదాంత్ (బి) అంబ్రిష్ 3; గ్రీన్ నాటౌట్ 0, ఎక్స్‌ట్రాలు 5, **మొత్తం:** (40.2 ఓవర్లలో) **311; వికెట్ల పతనం:** 1-19, 2-93, 3-142, 4-174, 5-174, 6-177, 7-177, 8-269, 9-281; **బౌలింగ్:** అంబ్రిష్ 9-1-56-3, హెనిల్ 4-2-28-0, దీపేశ్ 6-0-64-2, ఖిలాన్ 8-0-66-1, కనిష్క్ 8.2-0-63-2, ఆయుష్ మాత్రే 5-0-31-1


వైభవ్ సూర్యవంశీ **175** 80 బంతుల్లో 15×4, 15×6

15 ఫైనల్లో సూర్యవంశీ బాదిన సిక్సర్లు. యూత్ వన్డేల్లో తన పేరిట ఉన్న అత్యధిక సిక్సర్ల రికార్డు (14)ను తిరగరాశాడు.

150 ఫైనల్లో ఫోర్లు (15), సిక్సులు (15) రూపంలో సూర్యవంశీ సాధించిన పరుగులు. హసిత (శ్రీలంక, 124; 28×4, 2×6) రికార్డును బద్దలుకొట్టాడు.

దమ్మునోడు

ఫోర్త్ అంపైర్

14 ఏళ్ల 316 రోజులు.. శుక్రవారం నాటికి వైభవ్ సూర్యవంశీ వయసు. సాధారణంగా ఈ వయసున్న పిల్లాడు ఆటలన్నీ కట్టిపెట్టి పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సిద్ధమవుతూ ఉండాలి. కానీ ఈ బిహార్ కుర్రాడు మాత్రం తనకంటే వయసులో నాలుగైదేళ్లు పెద్ద వాళ్లతో కలిసి అండర్-19 ప్రపంచకప్ ఆడుతూ.. ఆ పెద్ద వయస్కులు కూడా అందుకోలేని స్థాయిలో అసామాన్య ప్రదర్శన చేశాడు.

ఈ వయసులోనే ఇదేం ఆట అని వైభవ్ గురించి ఆశ్చర్యపోవడం ఏడాది కిందటే మొదలైంది. దేశవాళీల్లో సత్తా చాటి 13 ఏళ్ల వయసుకే ఐపీఎల్ వేలంలో కోటీశ్వరుడిగా మారి అందరూ ముక్కున వేలేసుకునేలా చేశాడు. వేలంలో అయితే అమ్ముడయ్యాడు కానీ.. మ్యాచ్ ఆడగలడా అని సందేహిస్తే, ఆ అవకాశమూ దక్కించుకున్నాడు. ఛాన్స్ అయితే వచ్చింది కానీ.. విపరీతమైన పోటీ ఉండే ఐపీఎల్‌లో ఇంత చిన్న కుర్రాడు నిలవగలడా అనుకుంటే రాజస్థాన్ రాయల్స్ ఓపెనర్‌గా మహామహా బౌలర్లను ఊచకోత కోస్తూ కేవలం 35 బంతుల్లో సెంచరీ కొట్టేశాడు. ఇలా ఎక్కడ ఆడితే అక్కడ ఈ చిన్నోడు వీరవిహారం చేయడం.. ఈ వయసులో ఇలా ఆడడం ఎలా సాధ్యం అని చూసేవాళ్లు అవాక్కవడం.. ఇదే వరస! ఏడాది తిరిగేసరికి అందరూ అతడి ఆటకు అలవాటైపోయారు. తన వయసు సంగతి మరిచిపోయారు. అతణ్ని ఒక స్టార్‌లా చూస్తున్నారు. అండర్-19 ప్రపంచకప్ మొదలవుతుంటే అందరి దృష్టీ ఈ కుర్రాడి మీదే నిలిచింది. గ్రూప్ దశలో 5 మ్యాచ్‌ల్లో 196 పరుగులంటే మెరుగైన ప్రదర్శనే. కానీ ఇప్పటికే వైభవ్ తనపై బాగా అంచనాలు పెంచేసిన దృష్ట్యా ఈ ఆట అభిమానులకు ఆనలేదు. సెమీఫైనల్లో 68 పరుగుల విధ్వంసక ఇన్నింగ్స్ ఆడినా అది కూడా సరిపోలేదు. ఎట్టకేలకు ఫైనల్లో 175 పరుగుల ఇన్నింగ్స్‌తో తనపై అంచనాలను అందుకున్నాడు. 175 పరుగులంటే మారథాన్ ఇన్నింగ్స్ అనేవాళ్లు ఒకప్పుడు. అన్ని పరుగులు చేయాలంటే ఇన్నింగ్స్ ఆరంభం నుంచి చివరి వరకు నిలవాలి. 1983 ప్రపంచకప్‌లో కపిల్ ఇలాగే నిలిచి 175 పరుగులు చేశాడు. కానీ ఇప్పుడు వైభవ్ వన్డే మ్యాచ్‌లో సగం ఓవర్లకే అంత స్కోరు చేయడం అసామాన్యమైన విషయం. బంతి పడిందా దాని గమ్యం బౌండరీనే అన్నట్లు అతడు కొట్టిన షాట్లను చూసి అబ్బురపడకుండా ఉండలేం! కొన్ని షాట్లను వర్ణించడానికి ఉపమానాలు వెతుక్కోవాల్సిన పరిస్థితి. ముఖ్యంగా ఒంటిని విల్లులా వంచుతూ మిడ్‌వికెట్‌లోకి కొట్టిన సిక్సర్‌ను ఏమని వర్ణించాలి? తన శక్తికి.. చక్కటి ఫుట్‌వర్క్, టైమింగ్ కూడా తోడవడం వల్లే అతను ఇలా వీరవిహారం చేయగలుగుతున్నాడు. టీనేజీలో ఒకట్రెండు ఇన్నింగ్స్‌లతో సత్తా చాటిన క్రికెటర్లలో చాలామంది తర్వాత కనుమరుగైపోయిన వారే. బ్యాటర్ల బలహీనతలను కనిపెట్టి బౌలర్లు కళ్లెం వేస్తుంటారు. కానీ ఇప్పటిదాకా వైభవ్ వారి ఉచ్చులో పడలేదు. తన నిలకడ చూస్తుంటే అతను చరిత్ర సృష్టించేవాడే కానీ.. చరిత్రలో కలిసిపోయేవాడు కాదని అర్థమవుతోంది. తాజా ప్రదర్శనతో అతను సీనియర్ జట్టులో ఆడడానికి అర్హుడే అని స్పష్టమవుతోంది. సచిన్ కంటే చిన్న వయసులో అంతర్జాతీయ క్రికెట్లోకి ప్రవేశించి ప్రకంపనలు రేపేలాగే కనిపిస్తున్నాడు. ఇంకెంతో కాలం అతణ్ని భారత జట్టుకు దూరంగా ఉంచడం కష్టమే

టీ20 ప్రపంచకప్ నేటి నుంచే

చిన్న కప్పు.. పెద్ద వినోదం

● తొలి పోరులో అమెరికాతో భారత్ ఢీ
రాత్రి 7 నుంచి

పుష్కర కాలం పాటు ప్రతిసారీ కలిసి బరిలో దిగిన విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ ఇప్పుడు లేరు. ఈసారి చిరకాల ప్రత్యర్థులు భారత్, పాకిస్థాన్ మధ్య మ్యాచ్ జరిగే అవకాశమూ కనిపించడం లేదు. ఎప్పుడూ కప్పులో ఆడే బంగ్లాదేశ్ అనూహ్యంగా టోర్నీకి దూరమైంది. ఇవన్నీ ఆసక్తిని కాస్త తగ్గించే విషయాలే! అలా అని ధనాధన్ ఫార్మాట్లో.. సొంతగడ్డపై ప్రపంచకప్ జరుగుతుంటే క్రికెట్ ప్రేమికులు పట్టించుకోకుండా ఉండగలరా! మెరుపుల ఆటలో వినోదానికేం.. బోలెడంత వినోదం! దిగ్గజ ఆటగాళ్లు దూరమైనా టీమ్‌ఇండియాకు ఆకర్షణ తక్కువేమీ కాదు. అంచనాలకూ లోటు లేదు. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతున్న భారత్.. మూడో ట్రోఫీతో రికార్డు సృష్టించాలనే లక్ష్యంతో పొట్టి కప్పులో అడుగు పెడుతోంది. ఆతిథ్య దేశానికి దీటుగా కనిపిస్తున్న మరి కొన్ని జట్లు.. తమ అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి సిద్ధమయ్యాయి. వచ్చే నెల రోజుల పాటు క్రికెట్ అభిమానులకు పండగే!

ముంబయి

క్రికెట్ అభిమానులకు ఎంతో ఇష్టమైన టీ20 ప్రపంచకప్ రెండేళ్లు తిరక్కుండానే మళ్లీ వచ్చేసింది. 2024లో రోహిత్‌సేన అద్భుత ప్రదర్శనతో కప్పును చేజిక్కించుకోగా.. ఇప్పుడు సూర్యకుమార్ నేతృత్వంలోని భారత జట్టు భారీ అంచనాలతో కప్పు వేటకు సిద్ధమైంది. 2024లో టైటిల్ గెలవగానే రోహిత్, కోహ్లి టీ20లకు గుడ్‌బై చెప్పేయగా.. నాటి జట్టులోని సూర్యకుమార్ యాదవ్, హార్దిక్ పాండ్య, జస్‌ప్రీత్ బుమ్రా లాంటి అనుభవజ్ఞులు మరోసారి భారీ అంచనాలతో బరిలోకి దిగుతున్నారు. గత టోర్నీలో ఆడిన అక్షర్ పటేల్, అర్ష్‌దీప్ సింగ్, కుల్‌దీప్ యాదవ్ కూడా ఇప్పుడు బరిలో ఉన్నారు. తొలి బంతి నుంచే బాదేసే యువ ఓపెనర్ అభిషేక్ శర్మ.. జట్టులో కొత్త సూపర్ స్టార్. కీలక ఆటగాడిగా ఎదిగిన తెలుగు కుర్రాడు తిలక్ వర్మ మీదా భారీ అంచనాలే ఉన్నాయి. కివీస్‌తో సిరీస్‌లో సంజు శాంసన్ విఫలమైన నేపథ్యంలో ఫామ్‌లో ఉన్న ఇషానే.. అభిషేక్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను ఆరంభించే అవకాశముంది. ఆ తర్వాత సూర్యకుమార్, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్య, శివమ్ దూబె, అక్షర్ పటేల్‌లతో భారత బ్యాటింగ్‌కు తిరుగులేదు. అయితే బ్యాటింగ్ ఎంత భీకరంగా ఉన్నప్పటికీ.. బౌలర్లు రాణించడాన్ని బట్టే భారత్ కప్పు గెలుస్తుందా లేదా అన్నది ఆధారపడి ఉంది. బ్యాటింగ్‌కు అనుకూలిస్తున్న పిచ్‌లపై ఇటీవల బుమ్రా సహా భారత బౌలర్ల ప్రదర్శన అంతంతమాత్రంగానే సాగింది. ప్రపంచకప్‌లోనూ వికెట్లు బ్యాటర్ల పక్షమే వహించొచ్చు. మరి పేసర్లు బుమ్రా, అర్ష్‌దీప్, సిరాజ్, హార్దిక్, దూబె.. స్పిన్నర్లు అక్షర్, వరుణ్ చక్రవర్తి, కుల్‌దీప్ ప్రత్యర్థి బ్యాటర్లకు ఏమేర కళ్లెం వేస్తారో చూడాలి. అక్షర్‌తో పాటుగా వరుణ్, కుల్‌దీప్‌ల్లో ఒకరు తుది జట్టులో ఉంటారు. తిరుగులేని బ్యాటింగ్, స్వదేశంలో సొంత అభిమానుల మధ్య ఆడుతుండడం భారత్‌ను టోర్నీలో బలమైన ఫేవరెట్‌గా నిలబెట్టే అంశాలు. అయితే ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్, న్యూజిలాండ్ జట్లు కూడా బలంగా కనిపిస్తున్నాయి. ఆ జట్లూ కప్పుపై కన్నేశాయి.


సూర్యకుమార్

టీ20 ప్రపంచకప్ ఆడే మొత్తం జట్లు: 20

గ్రూప్-ఎ: భారత్, నమీబియా, నెదర్లాండ్స్, పాకిస్థాన్, అమెరికా
గ్రూప్-బి: ఆస్ట్రేలియా, ఐర్లాండ్, ఒమన్, శ్రీలంక, జింబాబ్వే
గ్రూప్-సి: ఇంగ్లాండ్, ఇటలీ, నేపాల్, స్కాట్లాండ్, వెస్టిండీస్
గ్రూప్-డి: అఫ్గానిస్థాన్, కెనడా, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, యూఏఈ

ఫార్మాట్ ఇలా

మొత్తం 20 జట్లు గ్రూప్‌నకు అయిదు చొప్పున నాలుగు గ్రూప్‌లుగా విడిపోయి తలపడనున్నాయి. ప్రతి జట్టు తమ గ్రూప్‌లో మిగిలిన నాలుగు జట్లతో ఒక్కో మ్యాచ్ ఆడుతుంది. గ్రూప్‌లో టాప్-2లో నిలిచిన జట్లు సూపర్-8కు అర్హత సాధిస్తాయి. ఫిబ్రవరి 15న భారత్‌తో షెడ్యూల్ అయిన మ్యాచ్ నుంచి పాకిస్థాన్ వైదొలగడంతో సూర్య సేన టోర్నీలో దిగకుండానే 2పాయింట్లు దక్కించుకున్నట్లే. ఒకవేళ నాకౌట్లో టీమ్ ఇండియాతో ఆడాల్సి వస్తే పాక్ బరిలో దిగుతుందా లేదో?

ఘనారంభమేనా?: భారత్ ఉన్న గ్రూప్-ఎలో పాకిస్థాన్, నెదర్లాండ్స్, అమెరికా, నమీబియా కూడా ఉన్నాయి. మిగతా జట్లను ఓడించడం, గ్రూప్‌లో అగ్రస్థానం సాధించడం భారత్‌కు లాంఛనమే కావచ్చు. శనివారం ఉదయం కొలంబోలో జరిగే పాకిస్థాన్-నెదర్లాండ్స్ మ్యాచ్‌తో టీ20 ప్రపంచకప్ ఆరంభమవుతుంది. తర్వాత గ్రూప్-సిలో వెస్టిండీస్, స్కాట్లాండ్ తలపడతాయి. రాత్రి అమెరికా మ్యాచ్‌తో టీమ్‌ఇండియా కప్పు వేటను ఆరంభిస్తుంది. భారత సంతతికి చెందిన కెప్టెన్ మోనాంక్ పటేల్, సౌరభ్ నేత్రావల్కర్, మిలింద్ కుమార్, సంజయ్ కృష్ణమూర్తి, హర్మీత్ సింగ్ లాంటి ప్రతిభావంతులు ఉన్నప్పటికీ.. టీమ్‌ఇండియా ధాటికి యుఎస్‌ఏ ఏమాత్రం నిలుస్తుందన్నది సందేహమే.

● ఇప్పుడు జరగబోయేది పదో టీ20 ప్రపంచకప్. 2007లో జరిగిన తొలి పొట్టి కప్పులో ధోని నేతృత్వంలోని భారత జట్టు విజేతగా నిలిచింది. 2024లో జరిగిన చివరి ప్రపంచకప్‌లో రోహిత్‌సేన ఛాంపియన్ అయింది.

హర్షిత్‌కు గాయం.. సిరాజ్‌కు చోటు: భారత యువ పేసర్ హర్షిత్ రాణా టీ20 ప్రపంచకప్‌నకు దూరమయ్యాడు. వార్మప్ మ్యాచ్ సందర్భంగా గాయపడిన అతడు తొందరగా కోలుకునే అవకాశం లేకపోవడంతో బీసీసీఐ అతడిని జట్టు నుంచి తప్పించింది. హైదరాబాద్ పేసర్ మహ్మద్ సిరాజ్‌కు చోటు కల్పించింది. ఈ మార్పునకు ఐసీసీ ఆమోదం తెలిపింది.

భారత్ షెడ్యూల్

ఫిబ్రవరి 7 భారత్ × అమెరికా (వాంఖడే)
ఫిబ్రవరి 12 భారత్ × నమీబియా (దిల్లీ)
ఫిబ్రవరి 18 భారత్ × నెదర్లాండ్స్ (అహ్మదాబాద్)

● భారత్ మ్యాచ్‌లన్నీ రాత్రి 7కు ఆరంభమవుతాయి.
● ఫిబ్రవరి 20న మినహాయించి లీగ్ దశలో ప్రతి రోజూ మూడేసి మ్యాచ్‌లు జరుగుతాయి.

40 ఈసారి ప్రపంచకప్‌లో ఇతర దేశాల తరఫున బరిలో దిగబోతున్న భారత సంతతికి చెందిన ఆటగాళ్ల సంఖ్య. అత్యధికంగా కెనడా జట్టులో 11 మంది ఉన్నారు. అమెరికా (9), ఒమన్ (7), యూఏఈ (7), న్యూజిలాండ్ (2), దక్షిణాఫ్రికా (1), వెస్టిండీస్ (1), ఇటలీ (1), నెదర్లాండ్స్ (1)కు ప్రాతినిధ్యం వహించనున్నారు. ఇందులో కెనడా, అమెరికా, ఒమన్‌లకు సారథులు భారత సంతతి ఆటగాళ్లే కావడం విశేషం.

దూసుకొచ్చారు

ఈనాడు క్రీడావిభాగం

అండర్-19 వన్డే ప్రపంచకప్.. టీమ్‌ఇండియాకు దగ్గరి దారి. ఈ టోర్నీలో రాణించిన ఎందరో క్రికెటర్లు ఆ తర్వాత భారత జట్టులోనూ చోటు సంపాదించి స్టార్ ఆటగాళ్లుగా అవతరించారు. యువరాజ్ సింగ్, విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ, రవీంద్ర జడేజా ఆ కోవకు చెందిన ఆటగాళ్లే. ఈసారీ కొందరు అదిరే ఆటతో సీనియర్ జట్టుకు సిద్ధమని చాటారు. అందులో వైభవ్ సూర్యవంశీ ముందుంటే.. ఆయుష్ మాత్రే, విహాన్ కూడా సై అంటున్నారు. వీళ్లే కాదు.. బ్యాట్‌తో కొందరు.. బంతితో ఇంకొందరు.. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో మరికొందరు కీలకమయ్యారు. పెద్ద వేదికపై అదరగొట్టిన ఈ కుర్రాళ్లు.. భారత జట్టులోకి రాగలమన్న భరోసా ఇచ్చారు.

పక్కా హైదరాబాదీ!

ఈ ప్రపంచకప్‌లో వెలుగులోకి వచ్చిన మరో యువ తార.. ఆరోన్ జార్జ్. కేరళకు చెందిన అతను.. హైదరాబాద్‌లో స్థిరపడ్డాడు. హైదరాబాద్‌కే ఆడుతున్నాడు. ఈ టోర్నీలో ఈ ఓపెనర్ రెండు సెంచరీలతో సత్తా చాటాడు. అఫ్గానిస్థాన్‌తో సెమీఫైనల్లో 311 పరుగుల ఛేదనలో అదిరే సెంచరీ చేసిన ఆరోన్ (115).. లీగ్ దశలో దక్షిణాఫ్రికాపైనా (118) శతకం బాదాడు. అండర్-19 ప్రపంచకప్‌లో సెంచరీ రాబట్టిన తొలి హైదరాబాదీగా ఆరోన్ సరికొత్త రికార్డు సృష్టించాడు. గతంలో అంబటి రాయుడు, తిలక్‌వర్మ భారత అండర్-19 క్రికెట్లో సెంచరీలు సాధించారు. కానీ ప్రపంచకప్‌లో శతకాలు చేయలేదు. మణికట్టు మాయాజాలంతో కళాత్మక డ్రైవ్‌లు.. సొగసైన స్ట్రోక్ ప్లే.. అద్భుతమైన ఫ్లిక్‌లు.. గొప్ప టైమింగ్.. మొత్తంగా సంప్రదాయ పద్ధతిలో అతడి ఆట సాగింది. టీ20 హోరులో.. బంతిని బలంగా బాదడమే బ్యాటింగ్ అనుకుంటున్న కాలంలో.. పాత తరం ఆటగాళ్లను స్ఫురణకు తెచ్చాడు ఆరోన్. స్కాట్లాండ్‌పై అర్ధ సెంచరీ (61)లోనూ ఆరోన్ తన శైలిలో టెక్నిక్, టైమింగ్‌ను ప్రదర్శించాడు.


ఆరోన్ జార్జ్


ఆయుష్

విహాన్, ఆయుష్ బ్యాట్, బంతితో..: వైభవ్ సూర్యవంశీతో పాటు.. భారత జట్టు విజయాల్లో కెప్టెన్ ఆయుష్ మాత్రే, విహాన్ మల్హోత్రాలదీ ప్రధాన పాత్రే. మిడిలార్డర్‌లో భారత జట్టుకు ఇరుసులా నిలిచిన వీళ్లిద్దరు. బంతితోనూ సత్తా చాటారు. జింబాబ్వేపై సూపర్ సిక్స్ మ్యాచ్‌లో అజేయ సెంచరీ (109)తో అదరగొట్టిన విహాన్.. లీగ్ దశలో స్కాట్లాండ్‌పై 77 పరుగులు చేశాడు. బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌లో బంతితోనూ మాయ చేసిన ఈ పటియాలా కుర్రాడు 14 పరుగులకే 4 వికెట్లు తీశాడు. అఫ్గానిస్థాన్‌తో సెమీస్‌లో అర్ధసెంచరీ (62) చేసిన ఆయుష్.. లీగ్ దశలో న్యూజిలాండ్‌పై 53, ఇంగ్లాండ్‌పై 49 పరుగులతో రాణించాడు. ఫైనల్లో 53 పరుగులతో సత్తాచాటాడు. ఆఫ్‌స్పిన్ బౌలింగ్‌తోనూ ఈ ముంబయి కుర్రాడు మెరిశాడు. పాకిస్థాన్ (3/21), జింబాబ్వే (3/14)పై అదిరే ప్రదర్శనలు చేశాడు. ఫైనల్లో కీలక దశలో వికెట్ పడగొట్టాడు కూడా.

అభిజ్ఞాన్ స్థిరంగా..: ప్రస్తుత అండర్-19 ప్రపంచకప్‌లో స్థిరంగా ఆడిన బ్యాటర్లలో అభిజ్ఞాన్ ఒకడు. 7 మ్యాచ్‌ల్లో 59.75 సగటుతో 239 పరుగులు చేశాడీ వికెట్‌కీపర్ బ్యాటర్. ఇంగ్లాండ్ (82), బంగ్లాదేశ్ (80), జింబాబ్వే (61), స్కాట్లాండ్ (55)పై కుందు అర్ధసెంచరీలు నమోదు చేశాడు. న్యూజిలాండ్‌తో లీగ్ మ్యాచ్‌లో బ్యాట్‌తో విఫలమైనా.. మూడు క్యాచ్‌లు, ఓ స్టంపింగ్ చేసి విజయంలో తన వంతు పాత్ర పోషించాడు.

బంతితో వాళ్లు: భారత్ కప్ గెలవడంలో బంతితో కీలకమయ్యారు హెనిల్ పటేల్, అంబ్రిష్, ఖిలాన్ పటేల్. వీరు ఆరంభంలోనే వికెట్లు పడగొట్టి ప్రత్యర్థి జట్లను ఒత్తిడిలోకి నెట్టారు. పేసర్లు హెనిల్, అంబ్రిష్ 7 మ్యాచ్‌ల్లో 11 చొప్పున వికెట్లు పడగొట్టగా.. ఖిలాన్ 9 వికెట్లు తీశాడు. అమెరికా (5/16)పై హెనిల్ ప్రదర్శన హైలైట్. కివీస్‌పైనా సూపర్ బౌలింగ్ (3/23)తో ఆకట్టుకున్నాడు. ఇంగ్లాండ్‌తో ఫైనల్లో సత్తా చాటిన పేసర్ అంబ్రిష్ (3/56).. లీగ్ దశలో న్యూజిలాండ్‌పై (4/29) కూడా రాణించాడు. లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ ఖిలాన్.. స్కాట్లాండ్, పాకిస్థాన్‌పై మూడేసి వికెట్లు తీసి విజయంలో భాగస్వామి అయ్యాడు.


ఖిలాన్, హెనిల్

● నెదర్లాండ్స్‌తో భారత్ ఢీ

బెంగళూరు: డేవిస్ కప్ క్వాలిఫయర్ తొలి రౌండ్‌కు భారత్ సిద్ధమైంది. శనివారం ప్రారంభమయ్యే పోరులో నెదర్లాండ్స్‌తో భారత్ తలపడనుంది.

● ముకేశ్ జోడీకి స్వర్ణం

గుంటూరు క్రీడలు, న్యూస్‌టుడే: ఆసియా పిస్టల్, రైఫిల్ ఛాంపియన్‌షిప్‌లో గుంటూరు కుర్రాడు ముకేశ్ నేలవల్లి.. వంశిక చౌదరితో కలిసి స్వర్ణ పతకం గెలిచాడు. ఈ జోడీ జూనియర్ మిక్స్‌డ్ టీమ్ పిస్టల్ విభాగం ఫైనల్లో 481.1 పాయింట్లతో ప్రపంచ రికార్డు నెలకొల్పింది.

● భారత జట్ల పరాజయం

కింగ్‌డావో (చైనా): ఆసియా టీమ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో భారత జట్లకు చుక్కెదురైంది. మహిళల విభాగంలో డిఫెండింగ్ ఛాంపియన్ భారత్ క్వార్టర్‌ఫైనల్లో 0-3తో చైనా చేతిలో ఓడింది. తన్వి శర్మ, రక్షిత శ్రీ, గాయత్రి గోపీచంద్- ట్రీసా జాలీ ఓడారు. పురుషుల క్వార్టర్స్‌లో భారత్ 1-3తో కొరియా చేతిలో పరాజయం పాలయింది. కిదాంబి శ్రీకాంత్ గెలవగా.. ఆయుష్ శెట్టి, చిరాగ్ శెట్టి- హరిహరన్, పృథ్వీ-సాయి ప్రతీక్ ఓటమి చవిచూశారు.

భార్యలు చనిపోయిన పురుషులనూ ఆదుకోవాలి

• మహారాష్ట్ర గ్రామసభ తీర్మానం

మహారాష్ట్రలోని అహిల్యానగర్ జిల్లా కోపర్‌గావ్ తాలూకా పరిధిలో గల సోనేవాడి పంచాయతీ గ్రామసభ ఓ వినూత్న తీర్మానాన్ని ఆమోదించింది. ఆర్థికంగా బలహీనంగా ఉండి, నిరాశ్రయులైన విధురులకు (భార్య చనిపోయిన పురుషులకు) మహిళా వితంతువుల మాదిరిగానే సామాజిక భద్రత కల్పించేలా ప్రభుత్వ పథకాలు మంజూరు చేయాలని కోరుతూ చేసిన తీర్మానానికి ఈ గ్రామసభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఇందిరాగాంధీ జాతీయ వితంతు పింఛను పథకం, సంజయ్‌గాంధీ నిరాధార్ అనుదాన్ యోజన వంటి పథకాల కింద ప్రస్తుతం వితంతువులను ప్రభుత్వం ఆదుకుంటోంది. భార్యలు చనిపోయిన విధురులకు ఆదరణ కల్పించే పథకాలు లేవని గ్రామసభ ఆవేదన వ్యక్తం చేసింది. ఈ కోణంలో ప్రభుత్వాలు పురుషుల గురించి కూడా ఆలోచించాలని



వాలని కోరుతూ సోనేవాడి గ్రామసభలోని కోకర్ జవాలే గ్రామసభలో ప్రతిపాదన చేశారు. సోనేవాడిలో విధురులైన పురుషులు దాదాపు 150 మంది ఉన్నట్లు వెల్లడించారు. దీన్ని సభ్యులు సమర్థించారు. పథకాల అమలులో వివక్షతో సామాజిక అసమానతలు పెరుగుతాయంటూ తీర్మానాన్ని ఆమోదించినట్లు సభకు అధ్యక్షత వహించిన గ్రామ సర్పంచి శకుంతలా తాయి తెలిపారు. ఈ తీర్మానం కాపీని సంబంధిత ప్రభుత్వ విభాగాలకు పంపుతామని గ్రామ పంచాయతీ అధికారి బాబుదాస్ దబాదే ప్రకటించారు.

కబూతర్ ఆ.. ఆ.. ఆజా!

భవనం ముందు జనం నిలబడి పైకి చూస్తున్న ఈ దృశ్యం రాజస్థాన్‌లోని నాగౌర్ జిల్లా దేగానా పట్టణానికి చెందినది. స్థానిక బులియన్ మార్కెట్‌లోని నగల దుకాణం నుంచి రూ.లక్ష విలువచేసే బంగారు గొలుసును ముక్కున కరచుకుని భవనం పైకి చేరిన పావురాన్ని జనమంతా ఆసక్తిగా చూశారు. శుక్రవారం జరిగిన ఈ ఘటనతో మార్కెట్లో కాసేపు గందరగోళం నెలకొంది. బంగారం ధరలు రోజు రోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో దుకాణాల వద్ద భద్రతను ఎంతో కట్టుదిట్టం చేసినా.. 'ఆ పావురం లోపలకు వచ్చి గొలుసును ఎలా చేజిక్కించుకుందో చెప్మా' అని జనం చర్చించుకోవడం మొదలుపెట్టారు. దుకాణదారులు చాలాసేపు ప్రయత్నాలు చేశాక.. పావురం గొలుసును కింద జారవిడిచి తుర్రుమనడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.



అణ్వస్త్ర సామర్థ్య అగ్ని-3 పరీక్ష విజయవంతం

బాలేశ్వర్: అణ్వస్త్రాలను మోసుకెళ్లగల అగ్ని-3 బాలిస్టిక్ క్షిపణిని భారత్ శుక్రవారం విజయవంతంగా పరీక్షించింది. ఒడిశా తీరానికి చేరువలోని చాందీపుర్ నుంచి ఈ ప్రయోగం జరిగింది. ఉపరితలం నుంచి ఉపరితలంపైనున్న లక్ష్యాలను చేదించగల ఈ అస్త్రం పరిధి 3వేల కిలోమీటర్లు పైనేనని అధికారులు తెలిపారు. సాధారణ శిక్షణలో భాగంగా సైన్యంలోని వ్యూహాత్మక దళాల విభాగం తాజా పరీక్షను నిర్వహించింది. ప్రయోగానికి సంబంధించిన అన్ని అంశాలనూ సమర్థంగా లాంచర్ నుంచి క్షిపణి నింగిలోకి దూసుకెళ్లింది. నిర్దేశిత మార్గంలో పయనిస్తూ.. బంగాళాఖాతంలో లక్షిత ప్రాంతాన్ని చేరింది. అక్కడి వేదికలో మోహరించిన నౌకలు దీన్ని రికార్డు చేశాయి. ఈ పరీక్షకు సంబంధించిన అన్ని లక్ష్యాలూ నెరవేరాయని రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) వర్గాలు తెలిపాయి. తీర ప్రాంతంలోని రాడార్లు, టెలిమెట్రీ, ఎలక్ట్రో-ఆప్టికల్ వ్యవస్థలు ఈ క్షిపణి ప్రయాణ మార్గాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించాయి. అధునాతన క్షిపణి అయిన అగ్ని-3.. ఇప్పటికే భారత సైనిక దళాల అమ్ములపొదిలో చేరింది. 1.5 టన్నుల పేలోడ్‌ను ఇది మోసుకెళ్లగలదు. దీని పొడవు 17 మీటర్లు. ఘన ఇంధనంతో పనిచేసే రెండు దశలు ఇందులో ఉన్నాయి.

లోక్‌సభ కార్యకలాపాలకు ఆటంకం

• విపక్షాల నిరసనలతో సభ సోమవారానికి వాయిదా

దిల్లీ: విపక్షాల నినాదాలు, నిరసనలతో శుక్రవారం లోక్‌సభ ఎటువంటి కార్యకలాపాలనూ చేపట్టలేకపోయింది. ప్రతిపక్ష సభ్యులు పదేపదే అడ్డుపడటంతో సోమవారానికి వాయిదాపడింది. శుక్రవారం ఉదయం సభ సమావేశం కాగానే.. అమెరికాతో వాణిజ్య ఒప్పందాన్ని వ్యతిరేకిస్తూ రాహుల్ గాంధీ మాట్లాడేందుకు అవకాశం ఇవ్వడం లేదని ఆరోపిస్తూ...విపక్ష సభ్యులు ప్లకార్డులతో సభా మధ్యంలోకి దూసుకెళ్లారు. బడ్జెట్ సమావేశాల్లో ఇప్పటికే 19 గంటలకు పైగా సభా సమయం వృథా అయ్యిందని స్పీకర్ ఓం బిర్లా తెలిపారు. అయినా సభ్యులు వెనక్కితగ్గకపోవడంతో జీరో అవర్ నిర్వహించలేనని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం సభను వాయిదా వేశారు. తిరిగి 12 గంటలకు సమావేశమైనప్పటికీ సభలో నిరసనలు కొనసాగాయి. సభ్యులు కూర్చోవాలని, ప్లకార్డులు తొలగించాలంటూ సభాధ్యక్ష స్థానంలో ఉన్న కృష్ణప్రసాద్ తెన్నేటి విజ్ఞప్తి చేశారు. అయినా విపక్ష సభ్యులు శాంతించకపోవడంతో సభను సోమవారానికి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.



పార్లమెంటు ప్రాంగణంలో ధర్నా

లోక్‌సభ వాయిదాపడిన అనంతరం కాంగ్రెస్ ఎంపీలతో పాటు విపక్ష సభ్యులు పార్లమెంటు మకర ద్వారం వద్ద గుమిగూడారు. 'నియంతృత్వాన్ని సహించం', 'నరేంద్ర సరెండర్', 'ప్రజాస్వామ్యాన్ని హత్యచేయడాన్ని ఆపండి' అంటూ నినాదాలు చేస్తూ ధర్నా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ, లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ, బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకూ సస్పెండ్ అయిన ఎంపీలు తదితరులు ధర్నాలో పాల్గొన్నారు.

మనాలీ టు లేహ్.. 98 గంటల్లో పరుగు

5వ గిన్నిస్ రికార్డు సొంతం

ఈటీవీ భారత్: రాజస్థాన్‌లోని అజ్‌మేర్‌కు చెందిన సూఫియా 40 ఏళ్ల వయసులో అయిదో గిన్నిస్ రికార్డు సాధించారు. ఎత్తయిన మంచు పర్వతాల మీదుగా ఈమె హిమాచల్‌ప్రదేశ్‌లోని మనాలీ నుంచి లద్దాఖ్‌లోని లేహ్ వరకు దాదాపు 430 కిలోమీటర్ల దూరాన్ని 98.27 గంటల నిరంతర పరుగుతో పూర్తి చేశారు. గతంలో కశ్మీర్ నుంచి కన్యాకుమారి



వరకు పరుగు తీసిన సూఫియా ఖాతాలో ఇప్పటికే నాలుగు గిన్నిస్ రికార్డులు ఉండగా. తాజా విజయంతో ఫిబ్రవరి 2న అయిదో రికార్డు అందుకున్నారు. "ఆగస్టు 1న నా పుట్టినరోజు సందర్భంగా తూర్పు భారతదేశం నుంచి పశ్చిమానికి పరుగు ప్రారంభిస్తాను. ఆ తర్వాత 23 దేశాల మీదుగా 680 రోజుల పాటు ప్రపంచయాత్రగా పరుగు తీయాలన్నది నా కల" అని సూఫియా తెలిపారు.

పాక్‌లో మారణహోమం

• ఇస్లామాబాద్‌లో మసీదు వద్ద ఆత్మాహుతి దాడి

• 31 మంది దుర్మరణం



పేలుడు జరిగిన మసీదు

ఇస్లామాబాద్: పాకిస్థాన్ మరోసారి రక్తసిక్తమైంది. ఆ దేశ రాజధాని ఇస్లామాబాద్‌లో ఓ మసీదు లక్ష్యంగా శుక్రవారం ఆత్మాహుతి దాడి చోటుచేసుకుంది. ఈ ఘటనలో 31 మంది మృత్యువాతపడ్డారు. 169 మంది గాయపడ్డారు. ఇస్లామాబాద్‌లోని శివారు ప్రాంతంలో తర్లాయి కలాన్ ఖుదా అనే షియా మసీదు ఉంది. పోలీసులు, పలువురు ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం- శుక్రవారం ప్రార్థనలు జరుగుతుండగా ఆ మసీదు వద్దకు ఓ ఆత్మాహుతి బాంబర్ వచ్చాడు. అతణ్ని గేటు వద్దే భద్రతాసిబ్బంది ఆపగా, తనను తాను పేల్చేసుకున్నాడు. పేలుడు తీవ్రతకు పలువురి అవయవాలు తెగిపడ్డాయి. మృతదేహాలు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. పోలీసులు, ఇతర సిబ్బంది అక్కడికి చేరుకొని.. గాయపడ్డవారిని ఆసుపత్రులకు తరలించారు. ఆత్మాహుతి బాంబర్ తొలుత కాల్పులు జరిపి, తర్వాత తనను తాను పేల్చేసుకున్నాడని మరో ప్రత్యక్ష సాక్షి తెలపడం గమనార్హం.

తమ ప్రమేయం లేదన్న టీటీపీ: ఆత్మాహుతి దాడి తమ పనేనని ఇప్పటివరకూ ఉగ్రవాద సంస్థలేవీ ప్రకటించలేదు. ఆత్మాహుతి బాంబర్ విదేశీయుడని పోలీసువర్గాలు చెబుతున్నాయి. అతడికి తెహ్రీక్-ఎ-తాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ)తో సంబంధాలున్నట్లు అనుమానిస్తున్నాయి. దాడిలో తమ ప్రమేయం లేదని టీటీపీ స్పష్టంచేసింది. రెండు రోజుల పర్యటన నిమిత్తం ఉజ్బెకిస్థాన్ అధ్యక్షుడు షవ్కత్ మిర్జియోయెవ్ గురువారం పాక్‌కు చేరుకున్నారు. ఆయన పర్యటన కొనసాగుతుండగానే ఇస్లామాబాద్‌లో ఈ దాడి జరగడం గమనార్హం. మరోవైపు- మసీదు వద్ద దాడిలో భారత్, అఫ్గానిస్థాన్‌ల ప్రమేయం ఉందని పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ నిరాధార ఆరోపణలు చేశారు. వీటిని భారత్ నిర్ద్వంద్వంగా ఖండించింది.



మీ పని మీరు చేసుకుంటూ వెళ్లండి

ఇతరులు మిమ్మల్ని ప్రశంసించినప్పుడూ మీ పని మీరు చేసుకుంటూ వెళ్లండి. మిమ్మల్ని విమర్శించినప్పుడూ మీ పని మీరు చేసుకుంటూ వెళ్లండి. అసలు మీ శ్రమను ఎవ్వరూ గుర్తించకపోయినా, మీ పని మీరు చేసుకుంటూ వెళ్లండి. ప్రతిరోజూ నిబద్ధతతో మీ పని మీరు చేస్తే మిమ్మల్ని మీరు అభినందించుకొనేలా విజయాలు సాధిస్తారు.

– జాన్ గోర్డాన్, రచయిత

ఇష్టంలేని గర్భం కొనసాగింపునకు

మహిళను బలవంతం చేయడం తగదు

• 30వారాల పిండం తొలగింపునకు సుప్రీంకోర్టు అనుమతి

దిల్లీ: అవాంఛిత గర్భం ద్వారా బిడ్డను కనాలని మహిళను, ముఖ్యంగా మైనర్ అయిన యువతిని బలవంతం చేయడం తగదని సుప్రీంకోర్టు పేర్కొంది. 17 ఏళ్ల బాలిక మోస్తున్న 30 వారాల పిండం విచ్ఛిత్తికి వైద్యులను ఆదేశించింది. పొరుగింటి కుర్రాడితో సంబంధంలో ఉన్న బాలిక గర్భం ధరించిందని, దానిని ఆమె తొలగించాలని కోరుకుంటుందన్న విషయం జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ధర్మాసనం దృష్టికి రాగా ఈ ఆదేశాలు జారీ అయ్యాయి. వైద్యపరమైన అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ ఆ బాలికకు గర్భస్రావం చేయాలని ముంబయిలోని జెజె ఆసుపత్రి వైద్యులకు ధర్మాసనం సూచించింది. దురదృష్టకరమైన పరిస్థితుల్లో గర్భం ధరించిన యువతికి.. బిడ్డకు జన్మనివ్వాలా వద్దా అని నిర్ణయించుకునే హక్కు ఉందని పేర్కొంది. ఇష్టప్రకారంగా జరిగిన కలయిక వల్ల గర్భం వచ్చిందా లేక లైంగిక దాడి ఫలితమా అన్నది



ప్రస్తుత కేసు సమస్యకాదని తెలిపింది. 24వారాల లోపు పిండమైతే గర్భస్రావానికి చట్టపరంగా అనుమతి ఉన్నప్పుడు 30 వారాల పిండాన్ని ఆమె ఎందుకు తొలగించుకోరాదని ధర్మాసనం ప్రశ్నించింది. వైద్యనిపుణుల పర్యవేక్షణలో గర్భస్రావానికి కోర్టు అనుమతి ఇవ్వకపోతే నకిలీవైద్యులను ఆశ్రయిస్తారని, ఇది మరింత ప్రమాదకరమని హెచ్చరించింది.

రష్యా సైనిక నిఘా సంస్థ డిప్యూటీ చీఫ్‌పై కాల్పులు

మాస్కో: రష్యా సైనిక నిఘా సంస్థ డిప్యూటీ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ వ్లాదిమిర్ అలెక్సేయేవ్‌పై గుర్తుతెలియని వ్యక్తి శుక్రవారం కాల్పులకు పాల్పడ్డాడు. ఇందులో ఆయన గాయపడ్డారు. రష్యాకు చెందిన సైనికాధికారులపై దాడిచేసి చంపేస్తున్న ఘటనలు జరుగుతున్నాయి. ఇవన్నీ ఉక్రెయిన్ దుశ్చర్యలేనని రష్యా ఆరోపిస్తోంది. మాస్కోలో తన అపార్ట్‌మెంట్ నుంచి వ్లాదిమిర్ వెలుపలికి వస్తున్న సమయంలో ఈ ఘటన జరిగింది. డెలివరీ బాయ్ వేషంలో వచ్చిన దుండగుడు ఆయనపై కాల్పులు జరిపాడు.

అమెరికా-ఇరాన్ పరోక్ష చర్చలు

• ఒమన్ విదేశాంగ మంత్రితో విడివిడిగా భేటీ అయిన ఇరు దేశాల ప్రతినిధులు

మస్కట్: పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నవేళ.. ఒమన్ వేదికగా అమెరికా, ఇరాన్ పరోక్ష చర్చలు మొదలయ్యాయి. ఇరు దేశాల ప్రతినిధులు ఒమన్ విదేశాంగ మంత్రి బదర్ అల్-బుసైదీతో శుక్రవారం విడివిడిగా భేటీ అయ్యారు. ఈ చర్చలను 'చాలా మంచి ఆరంభం'గా ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి అభివర్ణించారు. అణు కార్యక్రమంపై భవిష్యత్ సంప్రదింపులకు బాటలు పరచడంపైనే ప్రాథమికంగా తాము దృష్టిసారించినట్లు చెప్పారు. ఒమన్ వర్గాలు కూడా ఇదే విషయాన్ని స్పష్టంచేశాయి. ఒమన్ రాజధాని మస్కట్ శివార్లలోని ఓ రాజభవనంలో తొలుత బదర్ అల్-బుసైదీతో అబ్బాస్ అరాఘ్చి సహా ఇరాన్ ప్రతినిధులు భేటీ అయ్యారు. వారు వెళ్లిపోయిన అనంతరం అమెరికా రాయబారి స్టీవ్ విట్కాఫ్, ఆ దేశాధ్యక్షుడు ట్రంప్ అల్లుడు జేర్డ్ కుష్నర్ తదితరులు రాజభవనానికి వచ్చి ఒమన్ విదేశాంగ మంత్రితో దాదాపు గంటన్నరపాటు సమాలోచనలు జరిపారు. అమెరికా బృందంలో నౌకాదళ అడ్మిరల్, అమెరికా మిలిటరీ సెంట్రల్ కమాండ్ అధిపతి బ్రాడ్ కూపర్ కూడా ఉండటం గమనార్హం. చర్చలు విఫలమైతే దాడులకు దిగుతామంటూ టెహ్రాన్‌కు సంకేతాలు పంపేందుకే కూపర్‌ను తమ బృందంలో వాషింగ్టన్ చేర్చుకున్నట్లు విశ్లేషణలు వెలువడుతున్నాయి.

పదే పదే అసత్యాలు చెప్పడమే మోదీ పని

ప్రధానిపై మల్లికార్జున ఖర్గే మండిపాటు



దిల్లీ: పదే పదే అసత్యాలు చెప్పడమే ప్రధాని మోదీ పని అని కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో విపక్షనేత మల్లికార్జున ఖర్గే ధ్వజమెత్తారు. రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై రాజ్యసభలో గురువారం మోదీ ప్రసంగిస్తూ ప్రతిపక్షాలపై విమర్శలు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఖర్గే శుక్రవారమిక్కడ మీడియాతో మాట్లాడుతూ.. ప్రతిపక్షాలు సంధించిన ప్రశ్నలకు జవాబిచ్చే ధైర్యం ప్రధానికి లేదని విమర్శించారు. రాష్ట్రపతి ప్రసంగంపై సభలో తాము లేవనెత్తిన అంశాల్లో ఒక్కదానిపైనా మోదీ సమాధానమివ్వలేకపోయారని చెప్పారు. "లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ జనరల్ నరవణే పుస్తకం గురించి ప్రస్తావించినప్పుడు.. అది ఇంకా ప్రచురితం కాలేదని, ఉనికిలో లేదని.. కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్ తదితరులు పదేపదే అన్నారు. వాస్తవానికి ఆ పుస్తకం ఉనికిలోనే ఉంది. మా ప్రశ్నలకు సమాధానాలు చెప్పే ధైర్యం ప్రధాని మోదీకి లేదు. సిక్కులను కాంగ్రెస్ అవమానించిందని మోదీ అంటున్నారు.. కానీ, వారిని గౌరవించింది కాంగ్రెసే. మన్మోహన్‌ను ఆర్థిక మంత్రిగా, ప్రధానిగా చేసింది మా పార్టీయే. మోదీ మాత్రం ఇతరులను ఎలా తక్కువ చేయాలనే ఆలోచిస్తుంటారు" అని ఖర్గే దుయ్యబట్టారు.

భారత్ సాహసోపేతమైన లక్ష్యాలను నిర్దేశించుకుంది...

వ్యోమగామి శుభాంశు శుక్లా వ్యాఖ్య

పనాజీ: భారత్ సాహసోపేతమైన లక్ష్యాలను నిర్దేశించుకుందని, వాటిని మనం సాధించితీరాలని వ్యోమగామి శుభాంశు శుక్లా వ్యాఖ్యానించారు. జాతీయ పుస్తక ట్రస్ట్ వారు పనాజీలో నిర్వహిస్తున్న గోవా పుస్తక ఉత్సవం 2026లో ఆయన విద్యార్థులతో మాట్లాడారు. "వికసిత భారత్ 2047 కానివ్వండి.. లేదా అంతరిక్ష ప్రయోగాలే అవనివ్వండి. వాటన్నిటినీ మనం ఎలా సాధిస్తాం..? అందరం దాన్ని సాధ్యమయ్యేలా చేయాలి. మీరందరూ ఆ బాధ్యతను స్వీకరించాలి. ఇప్పటికే గగన్‌యాన్ మిషన్‌పై ప్రయోగాలు ప్రారంభించాం. మనకు సొంతంగా అంతరిక్ష కేంద్రాన్ని నిర్మించుకునే దిశగా కృషి చేస్తున్నాం. ఆ తర్వాత చంద్రుడిపైకి మానవ సహిత యాత్రను చేపట్టనున్నాం. నాకు, మీకు, భారత్‌కు ఆకాశం ఎప్పటికీ హద్దు కాదు" అని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా అంతరిక్ష కోణం నుంచి భూమి ఎలా కనిపిస్తుందనే దృశ్యాలను, ఆయన తన యాక్సియం-4 మిషన్‌లో చిత్రీకరించిన మరి కొన్ని వీడియోలను ప్రదర్శించారు.

నెహ్రూ వల్లే

చైనా చేతిలో ఓడిపోయాం

• నిజాలున్నా 'బ్రూక్స్-భగత్' నివేదికపై మేం రాజకీయం చేయలేదు: రిజిజు వెల్లడి

దిల్లీ: లోక్‌సభలో కాంగ్రెస్ పార్టీ లేవనెత్తిన ఆర్మీ మాజీ చీఫ్ ఎం.ఎం.నరవణె పుస్తకం వ్యవహారాన్ని తిప్పికొడుతూ కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు కీలక వ్యాఖ్యలు చేశారు. 1962 యుద్ధంలో చైనా చేతిలో భారత్ ఘోర ఓటమికి నాటి నెహ్రూ ప్రభుత్వ తప్పుడు నిర్ణయాలే కారణమనే అంశం 'హెండెర్సన్ బ్రూక్స్-భగత్' నివేదికలో ఉందని తెలిపారు. ఈ విషయం తెలిసినప్పటికీ ఆ నివేదికను అధికార రహస్యంగానే ఉంచాలని మోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని రిజిజు చెప్పారు. 'హెండెర్సన్ బ్రూక్స్-భగత్' నివేదిక దేశ రక్షణతో ముడిపడిన సున్నితమైన అంశమైనందున, దాన్ని తాము రాజకీయ అస్త్రంగా వినియోగించలేదన్నారు. ఈ మేరకు రిజిజు ఒక ట్వీట్ చేశారు. 2024 నవంబరు 1న ఎక్స్ వేదికగా తాను చేసిన ఒక ట్వీట్‌ను ఆయన ఇప్పుడు మళ్లీ షేర్ చేశారు.



ఏమిటీ 'హెండెర్సన్ బ్రూక్స్-భగత్' నివేదిక?

థామస్ బ్రియాన్ హెండెర్సన్ బ్రూక్స్ 1909లో బర్మాలో జన్మించారు. 1929 నుంచి 1947 వరకు భారత్‌లోని బ్రిటీష్ ప్రభుత్వ సైన్యంలో అధికారిగా పనిచేశారు. స్వాతంత్ర్యానంతరం 1964 వరకు భారత ఆర్మీలో సేవలు అందించారు. భారత ఆర్మీ బ్రిగేడియర్ పీఎస్ భగత్, థామస్ బ్రియాన్ హెండెర్సన్ బ్రూక్స్‌లతో కూడిన దర్యాప్తు బృందం.. 1962 భారత్-చైనా యుద్ధంపై సమీక్షా నివేదికను రూపొందించింది. దీన్నే 'హెండెర్సన్ బ్రూక్స్-భగత్' నివేదిక అంటారు.

హెచ్-1బీ వీసాదారులు నగరాన్ని ఆక్రమించారు

టెక్సాస్‌లో భారతీయులపై వివక్ష

ఇంటర్నెట్‌డెస్క్: అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రంలో జరిగిన ఓ సమావేశంలో అక్కడి భారతీయులు వివక్షకు గురైనట్లు తెలుస్తోంది. హెచ్-1బీ వీసాదారులు తమ నగరాన్ని ఆక్రమించారంటూ ఫ్రిస్కో నగరంలోని కౌన్సిల్ సమావేశంలో అక్కడి కన్జర్వేటివ్ నేతలు జాతి వివక్ష వ్యాఖ్యలు చేసినట్లు స్థానిక పత్రికల్లో కథనాలు వెలువడ్డాయి. వాటి ప్రకారం.. ఫిబ్రవరి 3న జరిగిన కన్జర్వేటివ్ కౌన్సిల్ సమావేశంలో సామాజిక మాధ్యమాల ఇన్‌ఫ్లూయెన్సర్లు కైలీ కాంబెల్, మార్క్ పలాసియానోలు పాల్గొని భారతీయులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఫ్రిస్కోలో భారతీయుల జనాభా పెరగడం యాదృచ్ఛికం కాదని, ఇక్కడ వీసాల జారీలో మోసాలు జరుగుతున్నాయని ఆరోపించారు. త్వరలో ఈ ప్రాంతం మొత్తం భారతీయులతో నిండిపోతుందని.. ఇప్పటికైనా అమెరికన్లు మేలుకోవాలని మార్క్ పలాసియానో పిలుపునిచ్చారు. అర్హులైన అమెరికన్ల ఉద్యోగాలను లాక్కొనే వీసా విధానానికి తాను, తన మద్దతుదారులు ఎప్పటికీ వ్యతిరేకమేనని అన్నారు. ఈ విద్వేషపూరిత వ్యాఖ్యలను సమావేశంలో పాల్గొన్న భారతీయులు తీవ్రంగా ఖండించారు. నగరంలో నివసించే భారతీయులకు ఫ్రిస్కో మేయర్ జెఫ్ చెనీ మద్దతుగా నిలిచారు. కాగా, ఫ్రిస్కోలో భారతీయ మూలాలున్న జనాభా అధికం. ప్రభుత్వం నిర్వహించిన సర్వే ప్రకారం.. 2010లో 10 శాతంగా ఉన్న వీరి సంఖ్య ఇప్పుడు 33 శాతానికి పెరిగింది.


పట్టపగలే కనిపించనున్న తోకచుక్క!

మెల్‌బోర్న్: కొత్తగా వెలుగుచూసిన ఒక తోకచుక్క ఖగోళశాస్త్రవేత్తల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సూర్యుడి దిశగా దూసుకెళుతున్న ఈ ఖగోళవస్తువు ఏప్రిల్‌లో ప్రకాశవంతంగా కనిపించే అవకాశం ఉంది. సి/2026 ఏ1 (మ్యాప్స్) అనే ఈ తోకచుక్కను నలుగురు ఔత్సాహిక ఖగోళశాస్త్రవేత్తలు గత నెల 13న కనుగొన్నారు. ఇందుకోసం వారు చిలీలోని అటకామా ఎడారిలో ఉన్న ఒక టెలిస్కోపును ఉపయోగించారు. ఆ ఖగోళవస్తువు క్రాయిజ్ తోకచుక్కల తరగతికి చెందింది. ఆ తరగతిలో దేదీప్యమానమైన అనేక తోకచుక్కలు ఉంటాయి. తాజాగా గుర్తించిన మ్యాప్స్ తోకచుక్క.. సూర్యుడి చుట్టూ అత్యంత దీర్ఘవృత్తాకార కక్ష్యలో పరిభ్రమిస్తోంది. భానుడి దిశగా వేగంగా ముందుకు సాగుతోంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో.. సూర్యుడి ఉపరితలానికి కేవలం 1.2 లక్షల కిలోమీటర్ల దూరంలోకి వెళుతుంది. అక్కడి వేడి తాకిడికి విచ్ఛిన్నం కాకుంటే.. ఏప్రిల్ ఆరంభంలో అది సాయం సంధ్యవేళ ఆకాశంలో వెలుగులీనుతూ కనిపిస్తుంది. దక్షిణార్ధగోళ దేశాలవారు దాన్ని సులువుగా వీక్షించొచ్చు.

గురుద్వారా వెలుపల ఆప్ నేత కాల్చివేత

పంజాబ్‌లో దారుణం

చండీగఢ్: పంజాబ్‌లో దారుణం చోటుచేసుకుంది. ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) నేత లక్కీ ఒబెరాయ్‌ని గుర్తుతెలియని వ్యక్తులు కాల్చి చంపారు. జలంధర్ మోడల్ టౌన్‌లోని గురుద్వారా వెలుపల శుక్రవారం ఈ ఘటన జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. లక్కీ ఒబెరాయ్ శుక్రవారం ఉదయం గురుద్వారాకు వచ్చి కారులో తిరుగు పయనమవుతున్నారు. ఈ క్రమంలో ద్విచక్ర వాహనం మీద వచ్చిన దుండగులు ఆయన మీద 8-10 సార్లు కాల్పులు జరిపారు. తీవ్ర రక్తస్రావం అయిన ఒబెరాయ్‌ని గమనించిన స్థానికులు ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందారు. ఒబెరాయ్ భార్య గతంలో ఆప్ అభ్యర్థిగా మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు. హత్య ఘటనపై ప్రతిపక్ష నేతలు స్పందించారు. అధికార పార్టీకి చెందిన నాయకుడికే రాష్ట్రంలో భద్రత లేదని, ఇక సామాన్యుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు కరవయ్యాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి భగవంత్‌మాన్ దీనికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.



లక్కీ ఒబెరాయ్

రాజస్థాన్ హైకోర్టుకు బాంబు బెదిరింపు

జైపుర్: రాజస్థాన్ హైకోర్టుకు శుక్రవారం బాంబు బెదిరింపు వచ్చింది. దీంతో జైపుర్, జోధ్‌పుర్‌లలోని కోర్టు పరిసర ప్రాంతాల్లో ఆందోళనకర వాతావరణం చోటుచేసుకుంది. కోర్టు రిజిస్ట్రార్‌కు ఈ-మెయిల్ ద్వారా ఈ బెదిరింపులు అందాయి. మరోవైపు హరియాణాలోని అంబాలా జిల్లా కోర్టుకూ ఇలాంటి బెదిరింపులే వచ్చాయి. అప్రమత్తమైన పోలీసులు, బాంబు నిర్వీర్య దళాలు, జాగిలాల బృందాలు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని తనిఖీలు నిర్వహించాయి. ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లభించలేదని అధికారులు తెలిపారు.

దిల్లీలో ఘటన

నిర్మాణం కోసం తవ్విన గుంతలో పడి 25 ఏళ్ల యువకుడి మృతి

దిల్లీ: దేశ రాజధాని దిల్లీలో విషాదం చోటుచేసుకుంది. నిర్మాణ పనుల కోసం దిల్లీ జల బోర్డు(డీజేబీ) తవ్విన 15 అడుగుల గుంతలో పడి ఓ 25 ఏళ్ల యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. మృతుడిని కైలాశ్‌పురికి చెందిన కమల్ ధయానిగా గుర్తించారు. వివరాల్లోకి వెళ్తే.. రోహిణి ప్రాంతంలోని కార్యాలయంలో కమల్ విధులు నిర్వహించి, గురువారం రాత్రి ద్విచక్రవాహనం మీద ఇంటికి బయలుదేరాడు. రాత్రైనా రాకపోవడంతో కుటుంబ సభ్యులు అతడి కోసం గాలించారు. జనక్‌పురి, సాగర్‌పుర్, వికాస్ పురి, రోహిణి ప్రాంతాల్లోని పోలీసు స్టేషన్‌లలో ఫిర్యాదు చేసినా.. ఫలితం లేకుండా పోయింది. శుక్రవారం ఉదయం 8 గంటలకు ఓ మహిళ పోలీస్ కంట్రోల్ రూమ్‌కు ఫోన్‌చేసి, గుంతలో వ్యక్తి పడిపోయిన విషయాన్ని తెలియజేసింది. వెంటనే ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు.. బాధితుడిని బయటకు తీసి.. కమల్‌గా గుర్తించారు. అతడు అప్పటికే ప్రాణాలు కోల్పోయి ఉన్నాడు. అధికారుల నిర్లక్ష్యమే కమల్ ప్రాణాలు తీసిందని అతడి కుటుంబ సభ్యులు ఆరోపించారు. పోలీసులకు సమాచారం అందించినా వారు పట్టించుకోలేదని, సరిగ్గా స్పందించి ఉంటే అతడు బతికేవాడని ఆవేదన వ్యక్తంచేశారు. మరోవైపు, గుంత ఉందన్న విషయాన్ని హెచ్చరించేందుకు బారికేడ్లు, గ్రీన్ మెష్ ఏర్పాటు చేశామని, అయినా ఈ ఘటన జరగడం దురదృష్టకరమని డీజేబీ వివరణ ఇచ్చింది. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపింది. ఈ ప్రమాదంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించారు. ఇది ప్రమాదం కాదని, దిల్లీ ప్రభుత్వం చేసిన హత్య అని పేర్కొన్నారు.



గుంతలో నుంచి బైక్‌ను బయటకు తీస్తున్న సిబ్బంది

హైటెక్ విలేజిలో చోరీలకు చెక్

విద్యార్థులకు ఉచిత ఇంటర్నెట్!

మధ్యప్రదేశ్‌లోని జిల్లా కేంద్రం రత్లాంకు 18 కి.మీ.ల దూరాన ఉన్న సెమలియా గ్రామ పంచాయతీలో ఒకప్పుడు దొంగతనాలు విపరీతంగా జరిగేవి. ఇంటి ముందు పెట్టిన బైక్‌లు, ఇతర వాహనాలు తెల్లారేసరికి మాయమయ్యేవి. గ్రామానికి యువ సర్పంచి విశాల్ చౌహాన్ రాకతో ఈ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. రాత్రివేళల్లోనూ అత్యంత నాణ్యంగా ఆడియో, వీడియో రికార్డు చేసే 25 సీసీ కెమెరాలను గ్రామంలోని కీలక కేంద్రాల్లో ఏర్పాటు చేయించారు. ఇప్పుడు చోరీలకు పూర్తిగా అడ్డుకట్ట పడింది. గ్రామ పంచాయతీ కోసం నిర్మించిన కొత్త భవనంలోనూ హైటెక్ సౌకర్యాలు కల్పించారు. గ్రామంలోని విద్యార్థుల కోసం అక్కడ ఉచిత వై-ఫై సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చారు. గ్రామ భద్రత కోసం పూర్తిగా పోలీసులపై ఆధారపడకుండా సెమలియా గ్రామ పంచాయతీ చూపిన చొరవ బాగుందని నమ్లి పోలీస్‌స్టేషను ఇన్‌ఛార్జి గాయత్రి ప్రశంసించారు.



నర్మదా రాళ్లను సేకరిస్తున్న

'స్టోన్ మ్యాన్' గులాబ్‌చంద్

మధ్యప్రదేశ్‌లోని జబల్‌పుర్‌కు చెందిన గులాబ్‌చంద్ గుప్తా నర్మదానది నుంచి భిన్నమైన రాళ్లను సేకరించి భద్రపరుస్తున్నారు. దాదాపు గత అయిదు దశాబ్దాలుగా వేటికవి ప్రత్యేకంగా ఉన్న రాళ్లను సేకరించిన గులాబ్‌చంద్‌ను అందరూ 'స్టోన్ మ్యాన్' అని పిలుస్తారు. వ్యాపారవేత్త అయిన గులాబ్‌చంద్‌కు చిన్నప్పటి నుంచీ ఈత అంటే ఇష్టం. బాల్యం నుంచీ నర్మదానదిలో ఈత కొడుతూ.. ఆ తర్వాత వాటర్ పోలో జట్టులో సభ్యుడయ్యారు. నర్మదానదిలో ఈతకు వెళ్లినపుడల్లా భిన్నంగా కనిపించిన రాళ్లను సేకరించడం గులాబ్‌చంద్‌కు అభిరుచిగా మారింది. ఇందులో కొన్ని రాళ్లు నీటిని పీల్చుతాయి. మరి కొన్ని నీళ్లలో తేలుతాయి. ఇంకొన్ని జంతువుల ముఖాలను పోలి ఉంటాయి. దేశంలో అయిదో పొడవైన నది నర్మదా ప్రవాహం మధ్యప్రదేశ్ రాష్ట్రం అనూప్‌పుర్ జిల్లాలోని అమర్‌కంటక్ పీఠభూమి దగ్గర మొదలవుతుంది. జబల్‌పుర్‌కు చేరుకునేటప్పటికి పలురకాల రాళ్లు కొట్టుకొస్తాయి.



భూవివాదాలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దుతా

కర్నూలు జిల్లాలో 'మీభూమి.. మీ హక్కు' సభలో సీఎం చంద్రబాబు

"రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 37.40 లక్షల పట్టాదారు పాసుపుస్తకాలు సిద్ధం చేశాం. వాటిలో 19 లక్షల పుస్తకాలు భూయజమానులకు ఇచ్చాం. ఇంకా 18.40 లక్షల పుస్తకాలను ఏప్రిల్‌లోగా ఇస్తాం. ఈ నెలలో 1,16,870 మందికి పాసు పుస్తకాలు ఇవ్వాలని లక్ష్యం పెట్టుకోగా, ఇప్పటికే 91,030 మందికి అందించాం. ఈ నెలలో 279 గ్రామాల్లో సభలు నిర్వహిస్తాం. ఇవికాక, 9,500 గ్రామాల్లో సర్వే చేయాలి. ఆ ప్రక్రియ పూర్తయితే 62 లక్షల మందికి కొత్త పట్టాదారు పాసు పుస్తకాలివ్వొచ్చు." - సీఎం చంద్రబాబు



కర్నూలు జిల్లా కలుగొట్ల గ్రామంలో నిర్వహించిన 'మీ భూమి-మీ హక్కు' సభలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

తాడేపల్లిలో హెలిప్యాడ్ కోసం పొలాన్ని ప్రభుత్వ భూమిగా మార్చేశారు

"తాడేపల్లి ప్యాలెస్ పక్కనున్న భూమిలో జగన్ హెలిప్యాడ్ కట్టుకోవాలని అనుకున్నారు. ఆ భూమి కావాలని యజమానిని అడిగితే ఆయన నిరాకరించారు. అతని వద్ద 1956 నుంచీ రికార్డులు ఉన్నాయి. ఆ స్థలం చుట్టూ ప్రహరీ ఉంది. అలాంటి భూమిని తనకు అమ్మలేదని ఓ రోజు అందులో హెలిప్యాడ్ నిర్మించేశారు. రికార్డుల్లోంచి భూయజమాని పేరు తీసేసి, ప్రభుత్వ భూమిగా మార్చేశారు. తర్వాత దాన్ని జగన్ తన ఆధీనంలోకి తెచ్చుకున్నారు. ఆ భూయజమాని చెప్పిన ఈ వివరాలు విని షాక్‌కు గురయ్యా. ఇలాంటి వ్యవహారాలు రాష్ట్రంలో లక్షల్లో జరిగాయి." -ముఖ్యమంత్రి చంద్రబాబు



సభలో ప్రభుత్వం అందజేసిన పాసుపుస్తకాలు చూపుతున్న రైతులు

ఈనాడు, కర్నూలు, ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్‌ను భూవివాదాలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని, ఈ ఏడాది డిసెంబరుకల్లా ఈ ప్రక్రియ పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. రైతుల జీవనాధారమైన భూమికి ఎవరి కారణంగానూ ఇబ్బందులు రాకుండా, పూర్తి భద్రతతో పాసుపుస్తకాలు తయారు చేసినట్లు చెప్పారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు నియోజకవర్గ పరిధిలోని కలుగొట్ల గ్రామంలో 'మీ భూమి- మీ హక్కు' పేరుతో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో సీఎం చంద్రబాబు రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు అందించారు. అనంతరం సభలో ప్రసంగించారు. వివాదాల్లేని భూ సరిహద్దులు, ప్రతి ఎకరాకూ సాగునీరు, లాభదాయకమైన సేద్యం లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. రెవెన్యూ శాఖలో గత ప్రభుత్వం చేసిన విధ్వంసాన్ని చక్కదిద్దే చర్యల్లో భాగంగా ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేశామని, మరెన్నో సంస్కరణలు తెచ్చామని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌తో కలిసి సూపర్ సిక్స్ హామీలను సూపర్ హిట్ చేశామన్నారు. రాయలసీమ సమగ్ర అభివృద్ధికి తమ ప్రభుత్వం చేపడుతున్న నీటిపారుదల, పారిశ్రామిక, రవాణా ప్రాజెక్టులను చంద్రబాబు వివరించారు.

రాజముద్రతో పాసు పుస్తకాలిస్తున్నాం

మీరు కష్టపడి సంపాదించుకున్న, వారసత్వంగా వచ్చిన భూములకు పాసు పుస్తకాలపై జగన్ తన ఫొటోలు వేసుకున్నారని, తాము మాత్రం ట్యాంపరింగ్‌కు వీల్లేకుండా రాజముద్రతో అందిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు గుర్తుచేశారు. హద్దురాళ్లపై కూడా జగన్ తన ఫొటోలు వేసుకొన్నారని, సర్వే రాళ్లకు రూ.700 కోట్లు తగలేశారని మండిపడ్డారు. 'వైకాపా నాయకులు ప్రైవేటు భూములను వారు అడిగినంత ధరకు అమ్మకపోతే వాటిని 22ఎలో పెట్టించారు. లక్షల ఎకరాలను నిషిద్ధ జాబితాలో చేర్చారు. ల్యాండ్ టైటిలింగ్ చట్టం తెచ్చి, రైతులను కోర్టుల చుట్టూ తిప్పాలని చూశారని చంద్రబాబు ధ్వజమెత్తారు.

బ్లాక్‌చైన్ సాంకేతికతతో భద్రంగా రికార్డులు

'మంగళగిరిలోని తెదేపా కార్యాలయానికి నిత్యం వందల మంది ఫిర్యాదుదారులు వస్తున్నారు. వారి సమస్యలు ఆందోళన కలిగిస్తున్నాయి. గతంలో ఎప్పుడూ చూడనన్ని భూసమస్యలు వస్తున్నాయి. అందుకే భూములపై ఇతరుల కన్ను పడకుండా కట్టుదిట్టమైన భద్రత ఉండేలా రికార్డులు రూపొందిస్తున్నాం. రైతుల సమక్షంలోనే భూసర్వే చేసి, తప్పులకు తావులేకుండా పట్టాదారు పాసుపుస్తకాలు తయారు చేస్తున్నాం. వాటిని ట్యాంపరింగ్‌కు యత్నిస్తే తెలిసిపోతుంది. బాధ్యులపై పీడీ చట్టం ప్రయోగించి, జైళ్లకు పంపిస్తాం. లంచాలు ఇవ్వాల్సిన పనిలేకుండా గ్రామసభల్లో ఫిర్యాదులు స్వీకరిస్తున్నాం. పాసు పుస్తకాలు పొందాక మీ ఫీడ్‌బ్యాక్ తీసుకొని యంత్రాంగంలో జవాబుదారీతనాన్ని పెంచుతున్నామ'ని ముఖ్యమంత్రి వివరించారు.


రతనాల సీమగా మారుస్తా

నదుల అనుసంధానం ద్వారా రాయలసీమను రతనాలసీమగా మారుస్తామని సీఎం చంద్రబాబు చెప్పారు. 'రాష్ట్రంలో ఏటా 400 లక్షల మెట్రిక్ టన్నుల పండ్ల ఉత్పత్తి అవుతుంటే, 225 లక్షల మెట్రిక్ టన్నులు రాయలసీమ నుంచే వస్తున్నాయి. దీన్ని 500 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచే బాధ్యత నాది' అని హామీ ఇచ్చారు. '2014-19 మధ్య సాగునీటి ప్రాజెక్టులకు రూ.68 వేల కోట్లు ఖర్చు పెట్టాం. రాయలసీమలో రూ.12 వేల కోట్లు వెచ్చించాం. జగన్ ఐదేళ్లలో కేవలం రూ.2 వేల కోట్లు మాత్రమే ఖర్చుచేశారు. డబ్బులకు కక్కుర్తిపడి అనుమతులు లేకుండా రాయలసీమ లిఫ్ట్ ఎత్తిపోతల చేపట్టారు. తీరా ఎన్జీటీ అభ్యంతరాలతో ఆపేశారు. ఆ విషయం చెప్పకుండా తిరిగి నాపై బురద జల్లేందుకు యత్నిస్తున్నార'ని మండిపడ్డారు. వేదవతి, ఆర్డీఎస్, గుండ్రేవుల ప్రాజెక్టులు పూర్తిచేసి కర్నూలును హరిత మయం చేస్తామన్నారు.

స్వామివారి ప్రతిష్ఠకు మచ్చ తెచ్చే యత్నం

వైకాపా హయాంలో రసాయనాలతో తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారు చేశారని ముఖ్యమంత్రి ఆరోపించారు. 'కల్తీ ప్రసాదంతో స్వామివారి ప్రతిష్ఠను దెబ్బతీశారు. మరుగుదొడ్లను శుభ్రం చేసేందుకు వినియోగించే రసాయనాలు వాడి లడ్డూలు తయారుచేశారని తెలిసి ఆశ్చర్యపోయా. జంతువుల కొవ్వు కలిపినట్లు ఎన్డీడీబీ నివేదిక తేల్చిచెప్పాక కూడా తమకు సిట్ క్లీన్‌చిట్ ఇచ్చిందని వైకాపా నేతలు మాట్లాడుతున్నారు. జగన్ బాబాయ్ మాట్లాడుతూ కల్తీ జరిగినట్లు సిట్ చెప్పిందికానీ, జంతువుల కొవ్వు కలపలేదని అంటున్నారు. తిరుమలలో గతంలో అమ్మిన లడ్డూకు.. ఇప్పుడు ఇస్తున్న లడ్డూకు తేడా చూడండి' అని కోరారు. శ్రీశైలంలోనూ కొంతకాలం కల్తీ నెయ్యినే వినియోగించారని సీఎం ఆరోపించారు. జగన్ విజయవాడ నుంచి గుంటూరుకు ఆరు గంటలపాటు ప్రయాణించి బలప్రదర్శన చేసి, ఆ మార్గంలో వాహనదారులను ఇబ్బందులకు గురిచేశారని, తప్పుడు విధానాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. కొత్త పాసుపుస్తకాల్లో 14 అధునాతన భద్రతా ప్రమాణాలున్నాయని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. సభలో మంత్రులు టీజీ భరత్, నిమ్మల రామానాయుడు, ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

కార్యకర్తలతో భేటీ: గ్రామసభ తర్వాత సీఎం, తెదేపా అధినేత చంద్రబాబు పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, నాయకుల పనితీరుపై తన వద్ద చిత్రగుప్త లెక్కలున్నాయని, మీరంతా ప్రజలతో మమేకమై పని చేయాలని ఆదేశించారు. ఓ సంస్థ సర్వేలో రాష్ట్రంలో ఎన్డీఏ ఓట్లు మరో 7 శాతం పెరిగినట్లు తేలిందని, వచ్చే ఎన్నికల్లోనూ తిరిగి అధికారంలోకి వచ్చేలా కృషి చేయాలని సూచించారు.



సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాల్‌లో స్వయం సహాయక సంఘాల సభ్యులకు నమూనా చెక్కు అందజేస్తున్న సీఎం చంద్రబాబు.



రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు అందజేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. చిత్రంలో బస్తిపాటి నాగరాజు, అనగాని సత్యప్రసాద్, బీవీ జయనాగేశ్వరరెడ్డి, నిమ్మల రామానాయుడు, టీజీ భరత్

చెవిరెడ్డి అనుచరుడు బాలాజీ యాదవ్ ఆస్తుల జప్తునకు చర్యలు

- కోర్టులో పిటిషన్ దాఖలుకు సిట్‌కు ప్రభుత్వం అనుమతి

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణం కేసులో నిందితుడైన వైకాపా నేత చెవిరెడ్డి భాస్కరరెడ్డి (ఏ-38) ఆదేశాల మేరకు ముడుపుల సొమ్ము తరలింపులో క్రియాశీలకంగా వ్యవహరించిన ఆయన ప్రధాన అనుచరుడు ఎం.బాలాజీ కుమార్ యాదవ్ (ఏ-35) ఆస్తుల జప్తునకు సిట్ చర్యలు ప్రారంభించింది. మద్యం ముడుపుల సొమ్ముతో 2023-24 సంవత్సరాల మధ్య పలు చోట్ల తన పేరిట, తన తండ్రి కుళ్లాయప్ప పేరిట బాలాజీ కుమార్ యాదవ్ పెద్ద ఎత్తున స్థిరాస్తులు కొన్నట్లు సిట్ దర్యాప్తులో తేల్చింది. ఈ అక్రమాస్తుల మార్కెట్ విలువ రూ.5.16 కోట్లని లెక్క కట్టింది. వీటి జప్తు కోసం విజయవాడలోని ఏసీబీ కోర్టులో పిటిషన్ దాఖలు చేసేందుకు సిట్.. రాష్ట్ర ప్రభుత్వం అనుమతి కోరగా, అందుకు ఆమోదం తెలుపుతూ హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. తిరుపతి అర్బన్ మండలం మంగళం గ్రామంలోని వసుప్రధ ఎన్‌క్లేవ్‌లో కుళ్లాయప్ప పేరిట ఉన్న 9.36 సెంట్లతో పాటు ఒక్కోటి 400 చదరపు గజాల విస్తీర్ణం కలిగిన మూడు వేర్వేరు ప్లాట్లు, తిరుపతిలోని వైకుంఠాపురంలో 172 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న నివాస భవనం, రేణిగుంట మండలం వెంకటాపురంలో 175 చదరపు గజాల స్థలం, తిరుపతి రూరల్ మండలం గాంధీపురంలో 160 చదరపు గజాల విస్తీర్ణంలోని రెండు వేర్వేరు ప్లాట్ల జప్తునకు అధికారులు చర్యలు చేపట్టారు. వీటన్నింటినీ మద్యం ముడుపుల సొమ్ముతో 2023 నవంబరు 17 నుంచి 2024 నవంబరు వరకూ కొనుగోలు చేసినట్లు సిట్ దర్యాప్తులో తేలింది. బాలాజీకుమార్ యాదవ్ చెవిరెడ్డి భాస్కరరెడ్డికి అత్యంత నమ్మకస్తుడు. మద్యం కుంభకోణం కేసులో గతేడాది జులై 30న అరెస్టైన బాలాజీ కుమార్ యాదవ్ ప్రస్తుతం గుంటూరు జిల్లా జైల్లో ఉన్నారు.

నెల్లూరు ఉపాధ్యాయుడికి జాతీయస్థాయి పురస్కారం



శిక్షాలోకం నిర్వాహకుల నుంచి పురస్కారం అందుకుంటున్న నెల్లూరు సుబ్రహ్మణ్యం


సంగం, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఖగోళ శాస్త్రం, సైన్సుపై ఆసక్తి పెంచేందుకు మూడు దశాబ్దాలుగా కృషి చేస్తున్న నెల్లూరు జిల్లా గాంధీజనసంఘం గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు, జిల్లా సైన్స్ కేంద్రం క్యూరేటర్.. నెల్లూరు సుబ్రహ్మణ్యం జాతీయస్థాయి 'శిక్షాగ్రహ లీడర్‌షిప్' పురస్కారం అందుకున్నారు. బెంగళూరులో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో శిక్షాలోకం నిర్వాహకులు ఎస్.డి.శిబూలాల్ (ఇన్ఫోసిస్ కో-ఫౌండర్, ఫార్మర్ సీఈవో), కుమారి శిబూలాల్.. ఆయనకు పురస్కారంతో పాటు రూ.10 లక్షల ఆర్థిక ప్రోత్సాహకం అందజేశారు. రాష్ట్ర సర్వశిక్షాభియాన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.శ్రీనివాసరావు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

ఏయ్ బిడ్డా.. ఇది త్రిపుర చామగడ్డ!



ఈ యువ రైతు పేరు రతంకా.. త్రిపుర రాష్ట్రానికి చెందిన వారు. ఇతని రెండు చేతులతో పట్టుకున్నవి చామగడ్డలు. కానీ రెండింటి పరిమాణాల్లో ఎంతో తేడా కనిపిస్తోంది కదూ. సాధారణంగా చామ దుంప గరిష్ఠంగా 200 గ్రాముల వరకు పెరుగుతుంది. ఈయన పండించిన ఈ పెద్ద దుంప ఏకంగా రెండున్నర కిలోల బరువు తూగింది. హైదరాబాద్ యూసుఫ్‌గూడలో నిర్వహిస్తున్న యువ పారిశ్రామికవేత్తల సదస్సులో ఏర్పాటు చేసిన స్టాల్‌లో ఈ అరుదైన చామగడ్డలను ప్రదర్శించారు. – ఈనాడు, హైదరాబాద్

అయ్యబాబోయ్... ఆ 6 జిల్లాలు!



అక్కడ పెద్దపెద్ద రహదారులే కాదు.. ప్రాణాలుతోడేసే పెనుగండాలూ ఉన్నాయి. ఆ జిల్లాల్లో రహదారులు నిత్యం రక్తమోడుతూనే ఉన్నాయి. ఎంతగానంటే దేశంలో అత్యంత ఎక్కువ సంఖ్యలో ప్రమాదాలు జరుగుతున్న జిల్లాల్లో ఇవి కూడా చేరాయి.

- కేంద్ర రోడ్డు రవాణా, హైవేల మంత్రిత్వశాఖ (మోర్త్)... సేవ్ లైఫ్ ఫౌండేషన్ సహకారంతో రోడ్డు ప్రమాదాలపై అధ్యయనం చేసింది.
- అందులో దేశంలోనే అత్యంత సంక్లిష్టమైన 100 జిల్లాలను గుర్తిస్తే వాటిలో... ఏపీలోని ఉమ్మడి ప్రకాశం, గుంటూరు, నెల్లూరు, అనంతపురం, కడప, చిత్తూరు జిల్లాలు ఉన్నాయి.
- 2023, 2024లో జరిగిన ప్రమాదాలు, మరణాల ఆధారంగా వీటిని ఎంపికచేశారు. మొత్తంగా ఆ రెండేళ్లలో రోడ్డు ప్రమాదాలు, అందులోని మరణాలను విశ్లేషించి... అత్యధిక మృతులున్న జిల్లాలకు ర్యాంకింగ్స్ ఇచ్చారు. ఇందులో అత్యధికంగా ఉత్తరప్రదేశ్‌లోని 20, తమిళనాడులోని 19 జిల్లాలు ఉంటే... ఏపీలో 6 ఉన్నాయి.
- వీటిలో 2030 నాటికి ప్రమాదాలు తగ్గేలా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని కేంద్రం సూచించింది.

ఈ జిల్లాల్లో 2030 నాటికి రోడ్డు ప్రమాద మరణాలు జరగకుండా వివిధ కార్యక్రమాలు చేపట్టేలా కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది.

మరణాలు 50 శాతం తగ్గించేలా...

- మహారాష్ట్రలో జీరో ఫెటాలిటీ కారిడార్ పేరిట ముంబయి-పుణె ఎక్స్‌ప్రెస్‌వేలో అమలు చేసిన కార్యక్రమం సత్ఫలితాలు సాధించింది. ప్రమాదాలు గణనీయంగా తగ్గాయి.
- దిల్లీ, ఉత్తరప్రదేశ్‌లో సైతం ఒక్కో రహదారిలో ఈ విధానం అమలుచేస్తే అక్కడా ప్రమాదాలు, మరణాల సంఖ్య తగ్గింది. దీంతో దేశమంతటా అమలు చేయాలని నిర్ణయించారు.

- ఈనాడు, అమరావతి

ఏం చేస్తారక్కడ?

- నిర్ణయించిన జిల్లాల్లో ప్రమాదాలు ఎక్కువగా జరిగిన రోడ్లు, వాటిలో కీలక ప్రాంతాలు పరిశీలించి అధ్యయనం చేయాలి.
- ఏయే నెలల్లో... ఏయే సమయాల్లో ప్రమాదాలు ఎక్కువగా జరిగాయనేది చూడాలి.
- ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన తీరు... వాటివల్ల ప్రమాదాలు జరిగిన తీరు పరిశీలించాలి.
- క్షతగాత్రులను ఎంత సేపటికి ఆసుపత్రికి తీసుకెళ్లారు? అంబులెన్స్‌లు సకాలంలో వచ్చాయా? లేదా? వంటివన్నీ చూడాలి.
- పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించి..అతివేగంగా వాహనాలు నడిపేవారు, హెల్మెట్ ధరించనివారు, సీట్ బెల్ట్ పెట్టుకోనివారిపై కేసులు నమోదు చేసి, జరిమానాలు విధించాలి.
- మద్యం తాగి వాహనాలు నడిపేవారిని కట్టడి చేసేందుకు నిరంతరం తనిఖీలు కొనసాగించాలి.
- లారీలు సామర్థ్యానికి మించి అధిక బరువులతో వెళ్లకుండా నియంత్రించాలి.
- సరకు రవాణా చేసే లారీలు, ప్రజా రవాణాచేసే బస్సులు, ఆటోలు తదితరాలన్నీ క్రమం తప్పకుండా ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకొని ధ్రువపత్రం పొందాయా? లేదా? చూడాలి.
- ఆ ఆరు జిల్లాల్లోని ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, జాతీయ రహదారులు, మున్సిపల్ ఇంజినీర్లు రహదారి భద్రత ఆడిట్ నిర్వహించాలి.
- బ్లాక్‌స్పాట్లను యుద్ధప్రాతిపదికన సరిచేయాలి. ప్రమాదకర ప్రాంతాల్లో సూచికలు ఏర్పాటు చేయడం, క్రాష్ బ్యారియర్లు ఏర్పాటుచేయాలి.
- రోడ్డు ప్రమాద బాధితులకు నగదు రహిత చికిత్స అందించేలా ఏర్పాట్లుచేయాలి.
- హైవేలు, రాష్ట్ర రహదారుల వెంబడి ట్రామాకేర్ సెంటర్లు, అంబులెన్సులు ఉంచాలి.

రద్దీ కారిడార్లపై ప్రత్యేక దృష్టి

దేశవ్యాప్తంగా అత్యధిక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న హైవేలు, ఎక్స్‌ప్రెస్ వేలు వంటి కారిడార్లలో.. 12 వాటిని ఎంపిక చేసి.. వాటిని జీరో ఫెటాలిటీ కారిడార్లుగా మార్చేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా గత కొన్నేళ్లలో ఎక్కువ ప్రమాదాలు జరిగి, వాటిలో అధిక సంఖ్యలో మరణాలు చోటుచేసుకున్న.. కారిడార్లను ఎంపిక చేయనున్నారు. ఏపీ నుంచి ఓ కారిడార్‌ను ఎంపిక చేస్తారు.

'ఖేలో ఇండియా' నిధులతో..

ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం అభివృద్ధి

- అదనంగా రూ.41 కోట్లు సమకూర్చనున్న రాష్ట్ర ప్రభుత్వం

ఈనాడు, అమరావతి: విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియాన్ని ఖేలో ఇండియా నిధులతో అభివృద్ధి చేయనున్నారు. ఇందుకు రెండు మూడు రోజుల్లో టెండర్లు పిలవనున్నట్టు రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) వర్గాలు తెలిపాయి. స్టేడియం అభివృద్ధి, నిర్వహణను శాప్, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ సంయుక్తంగా చేపట్టనున్నాయి. ప్రధాన స్టేడియం మధ్యలో ఆర్టిఫిషియల్ గ్రాస్ ఫుట్‌బాల్ ఫీల్డ్, టెన్నిస్ కోర్ట్, ఫుట్‌బాల్ కోర్ట్, సింథటిక్ ట్రాక్‌ల నిర్మాణం, ఫ్లడ్ లైట్ల ఏర్పాటుకు ఖేలో ఇండియా నిధులు రూ.19 కోట్లు వెచ్చించనున్నారు. వీటికి అదనంగా రూ.41 కోట్ల రాష్ట్ర ప్రభుత్వ నిధులు కూడా జోడించి తొలిదశ పనులు ప్రారంభించనున్నట్లు శాప్ వర్గాలు వెల్లడించాయి. స్టేడియంలో ఇప్పుడున్న కొన్ని నిర్మాణాలను ఆధునికీకరించి, మరికొన్ని కొత్త భవనాలు నిర్మిస్తారు. అదనపు కోర్టులు, వసతులు అందుబాటులోకి తేనున్నారు. మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం, ఇంటర్నేషనల్ వెయిట్ లిఫ్టింగ్ హాల్, బాక్సింగ్ ప్రాక్టీస్ ఎరీనా, అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, కమర్షియల్ హాల్ తదితరాలను అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించనున్నారు. పనులు ప్రారంభమైతే స్టేడియంలో ప్రభుత్వ, ప్రైవేటు క్రీడేతర కార్యక్రమాలు ఉండవని అధికార వర్గాలు వెల్లడించాయి.

భూవినియోగ మార్పిడిపై పాత విధానాన్నే కొనసాగించండి

- మంత్రి నారాయణకు నరెడ్కో ప్రతినిధుల విజ్ఞప్తి

ఈనాడు, అమరావతి: వ్యవసాయ భూములను నివాస అవసరాలకు వినియోగించేందుకు పట్టణాభివృద్ధి సంస్థల పరిధిలో మాత్రమే ఐదు హెక్టార్ల వరకు భూ వినియోగ మార్పిడికి అనుమతించేలా చూడాలని నరెడ్కో ప్రతినిధులు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణను కోరారు. నరెడ్కో రాష్ట్ర అధ్యక్షుడు గద్దె చక్రధరరావు ఆధ్వర్యంలో ప్రతినిధుల బృందం శుక్రవారం మంత్రిని కలిసింది. 'సీఆర్డీఏ, వీఎంఆర్డీఏ తదితర పట్టణాభివృద్ధి సంస్థల్లో ఐదు హెక్టార్ల పరిధిని రెండు హెక్టార్లకు కుదిస్తూ ఇటీవల తీసుకున్న నిర్ణయం కారణంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. 2 హెక్టార్లు దాటిన లేఔట్లకు ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. పాత విధానాన్నే అమలు చేసేలా ఆదేశాలివ్వండ'ని మంత్రిని కోరారు. సీఆర్డీఏ పరిధిలోని ఫిరంగిపురం, అచ్చంపేట మండలాల్లో కొత్త లేఔట్లు, భవన నిర్మాణాలను డీపీఎంఎస్ పోర్టల్‌లో అనుమతించడం లేదని వారు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. తాడికొండ, పెదకూరపాడు మండలాలతో పాటు రాజధానిలోని మరో ఏడు గ్రామాల్లో లేఔట్లకు అనుమతుల కోసం ఫీజులు చెల్లించినా పెండింగ్‌లో పెట్టారని వివరించారు. ఈ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని నరెడ్కో అధ్యక్షుడితో పాటు కార్యనిర్వాహక ఉపాధ్యక్షులు పరుచూరి కిరణ్, తాళ్లూరి శివాజీ తదితరులు కోరారు. ఈనెల 13, 14 తేదీల్లో దిల్లీలో నిర్వహించే జాతీయస్థాయి స్థిరాస్తి వ్యాపారాభివృద్ధి కాంక్లేవ్‌లో పాల్గొనాలని మంత్రిని ఆహ్వానించారు.

ఆహార కమిషన్ ఛైర్మన్‌కు భద్రతను పునరుద్ధరించండి

- ప్రభుత్వం, డీజీపీకి హైకోర్టు ఆదేశం

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ఆహార కమిషన్ ఛైర్మన్ విజయ్ ప్రతాప్‌రెడ్డికి 1+1 పోలీసు భద్రతను పునరుద్ధరించాలని రాష్ట్ర ప్రభుత్వం, డీజీపీని హైకోర్టు ఆదేశించింది. సరైన కారణాలు చూపకుండా చట్టబద్ధమైన పదవి నిర్వహిస్తున్న వ్యక్తికి భద్రతను ఉపసంహరించడం సరికాదంది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ఇటీవల ఈ మేరకు తీర్పు ఇచ్చారు. 2023 మే నుంచి తనకు 1+1 పోలీసు భద్రత ఉందని, సరైన కారణం లేకుండానే 2024 జులై 20 నుంచి ఆ భద్రతను ఉపసంహరించారంటూ ప్రతాప్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. హోం శాఖ ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. పోలీసు భద్రత కల్పించాలని హక్కుగా కోరలేరని, ప్రాణహాని ఉందా లేదా అని విశ్లేషించి భద్రత కల్పించడం లేదా ఉపసంహరించడం జరుగుతుందని చెప్పారు. పిటిషనర్ ప్రాణానికి ముప్పు లేదని పోలీసులు నివేదిక ఇచ్చాకే భద్రతను ఉపసంహరించారన్నారు. న్యాయమూర్తి స్పందిస్తూ.. విధి నిర్వహణలో భాగంగా ప్రతాప్‌రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా చౌకధరల దుకాణాలు, అంగన్వాడీ కేంద్రాలు, సంక్షేమ వసతిగృహాల తనిఖీకి వెళుతుంటారని గుర్తుచేశారు. సమర్థ విధి నిర్వహణకు ఆయనకు 1+1 పోలీసు భద్రతను పునరుద్ధరించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. సాధ్యమైనంత త్వరగా, గరిష్ఠంగా రెండు వారాల్లో భద్రతను పునరుద్ధరించాలని హోం శాఖ ముఖ్య కార్యదర్శి, డీజీపీలను ఆదేశించారు.

గనుల శాఖ సర్వేయర్ ఆస్తులు రూ.6 కోట్లు!

వేర్వేరు ప్రాంతాల్లో అనిశా అధికారుల తనిఖీలు




అబ్దుల్ ఆసిఫ్, అధికారుల తనిఖీల్లో లభ్యమైన సొత్తు

ఒంగోలు నేరవిభాగం, మార్కాపురం అర్బన్, న్యూస్‌టుడే: ప్రకాశం జిల్లా ఒంగోలులోని గనుల శాఖ ఉప సంచాలకుల కార్యాలయంలో సర్వేయర్-2గా పని చేస్తున్న షేక్ అబ్దుల్ ఆసిఫ్ అక్రమాస్తులపై అవినీతి నిరోధక శాఖ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. అనిశా నెల్లూరు డీఎస్పీ రామచంద్రుడు ఆధ్వర్యంలో పలు బృందాలు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించాయి. శుక్రవారం సాయంత్రం వరకు జరిగిన ఈ తనిఖీల్లో సుమారు రూ.6 కోట్ల విలువైన స్థిర, చరాస్తులను అధికారులు గుర్తించారు. అబ్దుల్ ఆసిఫ్ ప్రస్తుతం ఒంగోలులో పనిచేస్తుండగా.. ఆయన స్వస్థలమైన మార్కాపురం, అత్తగారి ఊరైన కనిగిరి, గతంలో పనిచేసిన నెల్లూరు, గుంటూరుతో పాటు ప్రస్తుతం అతని కుటుంబం నివాసముంటున్న విజయవాడలోనూ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఆసిఫ్‌ను ఒంగోలులో అదుపులోకి తీసుకుని విజయవాడలోని నివాసానికి తీసుకెళ్లి మరీ తనిఖీలు చేశారు. పెద్దఎత్తున స్థిర, చరాస్తులను గుర్తించారు. రెండు రెసిడెన్షియల్ ఫ్లాట్లు, ఒక ప్లాటు, 22 ఎకరాల వ్యవసాయ భూమి, రూ.2.82 లక్షల నగదు, 620 గ్రాముల బంగారు ఆభరణాలు, అరకేజీ వెండి వస్తువులు, రూ.3.54 లక్షల విలువైన ప్రామిసరీ నోట్లు, 16 వాచీలు, రూ.15 లక్షల విలువైన బీమా పత్రాలను గుర్తించారు. ఒక కారు కొనుగోలు చేసేందుకు అడ్వాన్స్ చెల్లించినట్లు అధికారుల తనిఖీల్లో వెల్లడైంది. ఈ తనిఖీల్లో ఒక బ్యాంకు లాకర్ తాళాన్ని గుర్తించిన అధికారులు నిబంధనలను అనుసరించి దాన్ని తెరవనున్నారు. అనంతరం పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

వైద్య కళాశాలల బలోపేతానికి రూ.167.33 కోట్ల అదనపు నిధులు

ఈనాడు, అమరావతి: కొత్త పీజీ సీట్లు, కోర్సుల పెంపుతో వైద్య కళాశాలల బలోపేతానికి ప్రభుత్వం వైద్యారోగ్య శాఖకు రూ.167.33 కోట్ల అదనపు నిధులు మంజూరు చేసింది. ఈ నిధులు నిర్ణీత ప్రయోజనాలకే వినియోగించి ఖర్చుల వివరాలతో వినియోగ ధ్రువీకరణ పత్రం/ గ్రాంట్ ట్రాన్స్‌ఫర్ వ్యయ నివేదిక ప్రభుత్వానికి సమర్పించాలని పేర్కొంది.

నడి సముద్రంలో ఒడిశా నేవీ ఇంజినీర్ అదృశ్యం!



సార్థక్ మహాపాత్ర్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ఒడిశాకు చెందిన ఓ యువ నేవీ ఇంజినీర్ నడి సముద్రంలో అదృశ్యమయ్యారు. ఈ ఘటన సింగపూర్ తీరానికి చేరువలో చోటుచేసుకుంది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. భద్రక్ జిల్లా సద్రైకెలా గ్రామానికి చెందిన సార్థక్ మహాపాత్ర్ 2025 జులైలో మర్చంట్ నేవీలోని ఓ ప్రైవేట్ షిప్‌లో ఉద్యోగంలో చేరి విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల 2న ఆయన వాళ్ల అమ్మ రశ్మితాతో ఫోన్‌లో మాట్లాడారు. ఆ సమయంలో సార్థక్ సింగపూర్ తీరానికి చేరువలో సముద్రంలో ఉన్నారు. అయితే, మరుసటి రోజు ఆయన తల్లికి నౌక యాజమాన్యం నుంచి ఫోన్ వచ్చింది. ఉదయం అల్పాహారం తీసుకున్న తర్వాత నుంచి సార్థక్ కనిపించడం లేదని, కారణాలు తెలియలేదని తెలిపారు. దాంతో అప్పటి నుంచి ఆయన తల్లి గుండెలవిసేలా రోదిస్తున్నారు. గురువారం ఒడిశా ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝిని, ఇతర ఉన్నతాధికారులను ఆమె కలిశారు. తన కుమారుడిని కాపాడాలని కోరారు. ఈ నేపథ్యంలో సాయం కోసం సీఎం కేంద్రానికి లేఖ రాశారు. దిల్లీలో ఉన్న రెసిడెంట్ కమిషనర్ విశాల్ గగన్‌తో ఫోన్‌లో మాట్లాడి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విపక్షనేత నవీన్ పట్నాయక్ సైతం కేంద్రం వెంటనే జోక్యం చేసుకోవాలని, సార్థక్ ఆచూకీ తెలుసుకోవాలని 'ఎక్స్' వేదికగా శుక్రవారం కోరారు.



ఈ అల్పాహారంతో రుచీ, ఆరోగ్యమూ..

రుచితోపాటు ఆరోగ్యకరమైన అల్పాహారానికి మూంగ్ దాల్ ఓట్స్ ఊతప్పం ఓ చక్కటి ఎంపిక. ఒక్కో ఊతప్పం నుంచి సుమారు 15 గ్రాముల మొక్కల ఆధారిత ప్రొటీన్ అందుతుంది. ఓట్స్‌లోని ఫైబర్ శరీరానికి స్థిరమైన శక్తిని ఇస్తుంది. ఇంగువతో ఉబ్బరం తగ్గి జీర్ణక్రియ సులువవుతుంది. ఇందులో వినియోగించే క్యారెట్లు, క్యాప్సికం, కొత్తిమీర కారణంగా యాంటీ ఆక్సిడెంట్లు, ఖనిజాలు, విటమిన్లు సమృద్ధిగా లభిస్తాయి. – గుంటాస్ సేథీ, షెఫ్

ఈతరం

youthpage@eenadu.in

ప్రేమ పండగ మొదలు..



ఫిబ్రవరి 14 వస్తుందంటేనే.. ప్రేమికులకు పండగ. ఆ సందడి వారం ముందు నుంచే మొదలవుతుంది. ఇవాళ రోజ్ డే. మనసుకు నచ్చిన మనిషికి అందమైన ఓ గులాబీ ఇచ్చి ప్రేమను తెలియజేసే రోజు. ఇక్కడి నుంచి మరో వారంపాటు ప్రతిరోజూ ప్రత్యేకమే. వరసగా ప్రపోజ్ డే, చాక్లెట్ డే, టెడ్డీ డే, కిస్ డే, హగ్ డే.. వచ్చేస్తాయి. ఆఖరుగా వాలంటైన్స్‌డేతో ప్రేమ పండగ రసకందాయంలో పడుతుంది. ఇంతకీ రోజ్ డే ప్రత్యేకత ఏంటంటే..

రిలేషన్‌లో ఒక్కొక్కరు ఒక్కో ఫేజ్‌లో ఉంటారు. ప్రతి అనుభూతిని ఒక్కో రంగుతో పోల్చి.. ఏ ఎమోషన్‌కు తగిన రంగు గులాబీని అవతలి వారికి ఇస్తారీ రోజు. గాఢమైన రొమాంటిక్ లవ్‌కు రెడ్, సున్నితమైన స్నేహపూర్వక భావాలను తెలియజేయడానికి ఎల్లో, స్వచ్ఛమైన అభిమానాన్ని చూపించడానికి తెల్లని గులాబీలను నచ్చిన వ్యక్తికి ఇస్తారు. లేత గులాబీ రంగున్న రోజ్‌లను కృతజ్ఞత, అడ్మిరేషన్ చూపడానికీ బహూకరిస్తారు. మరి మీ వాలంటైన్‌కు ఏ కలర్ రోజ్ ఇవ్వాలో ఆలోచించుకోండి!

అదే లవ్



పోస్ట్‌గ్రాడ్యుయేషన్ కోసం యూనివర్సిటీలోకి అడుగుపెట్టాను. భవిష్యత్తు గురించి కలలుకంటూ గడుపుతున్న నా జీవితంలో అనుకోని మలుపు ఎదురైంది. వర్సిటీ క్యాంపస్‌లో ఉల్లాసంగా గడిపేస్తున్న నా ముందు.. బారెడు కురులతో, మూరెడు మల్లెలతో పద్ధతిగా కనిపించే పూబోణి ప్రత్యక్షమైంది. అప్పటి నుంచి ఎవరిని చూసినా తనే మదిలో మెదిలేది. కళ్లు మూసినా తెరిచినా తన ఆలోచనలే. ఎదురుగా ఉంటే చాలు, హార్ట్‌బీట్ హండ్రెడ్‌కు వెళ్లిపోయేది. నైట్ నిద్రరాకపోయినా తను కలలోకి వస్తుందని బలవంతంగా పడుకునేవాడిని. తన మాట కూడా నాకు పాటే. ఆ నవ్వు చూస్తూ గడిపేయొచ్చు అనిపించేది. వీటికితోడు 'మామా ఆ అమ్మాయి నిన్నే చూస్తోంద'ని ఒకడంటే.. 'అవునవును నేనూ చూశాను' అని మరొకడు వంత పాడేవాడు. 'నువ్వు ప్రపోజ్ చేస్తావా.. లేక నీ లవ్ విషయం నేనే చెప్పాలా' అని బెదిరింపులు కూడానూ. ఇక ఈ విషయం ఆమెకు చెప్పాలని నిర్ణయించుకున్నా. కానీ అంతకంటే ముందు ఎవరైనా పెద్దలకు చెబితే బాగుంటుందని సైకాలజీ మాస్టారుతో పంచుకున్నా. నేను చెప్పిన లక్షణాలన్నీ విన్నాక.. 'తొలిచూపులో పుట్టేది భావోద్వేగ ఆకర్షణ మాత్రమే. నిజమైన ప్రేమ అంటే స్వార్థం లేకుండా ఉండటం. ఎదుటి వ్యక్తిని మార్చాలని కాకుండా, వారిని అలాగే స్వీకరించడం. లోపాలతో సహా ప్రేమించడం. అందులో వదిలేస్తారేమో, మోసం చేస్తారేమో అనే భయం ఉండదు. ఒకరికోసం ఒకరు ఉంటూ కష్టనష్టాల్లో పక్కన ఉండటం ప్రేమ' అంటూ.. దాని లక్షణాలన్నీ చెప్పేసరికి.. ఇంత సీరియస్‌నెస్ రావడానికి నాకింకా టైమ్ ఉందని అర్థమైంది. అందుకే ప్రస్తుతం కెరియర్ మీద ఫోకస్ పెట్టా. – పంగా శివారెడ్డి

'యువత తలచుకుంటే ప్రపంచ చరిత్రనే తిరగరాయగలరు. అలాంటిది అంగవైకల్యం ఒక లెక్కా' అనుకున్నారు వీరు. ముందునుంచి సంతోషంగా సాగిన జీవితం ఒక్కసారిగా మారిపోయినా కుంగిపోలేదు. పరిస్థితులకు ఎదురునిలిచి తమ లక్ష్యాలను సాధించారు. ప్రభుత్వ కొలువులు కొట్టి.. మేమే ఓ బ్రాండ్ అని నిరూపించారు!

వైకల్యం.. వెక్కిరించినా ధిక్కరించారు

కాలు, చేయి లేకున్నా..



అనుకోని విద్యుత్ ప్రమాదం.. 11 ఏళ్ల వయసులోనే ఒక కాలు, చేయి కోల్పోయింది ఆ అమ్మాయి. అమ్మానాన్నలు దినసరి కూలీలు. ఏం చేయాలో, ఎలా బతకాలో తెలియని స్థితి. అలాంటి రోజు నుంచి నేడు గ్రూప్-1లో స్టేట్ ట్యాక్స్ అసిస్టెంట్ కమిషనర్‌గా ఎంపికయ్యే వరకూ తన ప్రస్థానం అద్భుతం స్ఫూర్తిమంతం. ఆ వివరాలు తన మాటల్లోనే..

'నా పేరు కృష్ణవేణి. మాది చిత్తూరు జిల్లా శ్రీరంగరాజపురం మండలం జీఎంఆర్ పల్లె కండ్రిగ గ్రామం. పదకొండేళ్ల వయసులో ఒక రోజు ఇంటిపైన దుస్తులు ఆరబెడుతుండగా.. కరెంటు తీగలు తగిలి షాక్ కొట్టింది. అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాను. ఆసుపత్రిలో కళ్లు తెరిచి చూశాను. అప్పటికే ఒక కాలు, చేయి పూర్తిగా తొలగించారు వైద్యులు! ఒక్కసారిగా పరిస్థితులు తారుమారు అయ్యాయి. అయినా కష్టపడి, కుటుంబ సభ్యుల సాయంతో స్థానిక ప్రభుత్వ పాఠశాలలోనే పదోతరగతి వరకు చదివాను. తర్వాత కూడా చదువు కొనసాగించాలని చాలా శ్రమించా. 2021లో ట్రిపుల్ ఐటీ ఇడుపులపాయలో సివిల్ ఇంజినీరింగ్ పూర్తి చేశా! ఎలాగైనా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో హైదరాబాద్‌లోని ఓ కోచింగ్ సెంటర్‌లో చేరా. శిక్షణ సమయంలో చాలా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నా. దాంతో నా చదువుకు అయ్యే ఖర్చులు భరించడం కష్టంగా ఉండేది. నా పరిస్థితి గమనించిన ఉపాధ్యాయులు బాసటగా నిలిచి నన్ను ముందుకు నడిపించారు. 2022లో మొదటి ప్రయత్నంలో విఫలమైనా... తర్వాత జరిగిన గ్రూప్-2లో ఎంపికయ్యా. ఆ వెంటనే వెలువడిన గ్రూప్-1 ఫలితాల్లో విజయం సాధించడంతో ఆనందానికి అవధుల్లేవు!

అయితే ఇదేమీ అంత సులువుగా జరగలేదు. నాన్న దొరస్వామి, అమ్మ రత్నమ్మ, అన్నాతమ్ముళ్లు ఇద్దరూ నేను ఐఏఎస్ కావాలని ఆకాంక్షించారు. కూలి పనులకు వెళ్తూ.. నాకు డబ్బులు పంపేవారు. నేను ట్రిపుల్ ఐటీలో చదువుతున్న సమయంలో ఫ్రెండ్ అన్నపూర్ణ పరిచయమైంది. నా వెన్నంటే ఉంటూ ముందుకు నడిపేది. నేను కోచింగ్‌కు వెళ్లిన సమయంలో తను కూడా హైదరాబాద్ వచ్చింది. నా విజయానికి ఎంతో సహకరించింది. ప్రమాదం జరిగిన సమయంలో సహాయం కోసం కలెక్టర్ కార్యాలయానికి తిరిగే క్రమంలోనే.. 'నేనే ఐఏఎస్ ఎందుకు కాకూడదు' అనే ఆలోచన వచ్చింది. ఆ పట్టుదలతోనే గ్రూప్-1కు ప్రిపేర్ అయ్యాను. త్వరలో మరింత కష్టపడి సివిల్స్ రాస్తాను.'

– తలారి నవీన్ కుమార్, తిరుపతి

చక్రాల కుర్చీకే పరిమితమైనా..

ఆడుతూ పాడుతూ తిరిగే కుర్రాడు. తండ్రి వాచ్‌మెన్‌గా పడుతున్న కష్టం చూస్తూ పెరిగాడు. బాధ్యతగా ఎంబీఏ పూర్తిచేసి చక్కని కొలువులో కుదురుకున్నాడు. తన జీతంతో అమ్మానాన్నలను బాగా చూసుకోవాలని కలలు కన్న ఆ అబ్బాయి.. అనుకోకుండా వారికే భారమయ్యే పరిస్థితి తలెత్తింది. అరుదైన వెన్నెముక వ్యాధి దాడిచేయడంతో ఒక్కసారిగా మంచానికి పరిమితం అయ్యాడు. జీవితం కుప్పకూలిపోతోంది అనిపించే ఆ బాధ నుంచి.. తిరిగి ఎదిగాడు. తాజాగా విడుదలైన గ్రూప్-2 ఫలితాల్లో సత్తాచాటిన **మోతుకూరు సురేష్‌బాబు** ప్రయాణమిది!

వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన సురేష్.. పది, ఇంటర్, డిగ్రీ అక్కడే చదివాడు. అమ్మానాన్నలు సుబ్రహ్మణ్యం, అంజనమ్మ. తండ్రి స్థానిక చెన్నకేశవస్వామి దేవాలయంలో వాచ్‌మెన్, అమ్మ గృహిణి. కడపలో పీజీ పూర్తి చేసిన తర్వాత సురేష్‌కు తిరుపతిలో ఓ ప్రైవేటు సంస్థలో అకౌంటెంట్‌గా ఉద్యోగం లభించింది. హఠాత్తుగా ఒక రోజు కాళ్లు, చేతులు పనిచేయడం మానేశాయి. హుటాహుటిన ఇంట్లో వారు ఆసుపత్రికి తీసుకెళ్లారు. నెలరోజులు ఐసీయూలోనే ఉండిపోయాడు. లక్షల రూపాయలు అక్కడా ఇక్కడా తెచ్చి కట్టినా ఫలితం లేదు. పది లక్షల మందిలో ఒకరికి వచ్చే ఆటోఇమ్యూన్ డిజార్డర్‌గా వైద్యులు నిర్ధారించారు. మరింత ఉత్తమశ్రేణి వైద్యానికి వెళ్లే స్తోమత లేకపోయింది. ఫిజియోథెరపీ, ధ్యానంతో కొంత మెరుగుపడవచ్చన్న వైద్యుల సలహాతో.. చేసేదేమీ లేక ఇంటి బాట పట్టారు.



కోచింగ్ లేకుండా..


తర్వాత రెండేళ్లపాటు పూర్తిగా మంచం మీదే. అమ్మానాన్న సపర్యలు చేస్తుంటే, తమ్ముడు భుజాన వేసుకుని బయటకు తీసుకెళ్తుంటే.. సురేష్ గుండె తల్లడిల్లేది. ఏదైనా రంగంలో రాణించాలని ప్రయత్నించాడు. మెల్లగా డాక్టర్లు చెప్పినట్టు చేస్తూ చేతులు, కాళ్లు కదిలించడం ప్రాక్టీస్ చేసేవాడు. స్పోర్ట్స్ వైపు వెళ్లాలనుకున్నా.. చేతులు అంతగా సహకరించక కుదర్లేదు.

అప్పుడే గ్రూప్-1 ఉద్యోగం సాధించాలి అనే ఆలోచన కలిగింది. కానీ వ్యాస రూప ప్రశ్నలకు సమాధానం రాయడం కష్టమనిపించింది. దాంతో గ్రూప్-2 ఎంచుకున్నాడు. కోచింగ్‌కు వెళ్లే పరిస్థితులు లేక యూట్యూబ్ మీదే ఆధారపడ్డాడు. అప్పటి నుంచి పుస్తకాలే లోకమయ్యాయి. విధిని ఎదిరించి జీవితంలో పైకొచ్చిన వారి వీడియోలు చూసి ఉత్తేజితం అయ్యేవాడు. తనను తాను మానసికంగా, శారీరకంగా పరీక్షలకు సిద్ధం చేసుకునేందుకు చక్రాల కుర్చీలో ఉంటూనే ప్రతి నిమిషం కష్టపడ్డాడు.

● 2018 గ్రూప్-2 నోటిఫికేషన్‌లో మెయిన్స్ వరకూ వెళ్లినా రెండు మార్కుల దూరంలో పోస్టు దక్కలేదు. తిరిగి 2023 నోటిఫికేషన్ ప్రిలిమ్స్, మెయిన్స్‌లో సత్తాచాటి రాష్ట్ర సచివాలయంలో ఏఎస్‌వో(జీఏడీ) ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఫలితాలు తెలిసిన మరుక్షణం అమ్మానాన్నల కళ్లల్లో ఆనందం చూశాకే.. తనకు తృప్తిగా అనిపించింది అంటాడు సురేష్. ఇన్నేళ్ల కష్టం తర్వాత కూడా తను విశ్రాంతి తీసుకోవాలని అనుకోవడం లేదు. ఈసారి గ్రూప్-1లో పోస్టు దక్కించుకోవాలని మరింత గట్టిగా ప్రయత్నిస్తున్నాడు!

– పెద్దిరెడ్డిగారి పవన్‌కుమార్‌రెడ్డి, కడప

నాకవి చాలు!



పంచుకుందాం

తెల్లని మల్లెలాగా
చల్లని వెన్నెలలా
కమ్మని తేనెలా
నీ రూపు

కోయిల గీతంలా
చిరుగాలి తరగలా
సెలయేటి వాగులా
నీ పాట

మురళి రవళిలా
మువ్వల సవ్వడిలా
అమరనాదంలా
నీ మాట

..ఇవి చాలు నాకు!

– కాయల నాగేంద్ర, హైదరాబాద్

మెయిల్ పంపండి



ఈతరం పేజీలో వస్తున్న కథనాలు, శీర్షికలపై మీ విలువైన సలహాలు, సూచనలు మాకు పంపండి. మా మెయిల్ అడ్రస్ youthpage@eenadu.in

కెరియర్ కప్పగెంతులు

జెన్ జీలు పనిలో సిన్సియర్‌గా ఉంటారు.. కానీ ప్రమోషన్ల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూడమంటే వారి వల్ల కాదు.

గ్రోత్ ఎప్పటికప్పుడు కళ్లకు కనపడుతూ ఉండాలి. లేదంటే రాం రాం చెప్పేయడమే! అందుకే చాలామంది తరచూ కంపెనీలు మారుతున్నారు.



మీకు తెలుసా?

ఎక్కువ జీతం, మంచి పొజిషన్ వచ్చే ఉద్యోగాల వేటలో నిరంతరం శ్రమిస్తున్నారు. ఈ పనికి వారో పేరు కూడా పెట్టుకున్నారు.. అదే 'ఆఫీస్ ఫ్రాగింగ్'!

అంటే కప్పల్లా అటూఇటూ గెంతడం అని వీరి ఉద్దేశం. ఇటీవల నిర్వహించిన ఓ సర్వేలో.. ఇలా తరచూ స్థానాలు మారేందుకు 27శాతం మంది ఎప్పుడూ సిద్ధంగా ఉంటున్నారని తెలిసింది.

అతడిదో.. రంగుల ప్రపంచం

నల్లబారిన మురికివాడల గోడలను రంగులతో హరివిల్లులుగా మార్చేస్తాడు. తన చిత్రాలు ఆ మురికివాడల రూపురేఖలు మార్చడమే కాదు, నలుగురినీ ఆలోచింపజేస్తాయి. 'ఆరోగ్యం, పారిశుద్ధ్యం, ప్లాస్టిక్ నిషేధం, మొక్కల పెంపకం, డ్రగ్స్ నివారణ..' ఇలా ప్రభుత్వ ఉద్దేశం ఏదైనా సరే, ప్రజలకు అర్థమయ్యేలా, వారిలో చైతన్యం కలిగించేలా మ్యూరల్ ఆర్ట్స్‌ను తీర్చిదిద్దుతున్నాడు విశాఖకు చెందిన **ఎస్.నాగేంద్రబాబు.**

స్ట్రీట్ మాస్టర్స్ ఆర్ట్ (స్మార్ట్) పేరుతో ఓ స్టార్టప్ ప్రారంభించి ఎందరో పేద కళాకారులకు ఉపాధి కల్పిస్తున్నాడు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న కార్యక్రమాలకు తన బృందం గీసే చిత్రాలు ఎలా హంగులద్దుతున్నాయో తన మాటల్లోనే..



'మ్యూరల్ ఆర్ట్స్ నగరాల సుందరీకరణలో ఒక భాగం. వీటిని గీయడానికి ముందుగా అనుకున్న చిత్రాన్ని ప్రొజెక్టర్‌తో గోడపై కనపడేలా చేసి, అవుట్‌లైన్ డ్రా చేస్తాం. ఆ తర్వాత ఆర్ట్ వర్కర్స్‌తో పెయింటింగ్ పూర్తి చేయిస్తాం. ప్రస్తుతం కళ్లకు పెట్టుకుని స్క్రీన్‌పై కనిపించే చిత్రం అవుట్‌లైన్‌ను గీసే 'వీఆర్ మిక్స్‌డ్ రియాల్టీస్'ను ఉపయోగిస్తున్నాం.

ప్రస్తుతం మురికివాడలు, రోడ్ల వెంబడి గోడలను అందంగా తీర్చిదిద్దడానికి పనులు వస్తున్నాయి. అందుకు తగ్గ చిత్రాలను ఏఐ టెక్నాలజీ ఉపయోగించి సిద్ధం చేస్తాను. యోగాంధ్ర-2025ను విశాఖలో నిర్వహించడాన్ని సీఎం చంద్రబాబు ఛాలెంజ్‌గా తీసుకున్నప్పుడు జీవీఎంసీ అధికారులు నన్ను సంప్రదించారు. యోగాసనాల బొమ్మలను గోడలపై వేయాలని కోరితే, తక్కువ సమయంలోనే డిజైన్లు ఇచ్చాం. దాదాపు 50 వేల చదరపు అడుగుల్లో మ్యూరల్ ఆర్ట్ వర్క్ చేశాం. దానిపై సీఎం ప్రత్యేకంగా అభినందించారు. తాజాగా సీఐఐ భాగస్వామ్య సదస్సు థీమ్, విశాఖ ప్రత్యేకత తెలిసేలా గోడలపై కుడ్య చిత్రాలు గీశాం. గోదావరి పుష్కరాల నేపథ్యంలో రాజమహేంద్రవరంలో పుష్కరశోభ ఉట్టిపడేలా చిత్రాలు గీయాలన్న ప్రతిపాదనపై చర్చలు జరుగుతున్నాయి. రాష్ట్రంలో 35 కస్తూర్బా పాఠశాలల్లో, కొన్ని మున్సిపాలిటీల్లో బొమ్మలు గీసేందుకు అవకాశాలు వచ్చాయి. స్కూల్స్‌లోనూ సుందరీకరణకు సర్వశిక్షాకు కొన్ని డిజైన్స్ ఇచ్చాం.

ఇదే మొదటి స్టార్టప్: స్ట్రీట్ మాస్టర్స్ ఆర్ట్ (స్మార్ట్) కళ ఆధారంగా రాష్ట్రంలో ప్రారంభించిన తొలి స్టార్టప్. నిరుద్యోగ చిత్రకారులను గుర్తించి, బృందంగా తయారుచేసి శిక్షణ ఇచ్చి పనులు చేయిస్తున్నాం. ప్రతి జిల్లాలో నాకు టీం ఉంది. టెక్నాలజీని విరివిగా వాడుతూ.. నైపుణ్యం గల సిబ్బంది ఎక్కువ మందిని నియమించుకుంటూ వెళ్తున్నా. యోగాంధ్ర ప్రాజెక్టులో 71 మందికి ఉపాధి కల్పించాం.

చిన్నారులకూ.. విశాఖలో చిన్నారులను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో 30వేల మంది విద్యార్థులకు ఆర్ట్ కాంపిటేషన్స్ పెట్టాం. 'పెయింట్ మై స్ట్రీట్' థీమ్ ఎంచుకున్నప్పుడు జీవీఎంసీ గోడలపై విద్యార్థులతోనే బొమ్మలు గీయించాం. నేను ఎంఏ చదివాను, అనుకోకుండా ఈ రంగంపై ఆసక్తి మొదలైంది. రేంజర్ ఫోర్స్ ఛారిటబుల్ ట్రస్టు పేరిట ఓ ఎన్‌జీవో కూడా నిర్వహిస్తున్నాను. కళాకారులకు మరింత మెరుగైన ఉపాధి అందించాలనేదే నా ప్రయత్నం.

– యడ్లపాటి బసవ సురేంద్ర, విశాఖపట్నం

ఆదివారం.. అదో అద్భుతం!



ఇప్పుడంటే ఓటీటీలో సినిమాలు, టీవీలో కొత్త కొత్త ప్రోగ్రామ్స్‌తో ప్రతిరోజూ ఒకేలా గడిచిపోతోంది. కానీ అప్పటి రోజులు వేరు. వారమంతా స్కూలు, ట్యూషన్లు.. చదవడం తప్ప అన్నీ చేసేవాళ్లం! అంత ఆటలాడినా శనివారం వస్తుంది అనగానే ఓ సరదా, ఎందుకంటే నెక్స్ట్ ఆదివారం కాబట్టి! మామూలు రోజుల్లో అమ్మ ఫ్యాన్ ఆపితే కానీ నిద్ర లేచిందే లేదు. కానీ ఆదివారం మాత్రం ఆరింటికే లేవాల్సిందే. నాన్న వెంట సంచి పట్టుకుని రైతుబజారుకు వెళ్లడం, వచ్చాక మళ్లీ డ్రాయింగ్, పెయింటింగ్ క్లాసులకు పరుగు. నచ్చిన ఆటలు ఆడుకోవడానికి, ఇష్టమైనవి నేర్చుకోవడానికి ఆదివారం ఓ మంచి అవకాశంలా ఉండేది. మధ్యాహ్నం అమ్మ చేసిన చికెన్ కర్రీ ఓ పట్టుపట్టి, ఓ మంచి యాక్షన్ మూవీ చూసేసరికి నాలుగైపోయేది. ఇక అప్పుడు బ్యాట్లు పట్టుకుని బయటకు వెళ్తే చీకటిపడ్డా ఇంట్లోవాళ్లకు చిక్కేది లేదు. తీరా చూస్తే అప్పుడు గుర్తొచ్చేవి హోంవర్క్స్! గబగబా కూర్చుని చకచకా రాసేసి మళ్లీ టీవీ చూస్తూ భోజనం పూర్తిచేసి పడుకుంటే.. ఒళ్లు అలసిపోయి, ఎంత మత్తుగా పట్టేదో నిద్ర. ఆరోజు చేసిన అల్లర్లన్నీ తెల్లారి స్కూల్‌లో గొప్పగా చెప్పుకొంటుంటే.. ఎక్కడలేని ఆనందం! మళ్లీ ఆదివారం కోసం మొదలయ్యేది ఆరాటం. – వివేక్‌వర్ధన్, బొబ్బిలి

బెంగళూరు వైరస్



పేరు చూసి ఇదేదో కొత్త వైరస్ అనుకుని కంగారు పడకండి. ఐటీ జాబ్ చేసేవాళ్ల లైఫ్‌స్టైల్‌కి ఓ కొత్త పేరు వచ్చిందిలా. కంటిన్యూగా మీటింగ్స్‌లో పాల్గొనడం, తిండి కూడా ఆన్‌లైన్‌లోనే ఆర్డర్ పెట్టడం, ప్రతిదానికీ యాప్స్ మీద ఆధారపడటం, ఆదాయం అధికంగా ఉన్నా జీవితంలో క్వాలిటీ తగ్గిపోవడం, సోషల్ మీడియా స్క్రోలింగ్‌నే రిలాక్సేషన్‌గా భావించడం.. ఇలా అనారోగ్యకరమైన జీవనశైలిలో బతుకుతున్న ఐటీ నిపుణుల సంఖ్య పెరుగుతోందట. వీరిలో యూత్ అధిక సంఖ్యలో ఉంటున్నారు. ఈ రొటీన్ లైఫ్ వల్ల జీవితమంతా 'ఆటో పైలెట్' మోడ్‌లో వెళ్లిపోతున్నట్టు భావిస్తున్నారట. దీన్నే వైరస్ అంటున్నారు. అయితే ఇలాంటి అధిక జీతాలు పొందే వృత్తి నిపుణులు బెంగళూరులో ఎక్కువగా ఉండటం వల్ల.. దీనికి బెంగళూరు వైరస్ అనే పేరొచ్చింది!

లంచ్ తర్వాత..

మన ఉరుకుల పరుగుల ఉద్యోగాల్లో ఉన్నసీట్లకే అతుక్కుపోతుంటాం. అందులోనూ ఆఫీసులో చేరిన కొత్తల్లో ఉదయం వచ్చినప్పటి నుంచి పనులన్నీ పూర్తి చేసే వరకూ సీట్లలోంచి లేవం. కొన్నిసార్లు భోజనం కూడా అక్కడే! అయితే ఇది సరికాదని.. ముఖ్యంగా యూత్‌కు దీని వల్ల భవిష్యత్తులో అనేక రకాలైన సమస్యలు వస్తున్నాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. భోజనం తర్వాత సీట్లలో ఉండిపోవడం వల్ల మరీ ఎక్కువ సమస్యలట. అందుకే పని చేస్తూనో, ఫైల్స్ చూస్తూనో, ముఖ్యమైన కాల్స్ మాట్లాడుతూనో.. ఓ పదీపదిహేను నిమిషాలు క్యాబిన్ వద్దే నడవాలని సూచిస్తున్నారు. దీంతో జీర్ణక్రియ మెరుగుపడి, రక్తంలో చక్కెర నియంత్రణలో ఉండటంతోపాటు.. యువతలో పని వల్ల కలిగే ఒత్తిడి తగ్గి, మానసిక ఆరోగ్యం మెరుగ్గా ఉన్నట్టు పరిశోధనల్లో తేలింది. దీని వల్ల మెదడు విశ్రాంతి పొంది, మరింత ఉత్సాహంగా పని చేయగలమట!



కొంటె కొటేషన్



1. మచ్చలు లేని ముచ్చటైన మూడో జిరాఫీ – హరిశంకర్ గౌడ్
2. ఓరినాయనో ఏమిటీ హైటు.. నాకొచ్చిందా ఏమిటి సైటు. – సత్య
3. పెట్టావు జిరాఫీలా పోజు.. అది వెంటపడితే వదులుతుంది బూజు. – మాధవి, సత్తుపల్లి
4. పొద్దున్నే తాగాను కాఫీ.. తర్వాత అయ్యాను జిరాఫీ. – రూపేష్, నెల్లూరు
5. బాగుంది భంగిమ.. జిరాఫీకి జిరాక్స్‌లా! – జె.రామేశ్వరరావు



ఈ ఫొటోకి సరదా వ్యాఖ్య రాసి పంపండి. బాగున్నవి ప్రచురిస్తాం.

బ్రూచ్.. భంభం బోలే!







కుర్తా వేసినా, కోటు ధరించినా.. బ్రూచ్ పెడితే వచ్చే రాయల్ లుక్ వేరు! అందుకే కుర్రాళ్లకు ఇవంటే భలే సరదా. కానీ ఎక్కువశాతం పాశ్చాత్య సంస్కృతిని ప్రతిబింబించేలా ఉంటాయివి. అయితే తాజాగా ఇందులో లోకల్ లుక్ తీసుకొచ్చేలా కొత్త డిజైన్లు ఆకట్టుకుంటున్నాయి. అందులోనివే పవర్‌ఫుల్‌గా కనిపిస్తున్న ఈ లార్డ్ శివ థీమ్ బ్రూచెస్. ఈ శివరాత్రికి మీరు కూడా ధరించేయండి మరి!

వెనక దారి



మాది బాగా పేరున్న ప్రైవేటు డిగ్రీ కాలేజీ. అంటే గ్రౌండ్ గట్రా లేకుండా చిన్న అపార్ట్‌మెంట్‌లో ఉండాలి కదా! అందుకే మాది కూడా అలాగే చుట్టూ మూడు అడుగుల ఎత్తు పిట్టగోడతో, నాలుగు అంతస్తులతో ఇరుకిరుగ్గా, గాలీవెలుతురూ లేకుండా ఎంచక్కా ఉంటుంది. మేం ఆ చీకట్లో కూడా వెనక బెంచీలో కూర్చుని చిందులు తొక్కుతుంటాం. ఎంత అల్లరి చేసినా.. మా ప్రిన్సిపాల్ని చూస్తే మాత్రం మహా భయం! ఎందుకంటే ఆయన బాగా స్ట్రిక్ట్ మనిషే కాదు, కోపిష్టి కూడా. ఒళ్లు మండితే డిగ్రీ స్టూడెంట్స్ అని కూడా చూడకుండా లెంపలు వాయించేస్తుంటారు. ఎగ్జామ్స్ వస్తే చేపల్లా రుద్దించేయడమే!

అయినా ఆయనకు చిక్కకుండా క్లాసులు బంక్ కొట్టడానికి ఓ గొప్ప ప్లాన్ వేశాడు మా బ్యాచ్‌లోని ఉదయ్. 'రెండో పీరియడ్ తర్వాత ఎవ్వరికీ కనపడకుండా బిల్డింగ్ వెనకవైపు నుంచి గోడ దూకితే డైరెక్ట్‌గా మెయిన్ రోడ్డుకు చేరుకోవచ్చు. ఆ మలుపులోనే ఓ థియేటర్ ఉంది. నచ్చిన సినిమా మార్నింగ్ షో చూసేసి సాయంత్రం కాలేజీ అయ్యేలోపు మళ్లీ క్లాసులకు వచ్చేయొచ్చు' అని చెప్పిన వాడి మాస్టర్‌ప్లాన్ చూసి మైండ్ పోయింది మాకు! ఆలస్యం చేయకుండా అమలు చేయడం మొదలుపెట్టాం. అలా ఒకటి, రెండు, మూడు.. సినిమాలు అయ్యాయి. నాలుగో సినిమాకి వెళ్లే రోజున గోడ దూకడానికి ఒక్కొక్కరమే క్లాసు నుంచి బయటకు వస్తున్నాం. మొదట సాగర్ దూకాడో లేదో.. 'అయ్య బాబోయ్' అని పెద్ద కేక! ఏమైందో అని కంగారు పడుతూ అందరం ఒకేసారి దూకేశాం. అక్కడే తన పాత స్ప్లెండర్ బైక్ మీద స్టైల్‌గా కూర్చుని ఉన్నారు ప్రిన్సిపాల్! ఇక ఆ రోజంతా మాకు సినిమానే.. మిస్ చేసిన క్లాసులన్నీ మళ్లీ చెప్పించారు. మరోసారి దూకకుండా గోడ ఎత్తు పెంచేశారు. ఇప్పుడిక చేసేదేమీ లేక.. బుద్ధిగా క్లాసులకు వెళ్తున్నాం.

– డి.ముకుంద, అనకాపల్లి

పోలీసులపై కరడుగట్టిన నేరస్థుడి దాడి

- కత్తిపోట్లతో సీఐ, కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలు
- నిందితుడిపై కాల్పులు జరిపి బంధించిన పోలీసులు
- శ్రీసత్యసాయి జిల్లా చిలమత్తూరులో ఘటన





నిందితుడు నాగేంద్రను ఆసుపత్రికి తరలిస్తున్న పోలీసులు ★ తీవ్రంగా గాయపడిన కానిస్టేబుల్ రవికుమార్ ★ గాయపడిన సీఐ ఆంజనేయులు

ఈనాడు, పుట్టపర్తి, న్యూస్‌టుడే, హిందూపురం పట్టణం: ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో మోస్ట్ వాంటెడ్ క్రిమినల్‌గా ఉన్న కరడుగట్టిన నేరస్థుడు, సామూహిక అత్యాచారం కేసులో ప్రధాన నిందితుడు కావడి నాగేంద్ర పోలీసులపై కత్తితో దాడులకు తెగబడ్డాడు. ఆత్మరక్షణ కోసం పోలీసులు అతడిపై కాల్పులు జరిపారు. తీవ్రంగా గాయపడిన సీఐ, కానిస్టేబుల్‌ను, నిందితుడిని పోలీసులు హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంచలనం సృష్టించిన ఈ ఘటన శ్రీసత్యసాయి జిల్లా చిలమత్తూరు మండలంలో శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. సంఘటనకు సంబంధించి ఎస్పీ సతీశ్‌కుమార్, హిందూపురం డీఎస్పీ మహేశ్ తెలిపిన వివరాల మేరకు.. హిందూపురం పట్టణానికి చెందిన కావడి నాగేంద్ర దాదాపు 70 కేసుల్లో నిందితుడు. 2024 అక్టోబరు 12న చిలమత్తూరు మండలం టేకులోడు వద్ద ఓ ఫ్యాక్టరీలో సెక్యూరిటీ గార్డులుగా ఉన్న ఓ కుటుంబంపై తన స్నేహితులతో కలిసి దాడి చేసి తండ్రీకొడుకులను బంధించి.. అత్తాకోడలిపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ దారుణంలో నాగేంద్ర ప్రధాన నిందితుడు. అప్పట్లో అతనితోపాటు సాకే ప్రవీణ్‌కుమార్, సి.శ్రీనివాసులుపై కేసు నమోదుచేసి అరెస్టు చేశారు. అనంతరం బెయిల్‌పై విడుదలయ్యారు. ఈ కేసుపై విచారణ జరుగుతోంది. నిందితుడు గతేడాది నవంబరు 19 నుంచి కోర్టుకు విచారణకు రాకపోవడంతో వారంట్ జారీ అయింది. దీంతో పోలీసులు అతనిపై నిఘా ఉంచారు.

సమాచారం అందడంతో..

నాగేంద్ర చిలమత్తూరు మీదుగా వెళుతున్నట్లు శుక్రవారం తెల్లవారుజామున పోలీసులకు సమాచారం అందింది. వెంటనే చిలమత్తూరు ఎస్సై మునీర్ అహ్మద్‌ను అప్రమత్తం చేశారు. ఆయన ముగ్గురు కానిస్టేబుళ్లతో ఓ వైపు నుంచి. . మరోవైపు హిందూపురం గ్రామీణ సీఐ జనార్దన్, సీఐ ఆంజనేయులు, సిబ్బందితో రంగంలోకి దిగి టేకులోడు అటవీప్రాంతంలో గాలించారు. చిలమత్తూరు కసుమ ప్రాంతంలో తనను పట్టుకోవడానికి ప్రయత్నించిన కానిస్టేబుల్ రవికుమార్ ఎడమచేతిపై నాగేంద్ర కత్తితో పొడిచి అడవిలోకి పారిపోయాడు. గాయపడిన కానిస్టేబుల్‌ను పోలీసులు ఆసుపత్రికి తరలించారు. తర్వాత గాలింపు కొనసాగించగా తారసపడిన నిందితుడిని సీఐ ఆంజనేయులు పట్టుకోవడానికి ప్రయత్నించగా ఆయన ఛాతి, చేతులపై కత్తితో దాడిచేసి గాయపరిచాడు. ఈ క్రమంలో సీఐ గాలిలోకి కాల్పులు జరిపినా పట్టించుకోకపోవడంతో కాలిపై కాల్పులు జరిపారు. గాయపడిన నాగేంద్రను బంధించి హిందూపురం ఆసుపత్రికి తరలించారు. సీఐ ఆంజనేయులుకూ చికిత్స అందిస్తున్నారు. చికిత్స పొందుతున్న పోలీసులను హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ ఫోన్‌లో పరామర్శించారు.

దోపిడీలు, దొంగతనాలు, హత్యలు

హిందూపురం పట్టణం త్యాగరాజనగర్‌కు చెందిన నాగేంద్ర పలు దోపిడీలు, దొంగతనాలు, హత్య కేసుల్లో నిందితుడు. అదే కాలనీకి చెందిన ఇతని చిన్నాన్న దుర్గ కూడా కరడుగట్టిన నేరస్థుడు. అతని కూతురు రజని 2014-19 మధ్య వైకాపా తరఫున కౌన్సిలర్‌గా పనిచేశారు. దుర్గ ముఠాలో సభ్యుడిగా కొనసాగిన నాగేంద్రపై ఉమ్మడి జిల్లాలో 41, కర్ణాటకలో 30 వరకు కేసులు నమోదయ్యాయి. నాలుగేళ్లుగా హిందూపురంలోని మోడల్‌కాలనీలో నివాసముంటున్నాడు.

స్నేహితుడిని హత్య చేసి

కొంతకాలం కిందట త్యాగరాజనగర్‌కు చెందిన తన స్నేహితుడిని హత్య చేసిన కేసులో నాగేంద్ర ప్రధాన నిందితుడు. అనంతరం గంజాయి అక్రమ రవాణాలోనూ పోలీసులకు చిక్కాడు. హిందూపురం ప్రాంతంలో గంజాయి తరలింపు, విక్రయంలో కీలకంగా వ్యవహరిస్తున్నాడు. జనసంచారం లేని ప్రాంతాలకు ప్రేమికులెవరైనా వెళితే వారిలో మహిళలపై అత్యాచారాలకు పాల్పడినట్లు ఆరోపణలున్నాయి. శివారు ప్రాంతాల్లో సంపన్నులను గుర్తించి వారిపై దాడులు చేస్తూ దోపిడీలకు పాల్పడుతున్నాడు. ఈ నేపథ్యంలో ఎస్పీ సతీశ్ కుమార్ పాతనేరస్థులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు.

పెంచిపోషించిన ఫలితమిది..

పోలీసుల్లో కొంతమంది ఇతనితో సంబంధాలు నెరపడంతో ఆగడాలకు అడ్డూఅదుపూ లేకుండాపోయింది. ఉన్నతాధికారులు అరెస్టుకు ప్రయత్నిస్తే వారి కదలికల సమాచారం ముందుగానే నాగేంద్రకు తెలిసిపోయేది. 2017లోనే ఇతనిపై రౌడీషీట్ నమోదైనా.. పటిష్ఠమైన నిఘా ఉంచలేకపోయారన్న ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో ఇష్టారాజ్యంగా నేరాలు చేస్తూ 2024లో సామూహిక అత్యాచారానికి ఒడిగట్టాడు. అక్రమంగా ఆయుధాలు సమకూర్చుకొని ఒకసారి వన్‌టౌన్ పోలీసులకు పట్టుబడ్డాడు. ఈ సమయంలో ఇతనిపై కఠిన చర్యలు తీసుకొని ఉంటే నేరాలు పెరిగేవి కావు. కర్ణాటక ప్రాంతం సమీపాన ఉండటంతో అక్కడ నేరాలకు పాల్పడి ఇక్కడ తలదాచుకొనేవాడు.

హెటెరోలో స్లాబు పెచ్చులు ఊడిపడి సహాయ మేనేజరు దుర్మరణం



చిరంజీవి



హెటెరో కార్యాలయ భవనంలో ఊడిపడిన స్లాబు పెచ్చులు

నక్కపల్లి, న్యూస్‌టుడే: అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలంలోని హెటెరో మందుల పరిశ్రమలో శుక్రవారం కార్యాలయ భవనం స్లాబ్ పెచ్చులూడి పడిన ప్రమాదంలో ఓ ఉద్యోగి మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదానికి సంబంధించి సీఐ జె.మురళి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హెటెరో పరిశ్రమలో ల్యాబ్స్ యూనిట్-3 సర్వీస్ బ్లాక్ ఉంది. ఇక్కడే ఉద్యోగుల నిమిత్తం ఓ గది ఏర్పాటుచేసి కార్యాలయంగా వినియోగిస్తున్నారు. నర్సీపట్నం మండలం చెట్టుపల్లికి చెందిన బోదెపు చిరంజీవి (39) సహాయ మేనేజరుగా, గుంటూరుకు చెందిన షేక్ మస్తాన్‌వలీ సీనియర్ మేనేజరుగా పనిచేస్తున్నారు. వీరిద్దరూ శుక్రవారం మధ్యాహ్నం కార్యాలయంలో కూర్చుని ఉండగా స్లాబు కింది భాగంలోని పెచ్చు ఊడి వీరిపై పడింది. ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడగా, ఇద్దరినీ విశాఖ కేజీహెచ్‌కు తరలించగా.. అప్పటికే చిరంజీవి మృతిచెందినట్లు పేర్కొన్నారు. మస్తాన్‌వలీని మెరుగైన చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. స్థానిక సీఐ సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం తీరుని పరిశీలించారు. భవనం పైభాగంలో భారీ యంత్రసామగ్రి ఉన్నట్లు చెప్పారు.

◆ ప్రమాదంలో మృతిచెందిన చిరంజీవికి లక్ష్మీమాధవితో పదేళ్ల క్రితం పెళ్లైంది.. ఇతడికి ఏడాది వయసు కలిగిన ఇద్దరు కవల పిల్లలున్నారు.

తరగతి గదికి వెళ్తూ.. కుప్పకూలిన ఉపాధ్యాయుడు

- సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడిన విద్యార్థి



వెంకట కిరణ్ సిద్ధార్థ

ఉదయగిరి, న్యూస్‌టుడే: తరగతి గదికి వెళ్తూ.. ఒక్కసారిగా కుప్పకూలిపోయిన ఉపాధ్యాయుడికి ఓ విద్యార్థి సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడిన సంఘటన శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఉదయగిరి మండలం గండిపాళెం జడ్పీ ఉన్నత పాఠశాలలో చోటుచేసుకుంది. పాఠశాలలో శుక్రవారం ఉదయం ప్రార్థన ముగిసిన తరువాత ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తరగతి గదుల్లోకి వెళుతున్నారు. ఈ క్రమంలో తెలుగు ఉపాధ్యాయుడు ఒక్కసారిగా కుప్పకూలి పడిపోయారు. పదో తరగతి విద్యార్థి కంచర్ల వెంకటకిరణ్ సిద్ధార్థ వెంటనే ఉపాధ్యాయుడికి సీపీఆర్ చేయడంతో కోలుకున్నారు. అనంతరం 108 వాహనంలో ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు, ఆపై నెల్లూరుకు తరలించారు. సమయానుకూలంగా స్పందించి ఉపాధ్యాయుడి ప్రాణాలు కాపాడిన సిద్ధార్థను ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

రాష్ట్ర ప్రజలను భాజపాకు తాకట్టు పెడుతున్నారు

- పీసీసీ అధ్యక్షురాలు షర్మిల



జీడీనెల్లూరులో ఎద్దులబండిపై ర్యాలీగా వస్తున్న షర్మిల

గంగాధర నెల్లూరు, న్యూస్‌టుడే: సీఎం చంద్రబాబు, వైకాపా అధినేత జగన్ రాష్ట్ర ప్రజలను కేంద్రంలోని భాజపా ప్రభుత్వానికి తాకట్టు పెడుతున్నారని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల విమర్శించారు. ఉపాధి హామీ పరిరక్షణ యాత్రలో భాగంగా శుక్రవారం ఆమె చిత్తూరు జిల్లా జీడీ నెల్లూరుకు చేరుకున్నారు. స్థానిక బస్టాండు వద్ద కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రమేష్ ఆధ్వర్యంలో భారీ గజమాలతో స్వాగతం పలికి.. ఎద్దుల బండిపై ర్యాలీగా ఆమెను తీసుకొచ్చారు. షర్మిల మాట్లాడుతూ.. పేద ప్రజల శ్రేయస్సు కోసం గతంలో కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెడితే.. నేడు మోదీ ఆ పథకాన్ని మార్పు చేస్తూ నిర్వీర్యం చేస్తున్నారన్నారు. జగన్ అధికారంలో ఉన్నప్పుడు రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేయకుండా నిద్రపోయి.. ప్రస్తుతం ఆందోళనకు పూనుకోవడం హాస్యాస్పదమన్నారు. అధికారంలో ఉన్న ఐదేళ్లూ జగన్ కేంద్రంలోని మోదీకి దత్తపుత్రుడిగా మారారని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు మోదీకి వంతపాడుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కర్ణాటకలోని కోలారు కాంగ్రెస్ ఎమ్మెల్యే మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మంగారి మఠాన్ని ప్రసాద్ స్కీం కింద చేర్చండి

- కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు ఎమ్మెల్యే, ఎంపీ వినతి



కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఎంపీ పుట్టా మహేష్. చిత్రంలో మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

ఈనాడు, దిల్లీ: ప్రసిద్ధ ఆధ్యాత్మిక కేంద్రం బ్రహ్మంగారి మఠాన్ని ప్రసాద్ (పిలిగ్రిమేజ్ రిజువెనేషన్ అండ్ స్పిరిచ్యువల్, హెరిటేజ్ ఆగ్మెంటేషన్ డ్రైవ్) కింద చేర్చి నిధులు మంజూరుచేయాలని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌లు కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు విజ్ఞప్తి చేశారు. వారు శుక్రవారం ఇక్కడ కేంద్రమంత్రిని కలిసి బ్రహ్మంగారి మఠం అభివృద్ధికి రూపొందించిన డీపీఆర్‌ను సమర్పించారు. క్షేత్ర అభివృద్ధికి రూ.140 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశామని, దాన్ని పరిశీలించి ఈ కేంద్రాన్ని ప్రసాద్ స్కీంలో చేర్చాలని కోరారు. మఠానికి వచ్చే భక్తులకు కనీస వసతుల కల్పన, ఆధ్యాత్మిక వారసత్వ సంపద పరిరక్షణ, పర్యాటకాభివృద్ధి ప్రధానాంశాలుగా డీపీఆర్ తయారు చేసినట్లు వారు వివరించారు. ఇందుకు కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఎంపీ పుట్టా మహేష్ తెలిపారు.

హిందువులు నిద్రాణం వీడాలి

ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్



ఈనాడు, అమరావతి: 'మనం కేవలం భక్తులుగా ఉంటే సరిపోదు. మన విశ్వాసాలకు స్పృహతో రక్షకులుగా ఉండాలి. ఎవరైనా దురుద్దేశంతో మన ధర్మాన్ని, విశ్వాసాన్ని ఉద్దేశపూర్వకంగా ఎగతాళి చేస్తే మన బాధను వ్యక్తం చేయాల్సిన బాధ్యత మనదే. అలాంటి సందర్భాల్లో మౌనంగా ఉంటే సామూహిక ఆత్మవిశ్వాసం బలహీనపడుతుంది. హిందూ ధర్మ రక్షణ అంటే ఇతర మతాలకు వ్యతిరేకంగా ఉండటం కాదు. అది సొంత ధర్మాన్ని, విశ్వాసాన్ని కాపాడుకోవడమే' అని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పిలుపునిచ్చారు. ఆయన శుక్రవారం ఎక్స్ వేదికగా స్పందించారు. 'ప్రతి భక్తుడికీ ఒక ధార్మిక బాధ్యత ఉంది. సాధారణ హిందువు మనస్తత్వంలోని నిద్రాణం, సౌకర్యవాదం నుంచి మనం బయటపడాలి. ఎవరైనా హిందూ దేవతలను అపవిత్రం చేసినప్పుడు, మన ధర్మాన్ని ఎగతాళి చేసినప్పుడు ఒంటరిగా బాధపడి, కర్మపై వదిలేసి ముందుకు సాగిపోతాం. ఈ విధానం మార్చుకోవాలి. జాతి, మతం, ప్రాంతం, భాషల వారీగా విభజన జరిగినా ధర్మం ఒక్కటే. దేవతలు అందరికీ ఒకేలా ఉంటారు' అని ఆయన అభివర్ణించారు.

కొత్తగా 10 బీసీ గురుకులాలు

- అందుబాటులోకి 3,000 సీట్లు
- మరో 10 ప్రాంతాల్లో నూతన భవనాల నిర్మాణం
- 2026-27లో ఏర్పాటు చేసేలా ప్రణాళిక
- ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమోదం

ఈనాడు, అమరావతి: బీసీ విద్యార్థులకు చక్కటి వసతి, మెరుగైన విద్య, నైపుణ్యమున్న ఉపాధ్యాయులతో మంచి బోధన అందించేందుకు కొత్తగా గురుకులాల ఏర్పాటుకు ప్రభుత్వం నడుంకట్టింది. రాష్ట్రవ్యాప్తంగా 2026-27 ఆర్థిక సంవత్సరంలో కొత్తగా 10 ప్రాంతాల్లో గురుకులాలను అందుబాటులోకి తీసుకురానుంది. ఏళ్లుగా అద్దె భవనాల్లో మగ్గుతున్న విద్యార్థుల కష్టాలను తీర్చేందుకు మరో 10 చోట్ల నూతన భవనాలను నిర్మించనున్నారు. ఈ మేరకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. దీనికి సీఎం చంద్రబాబు ఆమోదముద్ర వేశారు. కొత్తగా గురుకులాలు ఏర్పాటైతే విద్యార్థులకు 3 వేల సీట్లు అందుబాటులోకి రానున్నాయి.

20 చోట్ల ప్రతిపాదన.. తొలి విడతగా 10కి ఆమోదం...

నియోజకవర్గానికి ఒకటి చొప్పున గురుకులాన్ని ఏర్పాటుచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం 175 నియోజకవర్గాలకుగాను 86 నియోజకవర్గాల పరిధిలో గురుకులాలు ఉన్నాయి. మరో 89 చోట్ల లేవు. విద్యార్థులకు మెరుగైన విద్య అందుబాటులోకి తీసుకొచ్చేందుకు డిమాండ్‌కు అనుగుణంగా విడతల వారీగా గురుకులాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు గత కొన్ని సంవత్సరాల ప్రవేశాలను పరిగణనలోకి తీసుకుని ఎక్కడ డిమాండ్ ఎక్కువగా ఉందనేది పరిశీలించి 20 నియోజకవర్గాల పరిధిలో కొత్త గురుకులాల ఏర్పాటుకు అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదించారు. ఇందులో ఈ ఏడాది 10 చోట్ల తొలి విడతగా అందుబాటులోకి తీసుకువచ్చేందుకు సీఎం ఆమోదముద్ర వేశారు. మిగతా 10 వచ్చే ఏడాది ఏర్పాటు చేస్తారు.

రాయలసీమలో 1:15... ఉత్తరాంధ్రలో 1:5 డిమాండ్

ప్రభుత్వ భవనాలున్న చోట ఒక్కో గురుకులంలో 480 మంది విద్యార్థులున్నారు. ప్రైవేటు భవనాల్లో ఉన్న వాటిలో 240 మంది విద్యార్థులకు బోధన అందించేందుకు అవకాశముంది. రాష్ట్రవ్యాప్తంగా రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాల్లో ఎక్కువగా బీసీ గురుకులాలకు డిమాండ్ ఉంది. రాయలసీమ పరిధిలో ఒక్కో సీటుకు 15 మంది, ఉత్తరాంధ్రలో ఒక్కో సీటుకు 5 మంది పోటీపడుతున్నారు. కోస్తాంధ్రలో ఆ మేరకు డిమాండ్ లేదు. ఈ నేపథ్యంలో ఉత్తరాంధ్రలో 4, కోస్తాంధ్రలో 4, రాయలసీమలో 12 గురుకులాల ఏర్పాటుకు అధికారులు ప్రతిపాదించారు. వీటిలో అత్యంత ఎక్కువ డిమాండ్ ఉన్న నియోజకవర్గాలను ఎంపిక చేసి అక్కడ 10 గురుకులాలను తొలి విడతగా అందుబాటులోకి తీసుకురానున్నారు. వీటితోపాటు నసన్నకోట, కొత్తవలస, ఆత్మకూరు, కలికిరి, గొలిగమూడి, వనిపెంట గురుకుల పాఠశాలల్ని జూనియర్ కళాశాలలుగా ఉన్నతీకరించనున్నారు.

ఒక్కో గురుకులం నిర్మాణానికి రూ.45 కోట్లు

కొత్తగా ఒక్కో గురుకులం నిర్మాణానికి 45 కోట్ల వరకూ వ్యయం కానున్నట్లు అధికారులు అంచనాలు రూపొందించారు. రాష్ట్రవ్యాప్తంగా నూతన భవనాల నిర్మాణానికి 28 చోట్ల స్థలాలు కూడా సేకరించారు. ఉత్తరాంధ్రలో 4, కోస్తాంధ్రలో 8, రాయలసీమలో 16 చోట్ల.. నాలుగు ఎకరాల నుంచి 12 ఎకరాల వరకు స్థలాల్ని గుర్తించారు. వీటిలో తొలి విడతగా 2026-27 ఆర్థిక సంవత్సరంలో 10 ప్రాంతాల్లో భవనాల నిర్మాణం చేపట్టనున్నారు.

శివయ్య కంఠానికి నాగరాజు అలంకారం



తెలంగాణలోని జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం కట్కూర్ గ్రామంలోని ఎల్లమ్మ ఆలయం వెనుక భాగంలో శివుడి ప్రతిమ ఉంది. దాని కంఠానికి శుక్రవారం నాగుపాము చుట్టుకుంది. విషయం తెలుసుకున్న స్థానికులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు.

– న్యూస్‌టుడే, బచ్చన్నపేట

చెన్నైలో క్రికెట్ వినాయకుడు!



చెన్నై అన్నానగర్ న్యూ ఆవడి రోడ్డులో ఓ వినాయకుడి ఆలయం క్రికెట్ అభిమానులను ఆకట్టుకుంటోంది. ఎందుకంటే.. అందులో క్రికెట్ జట్టును ప్రతిబింబించేలా 11 తలల వినాయక విగ్రహం ఉంది. బౌలర్‌గా, బ్యాటర్‌గా, ఫీల్డర్‌గా వివిధ రూపాల్లోనూ గణపతి ప్రతిమలు ఉన్నాయి. ఇందులో జరిగే పూజల్లో క్రికెట్ పరిభాషలో 108 మంత్రాలు చదువుతుంటారు. 2001లో ఈడెన్ గార్డెన్‌లో భారత్, ఆస్ట్రేలియా మధ్య జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో భారత్ గెలిస్తే క్రికెట్ వినాయకుడి గుడి కట్టిస్తానని అన్నానగర్‌కు చెందిన రామకృష్ణన్ మొక్కుకొని.. ఆ మేరకు ఆలయం నిర్మించారు. అప్పటి నుంచి క్రికెట్ అభిమానులు నిత్య పూజలు చేస్తుంటారు. ఇక్కడ పూజలు చేస్తే అంతర్జాతీయ పోటీల్లో ముఖ్యంగా ప్రపంచ కప్‌లో భారత జట్టు విజయం సాధిస్తుందని అభిమానుల నమ్మకం. ప్రస్తుత టీ-20 ప్రపంచకప్‌లో భారత జట్టు విజయం సాధించాలని అభిమానులు శుక్రవారం పూజలు చేశారు.

– న్యూస్‌టుడే, చెన్నై(సైదాపేట)

'ఎంబీయూపై ఆరోపణల్లో వాస్తవం లేదు'

చంద్రగిరి గ్రామీణ, న్యూస్‌టుడే: కొన్నిరోజులుగా మోహన్‌బాబు యూనివర్సిటీపై వస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని యూనివర్సిటీ మీడియా కోఆర్డినేటర్ రవి చంద్రబాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 'కొన్ని విద్యార్థి సంఘాలు, మరికొందరు కలిసి వర్సిటీ ప్రతిష్ఠ దెబ్బతీసేలా అవాస్తవ సమాచారాన్ని బయటకు చెబుతున్నారు. సంస్థ జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం సహించలేని కొందరు స్వార్థంతో ఈ ఆరోపణలు చేస్తున్నారు. వారి మాటలు నమ్మి విద్యార్థి సంఘ నాయకులు తొందరపాటు చర్యలతో ఆందోళనలు, ధర్నాలు చేస్తూ డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. వీరిపై చంద్రగిరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం. విద్యార్థి నాయకుల కిడ్నాప్ వ్యవహారంలో యూనివర్సిటీ ఛాన్స్‌లర్ మంచు మోహన్‌బాబుకు, ప్రో ఛాన్స్‌లర్ మంచు విష్ణుకు ఎటువంటి సంబంధం లేదు' అని పేర్కొన్నారు.

దర్యాప్తునకు సహకరించండి

- అంబటి రాంబాబుకు హైకోర్టు ఆదేశం
- ఆయనకు నోటీసులిచ్చి వివరణ తీసుకోవాలని పోలీసులకు నిర్దేశం

ఈనాడు, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబును ఉద్దేశించి అసభ్య వ్యాఖ్యలు చేసిన వ్యవహారంపై మంగళగిరి గ్రామీణ పోలీసులు తనపై నమోదు చేసిన కేసును కొట్టేయాలని, పోలీసుల తదుపరి చర్యలను నిలువరించాలని కోరుతూ వైకాపా నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు శుక్రవారం అత్యవసరంగా దాఖలు చేసిన వ్యాజ్యంపై హైకోర్టు విచారణ జరిపింది. బీఎన్‌ఎస్‌ఎస్ సెక్షన్ 35(3)ని అనుసరించి అంబటికి నోటీసులిచ్చి వివరణ తీసుకోవాలని పోలీసులకు స్పష్టం చేసింది. కేసు దర్యాప్తునకు సహకరించాలని అంబటి రాంబాబును ఆదేశించింది. దర్యాప్తు కొనసాగించుకోవచ్చని పోలీసులకు సూచించింది. ఫిర్యాదిదారు టి.గంగాధర్‌కు నోటీసులిచ్చింది. వ్యాజ్యంపై తదుపరి విచారణను ఈ నెల 27కి వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి శుక్రవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు.

సీఎం చంద్రబాబును అంబటి రాంబాబు అసభ్యంగా దూషించడంపై తెదేపా నాయకుడు టి.గంగాధర్ ఇచ్చిన ఫిర్యాదుతో మంగళగిరి గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేశారు. శుక్రవారం హైకోర్టు ప్రారంభ సమయంలో అంబటి తరఫు న్యాయవాది ఎల్లారెడ్డి స్పందిస్తూ.. గుంటూరు నల్లపాడు పోలీసులు నమోదు చేసిన కేసులో ఇప్పటికే రాంబాబును అరెస్ట్ చేసి, రిమాండ్‌లో ఉంచారన్నారు. ఇదే ఘటనపై కేసు నమోదు చేసిన మంగళగిరి గ్రామీణ పోలీసులు.. సంబంధిత కోర్టులో పీటీ వారంట్ వేసినట్లు తమకు సమాచారం ఉందన్నారు. ఒకే ఘటనపై పోలీసులు బహుళ ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారని, ఈ నేపథ్యంలో అత్యవసరంగా దాఖలు చేసిన తమ వ్యాజ్యంపై విచారణ జరపాలని కోరారు. దీంతో న్యాయమూర్తి మధ్యాహ్నం విచారణ జరిపారు. పోలీసుల తరఫున పీపీ ఎం.లక్ష్మీనారాయణ వాదనలు వినిపిస్తూ.. రాంబాబుకు నోటీసులిచ్చి వివరణ తీసుకుంటామన్నారు. దర్యాప్తునకు సహకరించేలా ఆదేశాలు జారీచేయాలని కోరారు.

నటుడు విజయ్‌కు న్యాయస్థానంలో చుక్కెదురు

- ఆదాయ పన్ను జరిమానా చెల్లించాల్సిందేనని తీర్పు



చెన్నై, న్యూస్‌టుడే: ఆదాయ పన్ను శాఖ విధించిన జరిమానాను సవాల్ చేసిన సినీనటుడు, టీవీకే అధినేత విజయ్ పిటిషన్‌ను మద్రాసు హైకోర్టు తోసిపుచ్చింది. 2015-16వ ఆర్థిక సంవత్సరానికి విజయ్ దాఖలు చేసిన రిటర్న్స్‌లో రూ.35.42 కోట్లు ఆదాయంగా చూపించారు. ఐటీ అధికారులు 2015లో విజయ్ నివాసం, కార్యాలయంలో సోదాలు చేసి, స్వాధీనం చేసుకున్న పత్రాల ద్వారా అతని ఆదాయ, వ్యయాలను పరిశీలించారు. 'పులి' చిత్రంలో నటించడానికి తీసుకున్న రూ.15 కోట్లను వెల్లడించనందుకు రూ.1.50 కోట్ల జరిమానా విధిస్తూ 2022 జూన్ 30న ఐటీ విభాగం ఉత్తర్వులిచ్చింది. దీన్ని విజయ్ మద్రాసు హైకోర్టులో సవాల్ చేశారు. అతని పిటిషన్‌ను విచారించిన హైకోర్టు.. ఐటీ విభాగం ఉత్తర్వుల అమలుపై అప్పట్లో మధ్యంతర నిషేధం విధించింది. ఆ పిటిషన్ తాజాగా శుక్రవారం న్యాయమూర్తి జస్టిస్ సెంథిల్‌కుమార్ రామమూర్తి సమక్షంలో మళ్లీ విచారణకు వచ్చింది. విజయ్ తరఫు న్యాయవాది వాదిస్తూ, 'చట్టప్రకారం జరిమానా ఉత్తర్వులను 2019 జూన్ 30లోపు ఇవ్వాల్సి ఉండగా, సుమారు మూడేళ్ల తర్వాత ఇచ్చారు. ఆ ఉత్తర్వులు చెల్లవు. వాటిని రద్దు చేయండ'ని కోరారు. ఐటీ చట్టం ప్రకారం విజయ్‌కు జరిమానా విధించడం సబబేనని, ఆయన పిటిషన్‌ను కొట్టివేయాలని ఐటీ విభాగం తరఫు న్యాయవాది వాదించారు. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి... విజయ్‌కు జరిమానా విధించడంలో తప్పేమీ కన్పించడం లేదని, ఇందులో హైకోర్టు జోక్యం చేసుకోవడానికి ఇష్టపడటం లేదంటూ అతని పిటిషన్‌ను తోసిపుచ్చారు. ట్రైబ్యునల్‌ను ఆశ్రయించడానికి విజయ్ తరఫు న్యాయవాది అనుమతి కోరగా, న్యాయమూర్తి సమ్మతించారు.

టీవీకే మ్యానిఫెస్టో తయారీకి ప్రతిపాదనల ఆహ్వానం

చెన్నై, న్యూస్‌టుడే: తమిళనాడు శాసనసభకు త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మ్యానిఫెస్టో రూపకల్పనకు ప్రజల నుంచి అభిప్రాయాలు, ప్రతిపాదనలను టీవీకే అధ్యక్షుడు, నటుడు విజయ్ కోరారు. https://tvkmanifesto2026.com అనే వెబ్‌సైట్, tvkmanifesto2026@gmail.com అనే ఇ-మెయిల్ చిరునామాకూ వాటిని పంపాలని సూచించారు.

జోగి రమేష్‌పై కఠిన చర్యలొద్దు

- పోలీసులకు హైకోర్టు ఆదేశం

ఈనాడు, అమరావతి: వైకాపా నేత, మాజీ మంత్రి జోగి రమేష్‌పై నమోదు చేసిన రెండు కేసుల్లో తదుపరి విచారణ వరకు కఠిన చర్యలు తీసుకోవద్దని తిరుపతి గ్రామీణ, ఇబ్రహీంపట్నం పోలీసులను హైకోర్టు ఆదేశించింది. కోర్టు ముందున్న రికార్డులు, ఆయన తరఫు న్యాయవాది వాదనలను పరిగణనలోకి తీసుకుంటే ప్రెస్‌మీట్‌లో జోగి రమేష్ చేసిన వ్యాఖ్యలు అధికరణ 19(1)(ఏ) పరిధిలోని వాక్ స్వాతంత్ర్యం, భావప్రకటన స్వేచ్ఛ కిందకు వస్తాయని ప్రాథమికంగా అభిప్రాయపడింది. పోలీసులు పెట్టిన కేసుల్లో సెక్షన్లన్నీ ఏడేళ్లలోపు జైలుశిక్షకు వీలున్నవేనని గుర్తుచేసింది. ఈ దశలో రమేష్‌ను తక్షణమే అదుపులోకి తీసుకొని కస్టోడియల్ ఇంటరాగేషన్ చేయాల్సిన అవసరం కనిపించడం లేదంది. ఈ కేసుల్లో ఎలాంటి అభిప్రాయాలనూ వ్యక్తపరచకుండా సుప్రీంకోర్టు వివిధ కేసుల్లో ఇచ్చిన ఆదేశాలను పరిగణనలోకి తీసుకుని పిటిషనర్‌కు పరిమితమైన రక్షణ కల్పిస్తూ, మధ్యంతర ఉత్తర్వులిస్తున్నామని పేర్కొంది. తదుపరి విచారణ వరకు జోగి రమేష్‌పై తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులను ఆదేశించింది. ఫిర్యాదుదారులకు నోటీసులిస్తూ విచారణను ఈనెల 27కు వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి శుక్రవారం ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులిచ్చారు.

◆ తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదానికి కల్తీ నెయ్యి వినియోగించారన్న కేసును పక్కదోవ పట్టించేలా జోగి రమేశ్ జనవరి 31న మీడియాతో మాట్లాడారని, ఆ సందర్భంగా మంత్రి లోకేశ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని, విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యవహరించారని పేర్కొంటూ తిరుపతి గ్రామీణ మండల తెదేపా అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రమేష్‌పై తిరుపతి గ్రామీణ పోలీసులు ఈనెల 1న కేసు నమోదు చేశారు.

◆ జోగి రమేష్, ఆయన అనుచరులు మీడియా సమావేశం నిర్వహించి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌ల ప్రతిష్ఠకు భంగం కలిగేలా మాట్లాడారంటూ ఎన్టీఆర్ జిల్లా మూలపాడుకు చెందిన కాకి నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఇబ్రహీంపట్నం పోలీసులు అతనిపై కేసు నమోదు చేశారు. ఈ రెండు కేసులనూ కొట్టేయాలని, అరెస్ట్‌పై తొందరపాటు చర్యలు తీసుకోకుండా పోలీసులను నిలువరించాలని జోగి రమేష్ అత్యవసరంగా దాఖలు చేసిన వ్యాజ్యాలపై బుధవారం హైకోర్టు విచారణ జరిపిన విషయం తెలిసిందే. మధ్యంతర ఉత్తర్వులపై నిర్ణయాన్ని ఆరోజు వాయిదా వేసిన న్యాయమూర్తి.. పిటిషనర్‌పై కఠిన చర్యలొద్దంటూ శుక్రవారం స్పష్టంచేశారు.

అంబటి బెయిల్, కస్టడీ పిటిషన్లపై తీర్పు వాయిదా

గుంటూరు లీగల్, న్యూస్‌టుడే: సీఎం చంద్రబాబుపై తీవ్రమైన అనుచిత వ్యాఖ్యలు చేసి రిమాండ్‌లో ఉన్న వైకాపా నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుకు బెయిల్ ఇవ్వాలని, జైలులో ప్రత్యేక వసతులు కల్పించాలని కోరుతూ ఆయన తరఫు న్యాయవాదులు వేసిన పిటిషన్‌తో పాటు ఐదు రోజుల కస్టడీకి ఇవ్వాలన్న పోలీసుల పిటిషన్లపై గుంటూరు ప్రత్యేక జూనియర్ సివిల్ కోర్టులో శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు సుదీర్ఘ వాదనలు జరిగాయి. అంబటి తరఫున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్ రెడ్డి, మరో న్యాయవాది కె.రామకృష్ణారెడ్డి వాదనలు వినిపించారు. రాంబాబును పోలీసు కస్టడీకి ఇవ్వాల్సిన అవసరం లేదని, ఆయన గతంలో మంత్రిగా పనిచేసినందున జైలులో ప్రత్యేక వసతులు కల్పించాలని, బెయిల్ మంజూరు చేయాలని కోరారు. వీరి వాదనలను ప్రాసిక్యూషన్ డిప్యూటీ డైరెక్టర్ విజయలక్ష్మి తిప్పికొట్టారు. రాంబాబు తీవ్రమైన నేరాలకు పాల్పడ్డారని, ఆయనను పోలీసు కస్టడీకి తీసుకుని విచారిస్తేనే కేసులో కుట్ర కోణం బయటపడుతుందని వివరించారు. ఇరువైపులా వాదనలు విన్న న్యాయమూర్తి జి.స్రవంతి సోమవారం తీర్పు వెలువరిస్తామని ప్రకటించారు.

క్వాంటమ్ వ్యాలీకి నేడు శంకుస్థాపన

- అమరావతిలో సరికొత్త సాంకేతిక విప్లవానికి శ్రీకారం
- పాల్గొననున్న కేంద్రమంత్రి జితేంద్ర సింగ్, సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: దేశ భవిష్యత్తు సాంకేతిక రంగాన్ని మలుపు తిప్పే చరిత్రాత్మక ఘట్టానికి అమరావతి శనివారం వేదికగా నిలవనుంది. ప్రపంచ క్వాంటమ్ టెక్నాలజీ రంగంలో ఏపీని అగ్రగామిగా నిలిపే లక్ష్యంతో రూపొందించిన 'అమరావతి క్వాంటమ్ వ్యాలీ' భవన నిర్మాణానికి పునాదిరాయి పడుతోంది. దీని ద్వారా దేశంలో క్వాంటమ్ విప్లవానికి నాయకత్వం వహించే అవకాశం రాష్ట్రానికి రానుంది. కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి జితేంద్ర సింగ్‌తో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెం గ్రామంలో 'క్వాంటమ్ వ్యాలీ' భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. దీని కోసం ప్రభుత్వం 50ఎకరాలు కేటాయించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం మధ్యాహ్నం 2.45 గంటలకు క్యాంపు కార్యాలయం నుంచి బయలుదేరి 3 గంటలకు ఉద్దండరాయునిపాలెం చేరుకుంటారు. సాయంత్రం 6 గంటల వరకు జరిగే క్వాంటమ్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారు. అమరావతిలో రూపుదిద్దుకుంటున్న క్వాంటమ్‌వ్యాలీ రాష్ట్రానికి, దేశానికి మైలురాయిగా నిలవనుంది. భారతదేశపు మొదటి 133 క్యూబిట్ క్వాంటమ్ కంప్యూటర్‌ను అమరావతికి తీసుకురావడానికి ఐబీఎం, టీసీఎస్, ఎల్అండ్‌టీ సంస్థలు కీలకంగా వ్యవహరిస్తున్నాయి. క్వాంటమ్ కంప్యూటింగ్, క్వాంటమ్ కమ్యూనికేషన్స్, క్వాంటమ్ సెన్సర్స్, కృత్రిమ మేధ, సైబర్ సెక్యూరిటీ, డిఫెన్స్, హెల్త్‌కేర్, ఫైనాన్స్ లాంటి కీలక రంగాల్లో పరిశోధనలు, ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధికి ఇక్కడ చోటు దక్కనుంది.

డిసెంబరు నాటికి క్వాంటమ్ కంప్యూటర్

ప్రపంచంలోనే అత్యాధునిక క్వాంటమ్ హబ్‌ల సరసన అమరావతిని నిలపాలనే సంకల్పంతో ఈ ప్రాజెక్టును సీఎం చంద్రబాబు తలపెట్టారు. క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటుతో ప్రపంచ స్థాయి పరిశోధన కేంద్రాలు, గ్లోబల్ టెక్నాలజీ సంస్థల పెట్టుబడులు, స్టార్టప్ ఎకో సిస్టం విస్తరణ, లక్షల మంది యువతకు నైపుణ్య శిక్షణ, పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభించాలని ముఖ్యమంత్రి ఆశిస్తున్నారు. ఆగస్టు నాటికి క్వాంటమ్ వ్యాలీ భవనం సిద్ధం చేసి, డిసెంబరు కల్లా క్వాంటమ్ కంప్యూటర్‌ను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ప్రపంచంలో బోస్టన్, సింగపూర్, షాంఘై లాంటి క్వాంటం కేంద్రాలతో సమానంగా ఇది నిలవనుంది.

నేడు చరిత్రాత్మక రోజు: సీఎం

1990 చివరిలో భారతదేశాన్ని ఐటీ శక్తిగా నిలబెట్టిన స్థాయి నుంచి... ఇప్పుడు అమరావతిలో భారతదేశాన్ని క్వాంటమ్ టెక్నాలజీలో అగ్రగామిగా నిలపడానికి తాము సిద్ధంగా ఉన్నామని ఎక్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. శనివారం చరిత్రాత్మక రోజు అని అన్నారు.

క్వాంటమ్ వ్యాలీకి సాంకేతిక సహకారం

- దేశవ్యాప్తంగా ఏడు స్టార్టప్‌లతో కలిసి పనిచేస్తున్నాం
- హార్డ్‌వేర్‌పైనా దృష్టిపెట్టాలి
- నేషనల్ క్వాంటమ్ టెక్నాలజీ సెల్ హెడ్ జేబీవీ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న నేషనల్ క్వాంటమ్ టెక్నాలజీ సెల్ హెడ్ జొన్నల భాస్కర వెంకటరెడ్డి

ఈనాడు, అమరావతి: అమరావతిలో ఏర్పాటు చేస్తున్న క్వాంటమ్ వ్యాలీకి నేషనల్ క్వాంటమ్ మిషన్ తరఫున సాంకేతిక సహకారం అందిస్తున్నామని నేషనల్ క్వాంటమ్ టెక్నాలజీ సెల్ హెడ్ జొన్నల భాస్కర వెంకటరెడ్డి (జేబీవీ రెడ్డి) తెలిపారు. విజయవాడ సమీపంలోని ధనేకుల ఇంజినీరింగ్ కళాశాలలో ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన అమరావతి క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్ ఫైనల్ పోటీల ప్రారంభానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. "నేషనల్ క్వాంటమ్ మిషన్ ఆధ్వర్యంలో దేశంలో నాలుగు హబ్‌లు ఏర్పాటుచేశాం. వీటిలో 43 విద్యాసంస్థలకు చెందిన 150 మంది పరిశోధనలు చేస్తున్నారు. ప్రాథమికంగా ఏడు స్టార్టప్‌లకు సహకారం అందిస్తున్నాం. చిప్స్ ఫ్యాబ్రికేషన్, పరిశ్రమలతోనూ అనుసంధానం కోసం పనిచేస్తున్నాం. వచ్చే ఐదు, పదేళ్లలో క్వాంటమ్‌లో విద్యార్థులు గ్లోబల్ లీడర్లుగా తయారుకావాలి. ఆల్గరిథమ్స్‌తో పాటు హార్డ్‌వేర్‌పైనా దృష్టిపెట్టాలి. ఇక్కడ ఐబీఎం ఏర్పాటు చేయబోతున్న క్వాంటమ్ కంప్యూటర్‌కు ఇతర సామగ్రిని విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. వాటిని మన దేశంలోనే తయారుచేసే స్థాయికి ఎదగాలి. క్వాంటమ్‌పై సహకారం అందించేందుకు 24 గంటలూ అందుబాటులో ఉంటాం. రెండేళ్ల క్రితం వరకు క్వాంటమ్ కంప్యూటర్ గురించి ఎవరికీ పెద్దగా తెలియదు. ఏడాది నుంచి ప్రచారంలోకి వచ్చి ఇప్పుడు గల్లీల్లోనూ చర్చిస్తున్నారు" అని తెలిపారు.

వందమందికి ఐబీఎం శిక్షణ

హ్యాకథాన్‌లో ఉత్తమ ప్రతిభ చూపిన వారిలో వందమందిని తదుపరి శిక్షణకు తీసుకోనున్నట్లు ఐబీఎం తెలిపిందని ఉన్నత విద్యామండలి ఛైర్మన్ మధుమూర్తి తెలిపారు. రాష్ట్ర విశ్వవిద్యాలయాలు బీటెక్‌లో క్వాంటమ్ కంప్యూటింగ్ కోర్సులను ప్రవేశపెడుతున్నాయని, ఇప్పటికే ఆంధ్రా వర్సిటీ కోర్సు ప్రారంభించగా.. శ్రీవేంకటేశ్వర వర్సిటీ వచ్చే విద్యా సంవత్సరంలో ప్రారంభించబోతోందని వెల్లడించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. "విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు కరిక్యులమ్‌లో మైనర్ డిగ్రీగా క్వాంటమ్‌ను ప్రవేశపెట్టాం. ఎన్‌పీటీఈఎల్ ద్వారా నాలుగు వారాల క్వాంటమ్ కోర్సుకు లక్ష మందికి పైగా విద్యార్థులు పేర్లు నమోదు చేసుకున్నారు. జాతీయ క్వాంటమ్ మిషన్ తరఫున 650 మంది అధ్యాపకులు క్వాంటమ్‌పై ఐదు మాడ్యూల్స్ శిక్షణ పూర్తిచేశారు. హ్యాకథాన్ వల్ల తరగతి బయట విద్యార్థులకు ప్రాక్టికల్ అనుభవం వస్తుంది. రిజిస్ట్రేషన్, ఆలోచన సమర్పణలో 20వేల మంది పాల్గొన్నారు. వీరికి మూడు రౌండ్లు నిర్వహించాం. తుది పోటీలకు 600 మంది వచ్చారు. ఉద్యోగావకాశాలతోపాటు వారిలోని సృజనాత్మకతను పెంచేందుకు ఇది ఉపయోగపడుతుంది. ఉపాధి అవకాశాలు పెరగడానికి, స్టార్టప్‌ల ఏర్పాటుకు దోహదం చేస్తుంది" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐబీఎం క్వాంటమ్ ఇండియా మాజీ హెడ్ ఎల్.వెంకట సుబ్రహ్మణ్యం, అమరావతి క్వాంటమ్ వ్యాలీ హెడ్ (టీసీఎస్) సీవీ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చేతుల మీదుగా బహుమతులు

క్వాంటమ్‌లో 10 ప్రాబ్లమ్ స్టేట్‌మెంట్లపై నిర్వహించిన పోటీల్లో విజేతలను ఎంపిక చేశారు. వీరికి ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా శనివారం బహుమతులు ప్రదానం చేయనున్నారు. పది అంశాల్లో ప్రథమబహుమతి కింద రూ.50వేలు, ద్వితీయ బహుమతిగా రూ.30వేల చొప్పున అందిస్తారు.

EENADU Vol: 52, Issue: 178 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

ఈనాడు సినిమా

ఒకే పాత్ర.. ముంబయి నేపథ్యం


బాలకృష్ణ

కథానాయకుడు బాలకృష్ణ. దర్శకుడు గోపీచంద్ మలినేని కలయికలో ఓ సినిమా పట్టాలెక్కనుంది. 'వీరసింహారెడ్డి' విజయం తర్వాత ఈ ఇద్దరి కాంబోలో రూపొందనున్న కొత్త చిత్రమిది. వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు. దీని కోసం తొలుత చారిత్రక కథను అనుకున్నప్పటికీ బడ్జెట్ పరిమితుల వల్ల దాన్ని పూర్తిగా పక్కకు పెట్టి సరికొత్త కథను సిద్ధం చేసుకున్న సంగతి తెలిసిందే. ఇది ముంబయి నేపథ్యంలో సాగే స్టైలిష్ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఉంటుందని సమాచారం. బాలయ్య గత చిత్రాల్లా కాకుండా ఆయన దీంట్లో ఒకే పాత్రలో కనిపించనున్నారని తెలిసింది. ఈ చిత్రం మార్చి తొలి వారం నుంచి చిత్రీకరణ ప్రారంభించుకోనుంది.

విభీషణుడిగా విజయ్‌సేతుపతి?


విజయ్ సేతుపతి

బాలీవుడ్ కథానాయకుడు రణ్‌బీర్ కపూర్, సాయిపల్లవి జంటగా నటిస్తున్న చిత్రం 'రామాయణ'. నితేశ్ తివారీ దర్శకత్వం వహిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో ఎంతో ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్న ఈ చిత్రంలో రావణుడిగా యశ్ కనిపించనున్నారు. ఇప్పుడీ చిత్రంలో మరో కొత్త నటుడు చేరినట్లు తెలుస్తోంది. ఇందులో రావణుడి తమ్ముడు విభీషణుడి పాత్ర కోసం విలక్షణ నటుడు విజయ్ సేతుపతిని ఎంపిక చేసే పనిలో పడిందట చిత్ర బృందం. ప్రస్తుతం ఆయనతో చర్చలు జరుగుతున్నాయని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటోన్న ఈ చిత్రంలో సన్నీ డేఓల్, రకుల్ ప్రీత్ సింగ్ లాంటి తదితర బాలీవుడ్ తారలు కీలక పాత్రల్లో కనిపించనున్నట్లు సమాచారం. ఈ ఏడాది దీపావళికి మొదటి భాగం, 2027 టపాసుల పండగకి రెండో భాగం థియేటర్లలోకి రానుంది.

'క్రిష్ 4'కి అంగీకారం?


ప్రియాంక చోప్రా

తన దగ్గరికి వచ్చిన ప్రతి అవకాశానికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వకపోయినా.. ఉన్నట్టుండి అదిరిపోయే కథతో తెరపై మెరిసిపోతుంటుంది అందాల తార ప్రియాంక చోప్రా. త్వరలో మహేశ్‌బాబుతో కలిసి 'వారణాసి' చిత్రంతో తెలుగు ప్రేక్షకుల్ని పలకరించడానికి ముస్తాబవుతోందీమె. కొన్ని రోజులుగా ప్రియాంక 'క్రిష్ 4'లో భాగం కాబోతున్నట్లు వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. ఇప్పుడు దీని గురించి మరో ఆసక్తికర విషయం నెట్టింట్లో చక్కర్లు కొడుతుంది. తాజాగా ఆమె 'క్రిష్ 4'లో నటించడానికి అంగీకారం చెప్పిందని, మళ్లీ హిందీ చిత్రపరిశ్రమలోకి రావడానికి ప్రియాంక చాలా ఉత్సాహంగా ఉందని బాలీవుడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. యాక్షన్ హీరో హృతిక్ రోషన్ ప్రధాన పాత్రలో నటిస్తూ.. దర్శకత్వం వహిస్తున్న తొలి చిత్రమిది. అంతరిక్ష నేపథ్యం, టైమ్ ట్రావెల్ కథగా ఈ సినిమా ఉండనుందని, త్వరలో చిత్రీకరణను మొదలెట్టనున్నారని సమాచారం. మరి మానవాతీత శక్తులు కలిగిన క్రిష్‌తో ప్రియాంక విన్యాసాలు చేస్తుందో లేదో తెలియాలంటే అధికారిక ప్రకటన వచ్చే వరకూ వేచి చూడాల్సిందే.

చిత్ర పరిశ్రమకు ఏ అవసరం వచ్చినా ప్రభుత్వ తలుపు తట్టొచ్చు

- ఉగాది రోజునే గద్దర్ సినీ పురస్కారాల ప్రదానం
- తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క


మణిశర్మ, మల్లు భట్టి విక్రమార్క, దిల్‌రాజు

హైదరాబాద్ నగరంలోని సానుకూలమైన వాతావరణాన్ని ఉపయోగించుకుంటూ... తెలంగాణని ప్రపంచ సినీ కేంద్రంగా మార్చాలన్నదే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని, అందుకోసం కార్యాచరణని కూడా సిద్ధం చేశామన్నారు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క. సినిమాలతో సామాజిక సందేశాన్ని ఇవ్వడంతోపాటు ఎంతో మందికి ఉపాధి అవకాశాల్ని కల్పించవచ్చన్నారు. వాణిజ్య పరంగానూ లబ్ధి పొందుతూ, ప్రపంచం దృష్టినీ ఆకర్షించవచ్చని పేర్కొన్నారు. ఇలాంటి కీలకమైన చిత్ర పరిశ్రమకు ఏ అవసరం వచ్చినా తెలంగాణ ప్రభుత్వం సాయంగా ఉంటుందన్నారు. ఆయన ముఖ్య అతిథిగా శుక్రవారం హైదరాబాద్‌లో తెలంగాణ గద్దర్ సినీ పురస్కారాలు - 2025 స్క్రీనింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ సందర్భంగా మల్లు భట్టివిక్రమార్క మాట్లాడారు. "తెలంగాణ ప్రాంత సామాజిక మార్పు కోసం కళల్ని ఉపయోగించి... ప్రజల కోసం తన జీవితాన్ని ధారబోసిన మహనీయుడు గద్దర్. ప్రజా ప్రభుత్వం ఏర్పాటు కాగానే ఆయన పేరుపైనే సినీ పురస్కారాలు ఇవ్వాలని నిర్ణయించాం. విజయవంతంగా రెండో ఏడాది పురస్కారాల్ని ప్రదానం చేస్తున్నాం. సమయాభావంతో గతేడాది కుదరలేదు కానీ, ఈసారి మాత్రం ఉగాది రోజునే వేడుకని చేస్తున్నాం. తెలంగాణలో సినిమా రంగాన్ని వ్యవస్థీకృతం చేయాలని ప్రజా ప్రభుత్వం కృషిచేస్తోంది. పరిశ్రమకు ఆర్థిక, సామాజిక, శాంతి భద్రతల పరంగా ఎలాంటి అవసరం వచ్చినా తమ ప్రభుత్వ తలుపు తట్టొచ్చు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, నేను ఎప్పుడూ అందుబాటులో ఉంటాం. పురపాలక ఎన్నికల కారణంగా వాళ్లు ఈ వేడుకకి రాలేకపోయారు. తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ దిల్‌రాజు ఈ పురస్కార వేడుక నిర్వహణని ఎంతో బాధ్యతాయుతంగా ముందుకు తీసుకెళుతున్నారు. జ్యూరీ ఛైర్మన్ మణిశర్మ నేతృత్వంలో కమిటీ తరతమ బేధాలు లేకుండా నిష్పక్షపాతంగా అవార్డుల ఎంపిక కార్యక్రమాన్ని చేపడుతుంద"న్నారు భట్టి విక్రమార్క. టీఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్‌రాజు మాట్లాడుతూ "ఈసారి పురస్కారాల కోసం 90 సినిమాలు పోటీ పడుతున్నాయి. అందులో 68 ఫీచర్, మరికొన్ని లఘు చిత్రాలు ఉన్నాయి. మార్చి 5లోపు జ్యూరీ సభ్యులు సినిమాల్ని వీక్షించి అవార్డుల్ని ఎంపిక చేస్తార"న్నారు. అవార్డుల జ్యూరీ కమిటీ ఛైర్మన్ మణిశర్మ మాట్లాడుతూ "ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి గతంలో ఎన్నో రికార్డింగులు చేసే అవకాశం దొరికింది. గద్దర్ చివరి రోజుల్లో కూడా ఆయనతో కలిసి మేం ఇద్దరం కొన్ని పాటల్ని రికార్డ్ చేశాం. 1987లో కీ బోర్డ్ ప్లేయర్‌గా ప్రయాణం మొదలుపెట్టిన నేను, 1997లో సంగీత దర్శకుడినయ్యా. ఇప్పటివరకూ 250 సినిమాలకు సంగీతం అందించా. గద్దర్ పురస్కారాల జ్యూరీకి ఛైర్మన్‌గా కొత్త బాధ్యతల్ని చేపట్టా" అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డీసీ డైరెక్టర్ కిశోర్‌బాబుతోపాటు జ్యూరీ సభ్యులు పాల్గొన్నారు.

కశ్మీర్‌కు 'మా వందే'


ఉన్ని ముకుందన్

ప్రధాని నరేంద్ర మోదీ జీవిత కథను 'మా వందే' పేరుతో తెరపైకి తీసుకొస్తున్నారు దర్శకుడు సీహెచ్ క్రాంతి కుమార్. దీంట్లో మోదీ పాత్రను మలయాళ స్టార్ ఉన్ని ముకుందన్ పోషిస్తున్నారు. వీర్ రెడ్డి. ఎం నిర్మిస్తున్నారు. రవీనా టాండన్, జగపతిబాబు, శరత్ కుమార్ ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఇటీవలే చిత్రీకరణ ప్రారంభించుకున్న ఈ సినిమా హైదరాబాద్‌లో తొలి షెడ్యూల్‌ను పూర్తి చేసుకున్నట్లు శుక్రవారం ప్రకటించారు. తదుపరి షెడ్యూల్‌ను కశ్మీర్‌లో ప్రారంభించనున్నట్లు తెలియజేశారు. దాదాపు రూ. 400కోట్ల భారీ బడ్జెట్‌తో దీన్ని నిర్మిస్తున్నారు. ఎన్నో పోరాటాల కన్నా తల్లి సంకల్పం గొప్పదనే సందేశానిస్తూ.. మోదీ జీవిత కథను ఆవిష్కరించనున్నారు. ఈ చిత్రంలో ఓ కీలక పాత్ర కోసం హాలీవుడ్ నటుడు జేసన్ మమోవాను సంప్రదిస్తోంది చిత్ర బృందం. అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మితమవుతున్న ఈ సినిమాని పాన్ ఇండియా భాషలతో పాటు ఇంగ్లిష్‌లోనూ విడుదల చేయనున్నారు. ఈ చిత్రానికి సంగీతం: రవి బస్రూర్, ఛాయాగ్రహణం: కె. కె సెంథిల్ కుమార్.

రూ.120కోట్లతో తెలుగులోకి 'టాక్సిక్'


యశ్

'కేజీఎఫ్' విజయాల తర్వాత కథానాయకుడు యశ్ నుంచి రానున్న కొత్త చిత్రం 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్'. గీతూ మోహన్ దాస్ తెరకెక్కిస్తున్న ఈ పాన్ ఇండియా సినిమాని మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఈ చిత్ర తెలుగు థియేట్రికల్ హక్కుల్ని నిర్మాత దిల్‌రాజు రూ.120కోట్లకు సొంతం చేసుకున్నట్లు శుక్రవారం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "కేజీఎఫ్' సినిమాల తర్వాత యశ్ మార్కెట్ చాలా పెరిగింది. నాలుగేళ్ల తర్వాత ఆయన నుంచి రానున్న ఈ 'టాక్సిక్' కోసం ప్రేక్షకులంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇప్పుడిలాంటి సినిమాని మా ఎస్వీసీ బ్యానర్ ద్వారా ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో విడుదల చేయనుండటం చాలా ఆనందంగా ఉంది" అన్నారు. ఇదొక పీరియాడిక్ యాక్షన్ డ్రామా సినిమా. కన్నడ, ఇంగ్లిష్ భాషల్లో ఏకకాలంలో తెరకెక్కిస్తున్నారు. ప్రస్తుతం ముగింపు దశలో ఉన్న ఈ సినిమా తెలుగు, హిందీ, తమిళ, మలయాళ భాషల్లో అనువాదమవుతోంది. ఈ చిత్రానికి రవి బస్రూర్ సంగీతమందిస్తుండగా.. రాజీవ్ రవి ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తున్నారు.

తొలి పాట ఆరోజే!


నాని

'ది ప్యారడైజ్' సినిమాతో బాక్సాఫీస్ బరిలో సందడి చేయనున్నారు కథానాయకుడు నాని. ఆయనతో దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తెరకెక్కిస్తున్న ఈ బహుభాషా చిత్రాన్ని సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. కయాదు లోహర్ కథానాయిక. మోహన్‌బాబు ప్రత్యేక పాత్ర పోషిస్తున్నారు. చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా నుంచి తొలి పాట వినిపించేందుకు చిత్ర బృందం సిద్ధమవుతోంది. ఈనెల 24న నాని పుట్టినరోజు సందర్భంగా దీన్ని బయటకు వదిలేందుకు సన్నాహాలు చేస్తున్నారని సమాచారం. ప్రస్తుతం ఈ చిత్ర షూటింగ్ శంషాబాద్‌లోని ప్రత్యేక సెట్‌లో శరవేగంగా జరుగుతోందని.. నాని పరిచయ గీతాన్ని తెరకెక్కిస్తున్నారని తెలిసింది. పీరియాడిక్ మాస్ యాక్షన్ చిత్రంగా ముస్తాబవుతున్న ఈ సినిమాకి అనిరుధ్ సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు. ఇది మార్చి నెలాఖరున తెరపైకి రావాల్సి ఉండగా.. వాయిదా పడనున్నట్లు ప్రచారం వినిపిస్తోంది. త్వరలోనే దీనిపై స్పష్టత వచ్చే అవకాశముంది.

ఇంటిల్లిపాది చూడటం కోసం చేసిన చిత్రం


గుణశేఖర్, రాగిణి గుణ

"నన్ను నేను కొత్తగా ఆవిష్కరించుకోవాలని చేసిన ప్రయత్నమే 'యుఫోరియా'" అన్నారు దర్శకుడు గుణశేఖర్. ఇప్పుడా ప్రయత్నానికి ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తోందని.. ఈమధ్య కాలంలో ఇలాంటి క్లైమాక్స్ చూడలేదని అంతా ప్రశంసిస్తున్నారని తెలిపారు. ఆయన దర్శకత్వం వహించిన ఈ సినిమాలో భూమిక, సారా అర్జున్, విఘ్నేశ్ గవిరెడ్డి ప్రధాన పాత్రధారులుగా నటించారు. రాగిణి గుణ సమర్పణలో నీలిమ గుణ, యుక్తా గుణ నిర్మించారు. ఈ సినిమా శుక్రవారం విడుదలైన నేపథ్యంలో హైదరాబాద్‌లో సక్సెస్‌మీట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు గుణశేఖర్ మాట్లాడుతూ.. "టైటిల్ చూసి యువతరం మాత్రమే వస్తామనుకున్నాం. కానీ, కుటుంబ ప్రేక్షకులు కూడా థియేటర్లకు వస్తున్నారు. కొత్త నటీనటులతో ఇంత పెద్ద స్కేల్‌లో ఇలాంటి సినిమా చేయడం సాహసమే అంటున్నారు. దీంట్లో తల్లి కొడుకు మధ్య ఉన్న సంఘర్షణను చూపించాం. ద్వితీయార్థంలోని ఉత్కంఠతని ఆస్వాదిస్తున్నట్లు కుటుంబ ప్రేక్షకులు చెప్తున్నారు. ఇంటిల్లిపాది చూడటం కోసమే చేసిన సినిమా ఇది" అన్నారు. ఈ కార్యక్రమంలో విఘ్నేశ్, నీలిమ గుణ, పృథ్వీ అడ్డాల తదితరులు పాల్గొన్నారు.

'గాయపడ్డ సింహం' వస్తోంది


తరుణ్ భాస్కర్

ఇటీవలే 'ఓం శాంతి శాంతి శాంతిః' చిత్రంతో హీరోగా థియేటర్లలో సందడి చేశారు దర్శకుడు తరుణ్ భాస్కర్. ఇప్పుడు 'గాయపడ్డ సింహం'గా ప్రేక్షకుల్ని పలకరించేందుకు సిద్ధమవుతున్నారు. ఆయన.. ఫరియా అబ్దుల్లా, మానస చౌదరి నాయకానాయికలుగా నటించిన ఈ సినిమాని కె.శ్రీనివాస్ తెరకెక్కించారు. దర్శకుడు పవన్ సాదినేని సమర్పణలో సప్తస్వ మీడియా వర్క్స్, పీఓవీ స్టోరీస్, జీ స్టూడియోస్ సంస్థలు నిర్మించాయి. ఈ చిత్ర టైటిల్, ఫస్ట్‌లుక్‌ను శుక్రవారం విడుదల చేశారు. "క్రైమ్, హాస్యంతో కలగలిసిన పొలిటికల్ సెటైర్ చిత్రమిది. థియేటర్లో ప్రేక్షకుల్ని కడుపుబ్బా నవ్వించేలా ఉంటుంది. ఓ పాట మినహా చిత్రీకరణ పూర్తయింది. ఈనెల 9న టీజర్‌ను విడుదల చేయనున్నాం" అని చిత్ర వర్గాలు తెలిపాయి.

దిల్లీ ప్రేమ కథలో?


అదితీరావ్ హైదరీ

అదితీరావ్ హైదరీ.. దిల్లీ అబ్బాయితో ప్రేమలో పడిందా? తన ప్రియుణ్ని త్వరలో పరిచయం చేయనుందా? అదితి ప్రేమలో పడడం ఏంటనే కదా మీ అనుమానం? ఇదంతా తన రాబోయే ప్రాజెక్టు గురించే. కొంకణా సేన్ శర్మ దర్శకత్వంలో రూపొందుతోన్న ఓ సిరీస్‌లో అదితి ప్రధాన పాత్ర పోషిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే చిత్రీకరణకు సంబంధించిన సన్నాహాలు కూడా ప్రారంభమైనట్లు తెలుస్తోంది. "దిల్లీలో జరిగే ఓ రొమాంటిక్ కామెడీ డ్రామాగా దీన్ని జయదీప్ సర్కార్‌తో కలిసి కొంకణా తీర్చిదిద్దుతున్నారు. ఇందులో నటుడు బరున్ సోబ్తి కీలక పాత్రలో నటిస్తున్నారు. ఆధునిక కథగా రూపొందుతున్న ఈ సిరీస్‌లో ప్రతి పాత్ర సరికొత్తగా ఉండనుంద"ని అదితి సన్నిహిత వర్గాలు తెలిపాయి. మరి నిజంగానే అదితి దిల్లీ అబ్బాయితో ప్రేమలో మునిగితేలబోతుందా అనేది తెలియాలంటే అధికారిక ప్రకటన వచ్చే వరకూ వేచి చూడాల్సిందే.

అలా... పిఠాపురంలో


రాజేంద్ర ప్రసాద్


ముగ్గురు అమ్మాయిల కథలా అనిపించే... ముగ్గురు తండ్రుల బాధకు అద్దం పట్టే కథతోనే 'పిఠాపురంలో' చిత్రాన్ని రూపొందించినట్టు తెలిపారు మహేశ్‌చంద్ర. ఆయన దర్శకత్వంలో రాజేంద్రప్రసాద్, పృథ్వీరాజ్, కేదార్ శంకర్, మణిచందన, జయవాహిని తదితరులు కీలక పాత్రల్లో నటించిన చిత్రమిది. అలా మొదలైంది... అనేది ఉపశీర్షిక. దుండిగల్ల బాలకృష్ణ, ఆకుల సురేశ్ పటేల్, ఎఫ్.ఎం.మురళీ (గోదారి కిట్టయ్య) చిత్రాన్ని నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్ని చేసుకుంటోంది. త్వరలోనే విడుదల తేదీని ప్రకటించనున్నారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ "నేటి ఇంటర్‌నెట్ తరం తెలుసుకోవాల్సిన విషయాలతో రూపొందిస్తున్న చిత్రమిది. మన చుట్టూ సమాజాన్ని, ఎంతోమంది జీవితాల్ని ప్రతిబింబించే ఈ కథలో స్వచ్ఛమైన వినోదం, మంచి పాటలు, సంభాషణలు ఉంటాయి. యువతరంతోపాటు, కుటుంబ ప్రేక్షకుల్నీ ఆకట్టుకునే అంశాలు ఇందులో ఉన్నాయి. పిఠాపురం నేపథ్యం ఈ చిత్రానికి మరింత ఆకర్షణ. పద్మశ్రీ గౌరవాన్ని పొందిన నటులు రాజేంద్రప్రసాద్‌ని ఇటీవలే చిత్రబృందమంతా కలిసి శుభాకాంక్షలు తెలిపాం. ఆ పురస్కారం తర్వాత విడుదలవుతున్న రాజేంద్రప్రసాద్ తొలి చిత్రమిదే కావడం మా అదృష్టం" అన్నారు. ఈ చిత్రానికి కథ: ఆకుల సురేశ్ పటేల్, సంగీతం: జీసీ క్రిష్.

ప్రతీకారమా... రెండు గుంతలు తవ్వాలి


అథర్వ మురళీ

గతేడాది 'డీఎన్ఏ' సినిమాతో మంచి విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నారు తమిళ నటుడు అథర్వ మురళీ. ఆయన ప్రధాన పాత్రలో జీవా శంకర్ దర్శకత్వంలో ఓ సినిమా రాబోతున్నట్లు గతంలో ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇప్పుడీ సినిమాకు 'వాలై' అనే పేరును ఖరారు చేశారు. తాజాగా నటుడు విజయ్ సేతుపతి ఈ చిత్ర టైటిల్‌తో పాటు టీజర్‌ను సామాజిక మాధ్యమాల వేదికగా విడుదల చేశారు. తీరప్రాంతం నేపథ్యంలో రూపొందుతున్న ఈ సినిమాలో అథర్వ.. కుట్టి, సారా అనే రెండు భిన్న కోణాలున్న పాత్రలో కనిపించనున్నారు. "ప్రతీకారం తీర్చుకోవాలని నిర్ణయించుకున్నారా? అయితే మీరు రెండు గుంతలు తవ్వాల్సి ఉంటుంది. ఒకటి మీ శత్రువు కోసం.. మరొకటి మీ కోసం" లాంటి సంభాషణలతో సాగుతున్న ఈ టీజర్ ఆకట్టుకుంటోంది.

'సుబేదార్' హెచ్చరిక!


అనిల్ కపూర్

ప్రత్యర్థులను సరిహద్దు దాటనివ్వకుండా దేశ రక్షణ కోసం యుద్ధభూమిలో పోరాడి గెలిచిన ఓ సైనికుడు.. ఇప్పుడు తన కుటుంబాన్ని కాపాడుకోవడానికి రంగంలోకి దిగాడు. మరి ఈ క్రమంలో ఆయనెలాంటి సవాళ్లు ఎదుర్కొన్నాడనేదే 'సుబేదార్' చిత్రం. సీనియర్ నటుడు అనిల్ కపూర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రమిది. సురేశ్ త్రివేణి దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం త్వరలో విడుదల కాబోతున్నట్లు తెలుపుతూ.. ఇన్‌స్టా వేదికగా 'సుబేదార్ హెచ్చరిక ఇది' అనే వ్యాఖ్యతో ఓ లుక్‌ను పంచుకుంది అమెజాన్ ప్రైమ్ వీడియో. ఇందులో అనిల్.. సుబేదార్ అర్జున్ సింగ్ అనే మాజీ సైనికుడిగా కనిపించనున్నారు. రాధికా మదన్ కీలక పాత్ర పోషిస్తున్నారు.

అర్జున విన్యాసం


అనీశ్

దర్శకుడు వెంకీ కుడుముల నిర్మాతగా కొత్త ప్రయాణాన్ని మొదలుపెట్టారు. వాట్ నెక్ట్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై 'ఇట్లు అర్జున' అనే చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అనీశ్ కథానాయకుడిగా నటిస్తుండగా, మహేశ్ ఉప్పల దర్శకత్వం వహిస్తున్నారు. అనస్వర రాజన్ కథానాయిక. అనీశ్ పుట్టినరోజు సందర్భంగా శనివారం ప్రత్యేకమైన పోస్టర్‌ని, వీడియోను విడుదల చేసింది చిత్రబృందం. ఆయన ఈ చిత్రంలో బధిర యువకుడిగా కనిపించనున్నారు. సైగలు, హావభావాలతోనే భావాల్ని ప్రకటించే యువకుడిగా నటించేందుకు తనని తాను సన్నద్ధం చేసుకున్న తీరుకి అద్దం పడుతుంది వీడియో. లోతైన భావోద్వేగాలతో ఈ చిత్రం సాగుతుందని, సవాల్‌తో కూడిన అర్జున పాత్రలో అనీశ్ చేసే విన్యాసాలు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని సినీ వర్గాలు చెప్పాయి.



డిజిటల్ మోసానికి గురైతే.. రూ.25,000 వరకు పరిహారం

- బ్యాంకు ఖాతాదార్లకు ఆర్‌బీఐ ఊరట
- ఎమ్‌ఎస్‌ఎమ్‌ఈలకు రూ.20 లక్షల వరకు హామీలేని రుణం
- చిన్న ఎన్‌బీఎఫ్‌సీలకు రిజిస్ట్రేషన్ మినహాయింపు
- కీలక రేట్లు యథాతథం
- భవిష్యత్తులో తగ్గొచ్చన్న సంకేతాలు

ఆర్‌బీఐ పరపతి విధాన సమీక్ష



ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఆరోది, చివరిది అయిన ద్వైమాసిక పరపతి విధాన సమీక్షలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) తన కీలక రేట్లను యథాతథంగా కొనసాగించింది. డిజిటల్ మోసాల బారిన పడిన వారికి పరిహారం; సూక్ష్మ- చిన్న, మధ్య తరహా కంపెనీ (ఎంఎస్‌ఎంఈ)లకు హామీ లేని రుణ మొత్తం పెంపు వంటి కీలక ప్రకటనలు చేసింది. అంతర్జాతీయ అనిశ్చితులు పెరిగినా.. అమెరికా-ఐరోపాతో మన దేశానికి కుదిరిన వాణిజ్య ఒప్పందం వల్ల ఆర్థిక వ్యవస్థకు సానుకూలతలు వస్తున్నాయని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా పేర్కొన్నారు.

రెపో రేటు 5.25% వద్దే

రెపో రేటు (బ్యాంకులకు ఆర్‌బీఐ ఇచ్చే రుణాలపై వసూలు చేసే వడ్డీ రేటు)ను 5.25% వద్దే కొనసాగించాలని ఆరుగురు సభ్యులున్న పరపతి విధాన కమిటీ (ఎమ్‌పీసీ) ఏకగ్రీవంగా నిర్ణయించింది. వాణిజ్య ఒప్పందాల వల్ల వృద్ధిపై ఆందోళనలు శాంతించడం ఇందుకు నేపథ్యం. 'తటస్థ' విధాన ధోరణిని కొనసాగించినందున, కీలక రేట్లు తక్కువ స్థాయుల్లోనే ఉంటాయని, ప్రస్తుతం కంటే తగ్గొచ్చనే సంకేతాలిచ్చింది. 2025 ఫిబ్రవరి తర్వాత 1.25% మేర రేట్లను ఆర్‌బీఐ తగ్గించింది.

ద్రవ్యోల్బణం, వృద్ధి అంచనాల పెంపు: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యోల్బణ అంచనా (2%)ను, 2.1 శాతానికి ఆర్‌బీఐ సవరించింది. అయినా ఆర్‌బీఐ లక్షిత 4% కంటే ఇది తక్కువే. వచ్చే ఆర్థిక సంవత్సరం తొలి, రెండో త్రైమాసికాల్లో ద్రవ్యోల్బణం వరుసగా 4%, 4.2 శాతంగా ఉండొచ్చని పేర్కొంది. వచ్చే ఆర్థిక సంవత్సరం ప్రథమార్థానికి వృద్ధి అంచనాను 6.75% నుంచి 6.95 శాతానికి సవరించింది. (2026-27 తొలి త్రైమాసికానికి 6.9%, రెండో త్రైమాసికానికి 7% ఉండొచ్చని తాజాగా పేర్కొంది) పూర్తి ఆర్థికసంవత్సరానికి అంచనాను ఇవ్వలేదు. సవరించిన జీడీపీ ప్రాతిపదిక సిరీస్ విడుదల అనంతరం, ఏప్రిల్ సమావేశంలో 2026-27కు అంచనాలు ఇవ్వనుంది.

ఓటీపీ చెప్పి మోసపోయినా..

డిజిటల్ ఆర్థిక మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో, బ్యాంకింగ్ వినియోగదార్లకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) గొప్ప ఉపశమనాన్ని ప్రకటించింది. ఒక మోసపూరిత లావాదేవీకి రూ.25,000 వరకు పరిహారాన్ని అందించనుంది. మోసగాళ్లకు వన్ టైం పాస్‌వర్డ్ (ఓటీపీ) ఇవ్వడం ద్వారా, డబ్బులు పోగొట్టుకున్న వారికీ ఈ పరిహారం అందుతుందని మల్హోత్రా పేర్కొన్నారు.

✦ రూ.85,000 కోట్ల డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్(డీఈఏ) ఫండ్ నుంచి బ్యాంకు ఖాతాదార్లకు ఈ పరిహారం ఇవ్వనున్నారు.

జీవితంలో ఒకసారే: 'మోసపోయిన వ్యక్తి డబ్బులు పోగొట్టుకున్న పక్షంలో, ఎటువంటి ప్రశ్నలూ అడక్కుండా రూ.25,000 చెల్లిస్తాం. అయితే ఆ లావాదేవీ దురుద్దేశంతో కూడుకున్నది కాకుండా ఉండాలి' అని మల్హోత్రా అన్నారు. ఒక వేళ మోసం రూ.25,000లోపే జరిగితే అందులో 15% మొత్తం బాధితులే భరించాల్సి ఉంటుంది. అంటే ఎక్కువమొత్తం మోసపోయిన వారికే, గరిష్ఠంగా రూ.25,000 అందుతుంది. ఒక వినియోగదారుకు జీవితకాలంలో ఒకసారి మాత్రమే ఈ పరిహారం అందుతుంది. త్వరలోనే దీనిపై ప్రజల చర్చ కోసం 'ముసాయిదా మార్గదర్శకాలను' ఆర్‌బీఐ విడుదల చేయనుంది.

మిస్‌సెల్లింగ్‌పై కొరడా

ఆర్థిక ఉత్పత్తులను కానీ, సేవలను కానీ అనైతిక పద్ధతుల్లో/సలహాలతో అంటగట్టడం (మిస్‌సెల్లింగ్) వల్ల వినియోగదార్లతో పాటు సంస్థలూ ఇబ్బంది పడుతున్నట్లు మల్హోత్రా పేర్కొన్నారు. ఆర్థిక ఉత్పత్తులు, సేవల వ్యాపార ప్రకటనలు, మార్కెటింగ్, విక్రయాలపై నియంత్రిత సంస్థ(ఆర్‌ఈలు)లకు విస్తృత స్థాయిలో నిబంధనలు జారీ చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. .

ఎమ్‌ఎస్‌ఎమ్‌ఈలకు రెట్టింపు రుణం

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు.. ఎమ్‌ఎస్‌ఎమ్‌ఈలకు హామీ లేకుండా ఇచ్చే రుణ మొత్తాన్ని ప్రస్తుత రూ.10 లక్షల నుంచి రెట్టింపు చేసి రూ.20 లక్షలకు చేర్చుతున్నట్లు మల్హోత్రా ప్రకటించారు. ఎమ్‌ఎస్‌ఎంఈ రుణస్వీకర్తలకు 2026 ఏప్రిల్ 1, ఆ తర్వాత మంజూరయ్యే, రెన్యూవల్ అయ్యే రుణాలకు ఈ నిబంధనలు వర్తిస్తాయి.

✦ రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్(రీట్స్)కు రుణాలిచ్చేందుకు బ్యాంకులను అనుమతించాలని ఆర్‌బీఐ ప్రతిపాదించింది. తద్వారా స్థిరాస్తి రంగానికి నగదు సరఫరాను బలోపేతం చేస్తారు.

✦ రూ.1,000 కోట్ల కంటే తక్కువ ఆస్తులు ఉండి, ఎటువంటి పబ్లిక్ నిధులూ పొందని చిన్నపాటి బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ(ఎన్‌బీఎఫ్‌సీ)లకు తప్పనిసరి రిజిస్ట్రేషన్ నుంచి మినహాయింపు లభిస్తుందని ఆర్‌బీఐ తెలిపింది.

ఉద్యోగాలపై ఏఐ నికర ప్రభావం సానుకూలమే: కృత్రిమ మేధ (ఏఐ)తో ఉద్యోగాలు పోతున్నాయన్న ఆందోళనల నేపథ్యంలో ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ పూనమ్ గుప్తా మాట్లాడుతూ 'ఈ కొత్త సాంకేతికత వల్ల నికరంగా ఉద్యోగాలపై సానుకూల ప్రభావమే ఉంది. కొన్ని ఉద్యోగాలు పోవొచ్చు. అయితే మరికొన్ని కొత్త ఉద్యోగాలు వస్తున్నాయి. కొత్త సాంకేతికతకు మారే సమయంలో సవాళ్లు ఉంటాయ'ని అన్నారు.

మరింత కాలం తక్కువ స్థాయుల్లోనే వడ్డీ రేట్లు

'దీర్ఘకాలం పాటు తక్కువ స్థాయుల్లోనే కీలక రేట్లు కొనసాగుతాయి. ప్రస్తుతం కంటే తగ్గే అవకాశమూ ఉంది. అయితే నిర్ణయం పరపతి విధాన కమిటీ (ఎమ్‌పీసీ) చేతుల్లోనే ఉంటుంది. ఇటీవలి వాణిజ్య ఒప్పందాల వల్ల, దేశ జీడీపీకి 20 బేసిస్ పాయింట్ల ప్రయోజనం జత చేరుతుందని అంచనా.'

– ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా

ఇతర ముఖ్యాంశాలు

- యూపీఐ ప్లాట్‌ఫాం అన్ని వర్గాలకు ప్రయోజనకరంగా ఉండేలా, మౌలిక వసతులను మరింత మెరుగుపరచాల్సిన అవసరం ఉందని ఆర్‌బీఐ తెలిపింది. ప్రస్తుతం ఈ సదుపాయం అందరు వినియోగదార్లకు ఉచితంగా ఉండగా, లావాదేవీ పూర్తి చేస్తున్నందుకు బ్యాంకులకు కేంద్రం పరిహారం ఇస్తోంది.
- మిషన్ సాక్ష్యం(సహకారీ బ్యాంక్ క్షమతా నిర్మాణ్) పేరిట పట్టణ సహకార బ్యాంకుల సామర్థ్య పెంపుపై దృష్టి సారిస్తారు.
- వాలంటరీ రిటెన్షన్ రూట్(వీఆర్‌ఆర్) కింద చేసే పెట్టుబడులకు ఉన్న రూ.2.5 లక్షల కోట్ల పరిమితిని తొలగించాలని ఆర్‌బీఐ ప్రతిపాదించింది.
- 2026-27 ప్రభుత్వ స్థూల రుణ లక్ష్యం (రూ.17.2 లక్షల కోట్ల)పై భయాలు అవసరం లేదని, నికర రుణాలు రూ.20,000 కోట్ల మేరే పెరిగాయని మల్హోత్రా అన్నారు.

తదుపరి ఎమ్‌పీసీ సమావేశం ఏప్రిల్ 6-8 తేదీల్లో జరగనుంది.

కిమ్స్ ఆదాయం రూ.1,003 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: కృష్ణా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (కిమ్స్) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబరు త్రైమాసికంలో తొలిసారిగా రూ.1,000 కోట్ల ఆదాయ మైలురాయిని అధిగమించింది. సమీక్షా త్రైమాసిక ఆదాయం రూ.1,003 కోట్లుగా నమోదైంది. 2024-25 ఇదే కాల ఆదాయం రూ.790 కోట్లు కంటే, ఇది 27% అధికం. ఇదే సమయంలో సంస్థ నికర లాభం మాత్రం రూ.93 కోట్ల నుంచి రూ.52 కోట్లకు పరిమితమైంది. కొత్తగా ప్రారంభించిన బెంగళూరు, థానే యూనిట్ల నిర్వహణ ఖర్చులు పెరగడమే ఇందుకు కారణమని సంస్థ వివరించింది. చికిత్స కోసం వచ్చే రోగుల సంఖ్య పెరిగిందని, ఒక్కో పడక ద్వారా వచ్చే సగటు ఆదాయం గత ఏడాదితో పోలిస్తే 20.5% వృద్ధితో రూ.46,3418 చేరుకుందని పేర్కొంది. ప్రస్తుతం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, మహారాష్ట్రల్లోని 25 ఆసుపత్రుల్లో సంస్థకు 7,100 పడకల సామర్థ్యం ఉంది. వివిధ దశల్లో ఉన్న కొత్త ఆసుపత్రుల ద్వారా, పడకల సామర్థ్యం 9,100కు చేరుతుందని కిమ్స్ సీఎండీ బి.భాస్కర రావు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరాన్ని మరింత వృద్ధితో ముగిస్తామన్న విశ్వాసం ఉందన్నారు.

పెరిగిన క్యాప్‌స్టన్ లాభం

ఈనాడు, హైదరాబాద్: క్యాప్‌స్టన్ సర్వీసెస్ 2025-26 డిసెంబరు త్రైమాసికంలో మొత్తం రూ.212.85 కోట్ల ఆదాయంపై, రూ.7.43 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. 2024-25 ఇదే కాలంలో ఆదాయం రూ.182.77 కోట్లు, నికర లాభం రూ.4.53 కోట్లుగా ఉన్నాయి. వీటితో పోలిస్తే సమీక్షా త్రైమాసికంలో ఆదాయం 16.46%, నికర లాభం 64.02% పెరిగాయి. ఏప్రిల్-డిసెంబరుకు ఆదాయం రూ.615.42 కోట్లు, నికర లాభం రూ.20.61 కోట్లుగా ఉన్నాయి. వినియోగదారులు పెరగడం, బలమైన నిర్వహణ సామర్థ్యంతో ఈ ఫలితాలు సాధించామని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీకాంత్ కొడాలి వివరించారు.

జీఎంఆర్ పవర్ అండ్ అర్బన్ ఇన్‌ఫ్రా ఆదాయం రూ.2,002 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: జీఎంఆర్ పవర్ అండ్ అర్బన్ ఇన్‌ఫ్రా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రూ.2,002.56 కోట్ల ఆదాయంపై రూ.160.27 కోట్ల నష్టాన్ని నమోదు చేసింది. 2024-25 ఇదే కాలంలో ఆదాయం రూ.1,762.14 కోట్లు, నికర నష్టం రూ.108.45 కోట్లుగా ఉన్నాయి. మొత్తం తొమ్మిది నెలల కాలానికి రూ.5,686.44 కోట్ల ఆదాయంపై రూ.727.25 కోట్ల లాభాన్ని సంస్థ ప్రకటించింది.

చిప్, అంతరిక్ష, రక్షణ సాంకేతిక అంకురాలకు రూ.600 కోట్ల నిధి

ప్రారంభించిన ఐఐటీ- మద్రాస్, యూనికార్న్ ఇండియా వెంచర్స్

అంతరిక్ష సాంకేతికత, సెమీకండక్టర్లు, రక్షణ సాంకేతికత లాంటి వ్యూహాత్మక రంగాల్లోని ప్రారంభ స్థాయి అంకుర సంస్థలకు తోడ్పాటు అందించే ఉద్దేశంతో రూ.600 కోట్ల డీప్‌టెక్ నిధిని ఐఐటీ మద్రాస్ రీసెర్చ్ పార్క్, యూనికార్న్ ఇండియా వెంచర్స్ ఏర్పాటు చేశాయి. 'ఐఐటీఎం యూనికార్న్ ఫ్రంటియర్ ఫండ్- 1'గా వ్యవహరించే ఈ నిధికి అవసరాన్ని బట్టి అదనంగా మరో రూ.400 కోట్లు జతచేసే అవకాశం ఉందని ఇరు సంస్థలు ప్రకటించాయి. జాతీయ వ్యూహాత్మక ప్రయోజనాలతో సంబంధమున్న డీప్‌టెక్ (ఐపీ ఆధారిత, ఇంజినీరింగ్ హెవీ) రంగాల్లోని సంస్థలకు సాయం చేయడంపై ఈ నిధి దృష్టి పెడుతుంది. మొత్తంగా 25 కంపెనీల్లో పెట్టుబడులు పెట్టాలన్నది లక్ష్యం. సగటున ఒక్కో సంస్థకు తొలుత రూ.8-10 కోట్లు అందివ్వనుంది. 10+2 సంవత్సరాల కాలపరిమితితో ఈ నిధిని నిర్వహిస్తారు. 60 శాతాన్ని అంకురాల్లో ప్రారంభ పెట్టుబడుల కోసం, మిగతా 40 శాతాన్ని మలివిడత దశల్లో ఆయా కంపెనీలకు సహకారం అందించేందుకు వెచ్చించనున్నారు.

వియాష్ సైంటిఫిక్ లాభం రూ.48.5 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: వియాష్ సైంటిఫిక్ (సీక్వెంట్ సైంటిఫిక్) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రూ.48.5 కోట్ల నికరలాభాన్ని నమోదు చేసింది. 2024-25 ఇదే కాల లాభం రూ.42 కోట్ల కంటే ఇది 16% అధికం. ఇదే సమయంలో ఆదాయం రూ.774 కోట్ల నుంచి 11% పెరిగి రూ.858 కోట్లకు చేరింది. మానవ, పశు ఆరోగ్య రంగాలకు సంబంధించి ఫార్ములేషన్, ఏపీఐ, సీడీఎంఓ కార్యకలాపాలను వియాష్ నిర్వహిస్తోంది. కొత్త ఉత్పత్తులను మార్కెట్లోకి విడుదల చేయడం, ఖర్చుల నియంత్రణ, వివిధ వ్యాపార విభాగాల మధ్య సమన్వయం కారణంగా ఆదాయం, లాభదాయకతలో బలమైన వృద్ధి సాధించినట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ హరిబాబు బోడేపూడి వివరించారు. 2025-26 ఏప్రిల్-డిసెంబరులో రూ.158 కోట్ల నికరలాభాన్ని ఆర్జించామని, గత ఆర్థిక సంవత్సరం ఇదే కాల లాభం రూ.48 కోట్ల కంటే ఇది 230% అధికమని పేర్కొన్నారు.

ఎన్ఎస్ఈ ఐపీఓ కమిటీ పునరుద్ధరణ

దిల్లీ: తమ తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) ప్రతిపాదనకు ఎన్ఎస్ఈ (నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్) బోర్డు శుక్రవారం ఆమోదముద్ర వేసింది. ఈ ఐపీఓకు మార్కెట్ నియంత్రణాధికార సంస్థ సెబీ నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్ఓసీ) అందిన నేపథ్యంలో, బోర్డు ఈ నిర్ణయం తీసుకుంది. పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) రూపంలోనే ఈ పబ్లిక్ ఇష్యూ ఉంటుంది. ఐపీఓ కమిటీ పునరుద్ధరణకూ ఎన్ఎస్ఈ బోర్డు ఆమోదముద్ర వేసింది. తబ్లేశ్ పాండే ఆధ్వర్యంలోని ఈ కమిటీలో శ్రీనివాస్ ఇంజెటి, మమతా బిస్వాల్, అభిలాష కుమారి, జి శివకుమార్‌తో పాటు ఎండీ, సీఈఓ ఆశీష్ కుమార్ చౌహాన్ కూడా ఉంటారు. ఐపీఓ ప్రక్రియకు సంబంధించిన అన్ని పనులను ఈ కమిటీ పర్యవేక్షిస్తుంది.

కోడి గుడ్డు

7న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	495
వరంగల్	497
విజయవాడ	515
తూ/ప గోదావరి	485
విశాఖపట్నం	490
చిత్తూరు	563

ఐడీబీఐ బ్యాంక్‌లో ప్రభుత్వ వాటా విక్రయం మార్చిలోపే పూర్తి!

ఐడీబీఐ బ్యాంక్‌లో తన వాటా విక్రయ ప్రక్రియను ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే (2025-26) ప్రభుత్వం పూర్తి చేయనుంది. ఈ బ్యాంకులో ఎల్ఐసీ, ప్రభుత్వానికి కలిపి 90% వాటా ఉంది. ఇందులో నుంచి ఎల్ఐసీ 30.24%, ప్రభుత్వం 30.38% చొప్పున దాదాపు 61% వాటాను విక్రయించనున్నాయి. ఈ వాటా కొనుగోలు చేసేందుకు కోటక్ మహీంద్రా బ్యాంక్, ఎమిరేట్స్ ఎన్‌బీడీ, ఫెయిర్‌ఫ్యాక్స్ ఇండియా హోల్డింగ్స్ తమ తుది బిడ్‌లను ఈ వారంలోనే సమర్పించనున్నాయని సంబంధిత వర్గాల సమాచారం. బిడ్‌ల సమర్పణ తర్వాత లావాదేవీల సలహాదార్లు, అంతర్ మంత్రిత్వ బృందం (ఐఎంజీ), బిడ్డర్‌ల తరపు ప్రతినిధుల సమక్షంలో ఈ బిడ్‌లు తెరుస్తారు. ఇందులో ఎంపిక చేశాక, ఆర్థిక శాఖ ఆమోదం కోసం పంపిస్తారు. ఐడీబీఐ బ్యాంక్‌లో వ్యూహాత్మక వాటా విక్రయం కోసం ఆసక్తి గల సంస్థల నుంచి ఆర్థిక బిడ్‌లు వచ్చాయని పెట్టుబడులు, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ విభాగం (దీపమ్) కార్యదర్శి అరుణిష్ చావ్లా తెలిపారు. ఈ ప్రక్రియ అంతా 2025-26లోనే పూర్తవుతుందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఐడీబీఐ బ్యాంక్‌లో 30.48% వాటా విక్రయం ద్వారా ప్రభుత్వానికి రూ.33,000 కోట్లు సమకూరే అవకాశం ఉంది.



మహీంద్రా గ్రూప్ రూ.15,000 కోట్ల పెట్టుబడులు

వచ్చే 10 ఏళ్లలో మహారాష్ట్రలో రూ.15,000 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు మహీంద్రా గ్రూప్ శుక్రవారం ప్రకటించింది. నాగ్‌పుర్‌లో వాహనాలు, ట్రాక్టర్ల తయారీకి కొత్త కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది. ప్రస్తుత ఉత్పత్తి, ఇంజిన్ సామర్థ్యాలను విస్తరించడానికి, అధునాతన టెక్నాలజీ విభాగం వృద్ధి కోసం ఇగత్‌పురి-నాసిక్ ప్రాంతంలో భూమి కొనుగోలు చేయనుంది. మొత్తంగా 3 ప్రదేశాల్లో 2,000 ఎకరాలను కంపెనీ కొనుగోలు చేయనుంది.

8 కంపెనీల ఐపీఓలకు సెబీ పచ్చజెండా

ఇన్‌క్రెడ్ హోల్డింగ్స్, ఎలివేట్ క్యాంపసెస్ సహా 8 కంపెనీల తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) ప్రతిపాదనలకు మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ అనుమతి ఇచ్చింది. ఈ కంపెనీలు మొత్తంగా రూ.10,000 కోట్లు సమీకరించనున్నాయి. సెబీ అనుమతి పొందిన కంపెనీల్లో లేజర్ పవర్ అండ్ ఇన్‌ఫ్రా, సెడెమాక్ మెకాట్రానిక్స్, అర్డీ ఇండస్ట్రీస్, అర్మ్ ఇన్ఫోటెక్, అర్వీ ఇంజినీరింగ్ కన్సల్టెంట్స్, శంకేశ్ జువెలర్స్ ఉన్నాయి.

అక్టోబరు-డిసెంబరు త్రైమాసిక ఫలితాలు (రూ.కోట్లలో)

కంపెనీ	నికర లాభం/(నష్టం) 2025-26	నికర లాభం/(నష్టం) 2024-25	మొత్తం ఆదాయం 2025-26	మొత్తం ఆదాయం 2024-25
బీఎల్ఎస్ ఇంటర్నేషనల్	170	128	736	513
ఎంఆర్ఎఫ్1	692	315	8050	7001
క్రాంప్టన్ గ్రీవ్స్	101	112	1898	1769
హైడెల్‌బర్గ్ సిమెంట్	15.6	5.19	574	543
బటర్‌ఫ్లై అప్లయన్సెస్	12	8	245	238
సఫైర్ ఫుడ్స్	(4.8)	12.7	814	757
సీమెన్స్	269	363	3831	3360
సీఈఎస్‌సీ	304	282	4099	3657
బీఈఎంఎల్	22	24	1087	880
స్పెన్సర్స్ రిటెయిల్	(58.4)	(47.3)	503	517
సన్ టీవీ2	355	364	862	829
శ్రీ సిమెంట్	268	194	4801	4573
బాష్	532	458	4886	4465
డిష్ టీవీ	(276)	(47)	299	373

1) రెండో మధ్యంతర డివిడెండ్ రూ.3 2)మధ్యంతర డివిడెండ్ రూ.2.50

మళ్లీ ధరలు పెంచక తప్పదేమో

ఆడి ఇండియా బ్రాండ్ డైరెక్టర్ బల్బీర్ సింగ్ ధిల్లాన్

ఈనాడు, హైదరాబాద్: వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) తగ్గింపు రూపేణ కార్ల కొనుగోలుదార్లకు ప్రయోజనం కలిగిందని.. అయితే డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ సుమారు 19% క్షీణించిన నేపథ్యంలో, కార్ల ధరలను పెంచక తప్పడం లేదని ఆడి ఇండియా బ్రాండ్ డైరెక్టర్ బల్బీర్ సింగ్ ధిల్లాన్ అన్నారు. దీని ప్రభావంతో రాబోయే కొన్ని నెలల్లో మరోసారి ధరల పెంపు నిర్ణయం తీసుకోవాల్సి రావచ్చని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆడి గ్లోబల్ ప్రోగ్రెసివ్ కాన్సెప్ట్ షోరూంను వీవీసీ మోటార్స్ ఛైర్మన్ వీవీ రాజేంద్రప్రసాద్, వీవీసీ ఆడి హైదరాబాద్ సెంట్రల్ డీలర్ ప్రిన్సిపల్ వికాస్ చౌదరితో కలిసి ప్రారంభించిన ధిల్లాన్ మాట్లాడారు. ఏడాది కాలంలో కార్ల ధరలను 4-5% పెంచినట్లు గుర్తు చేశారు. అయినా కూడా కరెన్సీ విలువ రూపేణ తయారీ వ్యయం పెరుగుతున్నందునే, మరోసారి పెంచక తప్పదన్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 30 షోరూములు, సర్వీస్ సెంటర్లతో కలిసి 67 టచ్ పాయింట్లు ఉన్నాయని తెలిపారు. కొత్త ప్రాంతాలకు విస్తరించేటప్పుడు ముందుగా వర్క్‌షాప్‌లు, ఆడి అప్రూవ్డ్ ప్లస్ కేంద్రాలను ఏర్పాటు చేసి, అక్కడ గిరాకీ పెరిగాక షోరూములు నెలకొల్పాలన్నది తమ వ్యూహమని వివరించారు. దేశంలో లగ్జరీ కార్లు ఏడాదికి 51,000 అమ్ముడవుతున్నాయని.. ఐటీ రంగంలోని ఒడిదుడుకులను, స్థిరాస్తి-రిటెయిల్ రంగాల వృద్ధి భర్తీ చేస్తోందని ఆయన విశ్లేషించారు. గత ఏడాదిలో మొత్తం 4510 ఆడి కార్లు విక్రయించినట్లు తెలిపారు. త్వరలోనే దేశీయ మార్కెట్లోకి ఒక కొత్త స్పోర్ట్స్ కారుతో పాటు, మరో విద్యుత్ మోడల్ విడుదల చేసే ప్రణాళికలు ఉన్నట్లు పేర్కొన్నారు.



బల్బీర్ సింగ్ ధిల్లాన్, వీవీ రాజేంద్రప్రసాద్, వికాస్ చౌదరి

దిల్లీ విమానాశ్రయంలో ఎయిరిండియా కొత్త లాంజ్

దేశ రాజధాని దిల్లీలోని విమానాశ్రయంలో కొత్త లాంజ్‌ను టాటా గ్రూప్ సంస్థ ఎయిరిండియా ప్రారంభించింది. శాన్ ఫ్రాన్సిస్కో, న్యూయార్క్, ఇతర నగరాల్లో కూడా సంస్థ కొత్త లాంజ్‌లను ప్రారంభిస్తోంది. దిల్లీలో 16,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో మహారాజా లాంజ్‌ను ఎయిరిండియా ఏర్పాటు చేసింది. బిజినెస్, ఫస్ట్ క్లాస్ తరగతులకు చెందిన దాదాపు 300 మంది అతిథులు ఒకే సమయంలో ఇక్కడ సేవలు పొందొచ్చు. ఈ ఏడాది కంపెనీకి చాలా కీలకమైనదని, పలుకొత్త మార్పులు చూడనున్నట్లు కంపెనీ సీఈఓ క్యాంబెల్ విల్సన్ తెలిపారు. ఈ ఏడాది చివరికల్లా సగానికి పైగా తమ వైడ్-బాడీ విమానాలను కొత్త ప్రమాణాలకు నవీకరించడం పూర్తవుతుందన్నారు. మిగతా విమానాల అప్‌గ్రేడ్ ప్రక్రియ పూర్తి కావడానికి మరో 18-24 నెలల సమయం పట్టొచ్చని వివరించారు.

✦ 'ప్రస్తుతం ఎయిరిండియాలో మార్పుల ప్రక్రియ, క్రికెట్ టెస్టు మ్యాచ్‌లో అయిదో రోజు ఉదయం మాదిరిగా ఉంద'ని క్యాంబెల్ పేర్కొన్నారు. మ్యాచ్ ఫలితం అయిదోరోజు సాయంత్రం తేలుతుంది.. అదేవిధంగా తమ సంస్థలో చేపట్టిన మార్పులు ఫలితాన్ని ఇవ్వబోతున్నట్లు ఆయన విశదీకరించారు. లాభదాయకత గురించి మాట్లాడుతూ, సంస్థ పనితీరుపై కొన్ని ఊహించని పరిణామాలు ప్రభావం చూపాయన్నారు.



ఐటీసీ, బ్యాంకు షేర్లు నడిపించాయ్

ఎఫ్ఐఐ కొనుగోళ్లు: రూ.1,951 కోట్లు
డీఐఐ విక్రయాలు: రూ.1,265 కోట్లు

సెన్సెక్స్ ▲266	నిఫ్టీ ▲51
83580	25694



ఐటీసీ, బ్యాంకుల షేర్లు రాణించడంతో, శుక్రవారం దేశీయ సూచీలు లాభాల్లో ముగిశాయి. అంచనాలకు అనుగుణంగానే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచడం మార్కెట్లపై ప్రభావం చూపింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి 36 పైసలు తగ్గి 90.70 వద్ద ముగిసింది. బ్యారెల్ ముడిచమురు 1.20% లాభంతో 68.34 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

✦ బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.61,000 కోట్లు పెరిగి రూ.467.31 లక్షల కోట్ల (5.17 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది.

✦ సెన్సెక్స్ ఉదయం 64 పాయింట్ల (క్రితం ముగింపు 83,313.93) లాభంతో 83,249.32 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. ఆరంభ ట్రేడింగ్‌లో 82,925.35 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ, ఆఖర్లో కొనుగోళ్లతో బలంగా పుంజుకుంది. ఒకదశలో 83,612.12 దగ్గర గరిష్ఠాన్ని నమోదుచేసినా, చివరకు 266.47 పాయింట్ల లాభంతో 83,580.40 వద్ద ముగిసింది. నిఫ్టీ 50.90 పాయింట్లు పెరిగి 25,693.70 దగ్గర స్థిరపడింది.

✦ సెన్సెక్స్ 30 షేర్లలో 17 మెరిశాయి. ఐటీసీ 5.09%, కోటక్ బ్యాంక్ 3.35%, హెచ్‌యూఎల్ 2.96%, భారతీ ఎయిర్‌టెల్ 2.32%, బజాజ్ ఫైనాన్స్ 1.76%, పవర్‌గ్రిడ్ 1.26%, బజాజ్ ఫిన్‌సర్వ్ 1.17%, టైటన్ 1.07% లాభపడ్డాయి. టీసీఎస్ 1.69%, అదానీ పోర్ట్స్ 1.32%, ఏషియన్ పెయింట్స్ 1.21%, ఎటర్నల్ 1.20%, హెచ్‌సీఎల్ టెక్ 0.95% నష్టపోయాయి.

✦ ఐటీ షేర్లలో కొనసాగిన నష్టాలు: కృత్రిమ మేధ కొత్త టూల్స్ వల్ల సాఫ్ట్‌వేర్ సంస్థలకు ఇబ్బంది అనే ఆందోళనల నేపథ్యంలో, ఐటీ షేర్లలో నష్టాలు కొనసాగాయి. బీఎస్ఈలో హెగ్జావేర్ టెక్నాలజీస్ 4.14%, ఎల్‌టీఐ మైండ్‌ట్రీ 2.26%, పర్సిస్టెంట్ 2.24%, టీసీఎస్ 1.69%, టెక్ మహీంద్రా 1.69%, విప్రో 1.14%, ఇన్ఫోసిస్ 0.85% చొప్పున నీరసపడ్డాయి.

✦ డిసెంబరు త్రైమాసిక లాభం 17% పెరగడంతో ఎల్ఐసీ షేరు 7.26% పరుగులు తీసి రూ.901.50 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.38,614.11 కోట్లు పెరిగి రూ.5.70 లక్షల కోట్లకు చేరింది.

✦ మెరుగైన త్రైమాసిక ఫలితాలతో, ఎంఆర్ఎఫ్ షేరు 8.57% దూసుకెళ్లి రూ.1,46,495.05 వద్ద ముగిసింది.

✦ సికెల్ సెల్ వ్యాధి చికిత్సలో వాడే ఔషధం డెసిడుస్టాట్‌కు అమెరికా ఔషధ నియంత్రణ సంస్థ నుంచి ఆర్ఫన్ డ్రగ్ హోదా లభించిందని జైడస్ లైఫ్‌సైన్సెస్ తెలిపింది.

తాజా గరిష్ఠానికి ఫారెక్స్ నిల్వలు

మన విదేశీ మారకపు (ఫారెక్స్) నిల్వలు జనవరి 30తో ముగిసిన వారానికి 14.361 బి.డాలర్లు (దాదాపు రూ.1.29 లక్షల కోట్లు) పెరిగి తాజా జీవనకాల గరిష్ఠమైన 723.774 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.65.13 లక్షల కోట్ల)కు చేరాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) తెలిపింది. అంతక్రితం వారం ఫారెక్స్ నిల్వలు 8.053 బి.డాలర్లు అధికమై 709.413 బి.డాలర్లుగా నమోదయ్యాయి. సమీక్షిస్తున్న వారంలో విదేశీ కరెన్సీ ఆస్తులు 493 మిలియన్ డాలర్లు తగ్గి 562.392 బి.డాలర్లకు చేరాయి. పసిడి నిల్వల విలువ 14.595 బి.డాలర్లు పెరిగి 137.683 బి.డాలర్లకు చేరింది.

ఆర్ఈసీ విలీనానికి పీఎఫ్‌సీ బోర్డు ఆమోదం

బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ ఆర్ఈసీ లిమిటెడ్‌ను విలీనం చేసుకునేందుకు పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (పీఎఫ్‌సీ) బోర్డు సూత్రప్రాయ అనుమతులను ఇచ్చింది. ఆర్ఈసీ విలీనానంతరమూ ప్రభుత్వ సంస్థగానే పీఎఫ్‌సీ కొనసాగుతుంది. ఫిబ్రవరి 1న సమర్పించిన బడ్జెట్లో.. పీఎఫ్‌సీలో దాని అనుబంధ ఆర్ఈసీ విలీనంపై ప్రకటన చేసిన సంగతి తెలిసిందే. రోజుల వ్యవధిలోనే పీఎఫ్‌సీ బోర్డు ఈ ప్రతిపాదనకు ఆమోదం తెలపడం గమనార్హం. ఆర్థిక వ్యవహారాలపై ఏర్పాటైన కేంద్ర మంత్రి వర్గ సంఘం ఇచ్చిన సూత్రప్రాయ అనుమతులకు అనుగుణంగా, 2019 మార్చిలో ఆర్ఈసీలో 52.63% వాటాను రూ.14,500 కోట్లకు పీఎఫ్‌సీ కొనుగోలు చేసింది. అప్పటి నుంచి పీఎఫ్‌సీకి అనుబంధ సంస్థగా ఆర్ఈసీ కార్యకలాపాలు నిర్వహిస్తోంది.

50 లక్షలు మించిన ఫాస్టాగ్ వార్షిక పాస్‌లు



దిల్లీ: ఫాస్టాగ్ వార్షిక పాస్‌ల సంఖ్య 50 లక్షలను మించింది. ఈ సదుపాయాన్ని ప్రారంభించిన 6 నెలల్లోనే, ఈ పాస్‌లపై 26.55 కోట్ల లావాదేవీలు నమోదయ్యాయని రోడ్డు రవాణా, హైవేస్ మంత్రిత్వ శాఖ తెలిపింది. రోజూ టోల్‌గేట్ల మీదుగా రాకపోకలు సాగించే వ్యక్తిగత వాహనాల యజమానులకు భారం తగ్గించేలా, 2025 ఆగస్టు 15న ఫాస్టాగ్ వార్షిక పాస్‌ను ప్రభుత్వం తీసుకొచ్చింది. ఒక్కసారి రూ.3,000 చెల్లిస్తే.. ఏడాది వ్యవధిలో 200 సార్లు జాతీయ రహదారుల్లోని టోల్‌ప్లాజాల ద్వారా ప్రయాణించేందుకు వీలవుతుంది. ఫాస్టాగ్ వార్షిక పాస్ లావాదేవీల్లో చండీగఢ్ అగ్రస్థానంలో ఉంది. మొత్తం లావాదేవీల్లో ఈ రాష్ట్ర వాటా 14%. ఆ తర్వాతి స్థానాల్లో తమిళనాడు (12.3%), దిల్లీ (11.5%) ఉన్నాయి. దిల్లీ ఎన్‌సీఆర్‌లోని బిజ్వాసన్ ఫీ ప్లాజ్ వద్ద అత్యధిక లావాదేవీలు నమోదయ్యాయి.

టాటా స్టీల్ లాభం రూ.2730 కోట్లు

టాటా స్టీల్, డిసెంబరు త్రైమాసికంలో రూ.2730.37 కోట్ల నికరలాభాన్ని నమోదు చేసింది. 2024-25 ఇదే కాల లాభం రూ.295.49 కోట్లతో పోలిస్తే, ఇది కొన్ని రెట్లు అధికం. కంపెనీ మొత్తం ఆదాయం రూ.53,869.33 కోట్ల నుంచి రూ.57,503.49 కోట్లకు పెరిగింది. సంస్థ ముడిఉక్కు తయారీ వార్షిక సామర్థ్యం 35 మిలియన్ టన్నులు.

ప్రజలే మిమ్మల్ని వద్దనుకున్నారు!

- **జన్ సురాజ్ పార్టీకి సుప్రీం చురకలు**

దిల్లీ: గత ఏడాది బిహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను రద్దు చేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన ప్రశాంత్ కిశోర్ నేతృత్వంలోని జన్ సురాజ్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ పిటిషన్‌ను తోసిపుచ్చుతూ సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి ధర్మాసనం చురకలు వేసింది. 'ప్రజలే మీ పార్టీని వద్దనుకున్నారు. ఇప్పుడు కోర్టును ప్రచార వేదికగా వాడుకుంటున్నారా?' అని ప్రశ్నించింది. అసెంబ్లీ ఎన్నికల్లో జన్‌సురాజ్ పార్టీ.. ఒక్క నియోజకవర్గంలో కూడా గెలవలేదు. ఎన్నికల షెడ్యూల్ వెలువడిన తర్వాత ముఖ్యమంత్రి నీతీశ్‌కుమార్ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం...ఒక్కో మహిళకు రూ. 10వేలు పంపిణీ చేసిందని, ఇది ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించడమేనని జన్‌సురాజ్ పార్టీ పిటిషన్‌లో ఆరోపించింది. 'ఒకవేళ.. మీ పార్టీ అధికారంలోకి వచ్చినా మీరూ అదే చేస్తారు' అని సీజేఐ వ్యాఖ్యానించారు. ఇంకా ఏమైనా ఫిర్యాదులు ఉంటే బిహార్ హైకోర్టును ఆశ్రయించాలని సూచించారు.

బ్యాంక్ ఆఫ్ ఇండియా కేసులో విచారణను వాయిదా వేయలేం

- నీరవ్ మోదీ విజ్ఞప్తిని తిరస్కరించిన లండన్ హైకోర్టు

లండన్: బ్యాంక్ ఆఫ్ ఇండియాకు 80 లక్షల డాలర్ల రుణం ఎగవేసినట్లు నమోదైన కేసులో తనపై విచారణను వాయిదా వేయాలంటూ.. పలాయనంలో ఉన్న వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ చేసిన వినతిని బ్రిటన్ రాజధాని లండన్‌లోని హైకోర్టు శుక్రవారం తిరస్కరించింది. ఈ కేసులో 8 రోజుల విచారణ ప్రక్రియ మార్చి 23న ప్రారంభమవుతుందని స్పష్టం చేసింది. తాను తీవ్ర దృష్టిలోపం, కుంగుబాటుతో బాధపడుతున్నానని.. అందుకే విచారణ వాయిదా వేయాలని నీరవ్ మోదీ కోర్టుకు విజ్ఞప్తి చేసిన సంగతి గమనార్హం.

అణ్వాయుధ నియంత్రణ చర్చల్ని త్వరలోనే ప్రారంభిద్దాం

- అమెరికా, రష్యా అంగీకారం


మాస్కో: అణ్వాయుధ వ్యాప్తి నియంత్రణకు తమ మధ్య మిగిలిన చివరి ఒప్పందమైన 'న్యూ స్టార్ట్' గడువు కూడా గురువారంతో ముగిసిన నేపథ్యంలో అమెరికా, రష్యా కీలక అంగీకారానికి వచ్చాయి. అణ్వాస్త్రాల విషయంలో నియంత్రణపై చర్చలను త్వరలోనే ప్రారంభించాలని నిర్ణయించాయి. రష్యా అధ్యక్ష కార్యాలయం 'క్రెమ్లిన్' అధికార ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ శుక్రవారం ఈ విషయాన్ని వెల్లడించారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) రాజధాని అబుదాబీ వేదికగా జరిపిన సంప్రదింపుల్లో వాషింగ్టన్, మాస్కో ప్రతినిధులు ఈ మేరకు అవగాహనకు వచ్చినట్లు తెలిపారు.

ట్రంప్.. ఒక్కరోజే రెండుసార్లు

భారత్-పాకిస్థాన్ మధ్య నిరుడు యుద్ధాన్ని ఆపానని ఇప్పటికే చాలాసార్లు చెప్పుకొన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. ఇంకా అదే పాట పాడుతున్నారు! తాజాగా ఒక్క రోజులోనే మరో రెండుసార్లు ఆ విషయాన్ని చెప్పుకొన్నారు. భారత్-పాక్ యుద్ధం సహా మొత్తం 8 యుద్ధాలను తాను ఆపానని గురువారం తొలుత నేషనల్ ప్రేయర్ బ్రేక్‌ఫాస్ట్‌లో వ్యాఖ్యానించిన ట్రంప్.. అనంతరం 'ట్రూత్ సోషల్'లో ఆ వ్యాఖ్యలను పునరావృతం చేశారు. భారత్-పాక్ యుద్ధాన్ని తాను ఆపినట్లు అమెరికా అధ్యక్షుడు ఇప్పటికి 90సార్లకుపైగా చెప్పుకోవడం గమనార్హం.

ట్రంప్ నోబెల్ పాట్లు.. మిత్రదేశం చీవాట్లు

ఇంటర్నెట్ డెస్క్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను నోబెల్ బహుమతికి నామినేట్ చేయడానికి పోలండ్ నిరాకరించడం ఇరుదేశాల మధ్య దౌత్య వివాదానికి దారితీసింది. నోబెల్ శాంతి బహుమతికి ట్రంప్ పేరును నామినేట్ చేయాలని అమెరికా, ఇజ్రాయెల్ నుంచి పోలండ్‌కు అందిన ప్రతిపాదనలను పోలండ్ స్పీకర్ తిరస్కరించడమే దీనికి కారణం. దీనిపై పోలండ్‌లోని అమెరికా దౌత్యవేత్త టామ్ రోజ్ స్పందిస్తూ.. "ఇది ట్రంప్‌ను అవమానించడమే. దీని వల్ల ఇరుదేశాల మధ్య సంబంధాలు దెబ్బతినే ప్రమాదం ఉంది. పోలండ్ స్పీకర్‌తో దౌత్యపరమైన సంబంధాలన్నీ తెంచుకుంటున్నాం. ఆయనను మా దేశంలోకి రానివ్వకూడదు చేస్తాం" అని పేర్కొన్నారు. దీనిపై పోలండ్ ప్రధాని తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. "మిత్ర దేశాలు పరస్పరం గౌరవించుకోవాలి. అంతే గాని ఇలా మాకు పాఠాలు చెప్పే ప్రయత్నం చేయొద్దు. దౌత్య సంబంధాలు ఎలా నిర్వహించాలో మాకు తెలుసు" అని హితవు పలికారు.



పేలుడు జరిగిన బొగ్గు గని

మేఘాలయ బొగ్గు గని పేలుడులో 25కు చేరిన మృతుల సంఖ్య

షిల్లాంగ్: మేఘాలయలోని ఓ అక్రమ బొగ్గు గనిలో పేలుడు సంభవించిన ఘటనలో మృతుల సంఖ్య 25కు పెరిగింది. శిథిలాల కింద చిక్కుకున్న మరో వ్యక్తిని కూలీల మృతదేహాలను వెలికితీశాం. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని, బాధితులను గుర్తించేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని రాష్ట్ర డీజీపీ ఐ నోంగ్‌రాంగ్ శుక్రవారం తెలిపారు. ఈ ఘటనతో సంబంధమున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు ఆయన వెల్లడించారు. మరో నిందితుడు పరారీలో ఉన్నాడని, తదుపరి దర్యాప్తు కొనసాగుతుందని పేర్కొన్నారు. తూర్పు జయంతియా హిల్స్ జిల్లాలోని థాంగ్‌స్కోలో ఓ అక్రమ బొగ్గు గనిలో గురువారం పేలుడు సంభవించిన విషయం తెలిసిందే.

ఎందుకంతగా తగ్గించారు?

- 'నీట్ పీజీ' కటాఫ్ పర్సంటైల్‌లపై వివరణ ఇవ్వండి
- ఎన్‌బీఈఎంఎస్‌కు సుప్రీంకోర్టు ఆదేశం

దిల్లీ: నీట్-పీజీ 2025-26 కటాఫ్ పర్సంటైల్‌లను గణనీయంగా ఎందుకు తగ్గించాల్సి వచ్చిందో వివరణ ఇవ్వాలని నేషనల్ బోర్డు ఆఫ్ ఎగ్జామినేషన్ ఇన్ మెడికల్ సైన్సెస్ (ఎన్‌బీఈఎంఎస్)ను సుప్రీంకోర్టు శుక్రవారం ఆదేశించింది. ఈ మేరకు అఫిడవిట్ దాఖలు చేయాలని పేర్కొంది. "ఓ వైపు సీట్లు వృథా కాకుండా చూడాలి. అదే సమయంలో అభ్యర్థులు రావడం లేదన్న ఒత్తిడి కూడా ఉంది. దీంతో కటాఫ్‌ను తగ్గించాలని అంటారు. తగ్గిస్తే ప్రమాణాలు పడిపోతాయంటూ వాదన బయల్దేరుతుంది. సీట్లు వృథా అయిపోతున్నాయన్నది దీనికి ప్రతివాదన. ఎక్కడో ఈ రెండింటి మధ్య సమతూకం అవసరం" అని జస్టిస్ పి.ఎస్.నరసింహ, జస్టిస్ ఆలోక్ ఆరాధేల ధర్మాసనం పేర్కొంది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఏదైనా అనూహ్య కారణాలు ఉంటే తప్ప పీజీ ప్రవేశాల్లో మార్కులు సడలించకూడదని పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది గోపాల్ శంకర్ నారాయణన్ అంతకుముందు వాదనలు వినిపించారు. పోస్ట్ గ్రాడ్యుయేట్ స్థాయిలో ప్రమాణాలు కఠినంగా ఉండాల్సిందేనని అన్నారు. ఈ అంశంపై కేంద్రం, ఎన్‌బీఈఎంఎస్, జాతీయ వైద్య కమిషన్ తదితరులకు సర్వోన్నత న్యాయస్థానం బుధవారం నోటీసులు జారీ చేసింది. దాదాపు 18 వేల పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్య సీట్లు దేశవ్యాప్తంగా ఖాళీగా ఉండటంతో నీట్-పీజీ 2025 ప్రవేశాల్లో అర్హతా పర్సంటైల్‌లను ఎన్‌బీఈఎంఎస్ సవరించింది. రిజర్వుడు తరగతుల కటాఫ్‌ను 40 పర్సంటైల్ నుంచి జీరోకు తగ్గించింది. దీంతో 800 మార్కులకి మైనస్ 40 స్కోరింగ్ వచ్చిన అభ్యర్థులు కూడా మూడో రౌండ్ పీజీ వైద్య సీట్ల కౌన్సెలింగ్‌లో పాల్గొనచ్చు. ఎన్‌బీఈఎంఎస్ ప్రచురించిన నోటీసు ప్రకారం.. జనరల్ కేటగిరీ కటాఫ్ కూడా 50 నుంచి 7 పర్సంటైల్‌కు తగ్గింది. కటాఫ్‌ను తగ్గించడం వల్ల రాజ్యాంగంలోని 14, 21 అధికరణాలు ఉల్లంఘనకు గురవుతున్నాయని ఈ పిటిషన్‌ను సామాజిక ఉద్యమకారుడు హరిశరణ్ దేవగన్ తదితరులు వేశారు.



అవసరం ఉన్నప్పుడే అరెస్టుచేయాలి: సుప్రీం

ప్రశ్నలు అడిగేందుకు మాత్రమే పోలీసులు ఓ వ్యక్తిని అరెస్టు చేయలేరని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అరెస్టు అనేది పోలీసు అధికారికి ఉన్న చట్టపరమైన విచక్షణాధికారం మాత్రమేనని, అది తప్పనిసరి కాదని పేర్కొంది. జస్టిస్ ఎం.ఎం.సుందరేశ్, జస్టిస్, ఎన్.కె. సింగ్‌తో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. భారతీయ నాగరిక్ సురక్షిత్ సంహిత 2023 ప్రకారం.. అరెస్టు అధికారాలను పోలీసులు తమ సౌకర్యం కోసం కాకుండా, కచ్చితమైన అవసరం ఉన్నప్పుడు మాత్రమే వినియోగించాలంది. 'ఏడేళ్ల వరకు శిక్ష ఉన్న నేరాల విషయంలో సంబంధిత వ్యక్తిని కస్టడీలోకి తీసుకోకుండా విచారణ సమర్థంగా సాగదని పోలీసు అధికారి నమ్మినప్పుడే అరెస్టు చేయాలి. దీనికి భిన్నమైన పరిస్థితులు ఉన్నప్పుడు బీఎన్‌ఎస్ఎస్ సెక్షన్ 35(1)(బి), 35(3) నుంచి 35(6) వరకు ఉన్న నిబంధనల ఉద్దేశం దెబ్బతింటుంది' అని తెలిపింది. అలహాబాద్ హైకోర్టు ఉత్తర్వులను సవాలు చేస్తూ దాఖలైన అప్పీల్‌ను విచారిస్తున్న సందర్భంలో ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. బీఎన్‌ఎస్ఎస్ సెక్షన్ 35(3) కింద జారీచేసిన నోటీసుకు అనుగుణంగా అరెస్టు చేయడం సాధారణ ప్రక్రియ కాదు.. అది అరుదైన మినహాయింపు మాత్రమేనని కోర్టు స్పష్టం చేసింది. ఈ అధికారాన్ని పోలీసులు జాగ్రత్తగా ఉపయోగించాలని సూచించింది. ఏడేళ్ల వరకు శిక్ష ఉన్న నేరాల విషయంలో అరెస్టు చేయాలంటే.. బీఎన్‌ఎస్ఎస్ సెక్షన్ 35(1)(బి)లోని షరతుల్లో కనీసం ఒకటి ఉన్నప్పుడే అరెస్టు సాధ్యమని, అది కూడా అత్యవసరమైతేనే చేయాలంది. 'అరెస్టు లేకుండానే విచారణ కొనసాగించవచ్చు. సాక్ష్యాల సేకరణ సమయంలో అరెస్టు అవసరమా? కాదా? అనేది పోలీసు అధికారి ఆలోచించాలి. ప్రారంభ దశ విచారణలో అరెస్టు కాకపోయినా.. కారణాలను లిఖితపూర్వకంగా నమోదు చేస్తే.. తరువాతైనా అరెస్టు చేయవచ్చు. ఆ అధికారం పోలీసులకు ఉంటుంది' అని ధర్మాసనం వెల్లడించింది. అరెస్టు అనేది ప్రతి కేసులోనూ తప్పనిసరి కాదని వెల్లడించింది.

మైనారిటీస్ కమిషన్‌లో ఖాళీల భర్తీపై మెరుగైన అఫిడవిట్ సమర్పించండి

- కేంద్రానికి సుప్రీంకోర్టు ఆదేశం

దిల్లీ: జాతీయ మైనారిటీల కమిషన్ (ఎన్‌సీఎం)లో వివిధ ఖాళీల భర్తీకి సంబంధించి మెరుగైన అఫిడవిట్‌ను సమర్పించాలని దిల్లీ హైకోర్టు శుక్రవారం కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖలోని అండర్ సెక్రెటరీ దాఖలు చేసిన అఫిడవిట్ నిస్సారంగా, అస్పష్టంగా ఉందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.కె. ఉపాధ్యాయ, జస్టిస్ తేజస్ కరియా ధర్మాసనం ఆక్షేపించింది. ఖాళీల భర్తీ ప్రక్రియను ఎప్పుడు ప్రారంభిస్తారు, ఎన్ని దశల్లో పూర్తి చేస్తారనే విషయాలను వెల్లడించలేదని పేర్కొంది. సవరణలతో అఫిడవిట్ దాఖలుకు రెండు వారాల గడువునిచ్చింది. తదుపరి విచారణ ఈ నెల 27కి వాయిదాపడింది.

పశ్చిమాసియాలో వేడెక్కిన వాతావరణం

మస్కట్: పశ్చిమాసియాలో మోహరించి ఉన్న తమ విమానవాహక యుద్ధనౌక ఐఎస్ఎస్ అబ్రహం లింకన్‌కు చేరువగా వచ్చిన ఓ ఇరాన్ డ్రోన్‌ను అమెరికా బలగాలు కూల్చివేశాయి. హార్మూజ్ జలసంధిలో అమెరికా పతాకంతో ఉన్న ఓ నౌకను అడ్డుకునేందుకు ఇరాన్ ప్రయత్నించింది. ఈ పరిణామాలతో ప్రాంతీయంగా పరిస్థితులు మరింత వేడెక్కాయి. ఈ పరిస్థితుల్లో వాషింగ్టన్ దాడులకు దిగితే.. ప్రాంతీయంగా యుద్ధం ప్రారంభమవడం ఖాయమని గల్ఫ్ అరబ్ దేశాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. వెంటనే ఇరాన్‌ను వీడాలంటూ తమ పౌరులను అమెరికా అప్రమత్తం చేయడం ఈ ఆందోళనను రెట్టింపు చేస్తోంది. "వెంటనే ఇరాన్‌ను విడిచి వెళ్లండి. అది వీలు కాకపోతే.. సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లండి. ఆహారం, నీరు, అత్యవసర ఔషధాలు అందుబాటులో ఉండేలా చూసుకోండి. మీ చుట్టుపక్కల ఏం జరుగుతుందో ఎప్పటికప్పుడు గమనించుకోండి" అంటూ అమెరికా తమ పౌరులకు సూచించింది. ఒమన్‌లో చర్చలు విఫలమైతే ఇరాన్‌పై బలప్రయోగానికి తమ దేశాధ్యక్షుడు ట్రంప్ వెనుకాడరని శ్వేతసౌధం ప్రెస్ సెక్రెటరీ కరోలిన్ లీవిట్ తాజాగా పేర్కొన్నారు.

నాటి రాజభవనంలోనే..

అమెరికా, ఇరాన్ మధ్య ప్రస్తుతం పరోక్ష చర్చలకు వేదికగా నిలిచిన మస్కట్ శివార్లలోని రాజభవనంలోనే అణు కార్యక్రమంపై ఒమన్ మధ్యవర్తిత్వంతో ఆ రెండు దేశాలు నిరుడు కొన్నాళ్లు చర్చలు జరిపాయి. అయితే జూన్‌లో ఇరాన్‌పై ఇజ్రాయెల్ యుద్ధానికి దిగింది. అదే సమయంలో ఇరాన్ అణు శుద్ధి స్థావరాలపై అమెరికా బాంబు దాడులకు పాల్పడటంతో చర్చలు నిలిచిపోయాయి. వాటిని పునఃప్రారంభించడంపై వాషింగ్టన్, టెహ్రాన్ ప్రస్తుతం దృష్టిపెట్టినట్లు తెలుస్తోంది.

మణిపుర్ ప్రభుత్వంలో భాగమైన ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా బంద్

- చురాచాంద్‌పుర్‌లో స్తంభించిన జనజీవనం

ఇంఫాల్: మణిపుర్‌లో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వంలో తమ వర్గానికి చెందిన ఎమ్మెల్యేల భాగస్వామ్యాన్ని వ్యతిరేకిస్తూ రెండు గిరిజన సంస్థలైన కుకీ, జోలు చురాచాంద్‌పుర్ జిల్లాలో శుక్రవారం 24 గంటల బంద్ పాటించాయి. దీంతో సాధారణ జనజీవనం స్తంభించింది. జిల్లా ప్రధాన కార్యాలయం సహా పలు ప్రాంతాల్లో మద్దతుదారులు వాహనాలను నిలిపివేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వ ఏర్పాటులో కుకీ- జో ఎమ్మెల్యేల భాగస్వామ్యానికి వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆందోళనకారులు తెలిపారు. ముందురోజు సైతం ఓ వర్గానికి, భద్రతా దళాలకు మధ్య ఘర్షణలు చెలరేగాయి. నిరసనకారులను చెదరగొట్టేందుకు భాష్పవాయువును ప్రయోగించారు.

బ్రిటన్ ప్రధానికి పదవీ గండం!



- కుదిపేస్తున్న ఎప్‌స్టీన్ ఫైల్స్ వివాదం

లండన్: మైనర్ బాలికలను ప్రముఖులతో లైంగిక కార్యకలాపాలకు నియోగించాడని రుజువై జైలులోనే ఆత్మహత్య చేసుకున్న అమెరికన్ ఫైనాన్సర్ జెఫ్రీ ఎప్‌స్టీన్ మూలంగా బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ పదవి ఊడిపోయేలా ఉంది. స్టార్మర్‌కు నేరుగా ఎప్‌స్టీన్‌తో సంబంధాలు లేకపోయినా, అతనితో పొత్తు ఉన్న పీటర్ మండేల్సన్(72)ను 2024లో అమెరికాలో బ్రిటన్ రాయబారిగా నియమించడమే స్టార్మర్ చేసిన తప్పు. ఎప్‌స్టీన్‌తో సంబంధాలు ఉన్నందుకు ఇప్పటికే బ్రిటిష్ రాజవంశీకుడు ప్రిన్స్ ఆండ్రూ రాజలాంఛనాలన్నీ రద్దయిపోయాయి. ఎప్‌స్టీన్‌తో తనకు పరిచయమే లేదని మండేల్సన్ చెప్పిన అబద్ధాలను నమ్మి ఆయన్ను ఉన్నత పదవిలో నియమించానని ఎప్‌స్టీన్ బాధితులకు గురువారం స్టార్మర్ క్షమాపణలు చెప్పారు. 2008లో ఎప్‌స్టీన్ అశ్లీల అక్రమాలు బయటపడి శిక్ష విధించిన తరవాత కూడా మండేల్సన్ అతడితో పొత్తు కొనసాగించినట్లు చూపే ఈ-మెయిల్స్ బయటకు రావడంతో గత సెప్టెంబరులో ఆయనకు స్టార్మర్ ఉద్వాసన చెప్పారు. మండేల్సన్‌పై లైంగిక ఆరోపణలేమీ లేవు. కానీ 2008 అంతర్జాతీయ ఆర్థిక సంక్షోభంలో మండేల్సన్ కీలక ప్రభుత్వ సమాచారాన్ని ఎప్‌స్టీన్‌కు వెల్లడించాడనీ, మండేల్సన్, అతడి భాగస్వామి రేనాల్డ్ అవిలా డ సిల్వా ఖాతాలలోకి రూ. 75,000 డాలర్లు జమఅయ్యాయనీ వెల్లడైంది. అంతకు ముందు కూడా మండేల్సన్ ఆర్థిక కుంభకోణాలు, నైతిక ప్రమాణాల ఉల్లంఘనల వల్ల రెండు సార్లు ప్రభుత్వ పదవులకు రాజీనామా చేయాల్సివచ్చింది. 2008 సంక్షోభం తరవాత కూడా ఎప్‌స్టీన్‌తో మండేల్సన్ పొత్తు కొనసాగిందని తెలుసా? అని అడగ్గా.. తెలుసని ప్రధాని స్టార్మర్ బుధవారం పార్లమెంటుకు చెప్పారు. దీనిపై పార్లమెంటులో దిగ్భ్రాంతి వ్యక్తంకాగా, గురువారం స్టార్మర్ వారిద్దరికీ పరిచయం ఉన్నట్లు అందరికీ తెలిసిన విషయమే తనకూ తెలిసిందని సర్ది చెప్పారు. గోరుచుట్టుమీద రోకటిపోటులా ఎప్‌స్టీన్-మండేల్సన్ వ్యవహారం స్టార్మర్ మెడకు చుట్టుకుంటోంది.



మద్యం లేని పెళ్లిళ్లకు రూ.51 వేలు నజరానా

ఈటీవీ భారత్: శీతల ప్రదేశమైన ఉత్తరాఖండ్‌లో వివాహాలతోపాటు ఇతర వేడుకల్లో కాక్‌టైల్ పార్టీల పేరుతో మద్యపానం సర్వసాధారణం. ఈ అలవాటు చాలా కుటుంబాలకు ఆర్థికభారంగా మారడమే కాకుండా యువత మాదకద్రవ్యాల వైపు మొగ్గు చూపేందుకు దోహదం చేస్తోంది. డోయీవాలా అసెంబ్లీ నియోకవర్గ పరిధిలోని గదూల్ గ్రామ పంచాయతీ ఈ దురలవాటు కట్టడికి ఆదర్శంగా ఓ ముందడుగు వేసింది. ఈ గ్రామ పెద్ద స్వీటీ రావత్ వివాహాల్లో కాక్‌టైల్ పార్టీలకు దూరంగా ఉండే కుటుంబాలకు రూ. 51 వేల చొప్పున ఆర్థికసాయం చేస్తామని ప్రకటించారు. ఇప్పటికే రెండు కుటుంబాలకు దేహ్రాదూన్ జిల్లా కలెక్టరు సవిన్ బన్సాల్ చేతుల మీదుగా ఆమె ఈ చెక్కులు అందజేశారు.

బ్లూటూత్ ట్రెండ్ ఎఫెక్ట్.. హెచ్‌ఐవీ కేంద్రంగా ఫిజీ

ఇంటర్నెట్‌డెస్క్: బ్లూటూత్ ట్రెండ్.. పసిఫిక్ దేశం ఫిజీని వణికిస్తోంది. ప్రఖ్యాత హనీమూన్ స్పాట్‌గా ఆ దేశానికి ఉన్న పేరును కాస్తా దెబ్బతీస్తోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) గణాంకాల ప్రకారం.. ఫిజీలో 2024లో 1583 హెచ్‌ఐవీ కేసులు నమోదయ్యాయి. 2025లో తొలి ఆరునెలల్లోనే 1,226 కేసులు వెలుగు చూశాయి. అంతకుముందు ఏడాదితో పోలిస్తే రెట్టింపు సంఖ్యలో కేసులు నమోదవుతున్నట్లు ఫిజీ ఆరోగ్య శాఖ ఆందోళన వ్యక్తం చేసింది. బ్లూటూత్ ట్రెండ్ ఈ వైరస్ వ్యాప్తికి కారణమవుతున్నట్లు తెలుస్తోంది. మాదకద్రవ్యాలు కొనుగోలు చేయడానికి డబ్బులు లేనివారు.. కిక్ కోసం అప్పటికే వాటిని తీసుకున్న వ్యక్తుల రక్తాన్ని ఎక్కించుకోవడాన్నే 'బ్లూటూత్ ట్రెండ్'గా పిలుస్తున్నారు. ఇలా ఒకరి రక్తాన్ని మరొకరు ఎక్కించుకోవడానికి అసురక్షిత పద్ధతులను అనుసరిస్తుండటంతో హెచ్‌ఐవీ వ్యాప్తి పెరుగుతోంది.



ఇజ్రాయెల్ క్షిపణి దాడితో గాజాలోని జియోటన్‌లో భవనాల మధ్య ఉవ్వెత్తున ఎగసిపడుతున్న మంటలు

వేళాపాళా లేని తిండితో కాలేయ పనితీరుకు విఘాతం!

దిల్లీ: కాలేయం.. శరీర గడియారానికి అనుగుణంగా కొన్ని ప్రొటీన్లను ఒక క్రమపద్ధతిలో రక్తప్రసరణ వ్యవస్థలోకి విడుదల చేస్తుందని ఆస్ట్రేలియా శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ ప్రొటీన్లు స్థిరంగా విడుదలవుతాయన్న సిద్ధాంతాన్ని ఈ పరిశోధన సవాల్ చేస్తోంది. రోజువారీ సాధారణ కార్యకలాపాలకు విఘాతం కలిగించే షిఫ్ట్ ఉద్యోగం, వేళాపాళాలేని తిండి వంటివి కాలేయ పనితీరుపై ప్రభావం చూపొచ్చని వివరించారు. శరీరంలో కాలేయం చాలా ముఖ్యభాగం. రక్తం ద్వారా సంచరించే ప్రధాన ప్రొటీన్ల ఉత్పత్తి, చేరవేతలో ఇది ముఖ్య పాత్ర పోషిస్తోంది. జీవక్రియ, ఇన్‌ఫ్లమేషన్ నియంత్రణ, శక్తిని సమతౌల్యం చేయడంలో ఈ ప్రొటీన్లు కీలకం. అయితే ఇవి అన్ని సమయాల్లోనూ ఒకే స్థాయిలో విడుదల కావు. కాలేయం తన అంతర్గత గడియారాన్ని నిర్వహించుకుంటోందని తాజా పరిశోధనలో పాలుపంచుకున్న మెల్టెమ్ వెగర్ తెలిపారు. 24 గంటల లయకు అనుగుణంగా ప్రొటీన్లను విడుదల చేస్తుందన్నారు. ఆహారం తీసుకునే సమయం.. ఈ లయకు కీలకం. క్రమంతప్పకుండా ఆహారం తీసుకునే వారిలో ఇది ఆరోగ్యకరంగా సాగుతున్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ విషయంలో క్రమపద్ధతి లోపించినవారిలో ఈ లయ తప్పుతున్నట్లు వారు గమనించారు. ఈ కాలచక్రానికి విఘాతం కలిగితే ఊబకాయం వంటి సమస్యలు తలెత్తవచ్చని వివరించారు. ప్రొటీన్ విడుదల ప్రక్రియను అర్థం చేసుకోవడానికి ప్రొటియోమిక్స్ అనే విశ్లేషణ విధానాన్ని శాస్త్రవేత్తలు ఉపయోగించారు.





జమ్మూకశ్మీర్‌లోని గుర్నామ్, బోబియాలో అమరవీరుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా

హైకోర్టుకూ వెళ్లొద్దు

- 'కొలీజియం' సిఫార్సుపై దాఖలైన పిటిషన్‌ను కొట్టివేస్తూ సుప్రీంకోర్టు

దిల్లీ: మద్రాసు హైకోర్టు కొలీజియం చేసిన ఓ సిఫార్సును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు శుక్రవారం తిరస్కరించింది. ఇలాంటి విషయాలను న్యాయపరమైన పరిశీలనకు అర్హమైనవి కావని, పరిపాలనా విభాగంలోని సంబంధిత అధికారులకు వదిలేయాలని తెలిపింది. "ఈ రిట్ పిటిషన్‌ను స్వీకరించదగినదిగా భావించడం లేదు" అని భారత ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మల్యా బాగ్చీ ధర్మాసనం శుక్రవారం పేర్కొంది. హైకోర్టును ఆశ్రయించేందుకు కూడా పిటిషనర్‌కు న్యాయమూర్తులు అనుమతి ఇవ్వలేదు. "ఏమీ చేయొద్దు. ఈ విషయాన్ని మా నోటీసుకు తెచ్చినందుకు ధన్యవాదాలు" అని పేర్కొంటూ పిటిషన్‌ను కొట్టివేశారు. సీనియర్ న్యాయమూర్తుల్లో ఒకరైన జస్టిస్ నిషా భాను పాల్గొనసందున మద్రాసు హైకోర్టు కొలీజియం చేసిన ఓ సిఫార్సు చెల్లదంటూ ఈ పిటిషన్‌ను న్యాయవాది ప్రేమ్‌కుమార్ వేశారు. జస్టిస్ నిషాభానును మద్రాసు హైకోర్టు నుంచి కేరళ హైకోర్టుకు బదిలీ చేస్తూ గతేడాది అక్టోబరు 14న కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. అయినా ఆమె కొంతకాలం మద్రాసు హైకోర్టులోనే కొనసాగారు. బదిలీకి సంబంధించి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము నుంచి రిమైండర్ రావడంతో ఆమె 2025 డిసెంబరులో కేరళ హైకోర్టులో బాధ్యతలు స్వీకరించారు.



బెడిసికొట్టిన ట్రంప్ వీడియో

- సామాజిక మాధ్యమం నుంచి ఒబామా దంపతులపై పోస్ట్ తొలగింపు

వాషింగ్టన్: ప్రత్యర్థులపై విరుచుకుపడుతూ రెచ్చగొట్టే వ్యాఖ్యలతో సామాజిక మాధ్యమంలో పోస్టులు పెట్టే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా దంపతులను పరిహసించేలా తన సొంత సామాజిక మాధ్యమం'ట్రూత్'లో పోస్ట్ చేసిన వీడియో బెడిసికొట్టింది. ట్రంప్ చర్యను సొంత పార్టీకి చెందిన రిపబ్లికన్లు సైతం తీవ్రంగా తప్పుపట్టారు. గురువారం రాత్రి పోస్ట్ చేసిన ఆ వీడియోను.. దేశం నలుమూలల నుంచి విమర్శలు రావడంతో శుక్రవారం మధ్యాహ్నానికి తొలగించక తప్పలేదు. తొలుత ఈ వీడియోను సమర్థించిన శ్వేతసౌధం వర్గాలు తర్వాత ఆ తప్పిదాన్ని సిబ్బందిపైకి నెట్టివేశాయి. మాజీ అధ్యక్షుడు, డెమోక్రాట్ పార్టీ నేత బరాక్ ఒబామా, ఆయన సతీమణి మిషెల్ ఒబామాపై జాతివివక్షను ప్రదర్శించేలా ఆ వీడియో ఉందంటూ నిరసనలు వెల్లువెత్తాయి. 62 సెకండ్ల నిడివి ఉన్న ఆ వీడియో చివరిలో.. వారిద్దరూ అడవిలో సంచరిస్తున్న వానరులుగా కనిపిస్తారు. 2020 అధ్యక్ష ఎన్నికల సమయంలో అత్యంత కీలకమైన రాష్ట్రాల్లో ఓటింగ్ యంత్రాలను ఉద్దేశపూర్వకంగా ట్యాంపరింగ్ చేశారని ఆరోపిస్తూ రూపొందించిన వీడియోల పరంపరలో భాగంగా ఈ దృశ్యాలున్నాయి.

తల్లిదండ్రుల సపర్యలకు సెలవు ఇవ్వాలి

- రాజ్యసభలో ఎంపీ ప్రతిపాదన

దిల్లీ: అరవై ఏళ్లపైబడిన తల్లిదండ్రుల ఆలనాపాలనా చూసుకోవడానికి ప్రభుత్వ, ప్రైవేటు రంగ ఉద్యోగులకు తప్పనిసరిగా 45 రోజుల సెలవు ఇవ్వాలని ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన పార్లమెంటు సభ్యురాలు సుమిత్రా బాల్మీక్ శుక్రవారం రాజ్యసభలో ప్రతిపాదించారు. ఒక తల్లి తన బిడ్డను 20 ఏళ్లు వచ్చేవరకు కంటికి రెప్పలా చూసుకున్నట్లే, అస్వస్థులైన తల్లిదండ్రులకు సపర్యలు చేయడానికి కుమారులు, కుమార్తెలకు సెలవులు ఇవ్వాలన్నారు. కానీ, ప్రస్తుతం వృత్తి ఉద్యోగాల ఒత్తిళ్ల వల్ల పిల్లలు పెద్దవారి బాగోగులు చూసుకోలేకపోతున్నారనీ, ఒకవేళ చూసుకోవాలనుకున్నా సెలవులు దొరకడం లేదని సుమిత్ర వివరించారు. భారత జనాభాలో యువతరం సంఖ్య ఎక్కువే అయినా క్రమంగా వృద్ధుల శాతమూ పెరుగుతోందని గుర్తుచేశారు. 2036కల్లా ప్రతి మూడో భారతీయుడూ వృద్ధుడే అవుతాడని వివరించారు. మహిళలు, యువతరం సముద్ధరణకు ప్రాధాన్యమిస్తున్న ప్రభుత్వం వృద్ధుల గురించీ పట్టించుకోవాలన్నారు.

పాక్‌లో మ్యాన్‌హోల్ మూతలు ఎత్తుకెళ్తున్నారు..

ఇంటర్నెట్‌డెస్క్: ఆర్థిక అనిశ్చితులతో కొట్టుమిట్టాడుతున్న పాకిస్థాన్‌ను 'మ్యాన్‌హోల్' సమస్య వేధిస్తోంది. మ్యాన్‌హోల్‌పై మూతలు ఇలా అమర్చగానే.. అలా మాయమవుతున్నాయి. దాంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. 30కేజీల వరకు బరువు ఉన్న ఇనుపమూతలను తస్కరించి.... దుండగులు బయట అమ్ముకొని అవసరాలు తీర్చుకుంటున్నారని స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. కాగా..తాజాగా మూత లేకపోవడం వల్ల పంజాబ్ ప్రావిన్సులోని లాహోర్‌లోని ఓ మ్యాన్‌హోల్‌లో పడి.. తల్లీకుమార్తె ప్రాణాలు కోల్పోయారు. మరో ఘటనలో మ్యాన్‌హోల్‌లో పడిపోయిన చిన్నారిని సహాయసిబ్బంది కాపాడారు.

రూ.20 కేసులో 29 ఏళ్లకు తీర్పు..

ఆనందంతో అదేరోజు 'నిర్దోషి' మృతి

ఈటీవీ భారత్: ఇరవై రూపాయల లంచం మరక.. 29 ఏళ్ల సుదీర్ఘ విచారణ.. నిర్దోషిగా తేలిన రోజే ఆనందంతో మరణం. ఇదీ గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కు చెందిన ఓ మాజీ పోలీసు భావోద్వేగపు కథ. 1997లో వేజల్‌పుర్ వద్ద ఆయనపై అభియోగం నమోదైంది. 2004లో జిల్లా కోర్టు మూడేళ్ల జైలుశిక్ష విధించింది. హైకోర్టులో అప్పీలుకు వెళ్లగా.. 22 ఏళ్ల విచారణ కొనసాగింది. నిరూపించడానికి తగిన ఆధారాలు లేనందున నిర్దోషి అంటూ గుజరాత్ హైకోర్టులోని జస్టిస్ ఎస్.వి.పింటో ధర్మాసనం ఫిబ్రవరి 4న తీర్పు చెప్పింది. ఈ న్యాయం తన జీవితంలో చివరి అధ్యాయంగా మారుతుందని ఆ కానిస్టేబులు ఊహించలేకపోయారు. హైకోర్టు తీర్పుతో ఆ మాజీ పోలీసు ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. 29 ఏళ్ల తర్వాత లంచం అనే మరక తన జీవితం నుంచి తొలగిపోయిందంటూ భావోద్వేగానికి గురయ్యారు. "ఈ ఆనంద సమయంలో ఈ క్షణమే ఆ దేవుడు నన్ను తీసుకుపోతే బాగుండేది" అని సన్నిహితులతో అన్నారు. ఆ రోజు రాత్రి ఇంటికి చేరుకున్న కొద్దిసేపటికే ఆయన తుదిశ్వాస విడిచారు.

రూ.930 కోట్ల స్కామ్..

నకిలీ ఖాతాల ముఠా గుట్టురట్టు

ఈటీవీ భారత్: నకిలీ ఖాతాలతో భారీ స్థాయిలో సైబర్ నేరాలకు పాల్పడుతున్న ఓ ముఠాను గుజరాత్ పోలీసులు పట్టుకున్నారు. వీరు దేశవ్యాప్తంగా దాదాపు రూ.930 కోట్ల విలువైన మోసాలకు పాల్పడినట్లు అంచనా వేస్తున్నారు. గిర్ సోమ్‌నాథ్ జిల్లాలోని వెరావల్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తోన్న ఈ ముఠాకు దాదాపు 28 రాష్ట్రాల్లో నమోదైన వందలాది సైబర్ మోసాల కేసులతో సంబంధం ఉన్నట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. ఈ కేసుకు సంబంధించి ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్టుచేశారు. గుజరాత్‌లోని ఓ ప్రైవేటు బ్యాంకులో 26 సేవింగ్స్ ఖాతాలతోపాటు 54 కరెంట్ అకౌంట్లను (మొత్తం 80 ఖాతాలు) ఈ ముఠా తెరిచినట్లు దర్యాప్తులో తేలింది. సైబర్ మోసాలతో ఈ ఖాతాల్లో చేరే భారీ మొత్తాన్ని ఇతర అకౌంట్లకు బదిలీ చేస్తున్నట్లు వెల్లడైంది. మొత్తంగా దేశవ్యాప్తంగా 1534 సైబర్ క్రైమ్ కేసుల్లో ఈ ముఠాకు సంబంధం ఉన్నట్లు దర్యాప్తు అధికారులు అంచనా వేస్తున్నారు.

ప్లాసీ యుద్ధంతో ఆరంభమైన తమ ఆధిపత్యాన్ని కాపాడుకునేందుకు ఆంగ్లేయులు అనేక విధానాలు అవలంబించారు. వారి పాలనను సుస్థిరం చేసుకునేందుకు పలు చట్టాలు, సంస్కరణలు చేశారు. ఆదాయం కోసం రైతుల నుంచి భూమిశిస్తు వసూలు చేశారు. పాలనా పరమైన అవసరాల కోసం సివిల్ సర్వీస్ వ్యవస్థను నెలకొల్పారు. ఆంగ్ల విద్యావిధానాన్ని దేశంలో ప్రవేశపెట్టారు. న్యాయస్థానాలు ఏర్పాటు చేశారు. రైల్వే, సమాచార వ్యవస్థలను స్థాపించారు. స్వలాభమే ధ్యేయంగా పాలించిన ఆంగ్లేయులు భారతదేశాన్ని అనేక రకాలుగా ఇబ్బందులకు గురిచేశారు.

ఆధునిక పరిశ్రమల అభివృద్ధి

దోపిడీ ధోరణితో ప్రవేశపెట్టిన ఆంగ్లేయుల ఆర్థిక విధానాలతో దేశంలోని సంప్రదాయ పరిశ్రమలు అంతమయ్యాయి. వీటి స్థానంలో 19వ శతాబ్దపు ద్వితీయ భాగం నుంచి భారతదేశంలో ఆధునిక పరిశ్రమలు ప్రారంభమయ్యాయి.

▼ ఆధునిక పరిశ్రమల అభివృద్ధికి దేశంలో పలు అనుకూల పరిస్థితులున్నాయి. అపార ఖనిజ సంపద ముఖ్యంగా ముడి ఇనుము, బొగ్గు, తక్కువ వేతనాలకు పనిచేసే కార్మికులు, పారిశ్రామిక వస్తువుల అమ్మకానికి కావాల్సిన మార్కెట్లు పారిశ్రామికీకరణకు దోహదపడ్డాయి. దీంతోపాటు వివిధ పరిశ్రమలకు కావాల్సిన ముడిసరుకులు అందించే వాణిజ్య పంటలు భారతదేశంలో పుష్కలంగా పండటం, ఆంగ్లేయులు ప్రవేశపెట్టిన ఆధునిక రవాణా, సమాచార వ్యవస్థలు పారిశ్రామికీకరణకు చేయూతనిచ్చాయి.

▼ 20వ శతాబ్దంలో ప్రారంభమైన జాతీయ ఉద్యమం భారత పారిశ్రామిక అభివృద్ధిలో కీలకపాత్ర పోషించింది. కాంగ్రెస్ నాయకులు తమ ప్రజా ఉద్యమాల్లో బ్రిటిష్ వస్తువుల బహిష్కరణతో కూడిన స్వదేశీ కార్యక్రమాలను చేపట్టడం భారత పరిశ్రమలకు కలిసి వచ్చింది.

▼ ప్రపంచ యుద్ధాల్లో అగ్రరాజ్యాల్లోని పరిశ్రమలు ధ్వంసం కావడంతో భారతీయ వస్తువులకు అంతర్జాతీయ డిమాండ్ పెరిగి భారత పరిశ్రమలు మెరుగయ్యాయి. జనపనార, తేయాకు, రబ్బర్ మొదలైనవి భారతదేశంలో అభివృద్ధి చెందిన తొలి పరిశ్రమలుగా పరిగణించవచ్చు.

▼ 1854లో తొలి ఆధునిక వస్త్రపరిశ్రమ బొంబాయిలో స్థాపించారు. జనపనార పరిశ్రమ ఆంగ్లేయుల ఆధీనంలో ఉండగా, వస్త్రపరిశ్రమ భారతీయుల యాజమాన్యంలో అభివృద్ధి చెందింది.

▼ 1855లో తొలి జనపనార పరిశ్రమను బెంగాల్‌లోని రిష్రాలో స్థాపించారు.

▼ 1907లో టాటా ఐరన్ అండ్ స్టీల్ కంపెనీ (TISCO)ని జంషెడ్‌పూర్‌లో స్థాపించారు. ఇది భారత్‌లో తొలి ఆధునిక ఉక్కు కర్మాగారం.

▼ భారతదేశంలో ఆధునిక పరిశ్రమల అభివృద్ధిలో అనేక లోపాలు కూడా ఉన్నాయి. సంప్రదాయ పరిశ్రమల విధ్వంసంతో భారత ఆర్థిక వ్యవస్థకు కలిగిన నష్టాన్ని ఆధునిక పరిశ్రమలు పూడ్చలేకపోయాయి. ఈ పరిశ్రమలు కేవలం కొన్ని ప్రాంతాలకే పరిమితమై ప్రాంతాల అసమానతలకు కారణమయ్యాయి. ఇనుము-ఉక్కు కర్మాగారాలు స్వాతంత్య్రం వచ్చే వరకు అభివృద్ధి కాకపోవడం పారిశ్రామికీకరణలో ప్రధాన లోపంగా భావించవచ్చు.

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
భారతదేశ చరిత్ర

వలసవాద ప్రయోజనాలకే.. ఆధునిక వ్యవస్థల అభివృద్ధి

బ్రిటిష్ పరిపాలనా విధానాలు

ఆధునిక రవాణా, సమాచార వ్యవస్థ



ఆంగ్లేయులు తమ పరిపాలన, ఆర్థిక ప్రయోజనాల కోసం భారతదేశంలో ఆధునిక రవాణా, సమాచార వ్యవస్థను అభివృద్ధి చేశారు. వీటిని తమ వలసవాద ప్రయోజనాల కోసం చేపట్టారే తప్ప ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం కాదు.

❖ లార్డ్ డల్హౌసీ 1853లో రైల్వేలను ప్రవేశపెట్టాడు. ఇతడిని భారత రైల్వే పితామహుడిగా అభివర్ణిస్తారు.

❖ భారతదేశంలో తొలి రైలు బొంబాయి నుంచి థానే వరకు నడిచింది. 1905లో థామస్ రాబర్ట్‌సన్ కమిషన్ నివేదిక ఆధారంగా రైల్వే బోర్డును ఏర్పాటు చేశారు. 1924లో విలియం అక్‌వర్త్ కమిషన్ సిఫార్సుల మేరకు రైల్వే బడ్జెట్‌ను జనరల్ బడ్జెట్ నుంచి వేరు చేశారు.

❖ 1850లోనే డల్హౌసీ నీటి ఆవిరితో నడిచే నౌకలను (Steam ships) ప్రవేశపెట్టాడు. ఇతడి పాలనా కాలంలోనే పెషావర్ నుంచి కలకత్తా వరకు గ్రాండ్ ట్రంక్ రోడ్డు నిర్మించారు.

❖ ప్రాచీన కాలంలో గ్రాండ్ ట్రంక్ రోడ్డును చంద్రగుప్త మౌర్యుడు తక్షశిల నుంచి పాటలీపుత్ర వరకు నిర్మించారు.

❖ 1853లో డల్హౌసీ టెలిగ్రాఫ్ వ్యవస్థను ప్రవేశపెట్టాడు. భారతదేశంలో మొదటి టెలిగ్రాఫ్ లైన్‌ను కలకత్తా నుంచి ఆగ్రా మధ్య నిర్మించారు.


❖ డల్హౌసీ పాలనా కాలంలోనే 1853లో కరాచీలో తొలి పోస్టల్ స్టాంప్‌ను విడుదల చేశారు.

లాభాలు – నష్టాలు:

ఆధునిక రవాణా, సమాచార వ్యవస్థలతో భారతీయులకు అనేక నష్టాలతో పాటు కొన్ని లాభాలు కూడా కలిగాయి. ప్రారంభంలో రైల్వేలు బ్రిటిష్ ఆర్థిక ప్రయోజనాలను కాపాడుతూ భారత ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేశాయి.

◆ ఆధునిక రవాణా వ్యవస్థతో దేశంలోని ముడిసరుకులు వేగంగా, తక్కువ ఖర్చుతో రేవు పట్టణాలకు చేరేవి. అక్కడి నుంచి నౌకల ద్వారా ఇంగ్లండ్‌కు తరలివెళ్లేవి. అదేవిధంగా ఇంగ్లండ్‌లో తయారైన వస్తువులను భారతదేశంలోని మారుమూల ప్రాంతాలకు చేర్చి, భారత హస్తకళా పరిశ్రమలను దెబ్బతీశాయి.

◆ బ్రిటిష్ ఆధునిక పరిశ్రమల్లో తయారైన వస్తువులకు భారత్‌లో తయారైన వస్తువులు పోటీ ఇవ్వలేకపోయాయి.




“దాదాభాయ్ నౌరోజీ రైల్వేలు మన ఆర్థిక వ్యవస్థను ఏ విధంగా చిన్నాభిన్నం చేశాయో తన రచనల్లో తెలియజేశారు.

◆ బాలగంగాధర తిలక్ రైల్వేలపై ఆంగ్లేయులు చేసే ఖర్చును వ్యతిరేకించారు. పేద రైతులు చెల్లించే పన్నులతో రైల్వేలను అభివృద్ధి చేసి, ఆంగ్లేయులు తమ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసుకున్నారని విమర్శించారు.

◆ నాటి రైల్వేలు స్వయం సమృద్ధి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేశాయి. అయితే ఆధునిక రవాణా, సమాచార వ్యవస్థ దేశానికి ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ఇవి భారతదేశాన్ని, భారతీయులను ఏకం చేయడంలో కీలకపాత్ర పోషిస్తున్నాయి. ఉత్తర, దక్షిణాది ప్రాంతాల మధ్య దూరాన్ని తగ్గించి ప్రజలను దగ్గర చేశాయి.

◆ జాతీయ ఉద్యమాన్ని దేశవ్యాప్తంగా విస్తరింపజేయడంలో ప్రముఖపాత్ర పోషించాయి. ఇవి ఆధునిక పరిశ్రమల అభివృద్ధికి దోహదపడ్డాయి.

ఆర్థిక విధానం - గ్రామీణ రుణగ్రస్థత



ఆంగ్లేయుల ఆర్థిక విధానాలు దేశంలో పేదరికాన్ని మరింత పెంచి గ్రామీణ రుణగ్రస్థతకు కారణమయ్యాయి. వీరు ప్రవేశపెట్టిన నూతన వ్యవసాయ, రెవెన్యూ విధానాల ద్వారా వ్యవసాయ భూమి వ్యాపార వస్తువుగా మారిపోయింది. 1880లో క్షామాలపై నియమించిన స్ట్రాచీ కమిషన్ అంచనాల ప్రకారం దేశంలోని 2/3వ వంతు రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయి, భయంకరమైన దారిద్ర్యాన్ని అనుభవిస్తూ, క్షామాల సమయంలో ప్రాణాలు కోల్పోయినట్లు స్ట్రాచీ కమిషన్ పేర్కొంది.

▮ ఆంగ్లేయుల రెవెన్యూ విధానాలు గ్రామీణ రుణగ్రస్థతకు మరో ప్రధాన కారణంగా చెప్పవచ్చు. భూమిశిస్తు అధికంగా ఉండటం, ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నాశనమైనప్పటికీ శిస్తులో ఎలాంటి రాయితీలు ఇవ్వకపోవడంతో రైతులు వడ్డీ వ్యాపారుల నుంచి రుణం తీసుకువచ్చి మరీ ప్రభుత్వానికి చెల్లించాల్సిన పరిస్థితి తలెత్తేది. దీంతోపాటు దేశంలోని సంస్కృతి, సంప్రదాయాలు సైతం రైతులపై రుణభారం పెంచాయి.

▮ రైతులు భూమిని అమ్ముకోవడం లేదా కుదవపెట్టడానికి అవకాశం లభించడంతో వడ్డీ వ్యాపారుల వద్ద తాకట్టుపెట్టి రుణం తెచ్చుకునేవారు. దీన్ని ఆసరాగా చేసుకున్న వ్యాపారులు రైతుల నుంచి అధిక వడ్డీలను వసూలు చేసేవారు. ఆంగ్లేయుల చట్టాలు సైతం వడ్డీ వ్యాపారులకు పూర్తి రక్షణ కల్పించాయి.

▮ బ్రిటిష్ ప్రభుత్వం సంస్థాగత రుణాలను పట్టించుకోకపోవడంతో రైతులు తమ అవసరాల కోసం పూర్తిగా ప్రైవేట్ వడ్డీ వ్యాపారులపై ఆధారపడేవారు. రైతుల రుణ చెల్లింపు సామర్థ్యాన్ని అవకాశంగా తీసుకున్న వ్యాపారులు భూములను స్వాధీనం చేసుకుని రైతులను వ్యవసాయ కూలీలుగా మార్చేశారు.

వ్యవసాయ కూలీల పెరుగుదల

1901 జనాభా లెక్కల ప్రకారం భారతదేశంలో 52.4 మిలియన్ల వ్యవసాయ కూలీలుండేవారు. వీరు భారత రైతాంగంలో 37.8 శాతంగా ఉంటూ, పేదరికంలో జీవిస్తూ, అత్యల్ప జీవన ప్రమాణాలను కలిగి ఉండేవారు.

కారణాలు: ఆంగ్లేయులు బెంగాల్, బిహార్, ఒరిస్సా ఇతర ప్రాంతాల్లో జమీందారీ విధానాన్ని ప్రవేశపెట్టి, భూమిపై యాజమాన్య హక్కులను జమీందార్లకు కట్టబెట్టడంతో రైతులు కౌలుదార్లుగా, కూలీలుగా మారిపోయారు.

◗ ఆంగ్లేయులు తమ వస్తువులను భారత మార్కెట్లలో అమ్ముకోవడానికి అవలంబించిన విధానాలతో దేశంలోని సంప్రదాయ పరిశ్రమలు అంతమయ్యాయి. దీంతో జీవనోపాధి కోల్పోయిన చేతివృత్తుల వారు గ్రామాలకు వలస వెళ్లి వ్యవసాయ కూలీలుగా మారారు.

◗ ఆంగ్లేయులు కాఫీ, తేయాకు, రబ్బరు లాంటి పరిశ్రమలకు అధిక ప్రాధాన్యతనివ్వడంతో పరిశ్రమల్లో పని చేయడానికి వేలాది కూలీల అవసరం ఏర్పడింది. జనాభా పెరుగుదలతోనూ వ్యవసాయ కూలీల సంఖ్య అధికమైంది.



రచయిత
డాక్టర్ ఎం. రవి కుమార్
విషయ నిపుణులు

Word of the Day

914

Barren

Telugu meaning: బంజరు, నిస్సారమైన

English meaning: The word barren (బ్యారెన్) is an adjective that describes land that cannot produce plants or a situation that is unproductive or lacking results.

Synonyms: Infertile, Unproductive

Antonyms: Productive, Fruitful

Usage: **1.** Due to the lack of rainfall, the once fertile fields turned barren and unsuitable for cultivation.

2. Without proper planning, their efforts remained barren and failed to produce any meaningful outcome.

కరెంట్ అఫైర్స్



మణిపూర్ రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా భాజపా నేత యుమ్నమ్ ఖేమ్‌చంద్ సింగ్ (62) 2026, ఫిబ్రవరి 4న ప్రమాణం చేశారు. గవర్నర్ అజయ్‌కుమార్ భల్లా ఆయనతో ప్రమాణం చేయించారు. జాతుల మధ్య ఘర్షణలతో 2023 మే 3 నుంచి మణిపూర్ అతలాకుతలమైంది. ఈ ఘర్షణల్లో దాదాపు 260మంది మృత్యువాతపడ్డారు. తర్వాతి పరిణామాల నేపథ్యంలో 2025, ఫిబ్రవరి 9న అప్పటి సీఎం బీరెన్‌సింగ్ రాజీనామా చేశారు. ఫిబ్రవరి 13 నుంచి మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించారు.

✦ తాజాగా రాష్ట్ర ఎన్డీయే భాగస్వామ్య పక్షాల ఎమ్మెల్యేలు దిల్లీలో 2026, ఫిబ్రవరి 3న సమావేశమై ఖేమ్‌చంద్‌ను తమ శాసనసభాపక్ష నేతగా ఎన్నుకున్నారు. ఈ క్రమంలో మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనను ఎత్తివేస్తూ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఉత్తర్వులు జారీ చేశారు.



ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో హైదరాబాదీ షూటర్ ఇషా సింగ్ స్వర్ణం నెగ్గింది. 2026, ఫిబ్రవరి 4న దిల్లీలో ప్రారంభమైన ఈ టోర్నీలో మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్‌లో పసిడి పతకం గెలిచిన ఇషా.. టీమ్ విభాగంలోనూ స్వర్ణాన్ని దక్కించుకుంది. వ్యక్తిగత విభాగం ఫైనల్లో ఇషా (239.8) అగ్రస్థానంలో నిలిచింది. చైనీస్ తైపీ అమ్మాయిలు చెంగ్ యెన్ చెంగ్ (235.4), యా అయ్ వెన్ (217.7) వరుసగా రజత, కాంస్య పతకాలు అందుకున్నారు.

మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) 2026 విజేతగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) నిలిచింది. 2026, ఫిబ్రవరి 5న వడోదరలోని కొటాంబి స్టేడియంలో జరిగిన ఫైనల్లో ఆర్సీబీ జట్టు దిల్లీ క్యాపిటల్స్‌పై నెగ్గింది.

■ దిల్లీ క్యాపిటల్స్ మొత్తం 20 ఓవర్లలో 4 వికెట్లకు 203 పరుగులు చేయగా, ఆర్సీబీ 19.4 ఓవర్లలో 4 వికెట్లకు 204 రన్స్ చేసింది. డబ్ల్యూపీఎల్‌లో 204 పరుగులు అతి పెద్ద ఛేదన. గత రికార్డు కూడా ఆర్సీబీదే (గుజరాత్‌పై 202).

దేశంలోనే తొలిసారిగా, సహకార రంగంలో క్యాబ్ సేవల ప్లాట్‌ఫామ్ ‘భారత్ ట్యాక్సీ’ని కేంద్ర సహకార శాఖ మంత్రి అమిత్ షా 2026, ఫిబ్రవరి 5న ప్రారంభించారు. తొలుత ఈ సేవలు దిల్లీ-ఎన్సీఆర్, గుజరాత్‌లలో అందుబాటులోకి రానున్నాయి.

మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

పర్యావరణ పరిరక్షణ సంస్థలు

స్టడీ జోన్



భూగోళంపై ఉన్న సమస్త ప్రాణికోటి పర్యావరణం ద్వారానే మనుగడ సాగిస్తోంది. అయితే జనాభా పెరుగుదల, అత్యాశ లాంటి కారణాలతో ప్రకృతి ప్రసాదించిన సహజ వనరుల వాడకం మితిమీరింది. ఫలితంగా పర్యావరణం క్షీణతకు గురవుతోంది. ఆవరణ వ్యవస్థల్లో మార్పులు సంభవించి జీవుల మనుగడే ప్రశ్నార్థకంగా మారింది. ఈ పరిస్థితులను అధిగమించి, పర్యావరణ వ్యవస్థలను పరిరక్షించేందుకు వివిధ సంస్థలు కృషి చేస్తున్నాయి. పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను చాటుతూ ఇవి ప్రజలను చైతన్యపరుస్తున్నాయి. పోటీ పరీక్షల నేపథ్యంలో అంతర్జాతీయంగా కొన్ని ముఖ్యమైన పర్యావరణ పరిరక్షణ సంస్థల గురించి తెలుసుకుందాం..!

ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ అండ్ నేచురల్ రిసోర్సెస్ (ఐయూసీఎన్): 1948, అక్టోబరు 5న ఫ్రాన్స్‌లోని ఫొంటెన్‌బ్లూయిలో దీన్ని స్థాపించారు. ప్రధాన కార్యాలయం స్విట్జర్లాండ్‌లోని గ్లాండ్‌లో ఉంది. ఇది అంతరించిపోయే దశలో ఉన్న జంతువులు, మొక్కలు, శిలీంధ్రాలను రెడ్ డేటా బుక్‌లో ప్రచురిస్తుంటుంది.

కన్వెన్షన్ ఆన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఇన్ ఎన్‌డేంజర్డ్ స్పీసీస్ ఆఫ్ వైల్డ్ ఫనా అండ్ ఫ్లోరా (సీఐటీఈఎస్): 1975, జులై 1 నుంచి అమల్లోకి వచ్చింది. ప్రధాన కార్యాలయం జెనీవాలో ఉంది. అంతరించే దశలో ఉన్న జంతువులు, మొక్కలను వాణిజ్యం నుంచి నిషేధించేందుకు ఈ సంస్థ కృషి చేస్తోంది.

ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం (యూఎన్ఈపీ): ప్రధాన కార్యాలయం కెన్యా రాజధాని నైరోబీలో ఉంది. ఐక్యరాజ్యసమితి చేపట్టే పర్యావరణ కార్యక్రమాలను సమన్వయం చేయడానికి, అభివృద్ధి చెందుతున్న దేశాల్లో పర్యావరణ పరిరక్షణ కార్యకలాపాల అమలుకు సహాయం అందించేందుకు స్థాపించారు.

ఐపీసీసీ, డబ్ల్యూఎన్ఓ తదితర సంస్థల సమాచారంతోపాటు గతంలో అడిగిన ప్రశ్నలు జవాబుల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - బయాలజీ

మైటోకాండ్రియా



కణశ్వాసక్రియలో కీలకపాత్ర పోషిస్తూ, పోషకాలను శక్తిగా మార్చే ప్రక్రియకు మైటోకాండ్రియానే కారణం. ఈ ద్విస్తరిత కణాంగాలు అనేక యూకారియోటిక్ కణాల్లో కనిపిస్తాయి. ఇవి సంక్లిష్టమైన, గతిజ నిర్మాణాన్ని ప్రదర్శిస్తాయి. మైటోకాండ్రియా నిర్మాణం, విధులు, వాటి ప్రాముఖ్యం గురించి పోటీ పరీక్షార్థులకు అవగాహన అవసరం.

మైటోకాండ్రియా అనేది నిజ కేంద్రక కణాల్లో కనిపించే ప్రధాన కణాంగం. సాధారణంగా వీటిని కణం పవర్‌హౌస్‌లు లేదా శక్త్యాగారాలుగా పేర్కొంటారు. ప్రఖ్యాత ఫిజియాలజిస్ట్‌గా పేరుగాంచిన ఆల్బర్ట్ వాన్ కొల్లికర్ మొదటిసారిగా 1857లో దీన్ని కనుక్కున్నారు.

ఆకారం, పరిమాణం

సాధారణంగా ఇవి కడ్డీ ఆకారంలో లేదా అండాకారంలో (ఓవల్) ఉంటాయి.

▮ వీటి పరిమాణం 0.5 నుంచి 10 మైక్రోమీటర్ల పొడవుతో ఉంటుంది.

నిర్మాణ భాగాలు

- బాహ్య పొర
- త్వచాంతర అవకాశిక (ఇంటర్‌మెంబ్రేన్ స్పేస్)
- లోపలి పొర
- క్రిస్టే
- మాతృక

మైటోకాండ్రియా ప్రత్యేక లక్షణాలు, విధులు మొదలైన అంశాలతోపాటు మాదిరి ప్రశ్నలతో సహా పూర్తి సమాచారం ‘ఈనాడు ఈప్రతిభ’ వెబ్‌సైట్‌లో ‘జనరల్ స్టడీస్ ఈ-బుక్స్’ కోర్సులో ఈ-బుక్ రూపంలో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

నోటిఫికేషన్స్

ఐసీఏఆర్ - ఐఏఆర్ఐలో ఉద్యోగాలు

దిల్లీలోని ఐసీఏఆర్ - ఇండియన్ అగ్రికల్చర్ ఇన్‌స్టిట్యూట్ (ఐఏఆర్ఐ) తాత్కాలిక ప్రాతిపదికన యంగ్ ప్రొఫెషనల్, రిసెర్చ్ అసోసియేట్, ల్యాబ్ అసిస్టెంట్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. మొత్తం పోస్టుల సంఖ్య 16. ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ 14 ఫిబ్రవరి 2026.

అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాలు

జవహర్‌లాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ (జిప్‌మర్) పుదుచ్చేరి ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. మొత్తం పోస్టుల సంఖ్య 10. అర్హులైన అభ్యర్థులు 2026, ఫిబ్రవరి 21లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ పోస్టులు

ఇర్కాన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ (ఇర్కాన్) వివిధ విభాగాల్లో గ్రాడ్యుయేట్, డిప్లొమా అప్రెంటిస్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. మొత్తం పోస్టుల సంఖ్య 26. ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ 17 ఫిబ్రవరి 2026.

దరఖాస్తు చేశారా..?

కింది ఉద్యోగాలకు నేడే (ఫిబ్రవరి 7) చివరి తేదీ

▮ కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో 260 వర్క్‌మెన్ పోస్టులు. పదో తరగతి, ఐటీఐలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉన్నవారు అర్హులు.

▮ ఎన్ఐటీ వరంగల్‌లో 10 ప్రాజెక్ట్ అసిస్టెంట్ పోస్టులు. బీటెక్ (సివిల్ ఇంజినీరింగ్) ఉత్తీర్ణులు అర్హులు.

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Algebra

1. If $a + b = 10$ and $a^2 + b^2 + ab = 52$ then find the positive value of $a^3 + b^3$.
A) –400 B) –440
C) 640 D) 480

2. If $(a + 3b)^2 - (a - 3b)^2 = ?$
A) 6ab B) 9ab
C) 12ab D) 18ab

3. If $a + b = 12$ and $a^2 + b^2 + ab = 156$ then find the positive value of $a^3 + b^3$.
A) 2160 B) 1008
C) 1296 D) 2728


4. If $a + b = 18$ and $a^2 + b^2 = 170$, where $a > b$, then find the value of $3a - 2b$.
A) 10 B) 12 C) 14 D) 19

5. If $a + b + c = 6$, $ab + bc + ca = 11$ and $abc = 6$, then find the value of $a^3 + b^3 + c^3$.
A) 90 B) 108 C) 126 D) 36

6. If $3x - 2y = 7$ and $xy = 6$, then find the value of $(9x^2 + 4y^2)$.
A) 153 B) 161 C) 169 D) 121

7. If $x^2 - 2xy = 52$ and $x - y = -14$, then the value of y is:
A) 10 B) 12 C) 14 D) 16

8. Simplify $x^4 - 10x^3 + 35x^2 - 50x + 24$; given $x = 2$.
A) 0 B) 4 C) 6 D) 8



9. Find the remainder when $5x^4 - 3x^3 + 2x^2 - 7x + 6$ is divided by $(x - 2)$.
A) 56 B) 28 C) 6 D) 90

10. What is the possible value of $(a + b + c) - 2$, if $a^2 + b^2 + c^2 = 14$ and $ab + bc + ca = 11$.
A) 1 B) 2 C) 3 D) 4

11. If $a - b = 4$ and $a^3 - b^3 = 208$, Then what is the value of ab?
A) 12 B) 16 C) 20 D) 24

12. If $a + b + c = 8$ and $a^2 + b^2 + c^2 = 50$, then find the value of $a^3 + b^3 + c^3 - 3abc$.
A) 256 B) 288 C) 320 D) 344

Railway Exams

Mathematics

13. If $x - y = 6$ and $xy = 12$, then what is the value of $2x^3 - 2y^3$?
A) 432 B) 504 C) 864 D) 648

14. If $x + y = 18$ and $xy = 24$, then find the value of $x^3 + y^3$.
A) 4320 B) 4536
C) 4860 D) 5184

15. If x and y are positive numbers such that $x - y = 7$ and $xy = 60$, then the value of $(x + y)$ is:
A) 13 B) 15 C) 17 D) 19

16. If $a + b + c = 6$, $ab + bc + ca = 5$ and $abc = -2$, then the value of $a^3 + b^3 + c^3$ is:
A) 90 B) 96 C) 102 D) 120

17. If $a + b + c = 15$ and $ab + bc + ca = 22$, then find the value of $a^2 + b^2 + c^2$.
A) 181 B) 191 C) 203 D) 215

18. If $a + b + c = 6$, $a^3 + b^3 + c^3 = 54$ and $abc = 6$, then find the value of $a^2 + b^2 + c^2 - ab - bc - ca$.
A) 4 B) 6 C) 8 D) 10

19. If $a^2 + b^2 = 25$ $x^2 + y^2 = 17$ and $ax + by = 16$, then find the value of $(ay - bx)$.
A) 11 B) 13 C) 15 D) 17

20. If $x = 101$, $y = 102$ and $z = 103$, then find the value of $x^3 + y^3 + z^3 - 3xyz$.
A) 950 B) 980
C) 918 D) 909

21. If $a : b = 3 : 4$ and $b : c = 5 : 6$, then $a^2 : b^2 : bc = ?$
A) 45 : 80 : 96 B) 43 : 20 : 16
C) 14 : 22 : 31 D) 41 : 43 : 33

22. If $a + b + c = 18$ and $ab + bc + ca = 65$, then what is the value of $a^2 + b^2 + c^2$?
A) 154 B) 194 C) 174 D) 184

23. If $x^2 + y^2 + z^2 = 350$ and $xy + yz + zx = 85$, then find the value of $(x + y + z)^2$
A) 720 B) 522
C) 240 D) 520

24. If $a + b + c = 7$ and $ab + bc + ca = 10$, then find the value of $a^2 + b^2 + c^2$.
A) 19 B) 21 C) 29 D) 33

25. If $a + b + c = 6$, $a^3 + b^3 + c^3 = 90$ and $abc = 8$, then find the value of $a^2 + b^2 + c^2 - ab - bc - ca$.
A) 11 B) 6
C) 8 D) 10

Scan the QR code for Key

These model questions were prepared by subject experts

అంధ క్రికెటర్ కరుణకుమారికి రూ.15 లక్షలు

- దీపికకు రూ.10 లక్షలు
- నగదు ప్రోత్సాహకం విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు

ఈనాడు, అమరావతి: అంధుల టీ-20 మహిళల ప్రపంచకప్ గెలుపులో కీలకంగా వ్యవహరించిన రాష్ట్రానికి చెందిన అంధ క్రీడాకారిణి పి.కరుణకుమారికి రూ.15 లక్షలు, భారత అంధ క్రికెట్ జట్టు కెప్టెన్ దీపికకు రూ.10 లక్షలు, కోచ్ అజయ్‌కుమార్‌రెడ్డికి రూ.2.5 లక్షలు నగదు ప్రోత్సాహకాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల జరిగిన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా సీఎం చంద్రబాబు వారికి నగదు ప్రోత్సాహకాన్ని ప్రకటించారు. ఈ నేపథ్యంలో వారి క్రీడా ప్రతిభను పరిశీలించి ఈ ప్రోత్సాహకాలు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. కరుణకుమారికి విశాఖలో ఇంటి స్థలం కేటాయింపుకు సంబంధించి మరో ఉత్తర్వును విడుదల చేయనున్నారు.

రాష్ట్రాభివృద్ధికి మీరందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు

నితిన్ గడ్కరీకి శుభాకాంక్షలు తెలిపిన లోకేశ్

ఈనాడు, అమరావతి: "రాష్ట్రంలో మౌలిక వసతుల కల్పన, పోర్ట్ ఆధారిత అభివృద్ధికి కేంద్రం అందిస్తున్న సహకారానికి హృదయపూర్వక కృతజ్ఞతలు" అని విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. మచిలీపట్నం పోర్టు అనుసంధాన రహదారి నిర్మాణానికి రూ.573 కోట్లు విడుదల చేస్తున్నట్లు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. దీంతో రాష్ట్రానికి కొత్త ఆర్థిక అవకాశాలు రానున్నాయని ఎక్స్ వేదికగా లోకేశ్ పేర్కొన్నారు. దేశాభివృద్ధికి శక్తినిచ్చే ప్రపంచస్థాయి జాతీయ రహదారుల నిర్మించడం, ఏపీ భవిష్యత్తును నడిపించడంలో గడ్కరీ నాయకత్వానికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు.

బడ్జెట్ సమావేశాలు అర్థవంతంగా జరగాలి

చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

ఈనాడు, అమరావతి: ఏపీ బడ్జెట్ సమావేశాలు అర్థవంతంగా జరగాలని, సామాన్య ప్రజలకు ఉపయోగపడే అంశాలపై నిర్ణయాలు తీసుకునేలా ఉండాలని చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు సూచించారు. ప్రభుత్వ విప్‌లతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. "అసెంబ్లీ సమావేశాలకు ఎమ్మెల్యేలు వంద శాతం హాజరుకావాలి. హాజరైనవారు సభ జరిగినంత సేపూ హాల్లో ఉండి సభాగౌరవాన్ని కాపాడాలి. ప్రతిపక్ష వైకాపా సభ్యులు సభకు హాజరై తమ చిత్తశుద్ధి నిరూపించుకోవాలి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ఈ నెల 14న జనరంజక బడ్జెట్ ప్రవేశపెట్టబోతున్నాం" అని తెలిపారు. ఈ సమావేశంలో ప్రభుత్వ విప్‌లు కాలవ శ్రీనివాసులు, పీజీవీఆర్ నాయుడు, యార్లగడ్డ వెంకట్రావు, బొలిశెట్టి శ్రీనివాస్, బొమ్మిడి నాయకర్, యనమల దివ్య, తంగిరాల సౌమ్య పాల్గొన్నారు.

జగన్ పాలనలో రాయలసీమలోని ప్రాజెక్టులన్నీ నిర్వీర్యం

ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

ఈనాడు, అమరావతి: కమీషన్ల కక్కుర్తితో రాయలసీమ ఎత్తిపోతల ప్రాజెక్టును బలిపెట్టిన చరిత్ర వైకాపాదని తెదేపా ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ధ్వజమెత్తారు. 2020లోనే ఎన్జీటీ ఈ ప్రాజెక్టును అడ్డుకుంటే జగన్ కనీసం కౌంటర్ కూడా వేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నికర జలాలున్న తుంగభద్ర ఎగువ కాలువపై వేదికైన ఒక్క రూపాయి కూడా ఖర్చుపెట్టకుండానే గత వైకాపా ప్రభుత్వం చీకటి జీవో ఇచ్చిందని.. ఇది రాయలసీమకు చేసిన అతిపెద్ద ద్రోహమని విమర్శించారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. "జగన్ పాలనలో రాయలసీమలోని ప్రాజెక్టులన్నీ నిర్వీర్యం చేశారు. 'ఎలో పోతిరెడ్డిపాడు' అంటూ వైకాపా నేతలు ఇప్పుడు మరో రాజకీయ నాటకానికి తెరలేపారు. 2024 ఎన్నికల్లో రాయలసీమలో ఉనికి కోల్పోయిన వారు మళ్లీ తమ గుర్తింపు కాపాడుకోవడానికి ప్రయత్నిస్తూ తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. హంద్రీ-నీవా, గాలేరు-నగరి, తెలుగుగంగ ప్రాజెక్టులు తెదేపా ప్రభుత్వాల్లోనే వచ్చాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే హంద్రీ-నీవా కాలువ పనులు రికార్డు స్థాయిలో నడుస్తున్నాయి" అని కాలవ శ్రీనివాసులు తెలిపారు.

పదోతరగతి విద్యార్థులు ఒత్తిడికి గురికావొద్దు

పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు

ఈనాడు, అమరావతి: పదోతరగతి పరీక్ష విషయంలో విద్యార్థులు భయాందోళనలు, ఒత్తిడికి గురికావద్దని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు తెలిపారు. విజయవాడలో శుక్రవారం ఆయన విద్యార్థులతో కలిసి ప్రధానమంత్రి పరీక్షా పే చర్చ కార్యక్రమాన్ని వీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడారు.. ఈ కార్యక్రమానికి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలిపి 23,84,230 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని వెల్లడించారు. ప్రత్యక్ష కార్యక్రమంలో పాల్గొన్న పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన షేక్ జమీర్ బాషాను అభినందించారు. 'పరీక్షా పే చర్చ' వీక్షించిన విద్యార్థులందరికీ ఎగ్జామ్ వారియర్ పుస్తకాలను పంపిణీ చేశారు.

గౌతు శివాజీతో లోకేశ్ భేటీ



ఈనాడు, అమరావతి: తెదేపా నేత, మాజీ మంత్రి గౌతు శివాజీతో మంత్రి నారా లోకేశ్ భేటీ అయ్యారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయానికి శుక్రవారం వచ్చిన శివాజీకి లోకేశ్ సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం ఇద్దరు నేతలు కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ప్రస్తుత, గత రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతం సహా వివిధ అంశాలపై ఇద్దరు నేతలు చర్చించుకున్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే శిరీష కుమారుడు శ్రావణ్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో నిరుద్యోగికి నిరీక్షణ శిక్ష

- విద్యార్హతలు, కోర్టు కేసులతో నియామకాలు పెండింగ్
- ఏపీపీఎస్సీలో 518 పోస్టులు ఎంపికలో జాప్యం
- త్వరగా తేల్చాలని అభ్యర్థుల వేడుకోలు

ఈనాడు, అమరావతి: రిజర్వేషన్లు, విద్యార్హతలు, కోర్టు కేసుల చిక్కులతో ఏపీపీఎస్సీలో 518 పోస్టుల భర్తీ ప్రక్రియ పెండింగ్‌లో పడింది. కొన్ని ఉద్యోగాలకు పరీక్షలు జరిగి రెండేళ్లు పూర్తయినా, నియామకాలు చేపట్టలేదు. పరీక్షలు రాసిన అభ్యర్థులు పోస్టింగుల కోసం ఎదురుచూస్తున్నారు. కొన్ని ప్రభుత్వ విభాగాల్లో నెలకొన్న జాప్యం కూడా ఫలితాల వెల్లడిలో జాప్యానికి కారణమవుతోంది. ఉదాహరణకు డిగ్రీ లెక్చరర్ పోస్టులకు రిజర్వేషన్లపై కళాశాల విద్యాశాఖ ఏపీపీఎస్సీకి ఫైల్ పంపించి నాలుగు నెలలు గడిచినా, అటు నుంచి సమాధానం రాలేదు. దీంతో ఫలితాల వెల్లడి నిలిచిపోయింది. పాలిటెక్నిక్, జూనియర్ లెక్చరర్ పోస్టులకు సంబంధించి విద్యార్హతల ఈక్వలెన్సీ తేలాల్సి ఉండగా, సాంకేతిక, ఇంటర్ విద్యా విభాగాలు పట్టించుకోవడం లేదు. కోర్టు కేసులు పరిష్కారానికి సంబంధిత విభాగాలు సకాలంలో స్పందించడం లేదని అభ్యర్థులు వాపోతున్నారు.

జేఎల్‌కు విద్యార్హతల సమానత్వ సమస్య

- ◆ 47 జూనియర్ లెక్చరర్ పోస్టుల భర్తీకి 2023 డిసెంబరు 28న ప్రకటన
- ◆ 2025 జులైలో పరీక్షలు, డిసెంబరులో ఫలితాలు విడుదల
- ◆ కంప్యూటర్ ప్రొఫిషియన్సీ పరీక్షలో ఇద్దరు ఫెయిల్ కాగా, విద్యార్హతలపై స్పష్టత రావాల్సి ఉంది.
- ◆ మొత్తంగా ఎంపిక ప్రక్రియ పెండింగ్‌లో పడింది. ఏపీపీఎస్సీ, ఇంటర్ విభాగాలు సమన్వయం చేసుకుంటే సమస్య పరిష్కారమయ్యేది. కానీ, ఎవరికి పట్టడం లేదు.

పాలిటెక్నిక్‌లోనూ ఇదే..

- ◆ 99 పాలిటెక్నిక్ లెక్చరర్ పోస్టుల భర్తీకి 2023 డిసెంబరు 21న ప్రకటన
- ◆ 2025 జులైలో పరీక్షలు, డిసెంబరు 11న ఫలితాలు
- ◆ విద్యార్హతల సమానత్వం (ఈక్వలెన్సీ) తేలకపోవడంతో ఎంపిక పెండింగ్‌లో పడింది.

డీఎల్ ఫలితాలూ పెండింగ్‌లోనే..

- ◆ 290 డిగ్రీ లెక్చరర్ పోస్టులకు 2023 డిసెంబరు 30న ప్రకటన
- ◆ 2025 జులైలో పరీక్ష నిర్వహించారు. ఇప్పటికీ ఫలితాలు ఇవ్వలేదు.
- ◆ హారిజాంటల్ రిజర్వేషన్‌పై స్పష్టత కోసం దస్త్రాన్ని కళాశాల విద్యా శాఖకు పంపగా.. మూడు నెలలుగా అక్కడే ఉంది.

డిప్యూటీ డీఈవో పోస్టులకు న్యాయ చిక్కులు

- ◆ 38 జిల్లా ఉప విద్యాశాఖాధికారి పోస్టుల భర్తీకి 2023 డిసెంబరు 22న నోటిఫికేషన్
- ◆ 2025 మార్చిలో పరీక్ష నిర్వహణ. ఫలితాలు పెండింగ్‌లో
- ◆ రిజర్వేషన్ జీవో-77పై హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉంది.

ఎఫ్ఆర్వో భర్తీకి కోర్టు కేసులు

- ◆ 37 అటవీ రేంజ్ అధికారి పోస్టుల భర్తీకి 2024 మార్చి 6న ప్రకటన
- ◆ 2025 మార్చి 16న స్క్రీనింగ్ పరీక్ష, జూన్ 2-4 మధ్య మెయిన్ పరీక్ష నిర్వహణ
- ◆ హైకోర్టులో కేసు వల్ల ఫలితాలు విడుదల కాలేదు.

టౌన్ ప్లానింగ్‌లో వింతలు

- ◆ టౌన్, కంట్రీ ప్లానింగ్‌లో 7 ఏడీ పోస్టుల భర్తీకి 2024 ఫిబ్రవరి 9న ప్రకటన◆ 2025 ఏప్రిల్ 28-29 తేదీల్లో పరీక్షలు.. సెప్టెంబరులో ఫలితాల విడుదల
- ◆ 15 మంది అభ్యర్థుల ఎంపిక.. వీరిలో 8 మంది విద్యార్హతలు సరిగా లేవని గుర్తింపు
- ◆ విద్యార్హతల వివాదంపై ఏపీపీఎస్సీ వింత నిర్ణయాలతో భర్తీ ప్రక్రియ పెండింగ్‌లో పడింది.

10 మంది నగర, పురపాలక కమిషనర్ల బదిలీ

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని పది మంది నగర, పురపాలక కమిషనర్లను ప్రభుత్వం బదిలీ చేసింది. పోస్టింగ్ కోసం వేచి ఉన్న కొందర్ని పలు చోట్ల నియమించింది. ఈ మేరకు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

- ◆ పోస్టింగ్ కోసం వేచి ఉన్న ఎం.జస్వంతరావును అనంతపురం నగరపాలక సంస్థ కమిషనర్‌గా నియమించారు. అక్కడి కమిషనర్ బి.బాలస్వామిని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్‌గా బదిలీ చేశారు.
- ◆ పల్నాడు పట్టణాభివృద్ధి సంస్థ కార్యదర్శి జి.సాంబశివరావును గుంటూరు నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్‌గా బదిలీ చేశారు. అక్కడి డిప్యూటీ కమిషనర్ టి.వెంకట కృష్ణయ్యను పల్నాడు పట్టణాభివృద్ధి సంస్థ కార్యదర్శిగా నియమించారు.
- ◆ గుంతకల్లు మున్సిపల్ కమిషనర్ సీఎంఏ నయీం అహ్మద్‌ను ఆదోని మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేశారు. అక్కడి కమిషనర్ ఎం.కృష్ణను సీఆర్‌డీఏకి పంపారు. ఆయనకు సీఆర్‌డీఏ కమిషనర్ పోస్టింగ్ ఇవ్వనున్నారు.
- ◆ పోస్టింగ్ కోసం వేచి ఉన్న పి.సింహాచలంను ఏలూరు పట్టణాభివృద్ధి సంస్థలో ఖాళీగా ఉన్న కార్యదర్శి స్థానంలో నియమించారు.
- ◆ ఒంగోలు పట్టణాభివృద్ధి సంస్థ కార్యదర్శి ఆర్.దేవసేనను బదిలీ చేసి తాడేపల్లిగూడెం మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్‌గా నియమించారు.
- ◆ విజయవాడ నగరపాలక సంస్థలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ కె.శివరాం ప్రసాద్‌ను వినుకొండ మున్సిపల్ కమిషనర్‌గా నియమించారు. అక్కడి కమిషనర్ ఎం.సుభాష్ చంద్రబోస్‌ను రాష్ట్ర పురపాలకశాఖ కమిషనర్ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.
- ◆ కళ్యాణదుర్గం మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ నూర్ అలీ ఖాన్‌ను కమలాపురం నగర పంచాయతీ కమిషనర్‌గా నియమించారు. అక్కడి కమిషనర్ బి.ప్రహ్లాద్ రాష్ట్ర పురపాలకశాఖ కమిషనర్ కార్యాలయంలో రిపోర్ట్ చేయనున్నారు.


టెట్ నుంచి మినహాయింపునివ్వాలి

కేంద్ర మంత్రికి ఏఐజాక్టో వినతి

ఈనాడు, దిల్లీ: విద్యా హక్కు చట్టం అమలుకు ముందు నియామకమైన టీచర్లకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని, చట్ట సవరణ చేయాలని అఖిల భారత ఉపాధ్యాయ సంఘాల సంయుక్త కార్యాచరణ సమితి (ఏఐజాక్టో) కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు విజ్ఞప్తి చేసింది. రాజ్యసభ సభ్యుడు శివదాసన్ నేతృత్వంలో జాక్టో స్టీరింగ్ కమిటీ సభ్యులు చావ రవి, కత్తి నరసింహారెడ్డి, బసవరాజ్ గురికార్, కమలాకాంత త్రిపాఠి, సీఎన్ భారతి శుక్రవారం పార్లమెంటు భవనంలో కేంద్రమంత్రికి వినతిపత్రం ఇచ్చారు. "సెప్టెంబరు 1 నుంచి రెండేళ్లలోగా ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు టెట్ పాసుకాకపోతే ఉద్యోగాల నుంచి తొలగించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో దేశవ్యాప్తంగా 30 లక్షల మంది ఉపాధ్యాయులు ప్రభావితమవుతున్నట్లు కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. సీపీఎస్ రద్దు, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రాథమిక ఉపాధ్యాయులకు ఓటు హక్కు కల్పన, కాంట్రాక్టు ఉద్యోగులకు కనీస వేతనాలు, జాతీయ విద్యావిధానంలో ప్రభుత్వ విద్యకు నష్టం కల్గించే అంశాల రద్దు గురించి వారు కేంద్రమంత్రికి విన్నవించారు. టెట్ విషయంలో సుప్రీంకోర్టు తీర్పుపై న్యాయనిపుణులతో చర్చిస్తున్నామని ధర్మేంద్ర ప్రధాన్ చెప్పినట్లు ఆయనను కలిసిన ప్రతినిధి బృందం వెల్లడించింది. మిగతా విజ్ఞప్తులపై వారు సరిగా స్పందించలేదని పేర్కొంది. ఆ తర్వాత జాక్టో ప్రతినిధి బృందం రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసి టెట్ సమస్యను పరిష్కరించేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరింది.

3 వారాల్లోపు నిర్ణయం తీసుకోండి

- లేదంటే కోర్టు ధిక్కరణ కింద చర్యలకు ఉపక్రమిస్తాం
- ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై తెలంగాణ స్పీకర్‌కు సుప్రీంకోర్టు హెచ్చరిక



ఈనాడు, దిల్లీ: ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై 3 వారాల్లోపు నిర్ణయం వెలువరించాలని తెలంగాణ స్పీకర్‌కు సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. లేదంటే తాము కోర్టు ధిక్కరణ కింద చర్యలకు ఉపక్రమిస్తామని హెచ్చరించింది. పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న పది మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరుతూ భారాస దాఖలు చేసిన పిటిషన్లపై గత ఏడాది అక్టోబరు 31 లోపు నిర్ణయం వెలువరించాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. దానిని ఉల్లంఘించిందని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై కోర్టు ధిక్కరణ కింద చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌లు గత ఏడాది నవంబరు 10న పిటిషన్లు దాఖలు చేశారు. వాటిని శుక్రవారం విచారించిన జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ఏజీ మసీహ్‌లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. జనవరి 16న ఈ కేసు విచారణకు వచ్చినప్పుడు.. పెండింగ్ పిటిషన్లపై స్పీకర్ నిర్ణయం తీసుకోవడానికి 4 వారాల సమయం ఇవ్వాలని సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ ధర్మాసనానికి విజ్ఞప్తి చేశారు. అందుకు న్యాయమూర్తులు అంగీకరిస్తూ కేసును 2 వారాలకు వాయిదా వేసి ఆలోపు నిర్ణయం తీసుకోవాలని చెప్పారు. శుక్రవారం ఆ కేసు విచారణకు రాగా గత పురోగతిని తమకు తెలపాలని ఆదేశించారు. అనంతరం తీర్పు కోసం వేచి ఉన్న కేసు వివరాలు సేకరించి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పిటిషన్లను శుక్రవారం ధర్మాసనం ముందు విచారణకు వచ్చాయి.

ఇళ్ల నిర్మాణం పేరుతో రూ.9.82 కోట్ల మోసం

వైట్ వాటర్స్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థపై కేసు

ఈనాడు- హైదరాబాద్: హైదరాబాద్ మూసాపేట వై జంక్షన్ సమీపంలో ఫ్లాట్లు నిర్మిస్తామని వైట్ వాటర్స్ కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ డబ్బు వసూలు చేసి మోసం చేసిందన్న ఫిర్యాదుపై సైబరాబాద్ ఈవోడబ్ల్యూ పోలీసులు కేసు నమోదు చేశారు. 15 మంది నుంచి రూ.9.82 కోట్లు వసూలు చేసి మోసం చేశారని, కొండాపూర్‌కి చెందిన డబుల్ రిజిస్ట్రేషన్ చేశారని బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. మరో 500 మంది నుంచి రూ.270 కోట్లు వసూలు చేశారని ఆరోపించారు. కేసు వివరాలివీ.. నగరానికి చెందిన మహిళ 2018 డిసెంబరులో మూసాపేట వై జంక్షన్‌లోని వైట్ వాటర్స్ కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ కార్యాలయానికి వెళ్లారు. సంస్థ డైరెక్టర్లు అజయ్ సబితే, తనయ్ సబితే, విజయలక్ష్మీ తదితరులు తమ సంస్థ 816 ఇళ్ల నిర్మాణం చేపడుతోందని చెప్పగా మహిళ ఓ ఫ్లాట్ బుకింగ్ కోసం రూ.11 లక్షలు చెల్లించారు. 1,650 చదరపు అడుగుల్లోని ఫ్లాట్ బుక్ చేసుకోగా.. బిల్డర్ కొన్ని రోజుల తర్వాత 1,945 చదరపు గజాల విస్తీర్ణంలో నిర్మిస్తున్నామని చెప్పి వ్యయం రూ.92.10 లక్షలకు పెంచాడు. బిల్డర్ ఒత్తిడితో ఆమె 2022లో కొనుగోలు ఒప్పందం చేసుకున్నారు. బిల్డర్ ఫ్లాటును తొలుత 2024 డిసెంబరు, తర్వాత 2025 డిసెంబరు వరకు అప్పగిస్తామన్నా పూర్తి చేయలేదు. మహిళ ఆరాతీయగా తనకు కేటాయించిన ఫ్లాటును మరొకరి పేరుతో రిజిస్ట్రేషన్ చేశారు. దాంతోపాటు రూ.1.27 కోట్ల రుణం తీసుకున్నట్లు తెలుసుకున్నారు. దీనిపై అజయ్‌ను సబితేను ప్రశ్నించగా రుణం తాము చెల్లిస్తామని రిజిస్ట్రేషన్ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. నెలలు గడిచినా రుణం చెల్లించలేదు. ఫ్లాటు రిజిస్ట్రేషన్ చేయలేదు. సంస్థ ప్రతినిధులను తనలాగే 15 మంది రూ.9.82 కోట్లు చెల్లించినట్లు తెలుసుకుని బాధితులంతా కలిసి ఫిర్యాదు చేయగా డైరెక్టర్లపై పోలీసులు కేసు నమోదు చేశారు.

తాటిచెట్టుపైనే గీత కార్మికుడి మృతి

తంగళ్లపల్లి, న్యూస్‌టుడే: ప్రమాదవశాత్తూ మోకు జారి.. తాటిచెట్టుపైనే ఓ గీత కార్మికుడు ప్రాణాలు కోల్పోయారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో శుక్రవారం ఈ విషాదకర ఘటన చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్థుల కథనం ప్రకారం.. తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల గ్రామానికి చెందిన సాయిలి కిషన్‌గౌడ్ (39) గీత కార్మికుడిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. రోజు మాదిరిగానే సాయంత్రం గ్రామ శివారులో ఉన్న తాటిచెట్టు ఎక్కారు. ఓ చెట్టుపైకి చేరుకున్నాక కల్లు గీసే క్రమంలో ప్రమాదవశాత్తూ మోకు కిందకు జారడంతో తలకిందులుగా వేలాడి అక్కడే మృతిచెందారు. ఫైర్ సిబ్బందితోపాటు ఎస్సై ఉపేందర్ చారి ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కిందకు దించారు. కిషన్‌గౌడ్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్థులు ప్రభుత్వాన్ని కోరారు.

పీజీ మెడికల్ కోర్సుకు కొత్తగా 18 సీట్లు

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: పీజీ మెడికల్ డిగ్రీ/డిప్లొమా కోర్సు ప్రవేశానికి కన్వీనర్/యాజమాన్య కోటాకు సంబంధించి నాన్ సర్వీస్ కేటగిరీ తుది ప్రాధాన్య క్రమాన్ని ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం విడుదల చేసింది. నీట్ పీజీ కటాఫ్ మార్కులు తగ్గించాక అర్హత సాధించిన వారి జాబితాతో మూడో విడత కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. కొత్తగా రెండో విడత కౌన్సెలింగ్ అనంతరం కొన్ని వైద్య కళాశాలలో కన్వీనర్ కోటాలో 9, యాజమాన్యంలో 9 సీట్లు అందుబాటులోకి వచ్చాయి. రాష్ట్రంలోని కాటూరి, ఎన్నారై, సిమ్స్ తిరుపతి, జెమ్స్ శ్రీకాకుళం, శాంతిరామ్ కర్నూలులో ఈ 18 కొత్త పీజీ సీట్లను కౌన్సెలింగ్‌కు అందుబాటులో ఉంచారు.

డీఎన్‌బీ కౌన్సెలింగ్..2025-26 విద్యా సంవత్సరానికి రాష్ట్రంలోని పలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఇన్‌సర్వీస్ అభ్యర్థుల మూడేళ్ల పోస్టు ఎంబీబీఎస్ (డీఎన్‌బీ), రెండేళ్ల డిప్లొమా కోర్సు ప్రవేశానికి నిర్వహించిన కౌన్సెలింగ్‌లో 30 సీట్లు భర్తీ అయ్యాయి. సీట్లు పొందిన వారికి ఈ నెల 8వ తేదీ మధ్యాహ్నం 3 గంటల్లోగా ఆయా కళాశాలల్లో చేరాల్సి ఉంటుంది.

డీఏపై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం: ఏపీజేఏసీ

ఈనాడు, అమరావతి: కరవు భత్యం(డీఏ) పొందడం ఉద్యోగుల చట్టబద్ధ హక్కు అన్న సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం(ఏపీజేఏసీ) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేఆర్ సూర్యనారాయణ, రమేష్ కుమార్ తెలిపారు. "సుప్రీం తీర్పు స్ఫూర్తితో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల బకాయిల చెల్లింపునకు కమిటీ వేయాలి. ఏపీలోనూ రూ.35 వేల కోట్ల బకాయిల చెల్లింపుకు బదులుగా ఉద్యోగులకు నివాస స్థలాల కేటాయింపుతో గృహ సముదాయ పథకానికి రూపకల్పన చేయాలి. ఉద్యోగులు, పెన్షనర్లకు చెల్లించాల్సిన బకాయిలు ఎన్ని? చెల్లింపులకు ప్రణాళిక ఏంటో.. రానున్న బడ్జెట్ సమావేశాల్లో ప్రకటించాలి. లేదంటే ప్రత్యామ్నాయ చెల్లింపు ప్రతిపాదనలు అధ్యయనం చేయడానికి విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి ఆధ్వర్యంలో కమిషన్‌ను ఏర్పాటు చేయాలి" అని పేర్కొన్నారు.



సాగర తేనెపట్టు!

విశాఖపట్నంలో జూ పార్కు సమీప సాగర తీరంలో అలల తాకిడి వల్ల వెలువడి రాళ్లు, శిలలు బయటపడ్డాయి. ఆ శిలలపై రంగుల నాచు, నత్తగుల్లలు, జలచర పురుగులు ఆకట్టుకునేలా కనిపించాయి. వీటిని 'సీ హనీ కూంబ్ (సముద్రపు తేనెపట్టు)' అని పిలుస్తారని ఉమ్మడి విశాఖ జిల్లా మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పి.శ్రీనివాసరావు తెలిపారు. సమూహంగా ఉండే పురుగుల్లో కొన్ని విషపూరితమైనవి ఉంటాయని వివరించారు.

– న్యూస్‌టుడే, విశాఖపట్నం(సాగర్‌నగర్)



మీనా.. నిను మోయగలనా..!

కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ జలాశయంలో మత్స్యకారుడు పంచ్ వేసిన వలకు చిక్కిందీ ఓ చేప.. గాలానికి 31 కిలోల ఈ భారీ బొచ్చె చేప చిక్కింది. తన వేటలో ఇంత పెద్ద చేప దొరకడం ఇదే తొలిసారని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. దీన్ని రూ.5,800కి విక్రయించినట్లు తెలిపారు.

-న్యూస్‌టుడే, నిజాంసాగర్

ఏడీఎంఈగా రాధికారెడ్డి

ఈనాడు, అమరావతి: వైద్య విద్య అదనపు సంచాలకులు(ఏడీఎంఈ)గా డాక్టర్ వి.రాధికారెడ్డి నియమితులయ్యారు. డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న ఈమెను వైద్యవిద్య సంచాలకుల కార్యాలయంలో ఖాళీగా ఉన్న ఏడీఎంఈ పోస్టులో నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

మంగళగిరి ఎయిమ్స్‌లో.. 45% బోధనా సిబ్బంది పోస్టులు ఖాళీ

ఈనాడు, దిల్లీ: మంగళగిరి ఎయిమ్స్‌లో 45% బోధనా సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్నట్లు కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ సహాయమంత్రి ప్రతాప్‌రావ్ జాదవ్ తెలిపారు. ఇక్కడ మొత్తం 309 బోధనా సిబ్బంది పోస్టులు మంజూరుకాగా, 171 మంది (55%) మాత్రమే పని చేస్తున్నారని, ఇంకా 138 పోస్టులు (45%) ఖాళీగా ఉన్నాయని వివరించారు. దేశవ్యాప్తంగా 20 ఎయిమ్స్‌లకు కలిపి 6,297 పోస్టులు మంజూరు చేయగా, ప్రస్తుతం 3,941 (63%) మంది పని చేస్తున్నారని, ఇంకా 2,356 పోస్టులు (37%) ఖాళీగా ఉన్నట్లు చెప్పారు. ఖాళీల పరంగా జాతీయ సగటుతో పోల్చితే మంగళగిరి ఎయిమ్స్‌లో ఎక్కువగా ఉన్నాయి. ఆయన శుక్రవారం లోక్‌సభలో ఈ వివరాలు వెల్లడించారు.

- ◆ దేశంలో గత 17 ఏళ్లలో జరిగిన మొత్తం కాన్పుల్లో 16.19% సిజేరియన్ ద్వారానే జరిగాయని కేంద్ర మంత్రి ప్రతాప్‌రావ్ తెలిపారు. వైకాపా ఎంపీ మద్దిల గురుమూర్తి అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ, 2008-09 నుంచి 2024-25 మధ్యకాలంలో దేశవ్యాప్తంగా 34.99 కోట్ల కాన్పులు నమోదుకాగా, వాటిలో 5.66 కోట్లు (16.19%) కాన్పులు సిజేరియన్ ద్వారా జరిగినట్లు వెల్లడించారు.
- ◆ ఏపీలో 2014 నుంచి 2024 మధ్య 11 ఏళ్లలో 7,27,478 క్యాన్సర్ కేసులు నమోదైనట్లు ప్రతాప్‌రావ్ తెలిపారు. 2014లో రాష్ట్రంలో 53,570 కేసులు రికార్డు కాగా, 2024లో ఆ సంఖ్య 76,708గా ఉందని వెల్లడించారు. ఏటేటా క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయని చెప్పారు.

ఏపీ హైకోర్టులో 15.62% మంది మహిళా న్యాయమూర్తులు

ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో ప్రస్తుతం పనిచేస్తున్న మొత్తం న్యాయమూర్తుల్లో మహిళా న్యాయమూర్తులు 15.62 శాతం ఉన్నట్లు కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్ తెలిపారు. హైకోర్టుకు మంజూరు చేసిన మొత్తం 37 న్యాయమూర్తుల పోస్టులకుగానూ ప్రస్తుతం 32 మంది పనిచేస్తున్నారు. వారిలో ఐదుగురు మహిళలు ఉన్నారు. దేశవ్యాప్తంగా అన్ని హైకోర్టుల్లో మహిళా న్యాయమూర్తుల వాటా సగటున 14.25 శాతంగా ఉంది. అత్యధికంగా పంజాబ్, హరియాణా హైకోర్టులో 29.50%, తెలంగాణ హైకోర్టులో 25శాతంగా ఉన్నట్లు మంత్రి మేఘ్‌వాల్ వెల్లడించారు.

కృష్ణా జలాలు పొదుపుగా వాడండి: కేఆర్ఎంబీ

తెలంగాణ లేఖపై వివరణ ఇవ్వాలని ఏపీకి లేఖ

ఈనాడు, హైదరాబాద్: వేసవి తాగునీటి అవసరాలను పరిగణనలోకి తీసుకుని కృష్ణా జలాలను పొదుపుగా వినియోగించాలని ఏపీ, తెలంగాణ రాష్ట్రాలను కృష్ణా బోర్డు కోరింది. ఏవైనా అవసరాలు ఉంటే త్రిసభ్య కమిటీ ఆమోదం పొందాలని సూచించింది. శ్రీశైలం, నాగార్జునసాగర్‌లలో కోటా కింద ఉన్న 2.45 టీఎంసీలకు మించి నీటిని ఏపీ వినియోగించుకోకుండా ఆ రాష్ట్రాన్ని కట్టడి చేయాలని, వెంటనే బోర్డు సమావేశం నిర్వహించాలంటూ తాజాగా తెలంగాణ రాసిన లేఖపై బోర్డు ఏపీని వివరణ కోరింది. ఈ మేరకు బోర్డు మెంబర్ సెక్రటరీ ఎన్ఎస్ జలవనరులశాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్‌కు లేఖ రాశారు. 'ఏపీ అధిక వినియోగాన్ని కట్టడి చేయాలంటూ తెలంగాణ ఇప్పటికే రెండుసార్లు లేఖలు రాసింది. దీనిపై వివరణ ఇవ్వండి. ఈ ఏడాది జనవరి 31 నాటికి ఏపీ 555.50 టీఎంసీలు(78.07 శాతం), తెలంగాణ 156.08 టీఎంసీలను (21.93 శాతం) వినియోగించుకున్నాయి. రెండు రాష్ట్రాలు ఉమ్మడి జలాశయాల్లో ఉన్న నీటిని పొదుపుగా వాడుకోవాలి' అని సూచించింది. దీంతోపాటు టెలిమెట్రీ-2వ ఏర్పాటు ప్రతిపాదనలు ఉన్న నేపథ్యంలో నాగార్జునసాగర్ కుడి, ఎడమ ప్రధాన కాలువల ప్రవాహ సామర్థ్యం ఎంతో తెలపాలని ఏపీని కోరింది... తెలంగాణ రాసిన లేఖపైనా బోర్డు.. ఏపీని అభిప్రాయం కోరింది.

శ్రీశైలంలో రికార్డు స్థాయి విద్యుత్తు ఉత్పత్తి

2,544.22 మిలియన్ యూనిట్లతో 2007-08 రికార్డు బద్దలు



శ్రీశైలం ఎడమగట్టు జల విద్యుత్తు కేంద్రం

ద్రుహ్మగిరి(అచ్చంపేట), న్యూస్‌టుడే: శ్రీశైలం ఎడమగట్టు భూగర్భ జల విద్యుత్తు కేంద్రం(ఎస్ఎల్‌బీహెచ్ఈఎస్) ఈ ఏడాది విద్యుదుత్పత్తిలో ఆల్‌టైం రికార్డు సాధించింది. 2007-08లో ఉత్పత్తిచేసిన 2,544.004 మిలియన్ యూనిట్లను మించి, శుక్రవారం నాటికి 2,544.22 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి సాధించి సరికొత్త రికార్డు నెలకొల్పింది. పది నెలల కాలంలో కేంద్రంలోని 6 యూనిట్ల ద్వారా సాధించిన ఉత్పత్తికి మించి ప్రస్తుతం 5 యూనిట్లతోనే సాధించినట్లు అధికారులు వెల్లడించారు. 'ప్రస్తుతం ప్రాజెక్టులో నీటిమట్టం 873.40 అడుగులుగా ఉంది. 835 అడుగులకు చేరేవరకు విద్యుదుత్పత్తి చేసే అవకాశం ఉంది. ఐదు యూనిట్లు అవాంతరాలు లేకుండా పనిచేయడం, అధికారులు, సిబ్బంది కలిసికట్టుగా పనిచేయడం వల్లే అత్యధిక ఉత్పత్తి సాధ్యమైంది' అని సీఈ సత్యనారాయణ తెలిపారు.

లోక్‌సభలో మోదీ మాట్లాడకపోవడం దేశానికి అవమానకరం

సీపీఐ నేత కె.నారాయణ

ఈనాడు, దిల్లీ: రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై లోక్‌సభలో ప్రధానమంత్రి సమాధానం ఇవ్వకపోవడం దేశానికి అవమానకరమని సీపీఐ జాతీయ కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ కె.నారాయణ ఆరోపించారు. ఆయన శుక్రవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడారు.. "పార్లమెంటులో మహిళల నుంచి ప్రధానికి ముప్పు ఉందని వ్యాఖ్యానించడం దారుణంగా ఉందన్నారు. దాన్ని ఎవరైనా నమ్మే పరిస్థితి ఉందా? అని ఆశ్చర్యం వ్యక్తంచేశారు. లోక్‌సభలో ఒకవైపు ప్రతిపక్ష నేతతో పాటు ప్రతిపక్ష ఎంపీలను మాట్లాడనివ్వకుండా.. మరోవైపు ప్రధాని కూడా రాకుండా భారత్ పరువును తీశారని మండిపడ్డారు. ప్రస్తుతం భారత్ దీపాల్ట్ ప్రధానిగా ట్రంప్ వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు.

ఐబొమ్మ రవి పాస్‌పోర్టు సీజ్ చేశారా? లేదా?

- వివరణ ఇవ్వాలంటూ పోలీసులకు హైకోర్టు ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: సినిమాల పైరసీకి సంబంధించి అరెస్టయిన ఇమ్మడి రవి అలియాస్ ఐబొమ్మ రవి పాస్‌పోర్టును సీజ్ చేశారా? లేదా అన్నదానిపై స్పష్టత ఇవ్వాలంటూ పోలీసులను శుక్రవారం హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. సినీ పరిశ్రమకు చెందినవారి ఫిర్యాదుతో నమోదైన ఆయా కేసుల్లో బెయిలు మంజూరు చేయాలంటూ ఐబొమ్మ రవి వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై జస్టిస్ కె.సుజన శుక్రవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఇప్పటికే దర్యాప్తు పూర్తయిందని, బెయిలు మంజూరు చేయాలని కోరారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వరరావు దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ.. బెయిలు మంజూరు చేస్తే నిందితుడు విదేశాలకు పారిపోతాడన్నారు. నిందితుడికి ఇండియా పాస్‌పోర్టు లేదని, ఐల్యాండ్ చెందిన ఉందని చెప్పారు. దీనిపై న్యాయమూర్తి జోక్యం చేసుకుని పాస్‌పోర్టును స్వాధీనం చేసుకోవాలని పిటిషనర్ న్యాయవాదికి సూచించారు.. అది పోలీసుల వద్దే ఉందని ఆయన తెలిపారు. పీపీ వివరణ ఇస్తూ.. దర్యాప్తు అధికారి అందుబాటులో లేరని, ఈ విషయంపై స్పష్టత ఇవ్వడానికి గడువు కావాలని కోరారు.